


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 74

బుధవారం 29-11-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మ్యాక్స్‌వెల్ గెలిపించాడు

మూడో టీ20లో భారత్‌పై ఆఖరి బంతికి ఆసీస్ గెలుపు - 12లో



2 నెలల గరిష్టానికి నిఫ్టీ


204 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. మళ్లీ 66 వేల స్థాయి పైకి - 13లో



వైట్‌హౌస్, యుద్ధ నౌకలు..

వైట్‌హౌస్‌తో పాటు పెంటగాన్, యుద్ధ నౌకల ఫొటోలను తమ నిఘా ఉపగ్రహం పంపించిందని ఉత్తరకొరియా ప్రకటించుకుంది.

వివరాలు 6లో ▸



కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

రాజస్తాన్‌లో కోచింగ్‌కు పేరెన్నికగన్న కోటా పట్టణంలో పశ్చిమబెంగాల్‌కు చెందిన ఫరీద్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాలు 6లో ▸



4 గంటలు ఆగాల్సిందే!

డిజిటల్ పేమెంట్స్ ద్వారా ఇద్దరి మధ్య జరిగే తొలి లావాదేవీలో భారీ మొత్తాన్ని 4 గంటలు బదిలీకాకుండా ఆపాలని కేంద్రం భావిస్తోంది.

వివరాలు 6లో ▸



తెలంగాణలో ముగిసిన ప్రచారం

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెర పడింది. రాష్ట్రమంతటా 144 సెక్షన్ అమల్లోకి వచ్చిందని ఎన్నికల అధికారి చెప్పారు.


పవర్ 'ఫుల్'

ఇంధనరంగ చరిత్రలో సరికొత్త అధ్యాయం

రాష్ట్రంలో ప్రజలు, రైతులకు నాణ్యమైన విద్యుత్

పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలో సీఎం జగన్

- కడపలో 750 మెగావాట్లు, అనంతపురంలో 100 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుల నిర్మాణానికి శంకుస్థాపన
- ఏపీ ట్రాన్స్‌కోలో 16 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన.. 12 సబ్‌స్టేషన్లు ప్రారంభం
- సబ్‌స్టేషన్లు, విద్యుత్ ప్రాజెక్టుల మొత్తం విలువ రూ.6,500 కోట్లు
- హెచ్‌పీసీఎల్‌తో రూ.10 వేల కోట్ల విలువైన ప్రాజెక్టుపై ఒప్పందం



విద్యుత్ ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యుత్ సామర్థ్యం పెరగడం ద్వారా ప్రజలకు, రైతులకు మరింత నాణ్యమైన విద్యుత్ అందనుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర విద్యుత్ రంగ చరిత్రలో తొలిసారిగా ఒకేసారి ఆయన వర్చువల్ విధానంలో 16 సబ్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన, 12 సబ్‌స్టేషన్లకు ప్రారంభోత్సవం చేశారు. కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, సత్యసాయి, ప్రకాశం, గుంటూరు, ఏలూరు, పశ్చిమ గోదావరి, కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, పల్నాడు, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు, అన్నమయ్య జిల్లాల పరిధిలోని 28 ప్రాంతాల్లో 132/33 కేవీ, 220/132 కేవీ, 400/220 కేవీ, 400/132 కేవీ సామర్థ్యాలతో ఈ సబ్ స్టేషన్లుఏర్పాటవుతున్నాయి. వీటితో పాటు కడపలో 750 మెగావాట్లు, అనంతపురంలో 100 మెగావాట్ల

మిగతా 2వ పేజీలో ▶

రేపు నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో సీఎం పర్యటన

అవుకు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్

అనంతరం కడప పెద్ద దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాల్లో పాల్గొననున్న సీఎం

సొరంగాన్ని జయించారు..

సిల్కియారా టన్నెల్‌లో ముగిసిన రెస్క్యూ ఆపరేషన్

డ్రిల్లింగ్ పనులు పూర్తిచేసిన ర్యాట్-హోల్ మైనింగ్ నిపుణులు

క్షేమంగా బయటకు వచ్చిన 41 మంది కార్మికులు

స్టీల్‌పైపు గుండా బయటకు తీసుకొచ్చిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

కార్మికులకు స్వాగతం పలికిన కేంద్ర మంత్రి వి.కె.సింగ్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామీ

6లో



సొరంగం నుంచి బయటకు వచ్చిన కార్మికుల ఆనందోత్సాహం



విజయనగరం జిల్లా నెల్లిమర్లలో సామాజిక సాధికార సభకు హాజరైన అశేషజనసందోహంలో ఓ భాగం

ఉప్పొంగిన ఉత్సాహం

నెల్లిమర్ల, కైకలూరు సామాజిక సాధికార యాత్రల్లో కదంతొక్కిన ప్రజలు

ఏలూరు జిల్లా కైకలూరు, విజయనగరం జిల్లా నెల్లిమర్లలో సామాజిక సాధికార నినాదం ఉప్పొంగింది. అడుగడుగునా ప్రజలు పూలవర్షం కురిపిస్తూ యాత్రలకు బ్రహ్మరథం పట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల 'మళ్లీ జగనే కావాలి–జగనే రావాలి' నినాదాలతో సభా ప్రాంగణాలు హోరెత్తాయి.

2లో

సులభంగా ఆరోగ్యశ్రీ సేవలు పొందేలా..

పథకం పట్ల ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు వైద్య శాఖ కార్యక్రమాలు

1వ తేదీ నుంచి ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బంది

సేవలపై సవివరంగా రూపొందించిన బ్రోచర్ అందజేత

చికిత్స అనంతరం ఆరోగ్య ఆసరా భృతి పొందే వివరాలు

చేరువలోని నెట్‌వర్క్ ఆస్పత్రులు, సేవలపై సమాచారం

సెల్‌ఫోన్‌లో యాప్ ఇన్‌స్టాల్, వినియోగంపై అవగాహన

ప్రజలంతా ఉచిత వైద్య సేవలు పొందడమే ఉద్దేశం

- వివరాలు 5లో



ఫ్యాక్ట్‌చెక్

'బాకా' బృందం.. 'కాకా' కథనం

- సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ముసుగులో 'ఈనాడు' వక్రీకరణ కథనం
- ఓటర్ల జాబితా సవరణ సచివాలయ సిబ్బంది చేయడం తప్పట
- సచివాలయ సిబ్బంది ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులే
- రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల్లోనే పని చేస్తున్నారు
- సీఈవో నిబంధనల మేరకే బాధ్యతలు అప్పగింత

10లో

'అవుకు'పైనా అవాకులు..

- మీ బాబువల్ల కానిది సీఎం జగన్ చేశాడనేగా మీ ఏడుపు రామోజీ?
- అవుకు రెండో సొరంగాన్ని పూర్తిచేసిన సీఎం జగన్
- గాలేరు–నగరి వరద కాలువ డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులు తరలింపునకు లైన్‌క్లియర్
- ఎస్సార్బీసీ, గాలేరు– నగరి ఆయకట్టు రైతుల్లో జగన్‌కు మరింతగా పెరిగిన ఆదరణ
- దీన్ని జీర్ణించుకోలేకే 'ఈనాడు'లో రామోజీ విషం

14లో



చంద్రబాబుకు 'సుప్రీం' నోటీసులు

బెయిల్ రద్దుపై డిసెంబర్ 8లోగా లిఖితపూర్వక కౌంటరు దాఖలు చేయండి

స్కిల్ కేసులో క్వాష్ పిటిషన్ తీర్పు తర్వాతే బెయిల్ రద్దుపై విచారణ

జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం స్పష్టీకరణ.. తదుపరి విచారణ 11వ తేదీకి వాయిదా

- వివరాలు 3లో

ఇదంజాకేత్



అలవాటయిన ప్రాణమాయె! బయట తిరగకూడదుగా!!



ఏపీపై తుపాను ప్రభావం!

బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను ప్రభావం ఏపీపై ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం గురువారానికి వాయుగుండంగా, శుక్రవారానికి తుపానుగా మారనుంది. ఇది కోస్తాంధ్ర తీరానికి సమీపంలోకి రాకపోయినా దాని ప్రభావం ఉంటుందని ఐఎండీ అంచనా వేస్తోంది. దీనివల్ల 4, 5, 6 తేదీల్లో భారీ వర్షాలు కురుస్తాయి.

5లో

ఇదేమి పని 'నారాయణా'



మన్సూర్ నగర్‌లో నారాయణ సంస్థల ఉద్యోగులను నిలదీస్తున్న స్థానికులు

- టీడీపీ ఎన్నికల ఉచ్చులోకి నారాయణ విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది
- మాజీ మంత్రి నారాయణ కోసం ఎన్ టీంలుగా ప్రజల్లోకి..
- నెల్లూరులో ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో వ్యక్తిగత సమాచార సేకరణ
- ఉద్యోగులకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

3లో

ఫ్యాక్ట్‌చెక్



రైతు ముంగిట పశు వైద్యసేవలు

పొరుగు రాష్ట్రాల కంటే మిన్నగా ఏపీలో వైద్యసేవలు

ఈనాడు కథనాన్ని ఖండించిన పశు సంవర్థక శాఖ

వాస్తవాలు తెలుసుకుని రాస్తే మేలని హితవు

- వివరాలు 3లో

దిక్కుతోచకే దుర్మార్గపు రాతలు

జనసేన కలిసినా వచ్చే ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని టీడీపీ అగ్రనేతల్లో ఆందోళన

- టీడీపీ శ్రేణుల్లో స్థైర్యాన్ని నింపడానికే రామోజీతో కలిసి చంద్రబాబు కుట్ర
- అందుకే రోజూ ప్రభుత్వం, మంత్రులు, కీలక ఎమ్మెల్యేలపై 'ఈనాడు'లో అడ్డగోలు రాతలు
- ఈ క్రమంలోనే ఆదోని ఎమ్మెల్యే ప్రతిష్టను దెబ్బతీసేలా 'ఆయనో భూచోడు' అంటూ రోతరాతలు

3లో

ఫ్యాక్ట్‌చెక్





ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

కట్టెలమ్మిన చోటే పండ్లమ్ముతున్నా..



20ఏళ్లగా నాకున్న రెండెకరాల్లో నిమ్మతోటనే జీవనాధారంగా చేసుకుని ఇద్దరు పిల్లలను చదివించుకుంటున్నాను. గతంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఎటుచూసినా తోట మొత్తం ఎండిపోయేది. సరిపడా నీరు లేక దిగుబడి చాలా తక్కువగా చేతికొచ్చేది. దీంతో నిమ్మకాయల మార్కెట్ యార్డులో వ్యాపారుల వద్ద అప్పులు చేసి, పిల్లల చదువులకు అయ్యే ఖర్చులను భరించాల్సి వచ్చింది. అదే క్రమంలో ఎండిపోయిన తోటను పూర్తిగా నరికించి వంట చెరకుగా అమ్మేశాను. ఫలితంగా కుటుంబ పోషణే భారంగా మారింది. చుట్టూ అప్పులతో మునిగిపోయాను. దిక్కుతోచని పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్ చేపట్టిన జలయజ్ఞం నా తోట స్వరూపాన్నే మార్చేసింది. ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని మా గ్రామం పులికల్లు చెంతనే కండలేరు హై లెవల్ స్లూయిజ్ నుంచి ఎడమగట్టు కాలువను రూ.40 కోట్లతో తవ్వించారు. దీంతో మా ఊరితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో భూగర్భ జలాలు బాగా పెరిగాయి. తర్వాత మళ్లీ నిమ్మ తోట పెంచాను. ప్రస్తుతం తోట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ నిమ్మతోట ఎండిందే లేదు. ఫలసాయం అందడంతో ఇబ్బందుల నుంచి బయటపడ్డాను. చేసిన అప్పులన్నీ క్రమంగా తీర్చేశాను. ఇప్పుడు మళ్లీ ధైర్యంగా వ్యవసాయం చేస్తున్నా. ఈ ప్రభుత్వం పుణ్యంతోనే ఉద్యాన పంటలను చక్కగా పండించుకుంటున్నాము. గత పాలకులు మాటలతో మభ్యపెట్టి దశాబ్దాలుగా మా ప్రాంతంలో కాలువ పనులు చేపట్టకపోవడం వల్ల నా లాంటి రైతులు ఎంతో మంది తీవ్రంగా నష్టపోయారు. ఈ ప్రభుత్వం పథకాల పుణ్యమాని నా పిల్లల చదువులు పూర్తయ్యాయి.

– సన్నాల శ్రీనివాసులురెడ్డి, పులికల్లు
(కె.మధుసూదన్, విలేకరి, పొదలకూరు)

ఓ గూడు దొరికింది



నా భర్త ఊరూరా తిరిగి బట్టల వ్యాపారం చేస్తారు. వచ్చిన ఆదాయం అంతంత మాత్రంగా సరిపోయేది. బతకడానికే ఇబ్బందికర పరిస్థితిలో ఉంటే ఇల్లు కట్టుకునే ఆలోచన ఎక్కడి నుంచి వస్తుంది? అందుకే ఆ ఊహకే స్వస్తి పలికాం. కాకినాడ జిల్లా సామర్లకోటలోని వీర్రాఘవపురంలో సుమారు 40 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే నివాసం ఉంటున్నాను. గతంలో అనేక పర్యాయాలు ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసినా ఏ ప్రభుత్వంలోనూ స్థలం రాలేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఒక రోజు వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చాడు. దరఖాస్తు పెట్టుకుంటే ఉచితంగా ఇంటి స్థలం ఇస్తారని చెప్పారు. ఇదంతా చూసిందేలే అనుకున్నాము. మా వలంటీరే దరఖాస్తు నింపించి ప్రభుత్వానికి పంపించారు. కొద్ది రోజుల్లోనే వలంటీరే మా ఇంటికి వచ్చి సామర్లకోట ఈటీసీ లేఅవుట్‌లో స్థలం కేటాయించారని శుభవార్త చెప్పారు. ఆ స్థలంలో చక్కగా మా ఆలోచనకు అనుగుణంగా ఇల్లు కట్టుకున్నాం. ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలకు తోడు మరింత మొత్తం కలిపి అందంగా నిర్మించుకున్నాం. ఇదివరకు నెలకు రూ.5 వేలు అద్దెగా కట్టేవాళ్లం. ఇప్పుడు ఆ మొత్తం ఆదా అవుతోంది. పిల్లలకు అమ్మ ఒడి, విద్యా దీవెన పథకాలు వస్తుండటంతో వారి చదువుకు ఇబ్బంది లేకుండా పోయింది. మా జీవితానికి ఈ ప్రభుత్వం ఒక కొత్త బాట వేసింది.

– కట్టా పద్మావతి, సామర్లకోట
(అడపా వెంకటరావు, విలేకరి, సామర్లకోట)

మా వ్యాపారానికి 'ఆసరా'



రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం మాది. ఇద్దరు ఆడపిల్లలున్నారు. పెద్దమ్మాయికి పెళ్లి చేశాం. రెండో అమ్మాయి ఇక్కడే హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. మా ఆయన చేపలు పట్టి తెస్తే వాటిని ఇక్కడే అమ్మేవాళ్లం. సరుకు కొని బయటికి వెళ్లి వ్యాపారం చేయాలని ఉన్నా పెట్టుబడి లేక ఊరుకున్నాం. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు మాకు అండగా నిలిచాయి. విజయనగరం జిల్లా లక్కవరపుకోటలోని వీరభద్ర పొదుపు సంఘంలో ఉన్న నాకు మూడు విడతలుగా ఆసరా కింద రుణమాఫీ మొత్తం రూ.21,300 అందింది. బ్యాంకు లింకేజీ కింద రూ.1,00,000, స్త్రీనిధి నుంచి రూ.50,000 మంజూరైంది. ఈ సొమ్ముతో చేపల వ్యాపారం ప్రారంభించాం. సరుకు కొనుగోలు చేసి మా ఆయనతో కలిసి అరకు, అనంతగిరి మండలాల్లో అమ్ముతున్నాం. కూతురి చదువుకు అమ్మఒడి సొమ్ము అందుతోంది. జగనన్న విద్యాకానుక రూపంలో ఆమె చదువుకు అవసరమైన సామగ్రి అంతా ప్రభుత్వమే అందిస్తోంది. ఇప్పుడు మా వ్యాపారం కూడా బాగుంది. ఈ ప్రభుత్వం వల్ల మా కుటుంబం గౌరవంగా బతికే అవకాశం కలిగింది.

– గుదేలక్ష్మి, నెయ్యిలవీధి, లక్కవరపుకోట
(ఆర్.వి.సూర్యప్రతాప్, విలేకరి, శృంగవరపుకోట)

కదంతొక్కిన కైకలూరు

- కైకలూరులో ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు.. భారీ ర్యాలీ
- జై జగన్ నినాదాలతో హోరెత్తించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు



సభలో ప్రసంగిస్తున్న మంత్రి విడదల రజిని



ఏలూరు జిల్లా కైకలూరులో జరిగిన సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం

సాక్షి, భీమవరం/కై కలూరు: కొల్లేరులో సామాజిక సాధికార నినాదం ఉప్పొంగింది. కొల్లేరే పొంగిందా అన్నట్టుగా కైకలూరును జన సునామీ ముంచెత్తింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజల 'జై జగన్' నినాదాలతో కై కలూరు నియోజకవర్గం హోరెత్తింది. నియోజకవర్గంలో మంగళవారం జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార యాత్ర వేలాది ప్రజలతో ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బస్సు యాత్ర కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్ నుంచి రైతుబజారు సెంటర్‌లోని బహిరంగ సభ వేదిక వరకు సాగింది. అడుగడుగునా ప్రజలు పూలవర్షం కురిపిస్తూ యాత్రకు బ్రహ్మరథం పట్టారు. వివిధ ప్రాంతాల మహిళలు, గ్రామ పెద్దలు వాహనాలతో యాత్రకు వచ్చారు. సమావేశం ఆద్యంతం 'జగనే కావాలి–జగనే రావాలి' నినాదాన్ని హోరెత్తించారు.

నాడు వివక్ష.. నేడు సామాజిక సాధికారత: మంత్రి రజిని

ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల క్రితం వరకు వివక్షకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సీఎం వైఎస్ జగన్ అండతో ఇప్పుడు సామాజిక సాధికారత సాధించి, తలెత్తుకు తిరుగుతున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఈ నాలుగేళ్లలో పేదల సంక్షేమం కోసం డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.4.8 లక్షల కోట్లు ఇస్తే.. అందులో 80 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే అందించారని తెలిపారు. రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తున్న ఏకైక సీఎం జగన్ అని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా జగనన్నకు అండగా నిలవాలని కోరారు.

17 ఎమ్మెల్సీల్లో 14 బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకే: మంత్రి కారుమూరి

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయానికి పెట్టింది పేరని అన్నారు. 17 ఎమ్మెల్సీల్లో 14 బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు ఇచ్చారని, బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆర్.కృష్ణయ్య, పిల్లి సుభాష్ చంద్రబోస్, బీద మస్తాన్ యాదవ్, మోపిదేవి వెంకటరమణలను రాజ్యసభకు పంపారని తెలిపారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపించలేదని విమర్శించారు. బీసీ అయిన జయమంగళ వెంకటరమణకు చంద్రబాబు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సీట్లు రెండింటిలోనూ హామీ ఇచ్చి మోసం చేశారని, సీఎం జగన్ మాత్రం ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించారని గుర్తుచేశారు.

న్యాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్: ఎంపీ మోపిదేవి

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ పేదల కష్టాలు ప్రత్యక్షంగా చూసిన వ్యక్తిగా ఎలాంటి పథకాలు ప్రవేశపెడితే వారు అభివృద్ధి చెందుతారో సీఎం జగన్ ఆలోచన చేశారన్నారు. దీనికి అనుగుణంగానే ప్రతి కుటుంబానికీ రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. రాజకీయంగా అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం చేశారన్నారు.

అన్నింటా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే పెద్దపీట : మంత్రి జోగి రమేష్

కైకలూరు సభలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. సీఎం జగన్ సామాజిక ధర్మాన్ని పాటిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావ్ పూలే వంటి మహనీయుల అడుగు జాడల్లో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని చెప్పారు. కేబినెట్ సహా అన్ని పదవుల్లో, పథకాల్లో, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలకే పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. కేబినెట్‌లో 25 మంది మంత్రులు ఉంటే వారిలో 17 మంది ఈ వర్గాల వారినే సీఎం నియమించారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారని వివరించారు.

ఈ ఘనత జగన్‌దే: ఎమ్మెల్యే నాగేశ్వరరావు

సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒక్క కై కలూరులోనే 15 వేల ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. నియోజకవర్గంలో సంక్షేమ పథకాల కోసం రూ.746 కోట్లు అందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొన్నారు.

చైతన్యం వెల్లివిరిసిన నెల్లిమర్ల

- నియోజకవర్గంలో బడుగు, బలహీన వర్గాల సాధికార యాత్ర
- నెల్లిమర్ల నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు
- యువత భారీ బైక్ ర్యాలీ



ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర



విజయనగం జిల్లా నెల్లిమర్లలో జరిగిన సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం జిల్లా నెల్లిమర్లలో సామాజిక చైతన్యం వెల్లివిరిసింది. సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను సాధికారత దిశగా నడిపించిన వైనాన్ని వివరిస్తూ బడుగు, బలహీన వర్గాల ప్రజలు నియోజకవర్గంలో భారీ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు సీఎం వైఎస్ జగన్ తమకు చేసిన మేలును వివరించారు. యువత బైక్‌లతో ర్యాలీ చేశారు. నెల్లిమర్ల డైట్ కాలేజీ మీదుగా కొండవెలగాడ, జర్జాపుపేట వరకూ యాత్ర సాగింది. కొండవెలగాడలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రజాప్రతినిధులు సందర్శించారు. సాయంత్రం 4 గంటలకు నెల్లిమర్ల మొయిదా జంక్షన్ వద్ద భారీ బహిరంగ సభ జరిగింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలతో సభా ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది. జై జగన్ – జైజై జగన్, జగనే కావాలి – జగనే రావాలి నినాదాలు సభలో హోరెత్తాయి.

పేదల పెన్నిధి సీఎం జగన్ : ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సీఎం వైఎస్ జగన్ పేదల పెన్నిధి అని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉండగా గిరిజనులు, ముస్లింలకు ఒక్క మంత్రి పదవీ ఇవ్వలేదన్నారు. సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. మంత్రి పదవుల నుంచి నామినేటెడ్ పదవుల వరకు అన్నింటా పెద్ద పీట వేస్తున్నారని తెలిపారు. గిరిజనుడైన తాను ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్నానంటే జగన్ వల్లే నని అన్నారు. 2014 ఎన్నికల్లో రైతులకు రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ, ఇంటికో ఉద్యోగం ఇలా 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అందర్నీ మోసం చేశారన్నారు.

వ్యవస్థల్లో సమూల మార్పులు: మంత్రి ధర్మాన ప్రసాదరావు

మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ.. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వ్యవస్థల్లో సమూల మార్పులు తెచ్చారని తెలిపారు. పేదల కోసం విద్య, వైద్య రంగాలను సమూలంగా ప్రక్షాళన చేసి, అధునాతనంగా తీర్చిదిద్దారని అన్నారు. ఇప్పుడు ప్రతి పేద కుటుంబం మంచి విద్యను, మంచి వైద్యాన్ని పైసా ఖర్చు లేకుండా అందుకుంటున్నాయని తెలిపారు. విభజన తర్వాత పదేళ్ల వరకూ హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్నప్పటికీ వదిలేసి వచ్చిన చంద్రబాబు కొత్త రాజధానిని రాజ్యాంగం, చట్టం ప్రకారం గాకుండా వ్యాపారంగా మార్చేశారన్నారు. రాష్ట్రంలో పెద్ద పట్టణం, అన్ని హంగులూ ఉన్న విశాఖని కాదని, తన అనుయాయులతో భూములు కొనిపించిన ప్రాంతంలో అర్ధరాత్రి రాజధానిని ప్రకటించిన పాపం చంద్రబాబుదేనన్నారు.

సీఎం జగన్‌ది సుపరిపాలన: మంత్రి సీదిరి అప్పలరాజు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని వర్గాలకూ సంక్షేమాన్ని అందిస్తూ సుపరిపాలన చేస్తున్నారని మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అక్కున చేర్చుకొని, సాధికారత దిశగా నడిపించారని తెలిపారు. ఎస్సీలను, ఎస్టీలను, బీసీలను అవమానించిన చంద్రబాబును అందరూ సమష్టిగా మరోసారి ఓడించాలని పిలుపునిచ్చారు.

భోగాపురంతో ఉత్తరాంధ్ర అభివృద్ధి: మంత్రి అమర్‌నాథ్

నెల్లిమర్ల నియోజకవర్గంలో సీఎం జగన్ ఇటీవల భూమిపూజ చేసిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం వేగంగా జరుగుతోందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. రూ.4,750 కోట్లతో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయంతో 50 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. సారిపల్లి ఇండస్ట్రియల్ పార్కు అప్‌గ్రేడ్ పనులకు సీఎం త్వరలో శంకుస్థాపన చేయబోతున్నారని తెలిపారు.

నెల్లిమర్లలో రూ.1172 కోట్ల సంక్షేమం: ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల నియోజకవర్గంలో నాలుగున్నరేళ్లలో రూ.1,172 కోట్లు సంక్షేమ కార్యక్రమాల కోసం సీఎం వైఎస్ జగన్ వెచ్చించారని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చెప్పారు. రామతీర్థంలో విధ్వంసాన్ని టీడీపీ రాజకీయం చేస్తే, సీఎం జగన్ మాత్రం రూ.4.5 కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు శంబంగి అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కంబాల జోగులు, కడుబండి శ్రీనివాసరావు, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ శోభా స్వాతిరాణి, నవరత్నాల వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి పాల్గొన్నారు.

రేపు నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో సీఎం పర్యటన

- అవుకు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేయనున్న సీఎం జగన్
- కడప పెద్ద దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నంద్యాల, వైఎస్సార్ జిల్లాల్లో పర్యటించనున్నారు. నంద్యాల జిల్లాలో నిర్మించిన అవుకు రెండో టన్నెల్‌ను సీఎం జగన్ జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం కడప పెద్దదర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాల్లో ఆయన పాల్గొంటారు. ఇందుకోసం గురువారం ఉదయం 10 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి నంద్యాల జిల్లా అవుకు మండలం మెట్టుపల్లికి సీఎం జగన్ చేరుకుంటారు. అక్కడి నుంచి అవుకు రెండో టన్నెల్ వద్దకు చేరుకుని నీటిని విడుదల చేసి.. ఆ టన్నెల్‌ను జాతికి అంకితం చేస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన అనంతరం పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి కడప చేరుకుంటారు. పెద్దదర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాల్లో పాల్గొంటారు. సాయంత్రానికి తాడేపల్లికి చేరుకుంటారు.

నేడు కురుపాం, మచిలీపట్నంలో సామాజిక సాధికార యాత్ర

సాక్షి, అమరావతి: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అభివృద్ధి పథంలో నడిపించి, వారి సామాజిక సాధికారతకు సీఎం జగన్ తోడ్పడిన వైనాన్ని వివరించడానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. మంగళవారం విజయనగం జిల్లా నెల్లిమర్ల, ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గాల్లో జరిగిన యాత్రకు జనం నీరాజనాలు పలికారు. బుధవారం ఈ యాత్ర పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం, కృష్ణా జిల్లాలో మచిలీపట్నం నియోజకవర్గాల్లో జరుగుతుంది.

పవర్ 'ఫుల్'

▶ మొదటి పేజీ తరువాయి

సోలార్ ప్రాజెక్టుల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో హెచ్‌పీసీఎల్‌తో రూ.10 వేల కోట్ల విలువైన ప్రాజెక్టుపై సీఎం సమక్షంలో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌పీసీఎల్) ఎండీ అండ్ సీఈఓ కమలాకర్ బాబు, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శువేందు గుప్తా ఒప్పంద పత్రాలను అందుకున్నారు. వీటన్నింటి వల్ల రానున్న రోజుల్లో వేగంగా అడుగులు ముందుకు పడి మరిన్ని ఉద్యోగ అవకాశాలతో పాటు రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సామర్థ్యం మెరుగు పడుతుందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏమన్నారంటే..

సరికొత్త అడుగులు.. నాణ్యమైన వెలుగులు

- 19 జిల్లాల్లో విద్యుత్ పంపిణీ సామర్థ్యాన్ని పెంచుతూ రూ.620 కోట్లతో 12 సబ్‌స్టేషన్లను ప్రారంభిస్తున్నాం. రూ.2,479 కోట్లతో మరో 16 సబ్‌స్టేషన్లకు శంకుస్థాపన చేస్తున్నాం. మొత్తంగా సుమారు రూ.3,099 కోట్ల పెట్టుబడులతో మంచి కార్యక్రమం జరుగుతోంది. కొత్తగా వస్తున్న ఈ 28 సబ్ స్టేషన్లలో 200 మందికి ఉద్యోగావకాశాలు వస్తున్నాయి. రూ.3,400 కోట్లతో దాదాపు 850 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తున్నాం. వీటి వల్ల 1,700 ఉద్యోగాలు వస్తున్నాయి. వీటిన్నింటి కోసం దాదాపు రూ.6,500 కోట్ల పెట్టుబడి పెడుతున్నాం.
- ఇటీవల గోదావరి ముంపునకు గురైన చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, ఎటపాక తదితర విలీన మండలాల్లో తిరిగినప్పుడు సబ్‌స్టేషన్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని అక్కడి ప్రజలు చెప్పారు. ఆ సమస్యను పరిష్కరిస్తూ.. అక్కడ వాటి నిర్మాణాలు ప్రారంభిస్తూ, నిర్మించిన వాటిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తున్నాం.
- ట్రాన్స్‌మిషన్ కెపాసిటీని విస్తరించుకుంటూ ప్రతి గ్రామానికి, ప్రతి రైతుకు నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చే పరిస్థితిని, వ్యవస్థను క్రియేట్ చేస్తున్నాం. రైతులకు 9 గంటల పాటు పగటిపూటే ఉచిత విద్యుత్ ఇవ్వాలన్న ఉద్దేశంతో అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతానికి శ్రీకారం చుట్టాం. ఇది చేయాలంటే కెపాసిటీ సరిపోదని, ట్రాన్స్‌మిషన్ కెపాసిటీ అభివృద్ధి చేయాలని అధికారులు చెప్పారు. అందుకోసం రూ.1,700 కోట్లతో ఫీడర్లను ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను పగటిపూటే ఇస్తున్నాం.



సీఎం జగన్ సమక్షంలో ఎంవోయూ పత్రాలను చూపుతున్న ఏపీఎస్‌పీసీఎల్, హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు

25 ఏళ్లపాటు ఢోకా ఉండదు

- రైతులకు ఉచిత విద్యుత్‌ను స్థిరంగా ఇవ్వడానికి యూనిట్ రూ.2.49తో సోలార్ పవర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చే గొప్ప అడుగు పడింది. దాదాపు 17 వేల మిలియన్ యూనిట్లకు సెకీతో ఒప్పందం చేసుకున్నాం. వ్యవసాయ విద్యుత్‌కు కావాల్సిన 13 వేల మిలియన్ యూనిట్లు పగటిపూటే, మరో 25 ఏళ్లపాటు ఉండేలా చర్యలు తీసుకున్నాం. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గుతుంది. ప్రస్తుతం యూనిట్ సగటు ధర రూ.5.30 పడే పరిస్థితులుంటే రూ.2.49కే యూనిట్ ధర వచ్చే పరిస్థితుల్లోకి అడుగులు వేస్తున్నాం. దీనివల్ల 2024 సెప్టెంబర్‌కు 3 వేల మెగావాట్లు, 2025 సెప్టెంబర్ నాటికి మరో 3 వేల మెగావాట్లు, 2026 సెప్టెంబర్ నాటికి మరో 1000 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది.
- అవేరా స్కూటర్స్ తయారీ సంస్థ ఇప్పటికే 25 వేల స్కూటర్ల ఉత్పత్తిని ప్రారంభించి విజయవాడలో నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టు లక్ష స్కూటర్ల ఉత్పత్తి దిశగా సామర్థ్యాన్ని పెంచుకుంటుంది. దీనికి సంబంధించి రూ.100 కోట్లతో విస్తరణ ప్రాజెక్టుకు ఈ రోజు శంకుస్థాపన చేసుకుంటున్నాం. ఈ కంపెనీలో 100 మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఉన్నాయి. తాజా పెట్టుబడి వల్ల అదనంగా మరో 200 ఉద్యోగాలు వస్తాయి.
- 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్, మరో 500 మెగావాట్ల పవన విద్యుత్, 250 మెగావాట్ల పీఎస్‌పీ, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ (100 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్)తో కలిపి రూ.10 వేల కోట్లకు సంబంధించి హెచ్‌పీసీఎల్‌తో ఎంఓయూ కుదుర్చుకున్నాం. దీనివల్ల దాదాపు మరో 1500 మందికి ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఈ ప్రాజెక్టుల వల్ల కాలుష్య రహిత క్లీన్ ఎనర్జీ అందుబాటులోకి వచ్చి, రాష్ట్ర ప్రగతిని మరింత పెంచే పరిస్థితి రావాలని మనసారా కోరుకుంటున్నాను.

ఈ కార్యక్రమంలో సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు, ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ జేఎండీ బి.మల్లారెడ్డి, హెచ్‌పీసీఎల్ డైరెక్టర్ అమిత్ గార్గ్, హెచ్‌పీసీఎల్, ఆయానా, స్ప్రింగ్ అగ్నిత్రా, సోలార్ ఎనర్జీ ఏపీ సిక్స్ ప్రై వేట్ లిమిటెడ్, అవేరా ఏఐ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు

గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర విద్యుత్ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. కొత్త టెక్నాలజీని ప్రవేశపెట్టాం. అక్టోబర్ ఆఖరు వరకు 39.64 లక్షల మంది లబ్ధిదారులకు (అగ్రికల్చర్, ఆక్వా, పశు సంవర్థక, ఎస్సీ, ఎస్టీ, బీసీలు, ఇతరులు) రూ.46,581 కోట్ల సబ్సిడీ అందించాం. జగనన్న హౌసింగ్ కాలనీలకు ఐదు లక్షల విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 1.25 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఈ ఏడాది అదనంగా నిర్ణీత కాలపరిమితిలో మంజూరు చేశాం. వ్యవసాయ విద్యుత్ కోసం 'సెకీ'తో తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నాం. స్మార్ట్ మీటర్స్ వల్ల రైతులకు మరింత మేలు జరుగుతుంది. విశాఖ పెట్టుబడుల సదస్సులో జరిగిన ఒప్పందాల ప్రకారం రూ.52,015 కోట్లు గ్రౌండ్ అయ్యాయి. వెయ్యి మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోంది. 12,586 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. సీఎం చిత్తశుద్ధితోనే ఇవన్నీ సాధ్యమవుతున్నాయి.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఇంధన శాఖ మంత్రి

కొత్తగా రూ.1,072 కోట్లతో పరిశ్రమలు

- నేడు ప్రారంభించనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: సీఎం జగన్ ప్రోత్సాహంతో ఏపీలో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ క్రమంలో బుధవారం మరిన్ని పరిశ్రమలు ప్రారంభం కానున్నాయి. రూ.1,072 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టులను సీఎం ప్రారంభించి..కొత్త పరిశ్రమలకు శంకుస్థాపన చేస్తారు. సీఎం క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ఈ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. వీటిద్వారా 21,079 మందికి ఉపాధి లభిస్తుంది. ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలో రూ.402 కోట్లతో నెల్లూరు జిల్లాలో ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్, విజయనగరంలో నువ్వుల ప్రాసెసింగ్ యూనిట్లను సీఎం ప్రారంభిస్తారు. కాకినాడ ప్రింటింగ్ క్లస్టర్, కర్నూలులోని ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో ఏర్పాటు చేసిన సిగాచి ఇండస్ట్రీస్ గ్రీన్‌ఫీల్డ్ ఫార్మాస్యూటికల్స్, ధాన్యం ఆధారిత బయో–ఇథనాల్ తయారీ యూనిట్‌లను ప్రారంభిస్తారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి రంగంలో ఏర్పాటు చేయనున్న 17 ప్రాజెక్టుల్లో గుంటూరు, హిందూపూర్, మచిలీపట్నంలో రూ.670 కోట్లతో పూర్తయిన ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. ఏలూరు జిల్లాలో స్టార్చ్ ప్రాసెసింగ్ యూనిట్, విజయనగరం, కర్నూలులో ఏర్పాటు చేసే ఆర్టీఈ/ఆర్టీసీ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలకు శంకుస్థాపన చేయనున్నారు.

క్లుప్తంగా...

'చింతమనేని'పై సుమోటోగా కేసు నమోదు చేయాలి

గౌడ సంఘ నేతల డిమాండ్



నిరసన తెలుపుతున్న గౌడ సంఘీయులు

ఏలూరు (టూటౌన్): టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గౌడ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఇటీవల ఏలూరు జిల్లా పెదవేగి మండలం బాపిరాజుగూడేనికి చెందిన వీరంకి లక్ష్మీనారాయణపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దాడి చేసి అతని గొర్రెను దౌర్జన్యంగా తన కారులో వేసుకుని వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రాష్ట్ర గౌడ సంఘ నేతలు మంగళవారం ఏలూరులో ఆందోళన చేపట్టారు. ఫైర్‌స్టేషన్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. తక్షణం చింతమనేనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌లో వినతిపత్రమిచ్చారు. గౌడ సంఘం నేతలు మాట్లాడుతూ చింతమనేని చర్యలను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గౌడ కులస్తులంతా ఖండిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర జేఏసీ నేతలు దొంతా సురేష్, యామా మురళి, ఎం.ఏడుకొండలు, కె.రాంప్రసాద్, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా లక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన చంద్రబాబు ఢిల్లీ పర్యటన

ముఖ్య నేతల అపాయింట్‌మెంట్లు లేక నిరాశతో తిరుగు ప్రయాణం

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగిసింది. ఆయన మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలోని జాకీర్‌హుస్సేన్ మార్గ్‌లో ఉన్న ప్రముఖ హోటల్‌లో బస చేసిన చంద్రబాబు... మంగళవారం ఉదయం టీడీపీ ఎంపీలు కనకమేడల రవీంద్రకుమార్, కేశినేని నాని, రామ్మోహన్‌నాయుడులతో భేటీ అయ్యారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. అనంతరం సుప్రీంకోర్టులో చంద్రబాబు తరఫు న్యాయవాదులు గుంటూరు ప్రభాకర్, గుంటూరు ప్రమోద్, ప్రేరణ తదితరులు ఆయనను కలిశారు. సుప్రీంకోర్టులో ఉన్న స్కిల్ డెవలప్‌మెంట్ కేసు, ఫైబర్‌నెట్ కేసులపై న్యాయవాదులతో చర్చించారు. సోమవారం మధ్యాహ్నం తన సతీమణితో కలిసి ఢిల్లీకి వచ్చిన చంద్రబాబు.. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కుమారుడి వివాహ విందుకు హాజరయ్యారు. ఈ పర్యటనలో పలువురు ముఖ్య నేతలను ఆయన కలుస్తారనే ప్రచారం జరిగింది. కానీ, ఎవరి అపాయింట్‌మెంట్లు లభించకపోవడంతో చంద్రబాబు నిరాశతో వెనుదిరిగారు.

సామాజిక న్యాయాన్ని మంటగలిపారు: అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయాన్ని మంట గలిపారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం రాష్ట్రానికి 15 మంది సివిల్ సర్వీస్ అధికారులను కేంద్రం నుంచి డిప్యుటేషన్‌పై తీసుకొస్తే వారిలో పదిమంది తన వర్గం వారే ఉండేలా చూసుకున్నారని విమర్శించారు. ఆ పది మందిని కావాలనే ఎక్కువ ఆదాయం వచ్చే శాఖల్లో నియమించారని ఆరోపించారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, బేవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, మైనింగ్ డైరెక్టర్ వెంకటరెడ్డి వంటి అధికారులు కేవలం సీఎం జగన్ కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. పెరిగిన మద్యం ధరలు, కల్తీ మద్యం అమ్మకాలపై ప్రశ్నించాడన్న అక్కసుతో ఓంప్రతాప్ అనే దళిత యువకుడిని దారుణంగా చంపించారన్నారు.

నిమ్మగడ్డ రమేశ్ పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో లక్షలాది నకిలీ ఓట్లు నమోదు అవుతున్నాయంటూ సిటిజన్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. మంగళవారం ఈ పిటిషన్ జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీశ్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. సీనియర్ న్యాయవాది అందుబాటులో లేరని విచారణ వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. దీనికి అంగీకరించిన ధర్మాసనం విచారణ సోమవారానికి వాయిదా వేసింది.

లక్ష్యం, సంకల్పం లేని యువగళం: ఎంపీ భరత్



రాజమహేంద్రవరం రూరల్: లోకేశ్ మిడ్ నైట్ యాత్రలు దేనికో సమో కనీసం టీడీపీ వాళ్లకే తెలియదని, లక్ష్యం, సంకల్పం లేని యువగళం యాత్ర దండగని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ వ్యాఖ్యానించారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేశ్ యాత్రను టీడీపీ నేతలు, కార్యకర్తలే పట్టించుకోవడం లేదన్నారు. సీఎం జగన్ అందరికీ న్యాయం చేశారు కాబట్టే.. ధైర్యంగా ప్రజల మధ్యకు వచ్చి 'మీకు మంచి జరిగితేనే ఓటు వెయ్యండి.. లేదంటే వద్దు' అని చెప్పగలుగుతున్నారని.. ఆ ధైర్యం చంద్రబాబుకు ఉందా.. అనిప్రశ్నించారు.

దిక్కుతోచకే దుర్మార్గపు రాతలు

జనసేన కలిసినా వచ్చే ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని టీడీపీ అగ్రనేతల్లో ఆందోళన

- టీడీపీ శ్రేణుల్లో స్థైర్యాన్ని నింపడానికే రామోజీతో కలిసి చంద్రబాబు కుట్ర
- అందుకే రోజూ ప్రభుత్వం, మంత్రులు, కీలక ఎమ్మెల్యేలపై 'ఈనాడు'లో అడ్డగోలు రాతలు
- ఈ క్రమంలోనే ఆదోని ఎమ్మెల్యే ప్రతిష్టను దెబ్బతీసేలా 'ఆయనో భూచోడు' అంటూ రోతరాతలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జనసేనతో జట్టు కట్టినా సరే వచ్చే ఎన్నికల్లో 2019 కంటే ఘోర పరాజయం తప్పదని టీడీపీ అగ్రనేతలకు అర్థమైంది. దీంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోవడంతో టీడీపీ శ్రేణులు పూర్తిగా నీరుగారిపోయాయి. అందుకే రాజకీయంగా టీడీపీ ఉనికిని కాపాడేందుకు పచ్చదండు గురువు రామోజీరావు.. అభూతకల్పనలు, పచ్చి అబద్ధాలు రంగరించి వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురదజల్లుతూ రోజూ 'ఈనాడు'లో తప్పుడు కథనాలు అచ్చేస్తున్నారు. మంత్రులు, కీలక ఎమ్మెల్యేలపై ఆధారాలు లేకుండా రోతరాతలు రాస్తూ టన్నుల కొద్దీ విషం చిమ్మి.. వారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించడం నిత్యకృత్యమైపోయింది. ఇలాగైనా టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని నింపాలన్నది రామోజీ ఎత్తుగడ. అందుకే ఆదోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ 'ఆయనో భూచోడు' శీర్షికన అడ్డగోలుగా తప్పుడు కథనాన్ని మంగళవారం 'ఈనాడు'లో అచ్చేశారు. ఆ కథనంలోని ప్రతి అక్షరంలో ఎమ్మెల్యేపై రామోజీరావుకున్న అసూయ, ద్వేషం ప్రతిబింబిస్తోంది.

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ..

రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని.. ప్రతిపక్ష టీడీపీ, జనసేన కలిసి పోటీచేసినా ఘోర పరాజయం తప్పదని పలు జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో తేలింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలుచేయడం.. అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించడం.. సుపరిపాలనతో విప్లవాత్మక మార్పులు తెచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు రోజురోజుకూ ప్రజల్లో పెరుగుతున్న ఆదరణే వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయానికి బాటలు వేస్తాయని ఆ సర్వేలు విశ్లేషించాయి. ఇక వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'సామాజిక సాధికార యాత్ర', 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలకు ప్రజలు నీరాజనాలు పలుకుతుండటం.. టీడీపీ, జనసేన చేపట్టిన కార్యక్రమాలకు జన స్పందన కన్పించకపోవడంతో ప్రధానంగా ప్రతిపక్ష టీడీపీ దిక్కుతోచని స్థితిలో పడింది. ప్రజల ఆశీర్వాదం కోరుతూ 175కు 175 అసెంబ్లీ స్థానాల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ దూసుకెళ్తుంటే.. అధిక స్థానాల్లో పోటీచేయడానికి కూడా అభ్యర్థులు దొరక్క చంద్రబాబుతోపాటు ఆ పార్టీ అగ్రనేతలు విలవిల్లాడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్రలు..

ఇక ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూలు రానుంది. మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. ఇందుకు కేవలం మూడు నెలల సమయం మాత్రమే ఉంది. దీంతో ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని అర్థమవడంతో టీడీపీ అగ్రనేతలు ఎన్నికలకు ముందే కాడి దించేస్తున్నారు. ఇది ఆ పార్టీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని పూర్తిగా దెబ్బతీసింది. ఇలాగైతే టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమని ఆందోళన చెందుతున్న చంద్రబాబు.. దుష్టచతుష్టయంలోని తన గురువైన రామోజీరావుతో కలిసి ప్రభుత్వంతోపాటు మంత్రులు, వైఎస్సార్‌సీపీ కీలక ఎమ్మెల్యేలపై బురదజల్లుతూ ఈనాడులో క్షుద్ర రాతలను అచ్చేయడం ద్వారా వారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు నిత్యం కుట్రలు చేస్తున్నారు. అందులో భాగంగానే ప్రభుత్వంపై, మంత్రులపై, కీలక ఎమ్మెల్యేలపై విచ్చలవిడిగా నిరాధారమైన ఆరోపణలు చేస్తూ విషం కక్కుతున్నారు. మరోవైపు.. ఇదే అంశాన్ని ప్రతి సభలోనూ సీఎం వైఎస్ జగన్ ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరిస్తున్నారు. పెత్తందార్ల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న దుష్టచతుష్టయం కుట్రలను చిత్తు చేయాలంటూ ఇస్తున్న పిలుపునకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పాత్రికేయ విలువలకు వలువలు వదిలేసి.. టీడీపీ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే రామోజీరావు తప్పుడు కథనాలు అచ్చేస్తున్నారని ప్రజలు గ్రహిస్తున్నారు.

టీడీపీ హయాంలో అరాచకాలు కనపడలేదా?

- తప్పుడు వార్తలతో ప్రజలను మభ్యపెట్టలేరు
- నియోజకవర్గంలో ఎవరు కబ్జాలు చేసినా మా కుటుంబంపైనే అభాండాలు
- వివాదాస్పద స్థల వారసులు కోర్టు నుంచి హక్కు తెచ్చుకుంటే రామోజీకి కడుపుమంట
- ఈనాడు రాతలపై ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఫైర్

ఆదోని సెంట్రల్/ఆదోని టౌన్: భూ దందాలు, భూ ఆక్రమణలు అంటూ తప్పుడు వార్తలు రాసి ప్రజలను మభ్యపెట్టలేరని కర్నూలు జిల్లా ఆదోని ఎమ్మెల్యే వై. సాయిప్రసాద్‌రెడ్డి ఈనాడు పత్రికను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలో ఎవరు కబ్జాలు చేసినా ఎమ్మెల్యే కుటుంబంపై అభాండాలు వేయడమే పనిగా ఆ పత్రిక పెట్టుకుందన్నారు. టీడీపీ హయాంలో ఎన్ని భూ ఆక్రమణలు చేశారో? ఎన్ని డబుల్ రిజిస్ట్రేషన్లు చేశారో రామోజీకి కనపడలేదా అంటూ ఆయన ప్రశ్నించారు. తన స్వగృహంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ నేతలు తప్పుడు కేసులు నమోదు చేస్తూ, మట్కాను ప్రోత్సహిస్తూ, గాంబ్లింగ్, మద్యం అమ్మకాల్లో భాగస్వాములైనప్పుడు ఏనాడైనా ఈనాడు వాటి గురించి ప్రచురించిందా అని ప్రశ్నించారు. 352 సర్వే నంబర్‌లో 4.54 ఎకరాలను ఓపెన్ ప్లేస్‌గా చూపించి 1992లో ఎవరో వెంచర్ వేసి అమ్ముకున్నారని.. ఆ స్థలానికి చెందిన అసలైన వారసులు కోర్టుకు వెళ్లి పూర్తి హక్కులు తెచ్చుకుంటే రామోజీకి కడుపుమంటగా ఉందన్నారు. గతంలో ఎవరైతే ఆ



స్థలాలను కొన్న లబ్ధిదారులున్నారో వారికి అన్ని విధాలా న్యాయం చేస్తామని చెప్పడం కూడా తప్పేనా అంటూ సాయిప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. వాస్తవాలను తెలుసుకోకుండా ఏది పడితే అది రాసి ఎంతకాలం పబ్బం గడుపుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఏనాడైనా మంచిగా రాశావా అంటూ ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వంపై అభాండాలు వేయడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు.

రోత రాతలు మానుకుంటే మంచిది..

ఇక వైఎస్సార్‌సీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఏనాడు మట్కా, మద్యం, బెట్టింగ్‌లను ప్రోత్సహించలేదని.. ఎవరి మీద కూడా అక్రమ కేసులు బనాయించలేదని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలను చేసి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్న విషయం కనపడలేదా అని ప్రశ్నించారు. ఒక ఐపీఎస్ అధికారి బదిలీ అయితే తనపై నెపం పెట్టడం తగదన్నారు. తాను ఏనాడు ఫలానా అధికారిని బదిలీ చేయమని, ఫలాన అధికారిని పంపించమని ఎవరినీ అడిగిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా రామోజీ రోత రాతలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. వివాదాస్పద స్థల యజమాని అలిమ్ బాషా మాట్లాడుతూ.. తమ స్థలం తమకు ఇప్పించాలని గతంలో ఎవరి దగ్గరకు వెళ్లినా న్యాయం జరగలేదన్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి విన్నవించగా.. ఆయన కోర్టుకు వెళ్లమని సూచించారని.. కోర్టుకు వెళ్లడంతో మాకు అనుకూలంగా తీర్పునిచ్చిందని ఆయన తెలిపారు.

రైతు ముంగిట పశు వైద్యసేవలు

- పొరుగు రాష్ట్రాల కంటే మిన్నగా ఏపీలో వైద్యసేవలు
- ఈనాడు కథనాన్ని ఖండించిన పశు సంవర్ధక శాఖ
- వాస్తవాలు తెలుసుకుని రాస్తే మేలని హితవు

సాక్షి, అమరావతి: గత సర్కారు పాడి పరిశ్రమను గాలికొదిలేసింది. పశు సంవర్ధక శాఖను నిర్వీర్యం చేసి.. పశువులకు కనీస వైద్యం కూడా అందించలేని స్థితికి నెట్టేసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక.. పంటలు పండించే రైతులతోపాటు పాడి రైతులకు పెద్దపీట వేస్తోంది. పశు పాలకులకు చేయూత అందిస్తుండటంతోపాటు పశువులకు 24 గంటలూ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. 340 సంచార పశువైద్య ఆరోగ్య సేవారథాలను రంగంలోకి దించింది. 7,396 ఆర్బీకే క్లస్టర్లలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పశు వైద్య నిపుణులను నియమించి పశువులకు అన్నిరకాల వైద్య సేవలు అందిస్తోంది. అయినా.. 'ఈనాడు'కు ఇవేమీ కనిపించడం లేదు. తన సహజ నైజంలో పశువుల పైనా విషం చిమ్మింది. 'పశువులూ అల్లాడుతున్నాయ్' శీర్షికన రామోజీ మార్కు జర్నలిజంతో మంగళవారం నాటి సంచికలో అబద్ధపు కథనాన్ని వండి వార్చింది.

ఆ కథనం పూర్తిగా సత్యదూరం

'ఈనాడు'లో ప్రచురితమైన కథనాన్ని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ రెడ్నం అమరేంద్రకుమార్ ఖండించారు. కథనంలో పేర్కొన్న అంశాలన్నీ పూర్తి సత్యదూరంగా ఉన్నాయన్నారు. మూగజీవాలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. వైద్య సేవలు అందక పశువులు చనిపోతున్న ఘటనలు రాష్ట్రంలో ఎక్కడా చోటుచేసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో 1,577 పశు వైద్యశాలలు, 323 ప్రాంతీయ పశు వైద్యశాలలు, 12 వెటర్నరీ పాలీ క్లినిక్స్ ద్వారా పశు పోషకులకు



రైతు ఇంటి వద్ద గేదెకు వైద్యసేవలు అందిస్తున్న పశు వైద్య సిబ్బంది

అత్యంత చేరువలో నాణ్యమైన, మెరుగైన అత్యాధునిక పశు వైద్యాన్ని అందిస్తున్నామని వివరించారు. క్లిష్టమైన శస్త్ర చికిత్సలను సైతం ఉచితంగా చేస్తూ పశువులను ప్రాణాపాయం నుంచి కాపాడుతున్నామన్నారు. రాష్ట్ర స్థాయిలో 2 సూపర్ స్పెషాలిటీ పశు వైద్యశాలల ద్వారా మనుషుల తరహాలో పశువులకూ 24 గంటల వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో 1.66 కోట్ల పశుగణ యూనిట్లు ఉండగా.. 1,527 పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు విధులు నిర్వహిస్తున్నారని వివరించారు. నియోజకవర్గ స్థాయిలో రూ.240.69 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 340 సంచార పశు వైద్య ఆరోగ్య సేవారథాల్లో మరో 701 మంది పశు వైద్యులు సేవలందిస్తున్నారని చెప్పారు. గ్రామస్థాయిలో 10,778 ఆర్బీకేలు ఏర్పాటు చేయగా.. వాటిలో 7,396 ఆర్బీకే క్లస్టర్ల ద్వారా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన పశు వైద్య నిపుణులు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్బీకేల ద్వారా ప్రాథమిక పశువైద్య సేవలతోపాటు కృత్రిమ గర్భధారణ సేవలు, పశు యాజమాన్యం, పశుగ్రాసాల పంపిణీ, పశు పోషణకు కావలసిన సేవలన్నీ అందిస్తున్నామని వివరించారు. ఆర్బీకేల్లో రెండు విడతల్లో నియమించిన 4,652 మంది గ్రాడ్యుయేట్స్ సేవలందిస్తుండగా.. తాజాగా మరో 1,896 ఆర్బీకేల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ జారీ చేశామన్నారు.

దేశంలో మరెక్కడా లేనివిధంగా..

దేశంలో మరెక్కడా లేనివిధంగా నియోజకవర్గ స్థాయిలో రూ.24.14 కోట్లతో 154 పశు వ్యాధి నిర్ధారణ ల్యాబ్స్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందని అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. ప్రతి ల్యాబ్‌లో ఒక ల్యాబ్ టెక్నీషియన్, అటెండర్‌ని నియమించారని చెప్పారు. ల్యాబ్‌ల ద్వారా పేడ పరీక్షలు, రక్త పరీక్షలు, పాల పరీక్షలు, మూత్ర పరీక్షలు, చర్మ సంబంధ వ్యాధి పరీక్షలు, యాంటీ బయోటిక్ సెన్సిటివిటీ, జీవక్రియ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారని చెప్పారు. వీటి ఫలితాల ఆధారంగా సత్వర, కచ్చితమైన పశు వ్యాధులను నిర్ధారించి, నాణ్యమైన, మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. పశ్చిమ బెంగాల్‌లో 51,772, గుజరాత్‌లో 36,540, బిహార్‌లో 32,138, తెలంగాణలో 32,127, ఉత్తరప్రదేశ్‌లో 27,480, రాజస్థాన్‌లో 20,821 జీవాలకు ఒక పశువైద్యుడు చొప్పున సేవలు అందిస్తుంటే.. మన రాష్ట్రంలో మాత్రం ప్రతి 17,808 జీవాలకు ఒక పశు వైద్యుడు సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. పశు వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామనడానికి ఇంతకంటే ఉదాహరణ అవసరం లేదన్నారు.

ఇదేమి పని 'నారాయణా'!

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నారాయణ విద్యా సంస్థల ఉద్యోగులు, ఉపాధ్యాయులు టీడీపీ ఎన్నికల ఉచ్చులో ఇరుక్కున్నారు. తమ విద్యాసంస్థల అధినేత, టీడీపీకి చెందిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ రాజకీయంలో సమిధలైపోతున్నారు. వారి చేత నారాయణ ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇలా వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్న నారాయణ సిబ్బంది, ఉపాధ్యాయులకు ప్రజలు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగిస్తున్నారు. మూడురోజుల క్రితమే నెల్లూరు నగరం మూలాపేట డివిజన్‌లో ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్న నారాయణ సంస్థ ఉద్యోగినికి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. తాజాగా మంగళవారం నగరంలోనే 42వ డివిజన్ మన్సూర్‌నగర్‌లో ఇదే తరహాలో నారాయణ విద్యా సంస్థల ఉపాధ్యాయుడు ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో వ్యక్తిగత సమాచారం సేకరిస్తుండగా స్థానికులు ఆగ్రహించి అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

ఎస్ టీంగా ఏర్పాటు

నారాయణ టీడీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయిన ఆయన 2024 ఎన్నికల్లో నెల్లూరు నుంచి మరోసారి బరిలోకి దిగేందుకు సమాయత్తం అవుతున్నారు. నాలుగున్నరేళ్ల పాటు నెల్లూరుకు ముఖం చాటేసిన ఆయనపై టీడీపీ కేడర్‌లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఆయన కోసం పనిచేయడానికి టీడీపీ నేతలెవరూ ముందుకు రావడంలేదు. దీంతో తన విద్యా సంస్థల ఉద్యోగులు, ఉపాధ్యాయులను రంగంలోకి దింపుతున్నారు. దాదాపు 150 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులతో నారాయణ టీం (ఎస్ టీం)గా ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆ బృందంలోని వారితో నెల్లూరు నగరంలో ఓటర్ల వెరిఫికేషన్ పేరుతో ప్రజల వ్యక్తిగత సమాచారం తీసుకుంటున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా సమాచారం, వారి మొబైల్‌కు వచ్చే ఓటీపీని కూడా అడుగుతుండడంతో స్థానికుల్లో ఆందోళన ఏర్పడింది. తమ ఓట్లు తొలగిస్తారని స్థానికులు వారిని అడ్డుకుంటున్నారు. నెల్లూరు నగరంలో మూడు రోజుల్లోనే ఇద్దరు ఉపాధ్యాయులు దేహశుద్ధి చేయించుకొన్నారు.

ఇదేం ఖర్మ నారాయణా.. అంటున్న ఉద్యోగులు

నారాయణ విద్యా సంస్థల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులుగా అనేక మంది పనిచేస్తున్నారు. 2014 ఎన్నికల వరకు నారాయణ టీడీపీకి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తూ ఆ పార్టీ అధినేత చంద్రబాబుకు బినామీగా వ్యవహరించేవారు. 2014లో టీడీపీ అధికారంలోకి రావడంతో నారాయణను చంద్రబాబు ఎమ్మెల్సీగా చేసి మంత్రి పదవి ఇచ్చారు. 2019 ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి నారాయణ సంస్థల ఉద్యోగులు, ఉపాధ్యాయులను రాజకీయ ఉచ్చులోకి దింపుతున్నారు. ఒకవేళ ఎవరైనా నిరాకరిస్తే ఏదో ఒక సాకుతో ఉద్యోగం నుంచి తొలగించడం.. లేదా దూర ప్రాంతాలకు బదిలీ చేయడం చేస్తున్నట్లు ఓ ఉద్యోగి వెల్లడించారు. ఇప్పుడు ఉద్యోగులు ప్రజల చేతిలో తన్నులు తింటున్నారు. మాకు ఇదేం ఖర్మ అంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబుకు 'సుప్రీం' నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ కుంభకోణం కేసులో ఏపీ సీఐడీ దాఖలు చేసిన బెయిలు రద్దు పిటిషన్‌లో సుప్రీంకోర్టు చంద్రబాబుకు నోటీసులు జారీచేసింది. ఈ కేసుకు సంబంధించి క్వాష్ పిటిషన్‌పై తీర్పు వెలువరించిన తర్వాతే బెయిల్ రద్దు కేసు విచారణ చేపడతామని తెలిపింది. డిసెంబరు 8లోగా లిఖితపూర్వక కౌంటరు దాఖలు చేయాలని చంద్రబాబుకు ఇచ్చిన నోటీసుల్లో పేర్కొంది. తదుపరి విచారణ డిసెంబరు 11వ తేదీకి వాయిదా వేసింది. టీడీపీ అధినేత చంద్రబాబుకు ఏపీ హైకోర్టు మంజూరు చేసిన రెగ్యులర్ బెయిలు రద్దుచేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ సతీష్‌చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ముందుకు వచ్చింది. ఏపీ సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. మధ్యంతర బెయిలు సమయంలో హైకోర్టు విధించిన షరతులు పొడిగించాలని కోరారు. దీంతోపాటు కేసు గురించి పబ్లిక్ డొమైన్‌లో ఎలాంటి ప్రకటనలు చేయకుండా చూడాలన్నారు. ఈ సమయంలో.. కోర్టులో ఉన్న అంశాలపై శాఖ అధికారులు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ ఆరోపించారు. ఇరుపక్షాలకు ఈ షరతు వర్తించేలా చూడాలని అభ్యర్థించారు. అగర్వాల్ వాదనకు ఏపీ సీఐడీ తరఫు మరో సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి అభ్యంతరం తెలిపారు. షరతులనేవి నిందితులకే వర్తిస్తాయని.. ప్రభుత్వానికి వర్తించవని చెప్పారు. అయితే, మీరు వాయిదా కోరుతున్నారా.. అని ధర్మాసనం ప్రశ్నించగా.. ప్రతివాదికి నోటీసులు జారీచేయాలని రోహత్గి బదులిచ్చారు. ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ ఆర్డర్‌లో మెరిట్స్‌పై నిర్ధారణలు ఉన్నాయని, ఇది రూ.300 కోట్ల ప్రజాధనం మళ్లించిన కేసు అని వివరించారు. ఏపీ సీఐడీ విజ్ఞప్తిని ధర్మాసనం అనుమతించింది. చంద్రబాబుకు నోటీసులు జారీచేస్తున్నామని, నవంబరు 3వ తేదీన ఏపీ హైకోర్టు విధించిన షరతుల్లో బహిరంగ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం లేదా పాల్గొనడం మినహా అన్నీ వర్తిస్తాయని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది.

సచివాలయ ఉద్యోగులపై నిమ్మగడ్డ రమేశ్ విషం

- ఆయనలా మేం ఎవరికీ అమ్ముడుపోలేదు
- సిటిజెన్స్ ఫర్ డెమోక్రసీ పేరుతో తప్పుడు ప్రచారం ఆపాలి
- గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎండీ జానీపాషా



సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులైన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేశ్ విషం చిమ్ముతున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎండీ జానీ పాషా పేర్కొన్నారు. సిటిజెన్స్ ఫర్ డెమోక్రసీ పేరుతో కొందరు మాజీ ఐఏఎస్ అధికారులతో కలిసి సంఘాన్ని ఏర్పాటు చేసిన ఆయన ఓ వర్గం మెప్పు కోసం తమపై నిందలు వేస్తూ ఒక రాజకీయ పార్టీకి ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారన్నారు. ఆయనలాగే సచివాలయ ఉద్యోగులను కూడా మరో రాజకీయ పార్టీకి సానుభూతిపరులుగా చిత్రీకరించడం దుర్మార్గమన్నారు. మంగళవారం ఫెడరేషన్ నాయకులతో కలిసి జానీ పాషా విజయవాడలో మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యం కోసం.. అంటూ మాజీ ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన సంఘం అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని, అర్థం లేని అనైతిక ఆరోపణలతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రాజకీయాలను ఆపాదించడం దురదృష్టకరమన్నారు. గతంలో నిమ్మగడ్డ రమేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా తన వర్గ ప్రయోజనాల కోసం అధికారాన్ని, పదవిని ఓ రాజకీయ పార్టీకి తాకట్టు పెట్టిన విషయం తెలిసిందేనన్నారు. అలాంటి నీతిబాహ్యమైన ప్రవర్తన గల ఆయన ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ సంఘం స్థాపించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ రాజ్యాంగబద్ధంగా ఏర్పడిందని, ఎన్నికల కమిషన్ అనుమతితోనే ప్రభుత్వ ఉద్యోగులమైన తాము బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్నట్టు పాషా చెప్పారు. నిమ్మగడ్డ రమేశ్ తమపై బురదజల్లడం, తమను ప్రభుత్వ ఉద్యోగులే కాదన్నట్టు చిన్నచూపు చూడటం దుర్మార్గమని మండిపడ్డారు. సచివాలయ ఉద్యోగులు పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహిస్తున్నారని స్పష్టంచేశారు. ఫెడరేషన్ నాయకులు సుభానీ, అర్చన, రహీమ్, మనోహర్, రాజేష్ బాబు, టి.రవి, స్టాలిన్‌చక్రవర్తి, శ్వేత పాల్గొన్నారు.

బాలయ్యా.. పిచ్చివేషాలు మానుకో..

హిందూపురంలో మహిళల భారీ ర్యాలీ.. బాలకృష్ణ పోస్టర్ దహనం

హిందూపురం టౌన్: 'బాలయ్యా.. పిచ్చి వేషాలు మానుకో... మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడం, నీచంగా మాట్లాడడం వంటి పిచ్చివేషాలు వేస్తే మహిళలే నిన్ను తరిమికొట్టడం ఖాయం..'అని హిందూపురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణను వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక హెచ్చరించారు. మహిళలు, తోటి నటీమణుల పట్ల బాలకృష్ణ అసభ్యకరంగా వ్యవహరించడం, అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం హిందూపురంలో మహిళలు ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు సాగిన ర్యాలీలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బాలకృష్ణ డౌన్ డౌన్.. బాలకృష్ణ గో బ్యాక్.. సైకో బాలకృష్ణ... అని నినాదాలు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలకృష్ణ పోస్టరును చెప్పులతో కొడుతూ దహనం చేశారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ అని చెప్పుకోవడానికి కూడా ఇక్కడి మహిళలు సిగ్గుపడుతున్నారని ఆగ్రహం



నిరసన తెలుపుతున్న మహిళలు

వ్యక్తంచేశారు. బాలకృష్ణ సంస్కారం లేకుండా తోటి సినీనటి విచిత్రతో ఎలా అసభ్యంగా ప్రవర్తించారో ఆమె నోటితోనే విన్నామని చెప్పారు. ఓ సినీ ఫంక్షన్ లోనూ మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. ఇలాంటి సైకో ఆలోచనలు ఉన్న వ్యక్తి ఎమ్మెల్యేగా అనర్హుడన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ హిందూపురం సమస్యలపై ఏ రోజూ అసెంబ్లీలో మాట్లాడని బాలకృష్ణ.. మహిళలపై మాత్రం నీచంగా మాట్లాడడం, అసభ్యంగా ప్రవర్తించడం రివాజుగా మార్చుకున్నాడని విమర్శించారు. మహిళలకు బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

యువగళానికి వస్తే రూ.వెయ్యి!



అమలాపురం హైస్కూలు సెంటర్‌లో లోకేశ్ పాదయాత్రకు వచ్చిన వారికి డబ్బులు ఇస్తున్న నేత

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో టీడీపీ నేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం యాత్రకు జనాన్ని తరలించేందుకు నేతలు తంటాలు పడుతున్నారు. మంగళవారం అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో పాదయాత్రకు వచ్చిన వారికి రూ.700 నుంచి రూ.వెయ్యి చొప్పున ఇస్తూ టీడీపీ నేతలు కెమెరాలకు దొరికిపోయారు. భట్నవిల్లిలో యువతతో లోకేశ్ ముఖాముఖి కోసం.. టీడీపీ నేతలు అమలాపురంలోని ప్రైవేటు కాలేజీలపై ఒత్తిడి తెచ్చి విద్యార్థులను బలవంతంగా తరలించారు. విద్యార్థులు విధిగా సాధారణ దుస్తుల్లో రావాలని, లేకపోతే ఇంటర్నల్ మార్కులు కోల్పోతారంటూ అధ్యాపకుల ద్వారా కాలేజీ యాజమాన్యాలు మెసేజ్‌లు పంపాయి. ఈ మెసేజ్‌ల స్క్రీన్‌షాట్లు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. యువగళం యాత్రకు తెచ్చిన ఓ విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది.



ఆధ్యాత్మిక మార్గంలో నీకు ఎవరి మద్దతూ లేనప్పుడు
ఒంటరిగా నడువు. అపరిపక్వ మనుషులు నీకు జత కాలేరు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 29 నవంబర్ 2023

ఎవరికీ పట్టని ప్రాణాలు

జానెడు పొట్ట కోసం ఉన్న ఊరునూ, అయినవారినీ వదిలి దూరతీరాలకు పోయి కాయకష్టం చేసే వారు బతుకుపోరాటంలో ఎప్పుడూ ఓడిపోతూనే వుంటారు. మహానగరాల్లో రాళ్లెత్తే కూలీలుగా, క్వారీల్లో గనుల్లో చెమటోడ్చే కార్మికులుగా, భారీ భవంతులకు కాపలాదార్లుగా, స్థానికులు చేయసాహసించని అనేక ప్రమాదకరమైన పనులను తప్పనిసరిగా తలకెత్తుకుని ప్రాణాలు పణంగా పెట్టే బడుగుజీవులుగా వీరు అందరికీ సుపరిచితులే. కానీ భద్రత, ఆరోగ్యం వంటివి వీరికెప్పుడూ ఆమడదూరమే. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుంటున్నా అర్ధాకలితో కాలం గడిపే అలాంటి అభాగ్యులపై ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) విడుదల చేసిన నివేదిక దిగ్భ్రాంతికరమైన నిజాలు వెల్లడించింది. పనికి సంబంధించిన ప్రమాదాల్లో చిక్కుకుని, వ్యాధుల బారినపడి ప్రపంచవ్యాప్తంగా సగటున ఏటా 30 లక్షలమంది కన్నుమూస్తున్నారని ఆ నివేదిక అంచనా. కార్మికుల ఉసురుతీస్తున్న పది రకాల కారణాలను ఆ నివేదిక గుర్తించింది. సుదీర్ఘమైన పనిగంటలు (వారానికి 55 గంటలు లేదా అంతకన్నా ఎక్కువ) కార్మికుల మరణాలకు ప్రధాన కారణమవుతున్నాయని, ఆ కేటగిరీలో ఏటా మరణిస్తున్నవారు 7,44,924 మంది అని తేల్చింది. ఆ తర్వాత స్థానం సూక్ష్మ ధూళి కణాలు, పొగలు, వాయువులది. వాటి బారినపడి మరణించేవారు ఏటా 4,50,381 మంది అని లెక్కేసింది. ఇవిగాక నికెల్, ఆర్సెనిక్, డీజిల్ కాలుష్యం, సిలికా, ఆస్బెస్టాస్ తదితరాల వల్ల మరో 15 లక్షల మరణాలు సంభవిస్తున్నాయని తెలిపింది. వీటిల్లో 63 శాతం ఆసియా–పసిఫిక్ ప్రాంత దేశాల్లోనే వుంటున్నాయని వివరించింది. వ్యవసాయం, రవాణా, మైనింగ్, నిర్మాణరంగం వగైరాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి నివారణకు అనుసరించాల్సిన విధానాల రూపకల్పనకు సోమవారం ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ప్రారంభ మైన నాలుగురోజుల సదస్సు సందర్భంగా ఐఎల్‌ఓ ఈ నివేదిక వెలువరించింది.

మనవరకూ తీసుకుంటే జనాభాలో మూడోవంతు మంది వలసబాట పడుతున్నారు. వీరంతా పల్లెటూళ్లను వదిలి పట్టణాలకూ, నగరాలకూ వలసపోయేవారే. ఇలాంటివారు ఎలాంటి గుర్తింపూ లేకుండా బతుకులీడుస్తున్నారు. వారికి ఓటు హక్కుండదు. రేషన్ కార్డు వుండదు గనుక చవగ్గా సరుకులు లభించవు. స్థానికతకు అవకాశం లేదు గనుక వారి హక్కుల కోసం, పని పరిస్థితుల మెరుగు కోసం పోరాడే సంస్థలుండవు. అసంఘటిత రంగ కార్మికులుగా కనీసం చట్టప్రకారం దక్కాల్సినవి వారికి ఎప్పుడూ దూరమే. జ్వరమో, మరే వ్యాధో ముంచుకొచ్చినా చూసే దిక్కుండదు. ఇలాంటి అభాగ్యులకు కుటుంబాలుంటే ఈ కష్టాలన్నీ మరిన్ని రెట్లు ఎక్కువ. ఈ కార్మికుల కాంట్రాక్టర్లు సర్వసాధారణంగా ఏదో ఒక పార్టీ ఛత్రఛాయలో వుంటారు గనుక అధికారులు వారి జోలికి పోవటానికి, కార్మికుల ప్రయోజనాలు కాపాడటానికి సాహసించరు. మెరుగైన సాంకేతికత లున్న యంత్ర సామగ్రి లభ్యమవుతున్నా వాటిపై పెట్టుబడులు పెట్టడం దండగన్న భావనతో ఈ కార్మికులతోనే అన్నీ చేయిస్తుంటారు. ఈ క్రమంలో ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోవటం లేదా అంగవికలురు కావటం రివాజు. ప్రపంచవ్యాప్తంగా గాయాలపాలై ఏటా 3,63,283 మంది కార్మికులు మరణిస్తున్నారని ఐఎల్‌ఓ నివేదిక చెబుతోంది. మన దేశంలో 2017–2020 మధ్య సగటున రోజూ ముగ్గురు కార్మికులు ప్రమాదాల బారినపడి చనిపోతున్నారని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ డేటా తెలిపింది. ఇవన్నీ రిజిస్టరయిన ఫ్యాక్టరీలకు సంబంధించినవి. అసంఘటిత రంగంలో సంభవించే మరణాలకు అరకొర డేటాయే వుంటుంది. సాధారణంగా ఆ రంగంలో సంభవించే చాలా మరణాలు సహజ మరణాల ఖాతాలోకి పోతుంటాయి. వైద్యులు కూడా వారికి సహకరిస్తుంటారు. అసంఘటిత రంగ కార్మికులు చేసే వెట్టిచాకిరీ అపారమైన సంపద సృష్టిస్తోంది. కానీ ఆ సంపద సృష్టికర్తలు అనామకులుగా మిగిలిపోతున్నారు. ముగిసిపోతున్నారు.

అంతర్జాతీయంగా నిబంధనలు లేవని కాదు. పని పరిస్థితుల్లో భద్రత, ఆరోగ్యం వంటి అంశాలపై ఐఎల్‌ఓ రూపొందించిన అంతర్జాతీయ ఒడంబడికను 187 సభ్య దేశాల్లో కేవలం 79 దేశాలు ఆమోదించాయి. కనీసం అందుకు సంబంధించిన నియమ నిబంధనలకైనా సభ్య దేశాలన్నీ ఆమోదం తెలపలేదు. అందుకు కేవలం 62 దేశాలు మాత్రమే సమ్మతించాయి. ఈ రెండు ఒడంబడికలకూ మన దేశం ఆమడ దూరంలో వుంది. వృత్తిపరంగా ఎదురయ్యే ఇబ్బందులేమిటో, అందులో పొంచివుండే ప్రమాదాలేమిటో బయటివారికన్నా కార్మికులకే ఎక్కువ తెలుస్తుంది. కనీసం అవి బయటివారు తెలుసుకోవటానికైనా కార్మికులకు సంఘాలుండాలి. వారి తరపున గట్టిగా ప్రశ్నించే నేతలుండాలి. కానీ మన దేశం వరకూ చూస్తే కార్మిక సంస్కరణల పేరిట తీసుకొచ్చిన కొత్త చట్టాలు అలాంటి అవకాశాలను మరింత నీరుగార్చాయి. ఫలితంగా బాల కార్మిక వ్యవస్థ, వెట్టిచాకిరీ, వివక్ష, అధిక పనిగంటలు వంటివన్నీ అసంఘటిత రంగ కార్మికులకు శాపాలవుతున్నాయి. రిజిస్టరైన ఫ్యాక్టరీల్లోనే తప్పుడు లెక్కలు చూపించి కార్మికుల భద్రతకు సంబంధించిన కమిటీల ఏర్పాటు, లైంగిక వివక్ష నిర్మూలన తదితరాలను ఎగ్గొడుతున్నారు. ఇక ఎవరికీ పట్టని అసంఘటితరంగ కార్మికుల గురించి చెప్పేదేముంది? సిడ్నీలో సాగుతున్న సదస్సులో 127 దేశాలకు చెందిన మూడు వేల మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటున్నారు. 30 గోష్ఠులు, ఆరు సాంకేతిక సదస్సులు కూడా వుంటాయంటున్నారు. కనీసం ఈ సదస్సు తర్వాతనైనా కార్మికుల భద్రతకు ముప్పుగా పరిణమించిన సమస్యలను నివారించటానికి పకడ్బందీ విధానాలు రూపొందించటం తమ బాధ్యతగా ప్రభుత్వాలు గుర్తించాలి.

మేధావులకు నిలయాలు కావాలంటే...

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

విశ్వవిద్యాలయం అంటే ఒక అధ్యయన బోధన కేంద్రమని మరిచిపోతున్నామా? జ్ఞాన సముపార్జనకు అదొక నెలవని విస్మరిస్తున్నామా? కొన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయాలను చూస్తుంటే పరిస్థితి అలాగే కనబడుతోంది. అధ్యాపక వర్గంలో సామర్థ్యం ఉన్నవారు కొరవడుతున్నారు. విద్యార్థులు మత్తుమందులకు బానిసలవుతున్నారు. అసాంఘిక చర్యలకు నిర్భయంగా దిగుతున్నారు. మతోన్మాదం, కులోన్మాదాలు పెరుగుతున్నాయి. విశ్వవిద్యాలయాలు అంబేడ్కర్, సర్వేపల్లి రాధాకృష్ణన్, ఇమాన్యుయేల్ కాంట్, హెగెల్, జీన్‌పాల్ సాత్రే, చిన్నయ సూరి వంటి ప్రపంచ మేధావుల్ని సృష్టించాలంటే... జ్ఞానం, నీతి, వ్యక్తిత్వం, మానవత, ప్రజ్ఞ విస్తరించాలి. అప్పుడే ప్రపంచ యవనికపై భారతీయ విశ్వవిద్యాలయాలు మెరుస్తాయి.

ప్రపంచ వ్యాప్తంగా విద్య... సామాజిక, సాంస్కృతిక, సాంకేతిక రంగాల్లో విప్లవంగా ముందుకొస్తూ ఉంది. నూతన సామాజిక నిర్మాణానికీ, ప్రపంచ అవగాహనకూ విద్యే ముఖ్యసాధనం. అటువంటి విద్యనందించే కేంద్రాలుగా విశ్వవిద్యాలయాలకు ఒక గుర్తింపు ఉంది. ఇవి దేశంలో కేంద్రీయ, రాష్ట్ర, డీమ్డ్, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలుగా సేవలు అందిస్తున్నాయి. ఉన్నత విద్యను ఒక జీవనశాస్త్రంగా అధ్యయనం చేసిన వారిలో డా॥ బీఆర్ అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్వేపల్లి రాధాకృష్ణన్, మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్, రామ్ మనోహర్ లోహియా, సర్ సి.వి.రామన్ వంటి మేధావులు ఎందరో ఉన్నారు. కానీ దేశంలో ఈనాడున్న 56 సెంట్రల్ యూనివర్సిటీలలో ఉన్న విద్యార్థులు, పరిశోధకులు వీరిలాగా నూత్న జ్ఞానాన్ని సృష్టించలేక పోతున్నారు. విశ్వ విద్యాలయ గ్రంథాలయాలు అధ్యయనపరుల కోసం ఆకలితో ఎదురుచూడాల్సి వస్తోంది.

అధ్యాపక వర్గంలో అత్యున్నత బోధనా సామర్థ్యం వున్న వారి సంఖ్య తగ్గిపోతోంది. దొంగ డాక్టరేట్లు ఇచ్చి డబ్బు గుంజుకున్న చర్యలతో అనేక విశ్వవిద్యాలయాలు పీకల్లోతు ఆరోపణలలో కూరుకొని ఉన్నాయి. కొన్ని విశ్వవిద్యాలయాలలో విద్యార్థులు మత్తుమందులకు బానిసలవుతున్నారు. అసాంఘిక చర్యలకు నిర్భయంగా దిగుతున్నారు. ఇక ర్యాగింగ్ పేరుతో కొందరు సీనియర్స్... విద్యార్థినీ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొనేంతగా వేధింపులకు గురి చేయడమూ కనిపిస్తోంది. శరీరాలను నగ్నంగా చూడాలనే... మనుషులను వేధించి, బాధించి ప్రేమను పొందాలనే మానవుడిలో అంతర్ నిహితంగా వున్న క్రూర స్వభావాన్ని జనారణ్యంలో ప్రదర్శించడం అనేది, ఈనాడు కొందరు విద్యార్థులకు ఒక దినచర్యగా మారింది. మెడికల్ కాలేజీలలో అమ్మాయిల మీద లైంగికంగా దాడులు జరుగుతున్నాయి.

ఉస్మానియా యూనివర్సిటీలో ఒక ప్రొఫెసర్ లైంగికంగా వేధించడం భారతదేశాన్ని కుదిపివేసింది. ఒక డాక్టరు మనిషికి ఉన్న రుగ్మతను చూడాలి. కానీ ఆమెను అనుభవించాలని అనుకోకూడదు. ఈనాటి ప్రొఫెసర్లు ఎందుకో బోధనేతర అంశాల పట్ల ఆసక్తి చూపుతున్నారు. జూదం, త్రాగుడు, క్లబ్బులు, పబ్బులు, డ్రగ్స్, ఇతర వినోదాంశాల వైపు ఉపాధ్యాయుడు వెళితే విద్యార్థుల పరిస్థితి ఏమిటి? విద్యార్థులు జ్ఞానేతర, వినోదభరిత జీవన సంస్కృతిలో కొట్టు మిట్టాడుతున్నారు. 'నన్ను ప్రేమించకపోతే నీ మీద యాసిడ్ పోస్తా' నని బెదిరిస్తున్నారు. కృతిమత్వం, క్రూరత్వం కొందరు విద్యార్థులను అలుముకుంది. నిజానికి గ్రంథాలయ పఠనం బాగా తగ్గింది. అందువల్ల లక్షలు పెట్టి కొన్న పుస్తకాలు వ్యర్థమవుతున్నాయి. ఈరోజు విద్యార్థినులు అన్ని రంగాలలో విద్యార్థులను దాటి ముందుకెళ్లి పోయారు. అది ఈర్ష్యగా పరిణమించింది. ఈర్ష్య మనిషిని విచ్ఛిన్నం చేస్తుంది. ఈర్ష్య మనిషిని తినేస్తుంది. ఈరోజు విద్యార్థులు ప్రేమ అని



చేస్తున్న ప్రపోజల్స్‌లో ప్రేమ లేదు, కామమే వుంది. కామం మనిషి కళ్లు కప్పుతుంది, అంధుణ్ణి చేస్తుంది, బధిరుణ్ణి చేస్తుంది. ఇలాంటి రుగ్మతల వల్లనే ఈ విద్యాలయాల నుంచి మంచి పరిశోధనా గ్రంథాలు రావట్లేదు.

శాస్త్రజ్ఞానం అనేది మనుష్యుల బుర్రల కెక్కాలంటే, విశ్వాసాలకు అతీతంగా ఆలోచించగలగాలి. తత్వవేత్తకు, శాస్త్రవేత్తకు సమన్వయం సాధించడంలో అద్వితీయమైన పాత్రను బెర్ట్రాండ్ రస్సెల్ సాధించాడు. డార్విన్‌లో కానీ, కారల్ మార్క్స్‌లో కానీ, మరి ఏ తాత్వికునిలోనూ, శాస్త్రవేత్తలోనూ ఉన్న లోపాన్నీ, ఆధిక్యభావాన్నీ ఎత్తి చూపడంలో కూడా రస్సెల్ వెనుకాడలేదు. ప్రతి తత్వవేత్త, శాస్త్రవేత్త జ్ఞానానికి పరిమితులు ఉంటాయి. రాబోయే కాలం వారు గతంలో చెప్పినవాటిలో కొన్నింటిని ఖండించవచ్చు. కొన్నింటిని పూరించవచ్చు. ఆ శాస్త్రజ్ఞానం వలన సమాజానికి జరిగే నష్టాన్ని గూర్చి చెప్పవచ్చు. ఇదొక సత్యాన్వేషణా క్రమం.

ప్రతి పౌరుడు, విద్యార్థి, పరిశోధకుడు... శాస్త్రవేత్తల జీవితాలను అధ్యయనం చేయడం వలన స్ఫూర్తి పొందవచ్చు. అంతేకాదు, వారి అధ్యయన క్రమాన్నీ, పరిశోధనా క్రమాన్నీ మనం అనుసరించవచ్చు. చార్లెస్ డార్విన్ గొప్ప పరిశోధకుడే కాదు, గొప్ప అధ్యయనపరుడు కూడా! ఆయనది శాస్త్రపరమైన రచన. ఆయన జీవితంలోని ఆటుపోటులను ధైర్యంగా ఎదుర్కొన్నాడు. అపారమైన ధైర్యశాలి ఆయన. అనేక జంతు సమూహాలనూ, పక్షి సమూహాలనూ, సముద్రాలనూ, వివిధ ఖండాలనూ చూసినపుడు సహజంగా ఆ ధైర్యం వస్తుంది. జీవులు జనిస్తాయి, నశిస్తాయనే శాస్త్ర జ్ఞానం అబ్బుతుంది. ఆ అవగాహనే అపారమైన శక్తినీ, వ్యక్తిత్వ నిర్మాణాన్నీ మనిషికి కలుగజేస్తుంది. జీవించడమే కాదు, ఈ జీవుల ప్రాదుర్భావాన్ని గూర్చి తెలుసుకోవడం కూడా ఒక గొప్ప జ్ఞానమే. ఈ పునాదిగా శాస్త్రం ఎంతో అభివృద్ధి చెందింది. 20వ శతాబ్దిలో ఎరిక్ కండెల్ చేసిన పరిశోధనలు కొత్త వెలుగులు చూశాయి. కండెల్ బయో కెమిస్ట్రీ, బయో ఫిజిక్స్‌లను అధ్యయనం చేసి 'ఇన్ సెర్చ్ ఆఫ్ మెమొరీ: ది ఎమర్జెన్స్ ఆఫ్ ఏ న్యూ సైన్స్ ఆఫ్ మైండ్' అనే గ్రంథం రాశాడు. ఇందులో అద్భుత విషయాలు తెలియ చేశాడు. న్యూరో సైన్సుపై అభిరుచితో మనిషి జ్ఞాపక శక్తి గురించి ఎంతో పరిశోధన చేశాడు. జంతువులకు, మనుషులకు జ్ఞాపకశక్తిలో ఎంతో తేడా ఉందని కనిపెట్టాడు. ఇపుడు సైన్సు శాఖోపశాఖలుగా విస్తరించడానికి ఆనాడు డార్విన్ చేసిన పరిశోధనలే ప్రధాన కారణం. నిజానికి డార్విన్ లాగా, ఐన్‌స్టీన్‌లాగా మన విశ్వవిద్యాలయాలలో పరిశోధన చేస్తే భారతదేశం ప్రపంచానికి ఒక ఆదర్శమయ్యేది. కానీ దురదృష్టవశాత్తూ జ్ఞానార్జనకు నెలవు కావాల్సిన చోట మతోన్మాదం, కులోన్మాదాలు పెరిగాయి. రాజకీయ రంగులు పులుముకుంటున్నాయి.

కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో మతోన్మాద అరాచకత్వం పెరిగిపోతోంది. చరిత్ర జ్ఞానాన్ని నిరాకరిస్తూ, పౌరాణిక జ్ఞానానికి పతాకలెత్తుతున్నారు. దుష్ట శిక్షణ పేరుతో దళితుల్ని, మైనారిటీలను వేటాడుతున్నారు. కులతత్వంతో ఊగిపోతూ కులాంతర వివాహితులను వేధిస్తున్నారు. అంబేడ్కర్ నిర్మించిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ జ్ఞాన శూన్యులుగా జీవిస్తున్నారు. మైనారిటీలైన ఆచార్యులను కించపరుస్తున్నారు. చరిత్రలో ప్రసిద్ధులైన అశోకుడు, అంబేడ్కర్ అంతటి వాళ్లను తక్కువచేస్తూ, బౌద్ధ సంస్కృతిని నిరాకరిస్తున్నారు. ఓ పక్క కార్పొరేట్ శక్తులకు బానిసలుగా ఉండి అమెరికన్ సామ్రాజ్య వాదానికి తొత్తులై, ఇజ్రాయెల్ దాడులను సమర్థిస్తూ, మహిళా విద్యార్థినులను హింసిస్తూ, విశ్వవిద్యాలయాలను భయకంపిత కేంద్రాలుగా చేస్తున్నారు.

విశ్వవిద్యాలయం అంటే ఒక విజ్ఞాన అధ్యయన, బోధన కేంద్రమని మరిచిపోయారు. మతోన్మాద క్రీడలకు నెలవు చేస్తున్నారు. శాంతి, కాంతులను విధ్వంసిస్తూ ఉన్మాదాన్ని, ఉద్రేకాన్ని కలిగిస్తున్నారు. అందుకే అంబేడ్కర్ భావజాలంతో పాటు, అంబేడ్కర్ గ్రంథాలయాలు, అంబేడ్కర్ పరిశోధనా కేంద్రాలు అన్నీ విశ్వవిద్యాలయాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది.

మన విశ్వ విద్యాలయాలు అంబేడ్కర్, సర్వేపల్లి రాధాకృష్ణన్, ఇమాన్యుయేల్ కాంట్, హెగెల్, జీన్‌పాల్ సాత్రే, చిన్నయ సూరి వంటి ప్రపంచ మేధావుల్ని సృష్టించాలంటే... జ్ఞానం, నీతి, వ్యక్తిత్వం, మానవత, ప్రజ్ఞ విస్తరించాలి. అప్పుడే ప్రపంచ యవనికపై మన విశ్వ విద్యాలయాలు మెరుస్తాయి. ఆ ప్రగతి పథంలో మనం నడుద్దాం. అప్పుడే భారతదేశానికి కీర్తి వస్తుంది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మరో జీవితం



ఉత్తరకాశీలోని సిల్క్యారా సొరంగం ఇప్పుడు తెరుచుకుంది. 17 రోజుల భారీ సహాయక చర్య ఎట్టకేలకు ముగింపునకు వచ్చింది. లోపల చిక్కుకు పోయిన 41 మంది కార్మికులు ఊపిరి పీల్చుకున్నట్టే! మొత్తానికి, చీకటి తర్వాత వెలుగు వచ్చినట్టయింది.

– పీయూష్ రాయ్, జర్నలిస్ట్

మానసిక క్షోభ



గాజాలో బంధితులుగా చేపట్టబడిన ఇద్దరు అమ్మాయిల (దఫ్నా–14 ఏళ్లు, ఎలా–8.5 ఏళ్లు) తల్లిగా నేను కచ్చితంగా చెప్పాలనుకుంటున్నది... వాళ్ల ప్రియమైనవాళ్ల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలతో హమాస్ క్రూరమైన మానసిక యుద్ధం కొనసాగిస్తోంది. బంధితులందరినీ హమాస్ వెంటనే విడుదల చేయాలి.

– మాయన్ జిన్, తల్లి

తలవంపేనా?



ఇటీవలి దక్షిణాఫ్రికా సమావేశాల్లో, 'బ్రిక్స్'ను 5 నుంచి 11 సభ్యదేశాలకు విస్తరించాలని కూటమి నిర్ణయించింది. దానికి నాయకత్వం వహించిన చైనాకు దౌత్యపరమైన ఇబ్బంది కలిగించేలా, అర్జెంటీనా నూతన ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఆ సభ్యత్వం వల్ల పెద్ద ప్రయోజనమేమీ లేదంటూ బ్రిక్స్‌లో చేరిక ఆహ్వానాన్ని అంగీకరించబోనట్టుగా సంకేతాలిచ్చింది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

ఆయనేనా?



ఒక వైద్యుడిగా మీకు రెండు అందమైన పేర్లున్న ఒక వ్యాధిని పరిచయం చేస్తాను: సూడొలాజికల్ ఫాంటాస్టికా లేదా మైథోమేనియా. ఈ వ్యాధి ఉన్నవాళ్లు అలవాటుగా అబద్ధాలాడుతారు. (ఇది చెప్పగానే) ఒక భారతీయుడిగా మీ మనసుకు ఎవరు గుర్తుకు వస్తున్నారో నేను అడగటం లేదు!

– షా ఆలమ్ ఖాన్, కాలమిస్ట్

ఆత్మీయతే మందు




మీరూ మనుషులే, నేనూ మనిషినే! మీకూ సంతోషమయ జీవితం కావాలి, నాకూ సంతోషమయ జీవితం కావాలి. కానీ ఈ లక్ష్యం కేవలం భౌతిక విలువలతో నెరవేరదు. మనం మరింత దయాపూరితంగా ఉండాలంటే, మనందరికీ ఆత్మీయత కావాలి.

– దలై లామా, బౌద్ధగురువు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

జగనే ఎందుకు కావాలంటే?

అభిప్రాయం



ఆచార్య గాజులపల్లి రామచంద్రారెడ్డి

మాట ఇస్తే మడమ తిప్పని నైజం, ఇచ్చిన మాటను ఆరు నూరైనా, నూరు ఆరైనా నిలబెట్టుకోవడం కొందరికే చెల్లు. 'నేను ఇచ్చిన మాట తప్పను' అని సగర్వంగా చెప్పిన వ్యక్తి, మహానేత వైఎస్సార్. ఆయన వారసత్వాన్ని ఆయన తనయుడు నేటి ఆంధ్రప్రదేశ్ యువ ముఖ్యమంత్రి, జననేత జగన్ పుణికి పుచ్చుకొన్నారు. జగనన్న 2019 మే నెల 30వ తారీఖున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారోత్సవ సమయాన 'మేనిఫెస్టోనే నా భగవద్గీత, బైబిల్, ఖురాన్' అని అన్నారు. అన్న విధంగానే నేటికి ఇచ్చిన హామీలన్నింటినీ దాదాపుగా నెరవేర్చారు. ఆయన ప్రతిపాదించిన 'నవరత్నాల'తో ఊరూరా అభివృద్ధీ, ఇంటింటా సమృద్ధీ కనిపిస్తోంది. జనులంతా నవజీవనంతో జీవిస్తున్నారు. ఆకలి దప్పులు లేవు. గ్రామాల్లో భిక్షాటన దాదాపుగా కనుమరుగైంది. పనిపాటలకు వచ్చేవారు కూడా సొంత స్కూటర్లు, మోటారు సైకిళ్లపై వస్తున్నారు. జీవన ప్రమాణాలు పెరిగాయి. జగన్ పథకాలతో ప్రతి ఇంట్లో లక్ష్మీకళ తొణికిసలాడుతూ ఉంది.

విద్య, వైద్యం, గృహకల్పనలో జగనన్న విప్లవం తెచ్చారు. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని గ్రామ 'సచివాలయా'ల స్థాపనతో సాకారం చేశారు. నిరుద్యోగులకు లక్షలాది ఉద్యోగాలను కల్పించారు. ఉద్యోగాలు ఇచ్చే ప్రక్రియ పారదర్శకంగా జరిగింది. దాదాపు 81 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా వర్గాలకు చెందినవారు ఉద్యోగాలు పొందారు. వాలంటీర్లతో సహా సచివాలయాల్లో పనిచేసేవారంతా స్థానికులు కావడం విశేషం. వీరు 600 పైగా సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను ఇంటి వద్దకే చేరుస్తున్నారు. దార్శనికుడైన డా॥ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశించిన సామాజిక న్యాయాన్ని జగన్ ప్రజలకు చేరువ చేశారు. నగరపాలక, మున్సిపాలిటీ, మండల, జిల్లా పరిషత్, పంచాయితీ ఎన్నికలలో మెజారిటీ పదవులను అణగారిన వర్గాలకే కట్టబెట్టారు. బలవంతుల దౌర్జన్యాలు, ధనవంతుల పన్నాగాలు, పెత్తందార్ల విపరీతపు పోకడలనూ ఆటకట్టిస్తున్నారు జగన్.

జ్యోతిరావు పూలే దంపతులు ఆశించిన 'అందరికీ ఆంగ్ల విద్య'ను సాకారం చేశారు సీఎం. శరీరంలో అన్ని అవయవాలు ఆరోగ్యంగా ఉంటే ఆ వ్యక్తి ఆరోగ్యవంతుడుగా ఉంటాడు. అదే విధంగా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలూ, అన్ని వర్గాలూ సమాన స్థాయిలో అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం సుభిక్షంగా, సుఖశాంతులతో వర్ధిల్లుతుంది. ఆ విధంగా అన్ని ప్రాంతాలూ వృద్ధి చెందాలని జగనన్న వికేంద్రీకరణే అభివృద్ధికి ఆలంబన అని 'మూడు రాజధాను'లనే భావన తెచ్చారు. 'నాడు – నేడు' కార్యక్రమాలతో పాఠశాలలు, ఆసుపత్రులు ఎంతో అభివృద్ధి చెందాయి. అధికార భాషా సంఘాన్ని, తెలుగు అకాడమీ లాంటి పలు సంస్థలను పునరుద్ధరించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేదానికి 'స్పందన' చేపట్టారు. 'ఆరోగ్యశ్రీ', 'సురక్ష', 'ఆరోగ్య సురక్ష' కార్యక్రమాలతో ప్రతి ఇంటికీ వైద్యాన్ని చేరువ చేశారు. జగన్ 17 కొత్త వైద్య కళాశాలలు నెలకొల్పారు. గ్రామ, పట్టణ, నగరాలలో 10 వేల వైఎస్సార్ క్లినిక్‌లను, 542 యూహెచ్‌సీలు, ప్రతి మండలానికీ పీహెచ్‌సీల స్థాపనకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తూ ఉంది. ఎప్పుడూ లేని విధంగా 6,000కు పైగా వైద్యులనూ, స్పెషాలిటీ వైద్యులనూ పారదర్శకంగా నియమించారు. అన్నింటికీ మించి జగన్ అన్ని వర్గాలకు 'భరోసా'గా ఉన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ముఖ్యమంత్రిగా కలకాలం ఉండాలి అని ప్రజలంటున్నారు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు

కమిట్‌మెంట్ రాజకీయాలే ఊపిరిగా...

అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లో కొన్ని విలువలుండేవి. కమిట్‌మెంట్ రాజకీయాలుండేవి. క్రమక్రమంగా అవి మాయమై, గెలవడమన్నదే ప్రధానాంశం అయిపోయింది. అంతేకాదు, పార్టీ సంగతి ఎలా ఉన్నా వ్యక్తిగత గెలుపునకు ప్రాధాన్యమివ్వడం పెరిగింది. సిద్ధాంతాలు మాయమై శుష్క వాగ్దానాలతో పొద్దుబుచ్చడం, గెలిచిన తర్వాత వాటిని గాలి కొదిలేయడం మామూలై పోయింది. అటువంటి పరిస్థితుల్లో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యి అనేక వినూత్న పథకాలను అమలుచేసి రాజకీయాల్లో నవశకాన్ని సృష్టించారు.

యువనాయకుడు జగన్ తండ్రి ఆదర్శాలనూ, పోరాటపటిమనూ సొంతం చేసుకొని, స్పష్టమైన రాజకీయ దృక్పథంతో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీని స్థాపించి ఎన్నికల్లోకి దిగారు. 2014 ఎన్నికల్లో, అతి స్వల్పకాలంలోనే గెలుపు అంచులవరకెళ్ళారు. విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు జగన్‌పై కక్ష సాధింపు చర్యలకు తెరతీశారు. సింగపూర్ లాంటి రాజధాని అంటూ గాలిమేడలు కడుతూ ఐదేండ్లు గడిపారు. ఇదే సమయంలో జగన్ తండ్రిని ఆదర్శంగా తీసుకొని ఏపీలో సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజల కష్టాలకు, కన్నీళ్ళకు కారణాలను అన్వేషించారు. తండ్రిని మించిన ఆదర్శాలతో, ప్రగతిశీల భావజాలంతో, స్పష్టమైన రాజకీయ దృక్పథంతో, మానవీయ పథకాలతో, సామాజిక న్యాయబాటను తనదిగా చేసుకొని ఎన్నికల బరిలోకి దిగారు. దిగ్విజయం సొంతం చేసుకొన్నారు.

చంద్రబాబులా పార్టీ మార్పిడులను ప్రోత్సహించి ఉంటే, టీడీపీ ప్రతిపక్షంగా కూడా మిగిలేది కాదు. కాని జగన్ ఆ పని చేయలేదు. 2019లో అధికారం చేపట్టిన జగన్ పాదయాత్రలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను మేనిఫెస్టోలో పొందుపరచి దాదాపు నూటికి నూరు పాళ్లు నెరవేర్చారు.

ప్రభుత్వ రంగంలో విద్యాలయాలను బలోపేతం చేయడం, ఆంగ్ల మాధ్యమంలో విద్య, ఆరోగ్యశ్రీని మరిన్ని రోగాలకు వర్తింప చేయడం, 'అమ్మ ఒడి' లాంటి పథకాలు ప్రజా



మన్నన పొందాయి. వ్యవసాయ రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం ఉత్పత్తి రంగంలో రాష్ట్రం ముందడుగు వేసేలా చేసింది. లక్షలాది ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్యను తీర్చ డమే కాక 'సచివాలయ' వ్యవస్థ ద్వారా పాలనను ప్రజల గడప దగ్గరకు చేర్చారు జగన్. ఇప్పుడు జగన్ పాలనతో ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీకీ పుట్టగతులు లేని పరిస్థితులొచ్చాయి. జనం అంతా ఆయన వైపే! ఇది ప్రచారంతో వచ్చింది కాదు, పనుల వల్ల వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ పథకాలతో, పాలనతో లబ్ధి పొందని గడపంటూ లేదు. ఈ నాలుగేళ్ళుగా టీడీపీ, జనసేన, బీజేపీ జగన్‌పై ఎన్ని అభాండాలు మోపినా, ఎంత వ్యతిరేక ప్రచారం చేసినా ఆంధ్రప్రదేశ్ ప్రజలు జగన్‌నే కోరుకుంటున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో మరో ఐదారు నెలల్లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయి. ఎన్నికల వేడి ఎప్పుడో రాజుకుంది. అనైతిక పొత్తులు, ఏ విలువలూ లేని రాజకీయాలు, రంధ్రాన్వేషణలు, ఎలాగైనా సరే గెలిచి తీరాలన్న పట్టుదలలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మూడు దశాబ్దాల పైగా చరిత్ర ఉన్న పార్టీ, పది పన్నెండేళ్ల వయసున్న పార్టీని ఓడించడానికి సినీగ్లామర్‌ని ఉపయోగించుకోవడానికీ, కులమతాలను రెచ్చగొట్టే పార్టీతో పొత్తు పెట్టు కోవడానికీ సిద్ధమవుతోంది. 14 ఏళ్ళ ముఖ్యమంత్రి అనుభవం, నలభై ఏండ్ల రాజకీయానుభవం ఉన్న పార్టీ నాయకునికి ఇతర పార్టీలతో పొత్తు ఎందుకో అర్థంకాని విషయం.

పనినే దైవంగా భావించి, ప్రజలనే దేవుళ్ళుగా భావిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జగన్ మరోసారి సీఎం కావడం ఖాయం. రాజకీయ విలువల వలవలొలుస్తున్న నాయకులను, పార్టీలను మట్టికరిపించి, రాజకీయ శాస్త్రాన్ని రాజనీతి శాస్త్రంగా మార్చే క్రమాన్ని ప్రజలే అడ్డుకొంటారని జగన్ పాలన రుజువు చేస్తున్నది.

వ్యాసకర్త ప్రముఖ కథా రచయిత
మొబైల్: 91829 18567

అసలైన సంతోషం

ఒక రాజు గారు తన దేశంలో సంతోషంగా, తృప్తిగా జీవిస్తున్న వ్యక్తి ధరించిన చొక్కా తీసుకురమ్మని భటులను పంపారు. అటువంటి వ్యక్తి కోసం వారు దేశమంతా గాలించారు. ఇల్లిల్లూ తిరిగారు. ప్రతి వ్యక్తి తనకు సమస్యలున్నాయనీ, తాను పూర్తి సంతోషంతో లేననీ చెప్పినవారే. భటులు విచారించిన వారిలో అత్యంత ధన సంపన్నులూ, విద్యావేత్తలూ, సామాన్యులూ...అన్ని రకాల వారు ఉన్నారు. భటులు అలా వెతుకుతూ వెతుకుతూ ఒక పూరి గుడిసె చూశారు. ఆ ఇంటిలోని వారితో మాట్లాడలేదని గుర్తించారు.



జ్యోతిర్మయం

కాని, ఆ ఇల్లు చాలా శిథిలావస్థలో ఉంది. తలుపులు ముట్టుకుంటే పడిపోయేట్లు ఉన్నాయి. ఇంతవరకు తాము విచారించిన ఇంతమందిలో లేని తృప్తి, సంతోషం ఈ పేదింట్లో మాత్రం ఎలా ఉంటుంది? ఈ ఇంటిలోకి వెళ్ళటం, అడగటం కూడా అనవసరం అనుకున్నారు. కాని, ప్రతి ఒక్కరినీ కనుక్కోమని రాజాజ్ఞ! రాజుకు ఈ ఇంటిని వదిలేశామని తెలిస్తే తమకు శిక్ష తప్పదు. ఎందుకు అనవసరంగా సమస్య కొని తెచ్చుకోవటం అని వారు ఆ ఇంటిలోనికి వెళ్లారు. ఆ ఇంట్లో ఒక భార్య, భర్త ఉంటున్నారు. భర్త ఒంటి మీద చొక్కా లేదు. మాసిపోయిన పంచె కట్టుకుని ఉన్నాడు. భార్య కూడా ఒక సాదా చీర కట్టుకుని ఉంది. వారు ఆ సమయంలో గంజి తాగుతున్నారు.

వారి పరిస్థితి అర్థమవుతున్నా, భటులు వారిని 'మీరు సంతోషంగా తృప్తిగా జీవిస్తున్నారా? మీకేమైనా ఇబ్బందులున్నాయా?' అని అడిగారు. ఆ వ్యక్తి నవ్వుతూ 'మేము మాకున్నదానితో చాలా సంతోషంగా, తృప్తిగా ఉన్నాము. మాకేం అత్యాశలు లేవ'న్నారు. భటులు చాలా ఆశ్చర్యపోయారు. ఆ వ్యక్తి, 'మీరెవరు, ఎందుకలా అడిగారు?' అనడిగితే భటులు ఇది రాజాజ్ఞ అని చెప్పి, అతని చొక్కా ఒకటి ఇమ్మన్నారు. ఆ వ్యక్తి చిరుగులు పడిన పాత చొక్కా ఇస్తే అది తీసుకుని వెళ్ళిపోయారు.

ఇది కథే అయినా, అత్యాశకు పోకుండా, ఉన్న దానితో సంతోషంగా ఉంటూ, కష్టపడటంలోని ఆనందాన్ని అనుభవిస్తూ జీవించే వారు మన మధ్యా ఉంటారు. వారిదే నిజమైన సంతోషం.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.విదియ ప.3.37 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** మృగశిర ప.2.28 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** రా.11.15 నుండి 12.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.26 నుండి 12.14 వరకు, **అమృత ఘడియలు:** ఉ.5.26 నుండి 7.03 వరకు. ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.16, **సూర్యాస్తమయం:** 5.20.

భోగాపురం ఎయిర్‌పోర్టుకు వైజాగ్ స్టీల్

ఉక్కునగరం: భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్మాణానికి విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. దీనికి సంబంధించిన కన్‌సైన్‌మెంట్ స్టీల్ ప్లాంట్ సెంట్రల్ డిస్పాచ్ యార్డు (సీడీవై) నుంచి మంగళవారం బయలుదేరింది. భోగాపురంలో అధునాతన అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున స్టీల్ ఉత్పత్తుల అవసరం ఉంది. దీనికి సంబంధించి విశాఖ స్టీల్ ప్లాంటుకు ఆర్డర్ లభించింది.

మన్యంలో చలి పులి పంజా

- తగ్గిన ఉష్ణోగ్రతలు
- చింతపల్లిలో 14.6 డిగ్రీలు నమోదు



సాక్షి, పాడేరు: చలి పులి పంజా అల్లూరి సీతారామరాజు జిల్లా వాసులను వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలి గాలులు విజృంభిస్తున్నాయి. మంగళవారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.6 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 15 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 15.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పొగ మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు వీస్తుండడంతో గ్రామాల్లో ప్రజలు చలిమంటల వద్ద చేరుతున్నారు. రాత్రి వేళ రెండు రోజుల నుంచి చలి ప్రజలను మరింత వణికిస్తోంది.

సులభంగా ఆరోగ్యశ్రీ సేవలు పొందేలా..

పథకంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు వైద్య శాఖ కార్యక్రమాలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని కోట్ల మంది నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు ఆపద్బాంధవి 'డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ' పథకం అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. దురదృష్టవశాత్తు అనారోగ్యం బారినపడినా, ప్రమాదానికి గురైనా సదరు వ్యక్తులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం ఉచిత వైద్య సేవలను అందిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన ఈ పథకానికి సీఎం వైఎస్ జగన్ ఊపిరిలూదారు. వైద్యం ఖర్చు రూ. వెయ్యి దాటే ప్రతి ప్రొసీజర్‌ను పథకం పరిధిలోకి తెచ్చారు. 1,059 నుంచి 3,257కు ప్రొసీజర్స్‌ను పెంచి ప్రజలకు ఆరోగ్య భరోసానిస్తున్నారు. ఇలాంటి పథకం గురించి తెలియక, సేవలు ఎలా వినియోగించుకోవాలో అవగాహన లేక పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం చేతి నుంచి డబ్బు పెట్టకూడదని ప్రభుత్వం భావించింది. దీంతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి పథకం పట్ల పూర్తి అవగాహన కల్పించడం కోసం డిసెంబర్ ఒకటో తేదీ నుంచి ఆరోగ్యశ్రీపై విస్తృత స్థాయి అవగాహన కార్యక్రమానికి వైద్య శాఖ శ్రీకారం చుట్టింది.

ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది

ఇటీవల ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించింది. ఇప్పుడు ఆరోగ్యశ్రీపై విస్తృత అవగాహన కార్యక్రమం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు ప్రతి ఇంటిని సందర్శిస్తారు. ఆరోగ్యశ్రీ సేవలపై సవివరంగా రూపొందించిన బ్రోచర్‌ను ప్రతి ఇంటిలో అందజేస్తారు. ఏదైనా ఆరోగ్య సమస్య, ప్రమాదం సంభవిస్తే ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా, సులువుగా వైద్య సేవలు ఎలా పొందాలో వివరిస్తారు. తాముంటున్న ప్రాంతానికి చేరువలో ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రులు, ఆయా ఆస్పత్రుల్లో అందే వైద్య సేవల గురించి చెబుతారు. సేవలు వినియోగించుకోవడంలో ఏమైనా సమస్యలు తలెత్తినా, సంతృప్తకర స్థాయిలో సేవలు అందకపోయినా 104కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవడంతో పాటు, ఎలా ఫిర్యాదులు చేయాలో వివరిస్తారు. ఎక్కడైనా లంచాలు డిమాండ్ చేస్తే 14400కు ఫోన్ చేసి కూడా ఫిర్యాదు చేసేలా చైతన్యం కల్పిస్తారు. చికిత్స అనంతరం విశ్రాంత సమయానికి భృతి అందిస్తున్న ఆరోగ్య ఆసరా గురించి తెలియపరుస్తారు.

అర చేతిలో ఆరోగ్యశ్రీ

ప్రజలకు మరింత సులువుగా పథకం సేవలు అందించడానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. ఈ యాప్ ద్వారా ఒనగూరే ప్రయోజనాలను వైద్య సిబ్బంది ప్రజల ఇంటి వద్దే తెలియజేసి వారి స్మార్ట్ ఫోన్‌లో యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించి, ఎలా వినియోగించాలో వివరిస్తారు. యాప్ ద్వారా గతంలో చేయించుకున్న చికిత్సల మెడికల్ రిపోర్ట్‌లను భవిష్యత్‌లో ఎప్పుడైనా అవసరమైతే ఎలా పొందవచ్చు, అలాగే ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవడాన్ని తెలియపరుస్తారు.

యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం ఇలా

- మొబైల్ ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ అని టైప్ చేయాలి.
- యాప్ ప్రత్యక్షం అయ్యాక ఇన్‌స్టాల్ ఆప్షన్‌పై ప్రెస్ చేయాలి.
- ఇన్‌స్టాల్ అయిన యాప్‌ను ఓపెన్ చేసి, ఆధార్ నంబర్‌ను యాప్‌లో నమోదు చేసి లాగిన్ అవ్వాలి.
- ఆ తర్వాత మెనూ బార్ ప్రత్యక్షం అవుతుంది. ఆస్పత్రులు అనే చోట క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, మండలం, అవసరమైన చికిత్సలకు అనుగుణంగా ఆస్పత్రుల వివరాలను పొందవచ్చు. ఆస్పత్రులకు వెళ్లే మార్గాన్ని గూగుల్ మ్యాప్ ద్వారా చూపిస్తుంది.
- గతంలో పొందిన చికిత్సలు వాటికి సంబంధించిన మెడికల్ రిపోర్ట్‌లు, ఆరోగ్య ఆసరా సమాచారం కేసుల వారీగా పొందవచ్చు. ఇంకా 104కు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవడానికి, ఫిర్యాదులు చేయడానికి వీలుంటుంది.

ఒక్కో కుటుంబానికి కనీసం 15 నిమిషాలు



ఆరోగ్యశ్రీ పథకం సేవల గురించి, వాటిని ఏ విధంగా వినియోగించుకోవాలి అనే దానిపై అవగాహన లేని కుటుంబం రాష్ట్రంలో ఉండకూడదు అనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పించేలా విస్తృత అవగాహన కార్యక్రమం చేపడుతున్నాం. ఏఎన్ఎం, సీహెచ్‌వో ప్రతి కుటుంబానికి కనీసం 15 నిమిషాలు కేటాయించి పథకం సేవలపై అవగాహన కల్పిస్తారు. ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్‌ను ప్రతి ఇంటికి అందజేస్తారు. ప్రజలు సైతం పథకం పట్ల పూర్తి అవగాహన ఏర్పరచుకుని చేతి నుంచి డబ్బు ఖర్చు పెట్టకుండా ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి. – డాక్టర్ వెంకటేశ్వర్, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌తో బీజేపీ ఎంపీ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుకాపులు, కళింగ వైశ్యులు, శిష్టకరణాలు, సోండి కులాలకు ఓబీసీ రిజర్వేషన్లు వర్తింపజేయాలని కేంద్రానికి సిఫార్సు చేసినందుకు జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ అహిర్‌కు బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన హన్సరాజ్ అహిర్‌తో భేటీ అయ్యారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సిఫార్సు చాలా కీలకమైనదని అన్నారు.

చెత్త కుప్పలో భారీ పేలుడు

- చలి కాగేందుకు వెళ్లి, గాయపడిన బాలురు
- ఐదుగురికి తీవ్ర, ఇద్దరికి స్వల్ప గాయాలు
- మామిడాడలో దుర్ఘటన

జగ్గంపేట/ప్రత్తిపాడు/కాకినాడ క్రైం: మండుతున్న చెత్త కుప్ప వద్దకు చలి కాగుదామని ఆ పిల్లలు వెళ్లారు. అంతలోనే ఊహించని విధంగా అక్కడ భారీ పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఐదుగురు బాలురు తీవ్రంగా గాయపడి, ఆసుపత్రి పాలయ్యారు. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మామిడాడ గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటన.. మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. మామిడాడ దళితవాడకు చెందిన కొంతమంది బాలురు.. అక్కడకు సమీపాన ఉన్న ఏలేరు కాలువలో స్నానాలకు సోమవారం సాయంత్రం వెళ్లారు. కొంత మంది పిల్లలు స్నానాలు చేసి బయటకు వచ్చారు. అక్కడే ఉన్న చెత్త కుప్ప వద్ద మంట వస్తూండటంతో చలి కాగేందుకు గుమిగూడారు.

అదే సమయంలో ఆ మంటల్లో నుంచి ఊహించని విధంగా ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఆ పేలుడు ధాటికి ఒక్కసారిగా నిప్పురవ్వలు మీద పడటంతో ఐదుగురు బాలురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో జంగం ఏసుబాబు, చింతపల్లి ఆనంద కుమార్, మందా శాంతిరాజు, ఉప్పాడ రామచరణ్, ఉప్పాడ మురళి తీవ్రంగా.. సన్నపు కార్తీక్, మడికి ఉదయ్ కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. వీరందరూ 10 నుంచి 16 సంవత్సరాల వయస్సున్న పిల్లలు. ఐదు నుంచి పదో తరగతి వరకూ చదువుతున్నారు. పేలుడు సంఘటనతో దళితవాడ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. స్థానికులు పరుగు పరుగున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే తొలుత ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)కి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు మంగళవారం సాయంత్రం తరలించామని ప్రత్తిపాడు సీహెచ్‌సీ ఆర్ఎంఓ కన్యాకుమారి తెలిపారు. గాయపడిన బాలుర ఒంటిపై కాలిన బొబ్బలు అధికంగా ఉన్నాయని చెప్పారు. స్వల్పంగా గాయపడిన సన్నపు కార్తీక్, మడికి ఉదయ్ కుమార్‌లను ప్రథమ చికిత్స అనంతరం స్వగ్రామానికి తీసుకువచ్చారని గ్రామ కార్యదర్శి ఎ.శేషగిరిరావు తెలిపారు. గాయపడిన ఐదుగురు బాలురకు బర్న్స్ వార్డులో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నామని కాకినాడ జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రాహుల్ తెలిపారు.

క్వారీ బాంబే కారణమా?

ఈ సంఘటనలో త్రుటిలో ఘోర ప్రమాదమే తప్పిందని స్థానికులు అంటున్నారు. దీపావళి పండగ నేపథ్యంలో ఎవరైనా ఆ చెత్తలో బాంబుల వంటివి పడవేసి ఉంటారని భావించారు. అయితే, పేలుడు తీవ్రత చూస్తే దీపావళి బాణసంచా కాదేమోనని, క్వారీలో ఉపయోగించే బాంబు కారణమై ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేలుడు జరిగిన మామిడాడ గ్రామం ఏలేశ్వరానికి దగ్గరగా ఉంది. ఇక్కడి క్వారీల్లో రాళ్ల బద్దలుగొట్టడానికి శక్తిమంతమైన బాంబులు వాడుతూంటారు. వాటిని అక్రమ మార్గంలో తీసుకువచ్చి, ఏలేరు కాలువ సమీపంలో కప్పెట్టి పేలుస్తున్నారని.. తద్వారా కాలువలో నీరు పెద్ద ఎత్తున పైకి లేచి పడి, చేపలు బయటకు వస్తూంటాయని.. ఇది చేపలు పట్టేవారికి అనువుగా ఉంటోందని చెబుతున్నారు. ఇటువంటి బాంబును ఎవరైనా ఆ చెత్తకుప్పలో దాచి ఉంటారని, చెత్తకు ఎవరో నిప్పు పెట్టడం వల్ల అది పెద్ద శబ్దంతో పేలి ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పేలుడుకు కారణాలేమిటో తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

దళితులపై ఆగని టీడీపీ దాష్టీకం

- ప్రభుత్వ స్థలం తమదంటూ కత్తులు, కర్రలతో దాడి
- ఐదుగురు దళితులకు తీవ్రగాయాలు



పవన్‌కుమార్‌పై దాడి చేస్తున్న టీడీపీ నేతలు



చికిత్స పొందుతున్న రెడ్డెమ్మ, సాగర్, ఈశ్వరమ్మ

పుంగనూరు (చిత్తూరు జిల్లా): ఖాళీగా కనిపించిన ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం, అడ్డు వచ్చిన వారిపై కత్తులు, కర్రలతో దాడులు చేయడం టీడీపీ నేతలకు అలవాటుగా మారింది. దళితులకు కేటాయించిన ఇంటి స్థలంలో మంగళవారం ఇద్దరు టీడీపీ మాజీ కౌన్సిలర్లు, వారి కుటుంబ సభ్యులు కత్తులు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పుంగనూరులోని కట్టక్రింద పాళ్యెం దళితవాడలో ఉంటున్న దళిత కుటుంబానికి చెందిన చెక్కల రాణెమ్మకు ప్రభుత్వం 2013లో ఇంటి పట్టా మంజూరు చేసింది. అప్పటి నుంచి ఆమె అక్కడే ఇల్లు కట్టుకుని ఉంటోంది. ఆ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు మునిసిపల్ అధికారులు స్థలాన్ని పరిశీలిస్తుండగా అదే ప్రాంతానికి చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ పసుపుల కేశవమూర్తి, అతని భార్య మాజీ కౌన్సిలర్ అనంతలక్ష్మి, వారి కుమారులు హరీష్, మహేష్, ప్రసాద్, శ్రీనివాసులు, చైతన్య, బన్ని తదితరులు మారణాయుధాలతో వచ్చి స్థలం తమదంటూ రాణెమ్మపై దాడి చేశారు. ఆమె కేకలు వేయడంతో ఆమె కుటుంబీకులు ఈశ్వరమ్మ, రెడ్డెమ్మ, బాలాజీ, సాగర్, పవన్ కుమార్, శిరీష, గీత తదితరులు రాణెమ్మను కాపాడేందుకు అడ్డువచ్చారు. దీంతో కేశవమూర్తి, వారి కుటుంబ సభ్యులు దళితులను కులం పేరుతో దూషిస్తూ విచక్షణారహితంగా కొట్టి చంపేందుకు యత్నించారు. బట్టలు చించి వేసి అవమానించడంతో దళితులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. స్థానికులు బాధితులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాణెమ్మ ఫిర్యాదు మేరకు సీఐ రాఘవరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కేశవమూర్తి ఇటీవల పుంగనూరులో పోలీసులపై దాడి చేసిన కేసులో నిందితుడిగా ఉండి..అరెస్టై బెయిల్‌పై విడుదలయ్యాడు. ప్రస్తుతం దళితులపై దాడి కేసులో ఈయనే ప్రధాన నిందితుడు.

ఏపీపై తుపాను ప్రభావం!

- ఐదారురోజుల్లో విస్తారంగా వర్షాలకు అవకాశం
- డిసెంబర్ 4 నుంచి 6 వరకు భారీ వర్షాలు
- అప్రమత్తం చేసిన భారత వాతావరణ శాఖ
- వరి కోతలు సత్వరమే పూర్తి చేసుకోవాలని సూచన



సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉండనుంది. మరో ఐదారు రోజుల్లో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలను కురిపించనుంది. ఈ తుపాను ప్రభావం రాష్ట్రంపై స్వల్పంగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తొలుత అంచనా వేసింది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం చేరువ వరకే తుపాను గమ్యాన్ని తెలిపే సైక్లోన్ ట్రాక్ పరిమితం కావడంతో ఈ నిర్ధారణకు వచ్చింది. దీంతో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకే వాతావరణం పరిమితమవుతుందని పేర్కొంది. కానీ మంగళవారం నాటికి పరిస్థితిలో ఒకింత మార్పు కనిపించింది. సోమవారం దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం కూడా ఆ ప్రాంతంలోనే కొనసాగుతోంది. ఐఎండీ ముందస్తు నివేదిక ప్రకారం ఈ అల్పపీడనం బుధవారానికే వాయుగుండం గాను, డిసెంబర్ ఒకటిన తుపాను గాను బలపడాల్సి ఉంది. కానీ అందుకు భిన్నంగా ఒక రోజు ఆలస్యంగా గురువారం నాటికి వాయుగుండంగా, డిసెంబర్ 2న తుపానుగా మారనుంది. ఇది కోస్తాంధ్ర తీరానికి సమీపంలోకి రాకపోయినా దాని ప్రభావం మాత్రం రాష్ట్రంపై ఉంటుందని ఐఎండీ అంచనా వేస్తోంది. ఫలితంగా డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలు చోట్ల విస్తారంగా, కొన్నిచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా తెలిపారు. భారీ వర్షాలకు వరితో పాటు ఇతర పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల కోతకు వచ్చిన వరి పంటను వెనువెంటనే కోసి భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు. అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశారు. ఒకవేళ తుపాను కోస్తాంధ్ర వైపు పయనిస్తే వర్షాల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వర్షాలకు ఈదురుగాలులు తోడై పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని పేర్కొంటున్నారు. కాగా, రానున్న మూడు రోజులు కోస్తాంధ్రలో ఒకటి రెండు చోట్ల, రాయలసీమలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

సీనియర్ ఐఏఎస్‌లకు జైలుశిక్ష.. జరిమానా

- డిసెంబర్ 8లోపు లొంగిపోవాలని శ్యామలరావు, పోలా భాస్కర్‌కు ఆదేశం
- కోర్టు ధిక్కారం కేసులో తీర్పు వెలువరించిన హైకోర్టు

సాక్షి, అమరావతి కోర్టు ధిక్కార కేసులో ఇద్దరు సీనియర్ ఐఏఎస్‌లకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ హైకోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాలను అమలు చేయనందుకు ఉన్నత విద్యాశాఖ ప్రస్తుత ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, కాలేజీ విద్య ప్రస్తుత కమిషనర్ పోలా భాస్కర్‌కు నెల రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.1,000 చొప్పున జరిమానా విధించింది. జైలుశిక్ష అనుభవించేందుకు వీలుగా డిసెంబర్ 8వ తేదీలోపు హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడీషియల్) ముందు లొంగిపోవాలని ఇద్దరు అధికారులను ఆదేశించింది. లొంగిపోయిన తరువాత వారిని నిబంధనల ప్రకారం జైలుకు పంపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కుంభజడల మన్మథరావు తీర్పు వెలువరించారు.

ఇదీ కారణం

అన్ ఎయిడెడ్ లెక్చరర్లుగా పనిచేస్తున్న తమను ఖాళీ పోస్టుల్లోకి తీసుకునేందుకు నిరాకరిస్తూ కాలేజీ విద్య కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పలువురు 2012, 2013, 2014, 2016 సంవత్సరాల్లో హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలన్నింటిపై న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి 2022 జూలైలో తీర్పు వెలువరిస్తూ.. పిటిషనర్ల మాదిరిగానే గ్రాంట్ ఇన్ ఎయిడ్ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని ప్రభుత్వమే విలీనం చేసుకుందని, అయితే పిటిషనర్లను మాత్రం విలీనం చేసుకునేందుకు నిరాకరించడం సరికాదని స్పష్టం చేశారు. పిటిషనర్లను ఖాళీగా ఉన్న అన్ ఎయిడెడ్ లెక్చరర్ల పోస్టుల్లోకి తీసుకునేందుకు నిరాకరిస్తూ కాలేజీ విద్య కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేశారు. ఖాళీగా ఉన్న అన్ ఎయిడెడ్ పోస్టుల్లోకి పిటిషనర్లను విలీనం చేసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. హైకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలను అధికారులు అమలు చేయలేదంటూ వారిపై కోర్టు ధిక్కార పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ మన్మథరావు విచారణ జరిపారు. అనంతరం ప్రధాన తీర్పును సమీక్షించాలని కోరుతూ అధికారులు రివ్యూ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ రివ్యూ పిటిషన్లపై విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు వాటిని కొట్టేస్తూ గత నెల 31న తీర్పు వెలువరించారు. అనంతరం కోర్టు ధిక్కార పిటిషన్లపై న్యాయమూర్తి విచారణ జరిపారు. కొందరు పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది పి.గంగయ్య నాయుడు వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి మంగళవారం తీర్పు వెలువరించారు. ఖాళీగా ఉన్న అన్ ఎయిడెడ్ పోస్టుల్లోకి పిటిషనర్లను విలీనం చేసుకోవాలన్న కోర్టు ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారని న్యాయమూర్తి తేల్చారు. ఇందుకు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, కాలేజీ విద్య కమిషనర్ పోలా భాస్కర్‌లను బాధ్యులుగా చేస్తూ.. వారికి కోర్టు ధిక్కారం కింద నెల రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.1000 చొప్పున జరిమానా విధిస్తున్నట్టు తీర్పులో పేర్కొన్నారు.

దైవదర్శనం చేయించినా కడుపు మంటేనా?

- టీడీపీ నేత కాలవ శ్రీనివాసులుపై విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజం


రాయదుర్గం: సొంత ఖర్చులతో కొందరికి దైవ దర్శనం చేయించినా కడుపు మంట ఎందుకని టీడీపీ నేత కాలవ శ్రీనివాసులుపై ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. కాలవ శ్రీనివాసులు కంత్రీ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ అని వ్యాఖ్యానించారు. రామచంద్రారెడ్డి మంగళవారం అనంతపురం జిల్లా డీ హీరేహాళ్ మండలం మురడి గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. తాను సొంత ఖర్చులతో కొందరికి తిరుమల శ్రీవారి దర్శనం చేయిస్తే దైవదర్శనం పేరిట ఓటర్లకు గాలం వేస్తున్నట్లు తప్పుడు కథనాలు రాయడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి పనులు చేస్తున్న తమపై స్వార్థ రాజకీయాల కోసం బురద జల్లాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాలవ మంత్రిగా ఉన్నప్పుడు తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనాలు, సిఫారసు లేఖలను సైతం అమ్ముకున్న నీచుడని, శవాలపై కాసులు ఏరుకునే నీచ బతుకు అతనిదని మండిపడ్డారు. ఆఖరుకు హారతిలోకి వేసే చిల్లర డబ్బులు కూడా వేరొకరి జేబు నుంచి తీసుకునే నీచుడన్నారు.

ఒకటే ఇంటి నంబర్.. దొంగ ఓటర్లెందరో!

- నంద్యాలలో టీడీపీ నేతల బరితెగింపు
- తమ పేరుతో, కుటుంబ సభ్యుల పేర్లతో భారీగా డబుల్ ఓట్ల నమోదు
- ఇప్పటివరకు నంద్యాల నియోజకవర్గంలో 1,000 దొంగ ఓటర్ల గుర్తింపు
- టీడీపీ ఎంపీటీసీ చిలుకూరి రవిబాబు కుటుంబానికి రెండు ప్రాంతాల్లో ఓట్లు
- దొంగ ఓటర్ల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం



నంద్యాలలో 29-178-29హెచ్ ఇంటి నంబర్‌తో ఓటరుగా ఉన్న టీడీపీ ఎంపీటీసీ చిలుకూరి రవిబాబు



మిట్నాలలో 3-36 ఇంటి నంబర్‌తో ఓటరుగా ఉన్న రవిబాబు

- ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి.. చిలుకూరి రవిబాబు. నంద్యాల రూరల్ మండలం మిట్నాల టీడీపీ ఎంపీటీసీగా ఉన్నారు. రవిబాబుతో పాటు ఆయన తండ్రి, తల్లి, భార్య, కుమారుడు, కూతురు, సోదరుడికి నంద్యాల ఎస్‌బీఐ కాలనీలో 29–178–29జీ, 29–178–29హెచ్ ఇంటి నంబర్లలో ఏడు ఓట్లు ఉన్నాయి. మళ్లీ వీరంతా మిట్నాల గ్రామంలో 3–36 ఇంటి నంబర్ కింద ఓటర్లుగా నమోదై ఉన్నారు. రవిబాబు కుటుంబం గ్రామాన్ని విడిచిపెట్టి నంద్యాలలో ఉంటోంది. అయినప్పటికీ ఆయనకు, ఆయన కుటుంబానికి మిట్నాలతోపాటు నంద్యాలలోనూ డబుల్ ఓట్లు ఉండటం గమనార్హం.
- ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు.. చిలకల గీత. ఈమెకు నంద్యాలలో 29–128–1 ఇంటి నంబరుతోనే రెండు ఓట్లున్నాయి. ఓటరు జాబితాలో పక్కపక్కనే ఆమె పేర్లున్నాయి. అయినా వీటిని తొలగించేందుకు అధికారులు తటపటాయిస్తున్నారు. రవిబాబు కుటుంబం వ్యవహారంలోనూ ఇదే మాదిరిగా వ్యవహరిస్తున్నారు.

ఇలా ఒక్క రవిబాబు, చిలకల గీత మాత్రమే కాదు.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఏమాత్రం లేకపోవడంతో టీడీపీ నేతలు అడ్డదారులను, అక్రమాలను నమ్ముకున్నారు. భారీగా దొంగ ఓటర్లను నమోదు చేయించడంతోపాటు తమతోపాటు కుటుంబ సభ్యులకు డబుల్ ఓటర్లను నమోదు చేయిస్తున్నారు. ఇలా అవకాశం ఉన్నచోటల్లా విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడుతున్నారు. పైగా దొంగే దొంగ.. దొంగ అని అరిచినట్టు అధికార పార్టీ నేతలపై ఫిర్యాదులు చేస్తుండటం పట్ల విస్మయం వ్యక్తమవుతోంది.

భారీగా దొంగ ఓటర్ల నమోదు

జనవరి 1 నాటికి 18 ఏళ్లు పైబడిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అనుమతినిచ్చింది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు తమకు సానుభూతిపరులుగా ఉన్న వారిని రెండు ప్రాంతాల్లో ఓటరుగా నమోదు చేయిస్తున్నారు. ఇప్పటివరకు నంద్యాల నియోజకవర్గవ్యాప్తంగా దాదాపు వెయ్యి ఓట్లు డబుల్ ఎంట్రీలుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇవన్నీ టీడీపీ నాయకులు, వారి సానుభూతిపరులవే కావడం గమనార్హం. టీడీపీ దొంగ ఓటర్లపై ఇప్పటికే అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయి. ఒక్క మిట్నాల గ్రామంలోనే 150 ఓటర్లకు పైగా దొంగ ఓటర్లను గుర్తించారు. క్షేత్రస్థాయిలో విచారించిన అధికారులు వీరిలో కేవలం 50 మందిని మాత్రమే తొలగించారు. మిగిలిన వారిని తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తప్పు చేసి ఎదురుదాడి

క్షేత్రస్థాయిలో ఓటరు జాబితాలను పరిశీలిస్తే అధికభాగం దొంగ ఓటర్లు టీడీపీకి చెందిన వారేనని స్పష్టమవుతోంది.

టీడీపీ నాయకులు అక్రమాలకు పాల్పడుతూ మరోవైపు వైఎస్సార్‌సీపీపై నిందలు మోపుతున్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఎదురుదాడికి దిగుతున్నారు. దొంగ ఓటర్లపై వైఎస్సార్‌సీపీ నేతలు ఫిర్యాదులు చేస్తే అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారంటూ గగ్గోలు పెడుతున్నారు. తమ అనుకూల పత్రికల్లో వైఎస్సార్‌సీపీ నేతలపై బురద రాతలు రాయిస్తూ రాక్షసానందం పొందుతుండటం పట్ల ప్రజల్లో విస్మయం వ్యక్తమవుతోంది. – సాక్షి, నంద్యాల

ఊరించి.. ఉసూరుమనిపించి..

'ప్రసాద్' నిధులపై నిరాశపరచిన కేంద్రం

- అన్నవరం దేవస్థానానికి మూడేళ్ల క్రితమే రూ.54 కోట్లతో డీపీఆర్
- ఇదిగో అదిగో అంటూ చివరకు రూ.10 కోట్లకు కుదింపు
- ప్రజాప్రతినిధులు, దేవస్థానం అధికారుల అసంతృప్తి

అన్నవరం: దఫదఫాలుగా కేంద్ర అధికారుల పర్యటనలు.. ప్రజాప్రతినిధులతో సమావేశాలు.. ఎన్నో వడపోతలు.. మరెన్నో మార్పులు.. ఇలా కేంద్ర పర్యాటక శాఖ ఎంతో హడావుడి చేసింది.. అన్నవరం దేవస్థానం అభివృద్ధికి నిధులు మంజూరు చేసేస్తామంది.. రూ.54 కోట్లతో డీపీఆర్ కూడా తయారైంది.. ఇంత హడావుడీ చేసి.. చివరకు ఓ రూ.10 కోట్లు మాత్రమే విదిలించాలని నిర్ణయించింది. ఇదిగో అదిగో అంటూ ఊరించి.. చివరకు ఉసూరుమనిపించేలా కేంద్రం తీసుకున్న నిర్ణయం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను, అధికారులను అసంతృప్తికి గురి చేసింది.

హడావుడి చేసి.. ఆశలపై నీళ్లు జల్లి..

బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత.. దేశంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పిలిగ్రిమేజ్ రిజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మెంటేషన్ డ్రైవ్ (ప్రసాద్) స్కీము ప్రారంభించింది. తొలి దశలో ఉత్తరాది రాష్ట్రాల్లోని వారణాసి, మధుర తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేశారు. రెండో దశలో అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానాన్ని 2016లో ఎంపిక చేశారు. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు కోరారు. దీనిపై అన్నవరం దేవస్థానం రూ.96 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. ఈ ప్రతిపాదనలపై నాలుగేళ్లుగా కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖల ఉన్నతాధికారులు.. కాకినాడ ఎంపీ వంగా గీత, ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓలతో దఫదఫాలుగా సమావేశాలు నిర్వహించారు. దేవస్థానానికి అత్యంత అవసరమైన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర పర్యాటక అధికారులు రూ.54 కోట్లతో డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేశారు. దీనికి రాష్ట్ర పర్యాటక, అన్నవరం దేవస్థానం అధికారులు అంగీకరించారు. దీనిపై కేంద్ర పర్యాటక శాఖ అధికారులు తుది నివేదిక రూపొందించి, గత ఏడాది సెప్టెంబర్‌లో కేంద్ర పర్యాటక మంత్రి కిషన్ రెడ్డి ఆమోదానికి పంపించారు. అక్కడ సంబంధిత ఫైలు పెండింగ్‌లో ఉండటంతో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, దేవస్థానం అధికారులు 2021లో కిషన్‌రెడ్డిని కలిసి, ప్రసాద్ స్కీము కింద రూపొందించిన డీపీఆర్ మేరకు నిధులు ఇవ్వాలని కోరారు. దీనిపై అప్పట్లో కేంద్ర మంత్రి సానుకూలంగానే స్పందించారు. అయినప్పటికీ చివరకు ఈ పథకం కింద రూ.10 కోట్లు మాత్రమే మంజూరు చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వం సమాచారం పంపడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

నిధుల పెంపుపై కేంద్ర మంత్రిని కలవాలని యోచన

డీపీఆర్ ప్రకారం ప్రసాద్ స్కీము కింద రూ.54 కోట్లు మంజూరైతే ప్రతిపాదించిన పనులన్నీ చేయాలనుకున్నారు. తీరా ఇప్పుడు రూ.10 కోట్లు మాత్రమే మంజూరు చేస్తూండటంతో ఈ పనులన్నీ దేవస్థానమే సొంతంగా చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయాలని కోరేందుకు తెలంగాణ ఎన్నికల అనంతరం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని మరోసారి కలవాలని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు యోచిస్తున్నట్లు సమాచారం. ప్రసాద్ స్కీము కింద రూ.10 కోట్లు మాత్రమే మంజూరు చేస్తే కేవలం అన్నదాన భవనం మాత్రమే నిర్మించాలని దేవస్థానం అధికారులు భావిస్తున్నారు.

ప్రసాద్ స్కీము ప్రతిపాదనలివీ..

- ప్రసాద్ స్కీము నిధులు వస్తే రూ.30 కోట్లతో ప్రకాష్ సదన్ సత్రం వెనుక మూడంతస్తుల్లో అన్నదాన భవనం నిర్మాణం.
- టీటీడీ సత్రం స్థలంలో మూడంతస్తుల వ్రత మండప నిర్మాణం.
- రూ.8.5 కోట్లతో కొండ దిగువన డార్మెట్రీ.
- వనదుర్గ ఆలయం నుంచి మొదటి ఘాట్ రోడ్డును కలుపుతూ రింగ్ రోడ్డు నిర్మాణం.
- వ్రత మండపం నుంచి సత్యదేవుని ఆలయం వరకూ భక్తుల నడక దారి అభివృద్ధి.
- భక్తులు క్యూలో అరగంట కన్నా ఎక్కువ సమయం నిలబడకుండా టీటీడీ తరహాలో కంపార్ట్‌మెంట్ల ఏర్పాటు.
- అన్నదానంలో మెకనైజ్డ్ కుకింగ్.
- భక్తుల కోసం బ్యాటరీ కార్లు.



వాళ్లు సొరంగాన్ని జయించారు!

సిల్‌క్యారా టన్నెల్‌లో ముగిసిన రెస్క్యూ ఆపరేషన్

- 12 మీటర్ల శిథిలాల డ్రిల్లింగ్ పనులు పూర్తిచేసిన ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులు
- క్షేమంగా బయటకు వచ్చిన 41 మంది కార్మికులు
- స్టీల్‌పైపు గుండా బయటకు తీసుకొచ్చిన ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది
- కార్మికులకు స్వాగతం పలికిన కేంద్ర మంత్రి వి.కె.సింగ్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్
- ఆపరేషన్ విజయవంతం కావడం పట్ల దేశమంతటా హర్షాతిరేకాలు

ఉత్తరకాశీ/న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మతాలకు అతీతంగా కోట్లాది మంది చేసిన ప్రార్థనలు ఫలించాయి. 17 రోజుల సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఉత్కంఠకు తెరపడింది. ప్రమాదవశాత్తూ సొరంగంలో చిక్కుకొని ఆశ నిరాశల మధ్య క్షణమొక యుగంలా బిక్కుబిక్కుమంటూ గడిపిన 41 మంది కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. 60 మీటర్ల పొడవైన ఎస్కేప్ రూట్‌లో ఏర్పాటు చేసిన స్టీల్ పైపు గుండా కార్మికులను ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. గుహ లాంటి సొరంగం నుంచి బయటకు వచ్చిన కార్మికులు బాహ్య ప్రపంచాన్ని కళ్లారా తిలకించి, గుండెనిండా హాయిగా ఊపిరి పీల్చుకున్నారు. ఉత్తరాఖండ్‌లో సిల్‌క్యారా సొరంగంలో సహాయక చర్యలు మంగళవారం పూర్తయ్యాయి. ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులు సొరంగం లోపల మిగిలిన 12 మీటర్ల మేర శిథిలాల డ్రిల్లింగ్ పనులు పూర్తిచేశారు. వెంటనే భారీ స్టీల్ పైపును ఏర్పాటు చేసి, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది కార్మికుల వద్దకు చేరుకున్నారు. ఒక్కొక్కరిని స్ట్రెచర్లపై బయటకు చేర్చారు. స్టీల్ పైపు నుంచి బయటకు రాగానే కార్మికులకు వైద్య సిబ్బంది కొన్ని పరీక్షలు చేశారు. వారందరి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ చెప్పారు. అయినప్పటికీ వారిని ఇళ్లకు పంపించడానికి ముందు కొన్నిరోజులపాటు వైద్యుల పరిశీలనలో ఉంచాలని నిర్ణయించామని తెలిపారు. 41 మంది కార్మికులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. సహాయక ఆపరేషన్‌లో పాల్గొన్నవారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మద్దతు లేకుంటే ఈ ఆపరేషన్ ఇంత త్వరగా విజయవంతమయ్యేది కాదని పుష్కర్‌సింగ్ ధామీ అన్నారు.

ఘటనా స్థలంలో ఉద్విగ్న వాతావరణం

సొరంగం ముఖద్వారం వద్ద మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో కార్మికులకు కేంద్ర మంత్రి వి.కె.సింగ్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కొందరు కార్మికులతో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనా స్థలంలో ఉద్విగ్న వాతావరణం నెలకొంది. హర హర మహాదేవ, భారత్ మాతాకీ జై అనే నినాదాలు మిన్నంటాయి. సొరంగం బయట ఉన్న వారంతా పరస్పరం ఆలింగనాలతో ఆనందం పంచుకున్నారు. కార్మికుల కుటుంబ సభ్యులు సైతం అభినందనలు తెలుపుకున్నారు. సహాయక సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. భగవంతుడు తమ మొర ఆలకించాడని చెమర్చే కళ్లతో వారు చెప్పారు. అధికారులు అప్పటికే సిద్ధంగా ఉంచిన అంబులెన్స్‌ల్లో కార్మికులను స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఆసుపత్రిలో కార్మికుల కోసం ఇంతకుముందే 41 పడకలతో ప్రత్యేక వార్డు సిద్ధం చేశారు. ఈ నెల 12వ తేదీన కార్మికులు సిల్ క్యారా సొరంగంలో చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. సొరంగంలో రెస్క్యూ ఆపరేషన్ విజయవంతమై, కార్మికులు క్షేమంగా బయటకు రావడం పట్ల దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. సహాయక సిబ్బందిని అభినందిస్తూ సోషల్ మీడియాలోనూ నెటిజన్లు పోస్టులు పెట్టారు.



క్షేమ సమాచారం కోసం ఫోన్ చేసిన ప్రధాని మోదీతో మాట్లాడుతున్న కార్మికులు

'ర్యాట్-హోల్'పై నిషేధం.. అదే ప్రాణాలు కాపాడింది

ఎలుకలాగా కలుగును తవ్వేసే ర్యాట్–హోల్ మైనింగ్ అనేది నిజానికి చట్టవిరుద్ధమే. కానీ, సిల్‌క్యారా టన్నెల్లో ఇదే ప్రక్రియ 41 మంది కార్మికుల ప్రాణాలు కాపాడిందని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్డీఎంఏ) సభ్యుడు లెఫ్టినెంట్ జనరల్(రిటైర్డ్) సయ్యద్ అతా హస్నెయిన్ మంగళవారం వెల్లడించారు. ఈ సొరంగంలో ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులు 12 మీటర్ల శిథిలాలను 24 గంటల వ్యవధిలో తవ్వేశారని చెప్పారు. వారి కృషి వల్లే కార్మికులు త్వరగా బయటకు వచ్చారని ప్రశంసించారు. బొగ్గు గనుల్లో 3 నుంచి 4 అడుగుల ఎత్తయిన సొరంగాలను అడ్డంగా తవ్వడానికి ర్యాట్–హోల్ మైనింగ్ టెక్నాలజీ వాడుతుంటారు. కేవలం ఒక్క మనిషి పట్టేందుకు వీలుగా ఈ సొరంగాలు ఉంటాయి. మేఘాలయ బొగ్గు గనుల్లో ఈ సాంకేతికతను వాడడాన్ని 2014లో జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధించింది. దేశవ్యాప్తంగా బొగ్గు గనుల్లో ర్యాట్–హోల్ మైనింగ్‌పై నిషేధం అమలవుతోంది. కానీ, ఇతర నిర్మాణ పనుల్లో అనధికారికంగా ఉపయోగిస్తూనే ఉన్నారు. సిల్‌క్యారా సొరంగంలో మట్టి శిథిలాలను తవ్వడానికి 12 మంది ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులను రప్పించారు.

ఎప్పుడేం జరిగింది?

నవంబర్ 12 దీపావళి పండుగ రోజే ఉదయం 5.30 గంటలకు సిల్‌క్యారా–దందల్‌గావ్ మధ్య నిర్మాణంలో ఉన్న సొరంగం కూలిపోయింది. 41 మంది కార్మికులు అందులో చిక్కుకుపోయారు. అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. సొరంగంలోకి ఎయిర్–కంప్రెస్డ్ పైపుల ద్వారా ఆక్సిజన్, విద్యుత్, ఆహార పదార్థాలు పంపించడానికి ఏర్పాట్లు చేశారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, బీఆర్‌ఓ, ఎన్‌హెచ్‌ఐడీసీఎల్, ఐటీబీపీ తదితర సంస్థలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి.

నవంబర్ 13 సొరంగంలో ఉన్న కార్మికులతో మాట్లాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఆక్సిజన్ కోసం ఉద్దేశించిన పైపుల గుండా అధికారులు మాట్లాడారు. క్షేమంగా ఉన్నామని కార్మికులు బదులిచ్చారు. అదేరోజు సొరంగం పైభాగం నుంచి మట్టి కూలింది. టన్నెల్ లోపల 60 మీటర్ల మేర మట్టి విస్తరించింది.

నవంబర్ 14 దాదాపు 900 మిల్లీమీటర్ల వ్యాసార్థం ఉన్న స్టీల్ పైపులను సొరంగం వద్దకు చేర్చారు. మట్టి శిథిలాల గుండా సొరంగంలోకి ఈ పైపులను పంపించాలని నిర్ణయించారు. సొరంగంలో పైభాగం నుంచి మరింత మట్టి కూలడం ఆందోళన కలిగించింది. ఇద్దరు కార్మికులు స్వల్పంగా గాయపడ్డారు.

నవంబర్ 15 కార్మికులను బయటకు తీసుకురావడానికి డ్రిల్లింగ్ యంత్రంతో తవ్వకం పనులు చేపట్టారు. అవి సవ్యంగా సాగకపోవడంతో అత్యాధునిక అగర్ మెషీన్‌ను రంగంలోకి దింపాలని నిర్ణయించారు. ఢిల్లీ నుంచి విమానంలో తీసుకొచ్చారు.

నవంబర్ 16 అగర్ మెషీన్‌తో డ్రిల్లింగ్ పనులు ప్రారంభించారు.

నవంబర్ 17 సొరంగంలో 57 మీటర్ల మేర మట్టి శిథిలాలు ఉండగా, 24 మీటర్ల మేర తవ్వకాలు జరిపారు. నాలుగు ఎంఎస్ పైపులను శిథిలాల గుండా పంపించారు. ఐదో పైపునకు అవరోధాలు ఎదురుకావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. మరో అగర్ మెషీన్‌తో పనులు ప్రారంభించారు. ఐదో పైపును అమర్చే క్రమంలో సొరంగంలో భారీగా పగుళ్ల శబ్దాలు వినిపించాయి. సొరంగం మొత్తం కుప్పకూలే అవకాశం ఉండడంతో ఆ పనులు వెంటనే నిలిపివేశారు.

నవంబర్ 18 1,750 హార్స్‌పవర్ కలిగిన అమెరికన్ అగర్ మెషీన్ వల్ల టన్నెల్ లోపల ప్రకంపనలు పుట్టుకొస్తున్నట్లు గుర్తించారు. ప్రత్యామ్నాయం కోసం అన్వేషించారు. సహాయక చర్యల్లో ఆలస్యం జరుగుతుండడంతో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) అధికారులు కూడా రంగంలోకి దిగారు. ఐదు రకాల మార్గాలపై దృష్టి పెట్టారు. టన్నెల్ ఉపరితలం నుంచి లోపలికి నిలువుగా డ్రిల్లింగ్ చేయాలని నిర్ణయించారు.

నవంబర్ 19 ఘటనా స్థలంలో సహాయక చర్యలను కేంద్ర మంతి నితిన్ గడ్కరీ స్వయంగా సమీక్షించారు. నిలువుగా కాకుండా అగర్ మెషీన్‌తో అడ్డంగా డ్రిల్లింగ్ చేస్తే బాగుంటుందని సూచించారు.

నవంబర్ 20 సహాయక చర్యలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరా తీశారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రితో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. టన్నెల్‌లో అడ్డంగా డ్రిల్లింగ్ చేస్తుండగా, అగర్ మెషీన్‌కు పెద్ద రాయి అడ్డుపడింది. పనులు నిలిచిపోయాయి.

నవంబర్ 21 సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల మొదటి వీడియోను అధికారులు విడుదల చేశారు. ఆహారం తీసుకుంటూ, ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ కార్మికులు కనిపించారు. తమ కుటుంబ సభ్యులతోనూ వారు మాట్లాడారు. సిల్కియారా వైపు నుంచి అగర్ యంత్రంలో అడ్డంగా డ్రిల్లింగ్ పనులను అధికారులు పునఃప్రారంభించారు.

నవంబర్ 22 800 వ్యాసార్థం కలిగిన స్టీల్ పైపులను శిథిలాల గుండా 45 మీటర్ల వరకు పంపించారు. మరో 12 మీటర్లే మిగిలి ఉంది. ఇంతలో మరో అవాంతరం వచ్చిపడింది. అగర్ మెషీన్‌కు కొన్ని ఇనుప కడ్డీలు అడ్డం వచ్చాయి.

నవంబర్ 23 అడ్డంగా ఉన్న ఐరన్ రాడ్లను తొలగించారు. శిథిలాల్లో అడ్డంగా 48 మీటర్ల మేర డ్రిల్లింగ్ పూర్తయ్యింది. ఇక్కడ మరో ఉపద్రవం తప్పలేదు. అగర్ మెషీన్‌ను ఏర్పాటు చేసిన వేదికకు పగుళ్లు వచ్చాయి.

నవంబర్ 24 పగుళ్లను సరిచేసి, డ్రిల్లింగ్ మళ్లీ ప్రారంభించారు. ఈసారి మెటల్ గిర్డర్ అడ్డుపడింది. దాన్ని తొలగించారు.

నవంబర్ 25 అగర్ మెషీన్ బ్లేడ్లు శిథిలాల్లో ఇరుక్కున్నాయి. దీంతో రెస్క్యూ ఆపరేషన్ పూర్తి కావడానికి మరికొన్ని వారాలు పడుతుందని భావించారు. మరో 12 మీటర్ల మేర డ్రిల్లింగ్ మిగిలి ఉంది. కానీ, ఆ పనులు ఆపేయాలని నిర్ణయించారు.

నవంబర్ 26 కార్మికులను క్షేమంగా బయటకు తీసుకురావడానికి ప్రత్యామ్నాయ మార్గం కోసం 19.2 మీటర్ల మేర నిలువుగా డ్రిల్లింగ్ పూర్తిచేశారు. 700 మిల్లీమీటర్ల వ్యాసార్థం కలిగిన పైపులు పంపించే పనులు ప్రారంభించారు.

నవంబర్ 27 12 మీటర్ల మేర డ్రిల్లింగ్ కోసం ర్యాట్–హోల్ మైనింగ్ నిపుణులను రప్పించారు. అదే సమయంలో టన్నెల్ పై భాగం నుంచి నిలువుగా డ్రిల్లింగ్ 36 మీటర్ల మేర పూర్తయ్యింది.

నవంబర్ 28 సాయంత్రం 7 గంటలకల్లా డ్రిల్లింగ్ ఆపరేషన్ మొత్తం పూర్తయ్యింది. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ సిబ్బంది స్టీల్ పైపు గుండా కార్మికుల వద్దకు చేరుకున్నారు. వీల్డ్–స్ట్రెచర్లపై ఒక్కొక్కరిని భద్రంగా బయటకు తీసుకొచ్చారు.





బయటకొచ్చిన కార్మికులతో మాట్లాడుతున్న ఉత్తరాఖండ్ సీఎం ధామి, కేంద్రమంత్రి వీకే సింగ్



టన్నెల్ నుంచి రక్షించిన 41 మంది కార్మికులను ఆస్పత్రికి తీసుకెళ్తున్న అంబులెన్సులు

కార్మికుల స్థైర్యానికి సలాం

సొరంగం ఆపరేషన్ విజయవంతంపై రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లోని సొరంగంలో 17 రోజులుగా చిక్కుబడిపోయిన కార్మికులు సురక్షితంగా బయటకు రావడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే సహా పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. సొరంగం ఆపరేషన్ విజయవంతంగా ముగిసినందుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంతోషం వ్యక్తం చేశారు. కార్మికుల స్థైర్యానికి దేశం సలాం చేస్తుందన్నారు. 'తమ ప్రాణాలకు ప్రమాదమున్నా లెక్క చేయకుండా కీలక మౌలిక నిర్మాణాల పనుల్లో పాలుపంచుకుంటున్న కార్మికులకు దేశం రుణపడి ఉంటుంది. 17 రోజులపాటు కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వారిని రక్షించేందుకు చేపట్టిన ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యాయి. మనిషి సహనానికి ఈ ఘటన ఒక నిదర్శనం'అని రాష్ట్రపతి పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం: ప్రధాని మోదీ

'కార్మికుల ధైర్యం, సహనం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని కలిగిస్తుంది. వారికి మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షిస్తున్నాను. మన స్నేహితులు చాలా కాలం ఎదురుచూపుల తర్వాత తమ ప్రియమైన వారిని కలుసుకోవడం చాలా సంతృప్తిని కలిగించే విషయం. వారి కుటుంబ సభ్యుల సహనం, ధైర్యాన్ని ఎంత పొగిడినా తక్కువే. టన్నెల్ ఆపరేషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నా సెల్యూట్'అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. కార్మికుల ప్రాణాలు కాపాడేందుకు అహర్నిశలు శ్రమించిన వివిధ విభాగాల అధికారులకు హోం మంత్రి అమిత్ షా కృతజ్ఞతలు తెలిపారు.

యాంత్రిక శక్తిపై మానవ శ్రమ విజయం: ప్రపంచ మీడియా

లండన్: ఉత్తరాఖండ్ టన్నెల్‌లో 41 మంది కార్మికులు 17 రోజుల క్రితం చిక్కుబడిపోయినప్పటి నుంచి.. మంగళవారం రాత్రి వారందరినీ సురక్షితంగా బయటకు తీసుకువచ్చే వరకు జరుగుతున్న పరిణామాలను అంతర్జాతీయ మీడియా ఎప్పటికప్పుడు అందజేస్తూ వస్తోంది. 'టన్నెల్ నుంచి మొదటి వ్యక్తి బయటకు వచ్చినట్లు తెలియగానే అక్కడ పండుగ వాతావరణం నెలకొంది'అంటూ రెస్క్యూ ఆపరేషన్ అప్‌డేట్స్ అందజేస్తున్న బీబీసీ విలేకరి పేర్కొన్నారు. 'సొరంగం లోపల చిక్కుకున్న వారిని రక్షించే క్రమంలో చిట్టచివరి అడ్డంకిగా ఉన్న 12 మీటర్ల మేర శిథిలాలను మాన్యువల్‌గా డ్రిల్ చేశారు. యంత్ర శక్తిపై మానవ శ్రమ సాధించిన విజయమిది'అని బ్రిటిష్ డెయిలీ 'ది గార్డియన్' పేర్కొంది. అదేవిధంగా, సీఎన్‌ఎన్, అల్‌జజీరా, ది టెలిగ్రాఫ్ కూడా ఎప్పటికప్పుడు అక్కడి పరిణామాలను కవర్ చేశాయి.

దేవుని దీవెనలు ఉన్నాయి కన్నా..

కార్మికునితో ఫోన్‌లో మాట్లాడిన తల్లి

కార్మికులు సురక్షితంగా బయటపడటంతో వారి కుటుంబాల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కొందరి కుటుంబసభ్యులు ఘటనాస్థలికి రాగా, మరికొందరు ఫోన్‌లో తమ క్షేమ సమాచారాన్ని కుటుంబసభ్యులకు చేరవేశారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికుడు శౌభిక్ పఖీరా బయటకురాగానే ఇంటికి ఫోన్ చేసి తల్లి లక్ష్మితో మాట్లాడారు. ఆ ఆనందకర దృశ్యం అక్కడివారికి కంటతడి పెట్టించింది. ' దేవుని దీవెనలు నీపై ఉన్నాయిరా. నువ్వు వరల్డ్ రికార్డ్ సాధించావు. నిన్ను నవమాసాలు మోసినందుకు ఆనందంగా ఉంది. నీ ఆరోగ్యం బాగుందా? హెల్త్ చెకప్ చేశారా? జాగ్రత్తగా ఇంటికి రా. స్నానం చేసి కొత్త బట్టలు కట్టుకో. పూజ చేసిన పూలు పంపిస్తున్నా' అని తల్లి లక్ష్మి ఏడుస్తూ మాట్లాడారు. మరోవైపు, కార్మికులు బయటకురావడంతో జార్ఖండ్‌లోని ఖైరాబేడా గ్రామంలో ఆనందం వెల్లివిరిసింది. రాజేంద్ర, సుఖ్‌రామ్, అనిల్ అనే కార్మికులు ఈ గ్రామం వారే.

యూపీఐ 'తొలి' లావాదేవీకి 4 గంటలు ఆగాల్సిందే!

సాక్షి, న్యూఢిల్లీ: డిజిటల్ సీమలో చెలరేగిపోతున్న సైబర్ చోరుల ఆట కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనను ప్రవేశపెట్టే యోచనలో ఉంది. అయితే ఈ నిబంధన మొదటికే మోసం వస్తుందేమోనన్న అనుమానం ప్రజలు, వర్తకుల్లో వ్యక్తమవుతోంది. యూపీఏ లావాదేవీల ద్వారా 2022–23 భారతీయ రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం యూపీఐ లావాదేవీల రూపంలో సైబర్ నేరగాళ్లు ఏకంగా రూ.30,252 కోట్లు కొట్టేయడంతో ప్రజాధనాన్ని కాపాడేందుకు కొత్త నిబంధనలను తేవాలని కేంద్రం యోచిస్తోంది. ఇందులోభాగంగా కొన్ని ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. డిజిటల్ పేమెంట్స్ ద్వారా ఇద్దరి మధ్య జరిగే తొలి లావాదేవీలో భారీగా రెప్పపాటులో బదిలీకాకుండా ఆపాలని భావిస్తోంది. ఈ నిబంధన అమల్లోకి వస్తే రూ.2వేలు వంటి చిన్న మొత్తాలను వెంటనే యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల ద్వారా పంపుకోవచ్చు. అంతకంటే ఎక్కువ మొత్తాలను పంపాలంటే ఆ ట్రాన్సాక్షన్ పూర్తికి 4 గంటల వ్యవధి పెట్టాలని కేంద్రం భావిస్తోంది. తప్పుడు/మోసపూరిత యూపీఐ లావాదేవీ ద్వారా భారీ మొత్తం ఖాతా నుంచి చోరీ అయితే ఆ 4గంటలలోపు ఫిర్యాదు అందితే బాధితులకు తక్షణ సాయం చేసేందుకు అవకాశం ఉంటుందని కేంద్రం భావిస్తోంది. గతంలో ట్రాన్సాక్షన్ జరగని ఖాతాలకు మాత్రమే దీనిని అమలు చేయనున్నారు.

వైట్‌హౌస్, పెంటగాన్, యుద్ధ నౌకలు...

ఫొటోలను తమ నిఘా ఉపగ్రహం తీసిందన్న ఉత్తరకొరియా

సియోల్: అమెరికా అధ్యక్షుడి నివాసం వైట్‌హౌస్, రక్షణశాఖ కార్యాలయం పెంటగాన్, అమెరికా విమాన వాహక నౌకల స్పష్టమైన ఫొటోలను సోమవారం తమ నిఘా ఉపగ్రహం పంపించినట్లు ఉత్తరకొరియా ప్రకటించుకుంది. వీటిని తమ నేత కిమ్ జొంగ్ ఉన్ పరిశీలించారని తెలిపింది. మల్లిగియోంగ్–1 అనే నిఘా ఉపగ్రహం ప్రయోగాన్ని కిమ్ తిలకిస్తున్న ఫొటోలను గత మంగళవారం అధికార వార్తా సంస్థ కేసీఎన్‌ఏ విడుదల చేసింది. శాటిలైట్ విడుదల చేసిన చిత్రాల్లో అమెరికా నేవీ కేంద్రం, నౌకాశ్రయం, వర్జీనియాలోని వైమానిక కేంద్రం ఉన్నాయని తెలిపింది.

కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్తాన్‌లో పోటీ పరీక్షల శిక్షణకు పేరున్న కోటాలో మరో విద్యార్థి తనువు చాలించాడు. పశ్చిమబెంగాల్‌లోని బిర్భుమ్ జిల్లాకు చెందిన ఫరీద్ హుస్సేన్(20) నీట్ పరీక్ష కోసం జూలై నుంచి స్థానిక వవ్ఫ్‌నగర్‌లోని అద్దె ఇంట్లో ఉంటూ శిక్షణ తీసుకుంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం తోటి వారికి కనిపించిన ఫరీద్ రాత్రి 8 గంటలైనా బయటకు రాలేదు. పోలీసులు తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫరీద్ ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కోటా నగరంలో శిక్షణ కోసం వచ్చి విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడిన ఘటనల్లో ఇది 25వది కావడం గమనార్హం.

బిహార్ పాఠశాలల్లో హిందూ పండుగల సెలవులు కుదింపు

పట్నా: 2024వ సంవత్సరానికి బిహార్ విద్యా శాఖ సోమవారం విడుదల చేసిన సెలవుల క్యాలెండర్ రాజకీయంగా అగ్గి రాజేసింది. పాఠశాలల్లో హిందువుల పండుగలకు సెలవులు తగ్గించడం, ముస్లిం పండుగలకు సెలవుల సంఖ్యను పెంచింది. జన్మాష్టమి, రక్షాబంధన్, శ్రీరామనవమి, శివరాత్రి, తీజ్, వసంత పంచమి, జీవిపుత్రిక పర్వదినాల్లో సెలవులుండని ప్రభుత్వం చెప్పింది. ముస్లిం పండుగలైన ఈద్, బక్రీద్‌కు మూడు రోజుల చొప్పున, మొహర్రంకు రెండు రోజులు సెలవులు ప్రకటించింది. విద్యా హక్కు చట్టం ప్రకారం.. పాఠశాలల్లో ఏటా కనీసం 220 బోధనా రోజులు ఉండాలని, అందుకే సెలవులను తగ్గిస్తూ హాలిడే క్యాలెండర్ విడుదల చేసినట్లు విద్యా శాఖ వెల్లడించింది.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
బుధవారం । 29 । నవంబర్ । 2023

మళ్లీ బీజేపీలో చేరను: శెట్టర్

హుబ్లీ: తాను బీజేపీలోకి తిరిగి వెళ్లే ప్రసక్తే లేదని మాజీ సీఎం, ఎమ్మెల్సీ జగదీష్ శెట్టర్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అబద్ధాలు ప్రచారం చేయడం ద్వారా పార్టీని విడిచి వెళ్లే వారిని ఆపడానికి బీజేపీ ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఈ క్రమంలో తాను బీజేపీలో చేరుతున్నట్లుగా వదంతులు వ్యాపింపజేశారని మండిపడ్డారు. ఎన్నికల వేళ ఏమేం జరుగుతుందో వేచి చూడాలన్నారు. బీజేపీ మాజీ మంత్రులు, నేతలు తన ద్వారా కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కులాల వారి జనాభా సేకరణపై ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం అందరి అభిప్రాయం తీసుకోవాలన్నారు. ఈ విషయంలో లోపదోషాలను నివారించాలన్నారు. మండ్యలో భ్రూణహత్యల కుంభకోణంపై ఆయన మాట్లాడుతూ నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

న్యూస్‌రీల్

గెస్ట్ లెక్చరర్ల ధర్నా



నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

గౌరిబిదనూరు: మా డిమాండ్ల సాధన కోసం ఈ నెల 23 నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తాలూకాలోని అతిథి ఉపన్యాసకులు వాపోయారు. మంగళవారం ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాల ముందు నిరసన నిర్వహించారు. ఏళ్ల తరబడి ఉద్యోగాలు చేస్తున్నాం, మా సర్వీసులను పర్మినెంట్ చేయాలని కోరుతున్నాం. సరైన వేతనాలు, భత్యాలు లేక దీనావస్థలో బతుకీడుస్తున్నామని వాపోయారు. 6 రోజులుగా నిరసన తెలుపుతున్నట్లు చెప్పారు.

డీకేశి సీబీఐ కేసు.. హైకోర్టుకు యత్నాల్

శివాజీనగర: ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అక్రమాస్తుల కేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తును ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే బసనగౌడ పాటిల్ యత్నాల్ హైకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. కేసు తుది దశలో ఉన్న తరుణంలో కేబినెట్ సీబీఐ విచారణను ఉపసంహరించుకోవడం చట్ట విరుద్ధమని, తమ అప్పీలును తీవ్రంగా పరిగణించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లో మంటలు

దొడ్డబళ్లాపురం: ఐటీ సిటీలో ఎయిర్‌పోర్టు రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్‌లో సోమవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. చిక్కజాల పోలీస్‌స్టేషన్ ఎదురుగా హైవే పక్కన ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగాయి. మంటల కారణంగా చుట్టుపక్కల దట్టమైన పొగ కమ్ముకుని స్థానికులు ఇబ్బంది పడ్డారు. మంటలకు కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో ఉన్న విలువైన వస్తువులు, ఫర్నిచర్లు కాలిబూడిదయ్యాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేసారు. కరెంటు షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్టు తెలిసింది.

నటి లీలావతికి శివన్న పరామర్శ

దొడ్డబళ్లాపురం: సీనియర్ నటి లీలావతి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో హీరో శివరాజ్‌కుమార్ మంగళవారంనాడు ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. నెలమంగల తాలూకా సోలదేవనహళ్లిలోని ఫార్మ్‌హౌస్‌కు వచ్చిన శివరాజ్‌కుమార్ లీలావతి కుమారుడు వినోద్‌రాజ్‌ను కౌగిలించుకుని ఓదార్చారు. తల్లి ఆరోగ్యం గురించి వినోద్‌రాజ్ శివణ్ణకు వివరించారు. శివణ్ణతో పాటు భార్య గీత కూడా ఉన్నారు. రెండు రోజుల క్రితం హీరో దర్శన్, సీనియర్ హీరో అర్జున్ కూడా విచ్చేసి లీలావతి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు.

ఇంజెక్షన్లు వికటించి గర్భవిచ్ఛిత్తి

బనశంకరి: ఓవర్‌డోస్ ఇంజెక్షన్ వేయడంతో మహిళకు గర్భస్రావం అయిందని కుటుంబసభ్యులు ఆసుపత్రి ముందు ఆందోళనకు దిగారు. బెంగళూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఈ ఘటన చోటుచేసుకుంది. గర్భిణి ప్రతి నెలా ఆస్పత్రికి చెకప్ కోసం వచ్చేది. అదే మాదిరి మంగళవారం రాగా, కడుపునొప్పిగా ఉందనడంతో ఆమెకు వైద్యులు ఇంజెక్షన్ వేశారు. కొంతసేపటికి సూది వేసిన చోట వాపు రావడంతో పాటు అస్వస్థతకు గురైంది. నొప్పి తగ్గాలని ఆమెకు పలు పెయిన్‌కిల్లర్ ఇంజెక్షన్లు వేశారు. కానీ ఆమెకు కడుపునొప్పి మరింత తీవ్రమైంది. చివరకు వైద్యులు అబార్షన్ చేయాలని చెప్పి చేసేశారు. వైద్యుల నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి వచ్చిందని మహిళ కన్నీరుపెట్టింది. ఆమె బంధువులు ఆసుపత్రి ముందు ధర్నాకు దిగారు. పోలీసులు వచ్చి ఇరువర్గాలతో మాట్లాడి సర్దిచెప్పారు.

కెప్టెన్ ప్రాంజల్‌కు నివాళి



మైసూరు: జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో వీర మరణం పొందిన ఆర్మీ కెప్టెన్ ఎంవీ ప్రాంజల్‌కు సోమవారం రాత్రి నగరంలోని ఫీల్డ్‌మార్షల్ కరియప్ప సర్కిల్‌లో సావర్కర్ యువకుల సంఘం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీర మరణం పొందిన సైనికుల ఫొటోలను ప్రదర్శిస్తూ క్యాండిల్స్ వెలిగించి నివాళి అర్పించారు. దివంగత ప్రాంజల్ సేవలను కొనియాడుతూ, యువత వీర సైనికుల ఆదర్శాలను అలవర్చుకుని ముందుకు సాగాలని అన్నారు.

కడుపులోనే కడతేరిపోయారు !



ఇప్పటివరకు 1,500 కు పైగా అబార్షన్లు చేసినట్లు అంచనా

వందలాది గర్భస్థ పిండాల హత్య

- రాష్ట్రంలో బృహత్ అబార్షన్ ముఠా గుట్టురట్టు
- లింగ నిర్ధారణ చేసి, ఆడపిల్ల అయితే గర్భవిచ్ఛిత్తి
- కోట్లాది రూపాయల ఆర్జన
- డాక్టర్లు, వైద్యసిబ్బంది సహా 9 మంది అరెస్టు
- ముఠాకు విస్తృతంగా నెట్‌వర్క్

బనశంకరి: గర్భస్థ పిండం లింగ నిర్ధారణ, ఆడపిల్ల అయితే అబార్షన్ చేసే కిరాతక ముఠా ఆగడాలు క్రమంగా బయటపడుతున్నాయి. ఈ ముఠా బెంగళూరుతో సహా రాష్ట్రంలో 1,500 కు పైగా భ్రూణ హత్యలకు పాల్పడినట్లు, గత మూడునెలల్లో ఎక్కువగా సుమారు 242 అబార్షన్లు చేయించినట్లు పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. లింగ నిర్ధారణ చేసేది ఒక ముఠా అయితే, అబార్షన్ నిర్వహించేది మరో ముఠాగా తేలింది. క్రైం సినిమాలో మాదిరిగా ఈ ముఠాలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. పోలీసులు వీరి ఫోన్ కాల్స్ వివరాలు సేకరిస్తుండగా, సమాజంలోని ప్రముఖ డాక్టర్లతో పాటు అనేక మంది పలుకుబడి ఉన్నవారి సంబంధాలు ఉన్నట్లు తేలింది. వారికి పోలీసులు ఫోన్లు చేస్తే కొందరు స్పందించడం లేదని బెంగళూరు పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. చెన్నైకు చెందిన డాక్టర్ తులసిరామ్, మైసూరు ప్రైవేటు ఆసుపత్రి డాక్టర్ చందన్‌బల్లాల్, అతని భార్య మీనా, ఆస్పత్రి రిసెప్షనిస్ట్ రిజ్మా, ల్యాబ్ టెక్నీషియన్ నిస్సార్ అనే వారిని అరెస్ట్ చేశారు. రెండురోజుల క్రితం మైసూరు ఉదయగిరి ప్రైవేటు ఆసుపత్రి, రాజ్‌కుమార్ రోడ్డులోని ఆయుర్వేదిక్ డే కేర్ సెంటర్‌ను సీజ్ చేశారు. ఈ రెండింటిని దందాకు ఉపయోగించేవారని గుర్తించారు.

> డబ్బుల కోసం దోపిడీలు, మోసాలు చేసేవారు ఒక ఎత్తయితే, కడుపులోని శిశువులతోనే ధనార్జన చేసేవారు మరొక ఎత్తు. రెండో కోవకు చెందిన ముఠాలు ఐటీ సిటీలో పట్టుబడ్డాయి. దొరకని ముఠాలు ఎన్నో మరి!



పుట్టబోయేది ఆడపిల్ల అయితే గర్భంలోనే చిదిమేసేవారు



అమ్మ కడుపులోనూ భద్రత కరువు

మైసూరు, బెంగళూరులో వ్యవహారం

అక్రమ అబార్షన్ల కుంభకోణంలో ఇప్పటివరకు 9 మందిని అరెస్ట్ చేశామని, పట్టుబడిన వారందరూ మైసూరు, మండ్య, చెన్నైకి చెందినవారని కమిషనర్ తెలిపారు. మండ్య అలెమనె, మైసూరు, బెంగళూరులోని బైయప్పనహళ్లి ఆసుపత్రుల్లో గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లకు పాల్పడేవారు. ఇందులో మధ్యవర్తులు కూడా పెద్దసంఖ్యలో ఉన్నారు. వారి ద్వారా బాధిత మహిళల వివరాలను సేకరిస్తున్నారు. ఒక గర్భవిచ్ఛిత్తికి రూ.20 వేలకుపైగా తీసుకునేవారు. గత మూడునెలల్లో 242 అబార్షన్లు చేసి కోట్లాది రూపాయలు సంపాదించారు. ఈ ముఠా గురించి బైయప్పనహళ్లి పోలీసులు గత అక్టోబరులో శివనంజేగౌడ, వీరేశ్, నవీన్ కుమార్, నయన్‌కుమార్ అనే నిందితులను అరెస్ట్‌చేశారు. మగపిల్లలు మాత్రమే కావాలనుకునేవారు, ఇతరత్రా కారణాలతో గర్భం వద్దనుకునే మహిళలను, యువతులను ఈ ముఠా గాలించేది. మధ్యవర్తులు కూడా తీసుకొచ్చేవారు. వారికి మండ్యలో స్కాన్ చేయించి గర్భ విచ్ఛిత్తికి పాల్పడుతున్నట్లు పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది.

గర్భంలో ఉండగానే శిశు విక్రయం



- **ఘరానా ముఠా అరెస్ట్**

మద్యం మత్తులో ఉన్న వ్యక్తి ఇచ్చిన సమాచారం ఆధారంగా ఓ పెద్ద నేర ముఠా గుట్టు రట్టయింది. ముగ్గురు మహిళలతో పాటు ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి 20 రోజులు పసికందును కాపాడారు. కణ్ణన్ రామస్వామి, మురుగేశ్వరి, సుహాసిని, శరణ్య, హేమలత అనే ఐదుమంది పట్టుబడ్డారు. మహాలక్ష్మీ, గోమతి, రాధామణి అనే ముగ్గురిని విచారిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ 8 మందిపై బెంగళూరు రాజరాజేశ్వరినగర పోలీస్‌స్టేషన్‌లో పిల్లల దొంగరవాణా కేసు నమోదు చేశారు.

- సాధారణంగా శిశువులను, బాలలను విక్రయిస్తుంటారు. కానీ వీరు నిరుపేద గర్భిణులను గుర్తించి, పుట్టబోయే బిడ్డను తమకు ఇవ్వాలని డబ్బు ఆశ చూపేవారు. పసికందులకు ఎక్కువ డిమాండ్ ఉండటాన్ని గుర్తించిన వంచకుల గ్యాంగ్ తమ నెట్‌వర్క్‌తో దందా నిర్వహిస్తున్నారు.
- నవజాత శిశువును తీసుకుని ఇతరులకు ఎక్కువ రేటుకు అమ్ముకునేవారు. మురుగేశ్వరి అనే పేద గర్భవతికి అన్ని విధాలుగా సహాయం చేస్తామని హామీ ఇచ్చి శిశు విక్రయ ఒప్పందం కుదుర్చుకున్నారు.



అరెస్టయిన నిందితులు

- ఈ సమాచారం ఆధారంగా ఆర్‌ఆర్.నగర దేవస్థానం వద్ద మకాం వేసిన పోలీసులకు తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన కారు రాగా, అడ్డుకుని నిందితులను అరెస్ట్ చేశారు.
- 20 రోజులు పసికందుతో పాటు తమిళనాడుకు చెందిన ముగ్గురు మహిళలు, ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు.
- పసికందులను రూ.25 వేల నుంచి 30 వేలకు కొనుగోలు చేసి సంతానం లేని శ్రీమంత కుటుంబాలకు రూ.8 - 10 లక్షలకు విక్రయిస్తున్నట్లు విచారణలో బయటపడింది.
- ముఠాలో కర్ణాటక, తమిళనాడు రాష్ట్రానికి చెందిన పేరుపొందిన డాక్టర్లు, ఆసుపత్రుల భాగస్వామ్యం ఉన్నట్లు తెలియడంతో సీసీబీచే దర్యాప్తు చేయిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

చిన్న జాతరకు నీరాజనం



ఆలయం ముందు రథోత్సవ సంరంభం

- జనసాగరమైన నంజనగూడు

మైసూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన మైసూరు జిల్లాలోని నంజనగూడులో వెలసిన శ్రీకంఠేశ్వర (నంజుండేశ్వర) స్వామి చిన్న జాతర వేడుకలు జనసాగరం మధ్య జరిగాయి. చిన్న జాతర వేడుకల సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున ఆలయంలో పార్వతీ సమేత శ్రీకంఠేశ్వర స్వామివారికి క్షీరాభిషేకం, పంచామృతాలతో అభిషేకించారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకులు నాగచంద్ర దీక్షిత్ ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు గావించారు. గణపతి పుజ, నవగ్రహాల పూజ చేసి ఉత్సవమూర్తిని తేరులో ఉంచి రథోత్సవం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంతో పాటు పట్టణ వీధుల్లో భక్తులు తేరును లాగారు. పలు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు.



పట్టణ వీధుల్లో సాగిన తేరు

అమ్మవారికి గృహలక్ష్మిసొమ్ము

మైసూరు: గృహలక్ష్మి పథకం కింద సర్కారు ఐదేళ్ల పరిపాలనలో 50 నెలలకు గాను నగదు సొమ్మును నాడిన శక్తి దేవత అయిన చాముండేశ్వరి అమ్మవారికి మొత్తం రూ. 1,18,000 నగదును ముందుగానే అందజేసింది. ఎన్నికల ప్రచారంలో మొక్కులో భాగంగా అమ్మవారికి కూడా గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేసినట్లు గతంలో సీఎం, డిప్యూటీ సీఎం చెప్పడం తెలిసిందే. 50 నెలల నగదు అధికారులు చాముండేశ్వరి ఆలయ అధికారులకు అప్పగించారు.

బెళగావి అసెంబ్లీ సమావేశాలకు రూ.25 కోట్లు

కంప్లి: డిసెంబరు 4వ తేదీ నుంచి బెళగావిలోని సువర్ణసౌధలో జరిగే శీతాకాల సమావేశాలకు రూ.25 కోట్లు ఖర్చు చేయనున్నటు పరిషత్ సభాపతి బసవరాజ్ హొరట్టి తెలిపారు. సణాపుర రోడ్డులోని పీయూ కళాశాలలో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. ప్రతిసారి శీతాకాల సమావేశాల్లో వివిధ రీతిలో ధర్నాలు, నిరసనలతో కాలయాపన జరిగిందే తప్ప సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈసారి సమస్యలపై ఆయా మంత్రుల శాఖల అధికారులకు ప్రభుత్వం తగిన నిర్దేశం చేసి ఎలాంటి ఆందోళనలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అజెండా ప్రకారం ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం డిసెంబర్ 5, 6 తేదీల్లో ఉత్తర కర్ణాటక ప్రాంత సమస్యలపై విధాన పరిషత్‌లో చర్చలకు ప్రత్యేక అవకాశం కల్పిస్తామన్నారు.



అర్ధరాత్రి.. పెద్ద పులి పట్టివేత

- మైసూరు జిల్లాలో కార్యాచరణ విజయవంతం
- ఇటీవల ఒక మహిళను చంపిన పులి


మైసూరు: మైసూరు జిల్లాలోని నంజనగూడు తాలూకా పరిధిలో ఉన్న బండీపుర అడవులను ఆనుకుని ఉన్న ప్రాంతంలో సంచరిస్తూ ప్రజలను భయానికి గురిచేస్తూ, ఇటీవల పశువులను మేపుతున్న ఒక మహిళను బలితీసుకున్న పెద్ద పులిని అటవీ సిబ్బంది హెడియాల గ్రామం సమీపంలో పట్టుకున్నారు. పులికి తుపాకీతో మత్తు ఇంజెక్షన్ ఇవ్వడంతో అది మత్తులోకి జారుకోగా పట్టుకుని బంధించారు.

ఈ నెల 24న హెడియాల వద్ద పశువులు మేపుతున్న రత్నమ్మ (55)ని పులి చంపి భక్షించింది. అలాగే రెండు ఆవులను బలితీసుకుంది. దీంతో పరిసర పల్లెల ప్రజలు పొలాలకు వెళ్లాలంటే భయపడేవారు. చుట్టుపక్కల గాలింపు ప్రారంభించిన అటవీ సిబ్బంది పగలూ రాత్రి శ్రమించారు. రెండు ఏనుగులు, వందమందికి పైగా అటవీ సిబ్బంది, డ్రోన్ కెమెరాలతో కార్యాచరణ చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి సుమారు 1.45 గంటల సమయంలో పదేళ్ల వయసున్న మగ పులిని చూశారు. దానిని వెంబడించి తుపాకీతో మత్తు సూదిని కొట్టారు. కొంతసేపటికి అది మత్తులో పడిపోగా, బంధించి మైసూరు నగరంలో ఉన్న చామరాజేంద్ర జూకి తరలించారు. పులి పీడ విరగడ కావడంతో పరిసర పల్లెల ప్రజలు హమ్మయ్య అనుకున్నారు.

ఆవు పొట్టలో బంగారు చైన్



గొలుసు మింగి ఆపరేషన్‌కు గురైన గోవు ఇదే



వెలికితీసిన బంగారు చైన్

- ఆపరేషన్ చేసి వెలికితీత

శివమొగ్గ: ఆవు బంగారుచైన్‌ను మింగేసింది. ఇంటి వారి నిర్లక్ష్యం ఆవుకు సంకటంగా మారింది. ఆవుకు ఆపరేషన్ చేసి దాని కడుపులో చైన్‌ను బయటకు తీసిన సంఘటన శివమొగ్గ జిల్లాలోని హొసనగర తాలూకా మత్తిమనె గ్రామంలో జరిగింది. వివరాలు.. శ్యామ ఉడుపె అనే వ్యక్తి ఇటీవల దీపావళికి గోపూజ చేసి ఇంట్లోని ఆవుకు ఆ నైవేద్యం సమర్పించారు. అందులో కలశానికి అలంకరించిన 12 గ్రాముల బంగారం చైన్‌ను వారు చూసుకోలేదు. దీంతో ఆవు వంటకాలతో పాటు చైనును కూడా మింగేసింది. కానీ ఆ విషయాన్ని అప్పుడెవరూ గమనించలేదు.

గొలుసు ఏదని గాలింపు

ఇంటిలో ఉన్న బంగారం చైన్ కనిపించలేదని అందరూ వెతికినా జాడ లేదు. ఈ మధ్య ఆవు చాలా తక్కువ మేత తినడం చూసి పశువుల వైద్యునికి సమాచారం ఇచ్చారు. కోణందూరుకు చెందిన పశు వైద్యాధికారి డా. ఆనంద్ వచ్చి ఆవును పరిశీలించి కడుపులో ఏదో సమస్య ఉందని చెప్పారు. చివరికి అది బంగారు చైన్‌ను మింగినట్లు నిర్ధారించారు. ఈ ఆదివారం రోజున ఆవుకు ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న బంగారం చైన్‌ను బయటికి తీశారు. రెండు వారాల పాటు బంగారు గొలుసు ఆవు కడుపులో అలాగే ఉండడం విశేషం.

పల్లెల ప్రగతే దేశానికి పట్టుగొమ్మ

- మునిసిపాలికా సదస్సులో సీఎం

శివాజీనగర: నగర, గ్రామీణ ప్రాంతాల సుస్థిర అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని సీఎం సిద్దరామయ్య అన్నారు. మంగళవారం బెంగళూరులో ప్యాలెస్ మైదానంలో జరిగిన మునిసిపాలికా-2023 17వ సమ్మేళనాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశం సుస్థిరంగా అభివృద్ధి చెందాలంటే నగర, గ్రామీణ ప్రాంతాలు కూడా అదేరీతిలో ప్రగతి సాధించాలన్నారు. దేశంలో బ్రాండ్ బెంగళూరును నంబర్ వన్ చేయడానికి ప్రభుత్వం అన్ని విధాల చర్యలను చేపట్టిందన్నారు. రాష్ట్రంలో 32 శాతం మంది నగర ప్రాంతాల్లో నివాసిస్తున్నారు. వీరికి సదుపాయాలను కల్పించడం సవాల్‌తో కూడుకున్నదన్నారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా 188 ఇందిరా క్యాంటీన్‌లను అదనంగా ఏర్పాటు చేస్తామన్నారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, మంత్రులు పాల్గొన్నారు.

ఎవరైనా కోర్టుకు వెళ్లొచ్చు

రాష్ట్ర ప్రభుత్వం గతంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వ్యతిరేకంగా సీబీఐ తనిఖీకి ఇచ్చిన అనుమతి చట్ట విరుద్ధమైనది, అందుకే దానిని రద్దు చేసినట్లు సీఎం చెప్పారు. తమ నిర్ణయాన్ని బీజేపీ నేత యత్నాళ్ కోర్టులో సవాల్ చేశారని, ఎవరైనా కోర్టుకు వెళ్లవచ్చని అన్నారు. బోర్డులు, కార్పొరేషన్‌ల పదవుల నియామకాలపై హోం మంత్రి పరమేశ్వర్ అసంతృప్తికి గురికావటంపై స్పందించిన సీఎం.. ఎంపిక ప్రక్రియ ఇప్పటికీ ప్రాథమిక దశలో ఉంది. దీనిపై స్పందించటం సరికాదన్నారు. తెలంగాణలో కర్ణాటక సాధనలపై చేసిన ప్రచారంపై కేంద్ర ఎన్నికల కమిషన్ అభ్యంతరం వ్యక్తం చేసినందున తాము పత్రికా ప్రచారాన్ని రద్దు చేసుకున్నట్లు తెలిపారు.

మా ప్రకటనల్లో తప్పేం లేదు: డీకే

యశవంతపుర: తమ ప్రభుత్వం సాధించిన విషయాలను మాత్రమే తాము తెలంగాణ పత్రికలకు ప్రకటనలు ఇచ్చాము తప్పా ఎన్నికలలో ఓట్లు అడగడానికి కాదని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు. ఆయన మంగళవారం నగరంలో నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో తెలుగు పత్రికలలో కర్ణాటక ప్రభుత్వం ఇస్తున్న గ్యారంటీ పథకాల ప్రకటనలపై ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేయడంపై ఈ మేరకు స్పందించారు. కాంగ్రెస్ పార్టీకి గానీ, అభ్యర్థికి గానీ ఓటు వేయాలని తాము ఆ ప్రకటనల్లో అడగలేదన్నారు. ఇదీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఎలా అవుతుందని అన్నారు. నోటీసులకు సమాధానం ఇస్తామన్నారు. చట్టం ప్రకారం తెలంగాణ పత్రికలకు ప్రకటనలు ఇస్తే ఈసీ నోటీసులివ్వటం సరికాదని కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సుర్జేవాలా అన్నారు. బెంగళూరులో మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికలలో కాంగ్రెస్ విజయం తథ్యమన్నారు.

క్లుప్తంగా

నీటి సంపులో పడి చిన్నారి మృతి



చిన్నారి మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ (ఇన్‌సెట్‌లో) విస్మిత(ఫైల్)

హొసపేటె: వాటర్ సంపులో పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా చిక్కజోగిహళ్లి తండాలో మంగళవారం జరిగింది. తండా వాసులు నాగరాజ్, కావేరి దంపతుల కుమార్తె విస్మిత(3) తల్లి పెట్టిన గోరు ముద్దలు తిని ఆడుకుంటూ ఇంటి వద్ద ఉన్న సంపులో పడి మృతి చెందింది. ఈ ఘటనతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌టీ శ్రీనివాస్ మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబం సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

కాటే దర్వాజ కమాన్ నిర్మించొద్దు



పనులను అడ్డుకుంటున్న అధికారులు

రాయచూరు రూరల్: నగరంలోని సూపర్ మార్కెట్ వద్ద కాటే దర్వాజ కమాన్‌ను నిర్మించడం తగదని ప్రజలు జిల్లాధికారికి ఫిర్యాదు చేశారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో దర్గా నిర్వాహకులు కమాన్ నిర్మాణానికి ముందుకొచ్చారు. మంగళవారం పురావస్తు శాఖ, నగరసభ అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శంకరప్ప, బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, రమానంద్ యాదవ్, శివ బసప్ప మాలిపాటిల్, నాగరాజ్ భాల్కి, నరసారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలో అశాంతిని రేకెత్తించే ఇలాంటి అక్రమ కట్టడ నిర్మాణానికి అవకాశం కల్పించరాదని జిల్లాధికారిని కోరారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో శోభాయాత్ర



శ్రీకృష్ణ శోభాయాత్రను నిర్వహిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో సోమవారం రాత్రి ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ శోభాయాత్రను చేపట్టారు. కార్తీక పున్నమి సందర్భంగా నగరేశ్వర ఆలయం నుంచి మహేశ్వరి సమాజ్ అధ్యక్షుడు విఠల్‌దాస్ ఇన్నాని శోభాయాత్రను ప్రారంభించారు. పుర వీధుల గుండా సాగిన యాత్రలో రంగుల ముగ్గులతో అలంకరించిన వీధుల్లో భక్తులు సంకీర్తనలు, భజనలు చేసి ప్రజలను మంత్రముగ్ధులను చేశారు. ఆర్యవైశ్య నగరేశ్వర మందిర్ అధ్యక్షుడు సరతి శ్యాం దాస్, కేశవరెడ్డి తదితరులున్నారు.

పాల సేకరణ ధర తగ్గింపు వద్దు



ధర్నా చేస్తున్న రైతు సంఘం కార్యకర్తలు

తుమకూరు: పాల ధరను తగ్గించిన తుముల్ చర్యలను ఖండిస్తు మల్లసంద్రలోని తుముల్ ఆఫీసు ముందు రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు కోడిహళ్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాడి రైతులు మంగళవారం ధర్నా నిర్వహించారు. జిల్లాలో ఉన్న 10 తాలూకాలలో ప్రభుత్వం కరువు ఉన్నట్లు ప్రకటించింది. ఈ తరుణంలో పాల సేకరణ ధరను పెంచడానికి బదులు తగ్గించడం వల్ల రైతులు ఎంతో నష్టపోతారన్నారు. వెంటనే తగ్గించిన పాల ధరను పెంచాలని కోరారు. అనంతరం ఎండీని కలిసి వినతిపత్రమిచ్చారు.

గందరగోళంతో మేయర్ ఎన్నిక వాయిదా

- రెండు వర్గాలుగా చీలిపోయిన కాంగ్రెస్ కార్పొరేటర్లు
- అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ప్రకటించిన అధికారులు



ఎన్నిక వాయిదా వేయడంతో కార్పొరేషన్‌లో ధర్నాకు దిగిన కార్పొరేటర్లు



రాయల్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు

సాక్షి,బళ్లారి: బళ్లారి నగర మేయర్ ఎన్నిక గందరగోళం మధ్య వాయిదా పడింది. మంగళవారం మేయర్ ఎన్నికను నిర్వహించేందుకు సంబంధిత ఎన్నికల అధికారి అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో మేయర్ పదవిని దక్కించుకునేందుకు ఎస్సీ వర్గానికి చెందిన నలుగురు కార్పొరేటర్లు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు 21 మందితో పాటు స్వతంత్రంగా గెలుపొందిన ఐదుగురు కార్పొరేటర్లు ముందు నుంచి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నందున ఆ పార్టీకి బలం 26 మందికి చేరింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని మేయర్‌గా ఎన్నుకునేందుకు సులభంగా అవకాశం ఉన్నా మేయర్ ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మేయర్ ఎన్నిక ఉత్కంఠంగా మారింది. దీంతో చివరికి ఎన్నిక వాయిదా వేసేందుకు దారితీసింది. జిల్లా మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే, నేతలు మేయర్ ఎంపికను ఏకగ్రీవంగా జరిపేందుకు ప్రయత్నించకపోవడంతో నగరంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. మేయర్ పదవి కోసం మించు శ్రీనివాస్, కుబేర, శ్వేతలతో పాటు బీజేపీకి చెందిన గుడిగంటి హనుమంతు నామినేషన్ వేశారు.

అధికార పార్టీ నేతల్లో కొరవడిన సఖ్యత

కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ల మధ్య సఖ్యత లేకపోవడంతో పాటు మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్ మేయర్ ఎన్నిక జరిగే ప్రాంతానికి పలు కారణాలతో రాకపోవడంతో నామినేషన్ వేసిన వారంతా బరిలో నిలవడంతో మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారింది. స్వతంత్రంగా గెలుపొందిన మించు శ్రీనివాస్‌కు బీజేపీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు మద్దతు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. వీరితో పాటు స్వతంత్రంగా గెలుపొందిన ఐదు మంది కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు మాజీ మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, పద్మరోజా, ఉమాదేవి తదితర ఆరుగురు కార్పొరేటర్లు మించు శ్రీనివాస్‌ను మేయర్‌ను చేసేందుకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయ సభాంగణం గందరగోళం నెలకొంది. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో తెర వెనుక నుంచి అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికను అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు ఏడీసీ తెలపడంతో కార్పొరేటర్లు భగ్గుమన్నారు.

భగ్గుమన్న కార్పొరేటర్లు

ఎన్నికను ఎందుకు వాయిదా వేస్తున్నారో తెలపాలని బీజేపీ కార్పొరేటర్లు ఇబ్రహీంబాబు, మోత్కూరు శ్రీనివాసరెడ్డి, గోవిందరాజులు, హనుమంతప్ప తదితరులు వాగ్వాదానికి దిగారు. మేయర్ ఎన్నిక నిర్వహిస్తామని తేదీ ఖరారు చేసి, నామినేషన్లు తీసుకుని, తగినంత కోరం ఉన్నా వాయిదా వేయడం వెనుక రాజకీయ దురుద్దేశం దాగి ఉందన్నారు. అధికారులు రాజకీయాలు చేయకూడదని, చట్ట ప్రకారం నడుచుకోవాలని, ఒకవేళ వాయిదా వేయాలనుకుంటే ముందుగా వేసి ఉండవచ్చని, రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఇలాంటి సంఘటన ఎక్కడా జరిగి ఉండదని మండిపడ్డారు. బీజేపీ హయాంలో 2008లో రిపబ్లిక్ ఆఫ్ బళ్లారి అని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారని, మరి ఇప్పుడు జరుగుతున్నదాన్ని ఏమనాలని ప్రశ్నించారు. అప్పుడు కాదు ఇప్పుడే రిపబ్లిక్ ఆఫ్ బళ్లారి పాలన జరుగుతోందని, ఇంత కన్నా ఇంకేమి కావాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు మేయర్ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. అయితే బీజేపీ కార్పొరేటర్లతో పాటు మేయర్ పదవికి నామినేషన్ వేసిన మించు శ్రీనివాస్, పలువురు స్వతంత్ర, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు దాదాపు 25 మంది కార్పొరేషన్ సభాంగణంలోనే కూర్చొని ధర్నా చేపట్టారు.

సభాంగణంలోనే ఆందోళన

ఈ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు వస్తుందని భావించిన పలువురు బయటి నుంచి ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లను బయటకు రప్పించేలా ప్రయత్నం చేశారు. అయితే తాము ఎట్టి పరిస్థితుల్లోను బయటకు రాబోమని, ఎన్నిక జరిపి తీరాలని భీష్మించు కూర్చొన్నారు. కాగా మేయర్ ఎన్నిక విషయంలో శ్వేత లేదా కుబేరాను మేయర్‌గా చేయాలని, నగర ఎమ్మెల్యే మించు శ్రీనివాస్‌ను మేయర్‌ను చేయాలని భావించినట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోడంతో మేయర్ ఎన్నిక రసకందాయంలో పడింది. పైగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు బహిరంగంగానే రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తేలింది. జిల్లా మంత్రి సూచించిన వ్యక్తిని మేయర్‌ను చేయడానికి కాంగ్రెస్ కార్పొరేటర్లు మద్దతు ఇవ్వకపోవడంతో బీజేపీ మద్దతుతో మించు శ్రీనివాస్ మేయర్ కావాలని ప్రయత్నించినా తాత్కాలికంగా వాయిదా పడటంతో మేయర్ పదవిపై ఉత్కంఠత నెలకొంది. దీంతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాయల్ సర్కిల్‌లో బీజేపీ కార్పొరేటర్ల ధర్నా

నగర మేయర్ ఎన్నిక వాయిదా వేయడంపై బీజేపీ ఆందోళనకు దిగింది. మంగళవారం నగర మేయర్ ఎన్నిక జరగాల్సి ఉండగా ఎన్నికల అధికారి రాకపోవడంతో అనివార్య కారణాలతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అదనపు జిల్లాధికారి ప్రకటించిన అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో కాసేపు కూర్చొన్న అనంతరం రాయల్ సర్కిల్ వద్ద బీజేపీ నాయకులు బైఠాయించి ఆందోళనను ఉధృతం చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురహర గౌడ, ఉపాధ్యక్షుడు వీరశేఖరరెడ్డిలతో పాటు కార్పొరేటర్లు ఇబ్రహీంబాబు, హనుమంతప్ప తదితరులు రాయల్ సర్కిల్ వద్ద కూర్చొని కాంగ్రెస్ సర్కారు తీరును ఎండగట్టారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వ్యక్తి రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించారన్నారు. నామినేషన్లు వేసిన తర్వాత ఎన్నిక జరపాల్సి ఉండగా, పాలకుల ఒత్తిళ్లకు తలొగ్గి వాయిదా వేశారని మండిపడ్డారు. దళిత వ్యక్తిని మేయర్ కాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ కుట్రలు చేసి అడ్డుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తినే మేయర్‌గా చేసేందుకు అవకాశం ఉన్నా ఎందుకు వాయిదా వేశారని ప్రశ్నించారు. కాగా ఆందోళన విరమింపజేసేందుకు డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి నేతృత్వంలో పలువురు సీఐలు, ఎస్‌ఐలు తీవ్రంగా ప్రయత్నించినా రాత్రి వరకు ఆందోళన చేశారు. కార్పొరేటర్లు మోత్కూరు శ్రీనివాసరెడ్డి, సురేఖ మల్లనగౌడ, నాగరత్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం



సత్యనారాయణ వ్రతం నిర్వహించిన దృశ్యం

కోలారు: తాలూకాలోని వానరాశి గ్రామంలో మంగళవారం ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. విద్వాన్ సుబ్బయ్య, నాగేంద్ర శాస్త్రి సత్యనారాయణ వ్రతం పూజలను జరిపారు. వేమగల్ వలయ అధికారి అనిల్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న సంప్రదాయాలు, పూజలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. పూజలతో సమాజంలో సౌహార్ద వాతావరణం నెలకొంటుందన్నారు. ధర్మస్థల సంస్థ ఆధ్వర్యంలో ఆలయాల పునరుద్ధరణ, చెరువుల అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం, రక్షిత తాగునీటి యూనిట్ల ఏర్పాటు వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య



కోలారు: స్వసహాయ సంఘాల్లో చేసిన రుణాలు తీర్చలేక ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని అన్సారి మొహల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. డ్రైవర్‌గా పని చేస్తున్న సయ్యద్ పీర్(32) అనే వ్యక్తి భార్య గతంలో చీటీలు నడిపిస్తుండేది. చీటీలు పాడుకున్న వారికి సరిగా డబ్బులు చెల్లించకపోవడం వల్ల సుమారు రూ.6 లక్షల వరకు అప్పులు చేశారు. తన భార్య ఆరిఫ్ సిద్దికి నడిపిస్తున్న స్వసహాయ సంఘాల నుంచి రుణం తీసుకుని ప్రతి వారం డబ్బులు కట్టడానికి సాధ్యం కాకపోవడంతో సంసారంలో కలతలు, కొట్లాటలు ప్రారంభమయ్యాయి. దీంతో విరక్తి చెందిన సయ్యద్ పీర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే నగర పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జాలప్ప ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

హంపీ ఎక్స్‌ప్రెస్ రూట్ మార్పు

రాయదుర్గంటౌన్: హుబ్లీ నుంచి బళ్లారి, గుంతకల్లు మీదుగా మైసూరుకు రాకపోకలు సాగించే హంపీ ఎక్స్‌ప్రెస్ రైలు (నంబరు 16591/ 16592)ను ఆ మార్గం నుంచి కాకుండా రెండు నెలల పాటు రాయదుర్గం మీదుగా నడపనున్నట్లు నైరుతీ రైల్వే అధికారులు తెలిపారు. ప్రశాంతి నిలయం (పుట్టపర్తి), బసన్న పల్లె స్టేషన్ల నడుమ రైలుమార్గం మరమ్మతు పనుల కారణంగా రెండు నెలల పాటు అంటే నవంబర్ 30వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 31వ తేదీ వరకు హంపీ ఎక్స్‌ప్రెస్ రైలును బళ్లారి కంటోన్మెంట్, రాయదుర్గం, చిక్‌జాజూరు, అరసికెరె, యశ్వంత్‌పూర్ మీదుగా నడుస్తాయని చెప్పారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని అధికారులు కోరారు. ఇదిలావుండగా మార్పు చేసిన స్టేషన్ల మధ్య రైలు హాల్ట్ ఉంటుందా లేదా అనే విషయంలో రైల్వే అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

గురుపాదుకలకు పూర్ణకుంభ స్వాగతం



శృంగేరి స్వాముల విగ్రహంతో మఠం పదాధికారులు

కోలారు: జగద్గురు శ్రీభారతీ తీర్థ పాదుల వారి పాదుకలకు మంగళవారం నగరంలోని శృంగేరి శంకరమఠంలో పూర్ణకుంభ స్వాగతం, ప్రాకారోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మాధికారి జెఎన్ రామకృష్ణ మాట్లాడుతూ శృంగేరి గురువుల పాదుకలను కోలారు మఠానికి అనుగ్రహించడం వల్ల భక్తుల నిరంతర సేవకు మఠంలో అవకాశం ఉంటుందన్నారు. శంకరాచార్య భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సేవా సమితి కార్యాధ్యక్షుడు విష్ణు, పదాధికారి మురళి సుందర్, ఆడిటర్ ఎస్‌కే ఉమేష్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుల మఠంలో దీప శోభ



గురురాఘవేంద్రుడికి దీపారాధన చేస్తున్న దృశ్యం



రాఘవేంద్రస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



దీపోత్సవం ప్రారంభిస్తున్న అర్చకుల బృందం

బనశంకరి: లోక కళ్యాణార్థం జయనగర శ్రీ గురురాఘవేంద్రమఠంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. జయనగర ఐదో బ్లాక్ శ్రీ గురు రాఘవేంద్రమఠంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి సుబుదేంద్ర తీర్థస్వామి ఆదేశాల మేరకు మఠం స్వాములు ఆర్‌కే.వాదీంద్రాచార్య, జీకే.ఆచార్య, నందకిశోర్ నేతృత్వంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. భక్తులు విశేషంగా దీపాలను వెలిగించి స్వామిని పూజించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భారీగా చౌక బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యం లోడు లారీలు

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లా షాపూర్‌లో మంగళవారం నల్ల బజారుకు అక్రమంగా తరలిస్తున్న చౌక బియ్యాన్ని అధికారులు భారీ ఎత్తున పట్టుకున్నారు. రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి శరణ బసప్ప దర్శనాపూర్ ప్రాతినిథ్యం వహిస్తున్న షాపూర్‌లోని ఎఫ్‌సీఐ గోదాముల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో నిత్యావసర వస్తువుల దుకాణాలకు అన్న భాగ్య పథకం కింద పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని రెండు లారీల్లో నల్లబజారుకు తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు వాటి విలువ సుమారు రూ.2.50 కోట్లు ఉంటుందని తేల్చారు. ఈ విషయంపై జిల్లాధికారి సుశీల మాట్లాడుతూ షాపూర్ ఎఫ్‌సీఐ గోడౌన్లలో సీసీ కెమెరాలు అమర్చలేదన్నారు. బియ్యం అక్రమంగా నల్లబజారుకు తరలిస్తుండగా పట్టివేత అంశంపై సమగ్ర విచారణకు కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

వేడుకగా గౌరమ్మ పండుగ





పూలతో ప్రత్యేక అలంకరణలో గౌరీదేవి , గౌరీదేవికి చక్కెర హారతులతో మహిళల పూజలు

బళ్లారిఅర్బన్: నగరంలో మంగళవారం గౌరీదేవి వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పటేల్‌నగర్ లక్ష్మీవెంకటేశ్వర దేవస్థానంలో గౌరీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి చుట్టు పక్కల ప్రాంత వాసులు తమ ఇళ్ల నుంచి నోముదారాలు, చక్కెర హారతులతో విచ్చేసి నోములు నోచి ధార్మిక పూజలను చేశారు. ముఖ్యంగా బాలికలు కూడా చీరలను కట్టుకొని చక్కెర హారతులతో సంబరంగా గౌరీదేవికి నైవేద్యం సమర్పించి బాణాసంచాను వెలిగించారు. ఇక గ్రామాల్లో గౌరమ్మ పండుగను విశేషంగా జరుపుకున్నారు.



కళ్యాణ లక్ష్మీవెంకటరమణ స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం



దీపాలు వెలిగించిన మహిళలు, పిల్లలు, పెద్దలు

కనువిందుగా లక్ష దీపోత్సవం

మైసూరు: వారసత్వ నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులో ఉన్న శ్రీ కళ్యాణ లక్ష్మీ వెంకటరమణ స్వామి దేవాలయంలో కార్తీక మాసం రెండవ సోమవారం లక్ష దీపోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే టి.ఎస్.శ్రీవత్స దీపాలను వెలిగించి ప్రారంభించారు. వందల మంది మహిళలు, పిల్లలు పెద్దసంఖ్యలో తరలివచ్చి దీపాలను వెలిగించడంతో ఆలయం శోభాయమానంగా దర్శనమిచ్చింది. శ్రీ కళ్యాణ లక్ష్మీ వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తిని ఊరేగించారు.

కోలారు వార్తలు...

హెబ్బటలో చేతబడి అనుమానం?



సమాధి వద్ద తవ్విన ఆనవాళ్లు

శ్రీనివాసపురం: తాలూకాలోని హెబ్బట గ్రామంలో చేతబడి చేశారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. నెల రోజుల క్రితం గ్రామానికి చెందిన తల్లీబిడ్డ ఆత్మహత్య చేసుకున్నారు. వారి మృతదేహాలను గ్రామ సమీపంలోని శ్మశానంలో సమాధి చేశారు. అయితే కొద్ది రోజుల క్రితం బాలుడి శవాన్ని వెలికితీసి వెంట్రుకలు, వస్త్రం తీసుకు వెళ్లారనే ఆరోపణపై పోలీసులకు మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. మృతురాలు హమీదాను భర్త శోయబ్ వరకట్నం కోసం వేధించేవాడని, దీంతో తల్లీబిడ్డ ఆత్మహత్య చేసుకున్నారని ఫిర్యాదులో తెలిపారు. శోయబ్ సూచనతో అతని స్నేహితులు శ్రీరాం, నారాయణస్వామి బాలుడి సమాధిని తవ్వి శవాన్ని వెలికి తీశారని, ఈనెల 19న వీరు శ్మశానం వద్ద తిరుగుతున్నట్లు సీసీ కెమెరా ఫుటేజీలో నమోదైందని ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

ది రూలర్స్ సినిమా షూటింగ్

కోలారు: మార్జేనహళ్లి గ్రామ శ్మశానంలో ది రూలర్స్ సినిమా సన్నివేశాలను షూటింగ్ చేశారు. అంబేడ్కర్, బసవణ్ణ ఫోటోలకు పూజలు నిర్వహించిన అనంతరం చిత్రీకరణ ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకుడు మురళి మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు తొలగి పోవాలన్నారు. ప్రజలు ఆలయాల ముందు బారులు తీరడం కంటే విద్యాసంస్థలు, గ్రంథాలయాలకు వెళ్లాలన్నారు. నటుడు సందేష్ చిత్రం ద్వారా సమాజానికి చక్కటి సందేశం అందించనున్నారని, సమాజాన్ని జాగృతం చేస్తున్నారన్నారు. చిత్ర నిర్మాత అశ్వర్థ, నటుడు సందేష్, హీరో విశాల్ పాల్గొన్నారు.

ఆరోగ్య మేళా లబ్ధి పొందండి

కంప్లి: ప్రతి మంగళవారం ఆరోగ్య మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ వై.రమేష్ బాబు కోరారు. ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన ఆరోగ్యమేళాను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో అంత్యోదయ కార్డుదారులకు అందించే ఆయుష్మాన్‌భవ అభియాన్ ద్వారా అన్ని తాలూకాల్లో విజయవంతంగా ఆరోగ్య మేళాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఆలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



నష్టపోయిన ఆలు పంటను చూపుతున్న రైతులు

కోలారు: నకిలీ విత్తనాలతో పంట నష్టపోయిన బంగాళాదుంప(ఆలుగడ్డ) రైతులకు ప్రతి ఎకరాకు రూ.2 లక్షల పరిహారం అందించాలని రైతు సంఘం పదాధికారులు డిమాండ్ చేశారు. మంగళవారం పంట నష్టపోయిన రైతు పొలం వద్దకు వెళ్లిన రైతు సంఘం పదాధికారులు పంటనష్టం పరిశీలించారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ జిల్లాలో దుకాణాల్లో నకిలీ విత్తనాలు, మందుల విక్రయాలతో రైతులు తమ పంటలను నష్టపోతున్నారన్నారు. నకిలీ విత్తనాల వల్లే ఆలు రైతులు పెట్టిన పెట్టుబడి కూడా అందడం లేదన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రూ.3500 పెట్టి ఖరీదు చేసిన విత్తనాలు కూడా మొలకెత్తలేదని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈసందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, వక్కలేరి హనుమయ్య, మంగసంద్ర తిమ్మణ్ణ, అశ్వర్థప్ప, నరసింహయ్య పాల్గొన్నారు.

పర్యావరణ సంరక్షణే ధ్యేయం



మొక్కలను అందిస్తున్న దృశ్యం

మాలూరు: పరిసరాలను సంరక్షించడమే ధ్యేయంగా పెట్టుకుని గత నాలుగేళ్లుగా పాఠశాల, కళాశాల, ధార్మిక కేంద్రాల్లో ఉచితంగా మొక్కలను అందిస్తున్నట్లు సమాజసేవకుడు, పర్యావరణవేత్త వెంకటేష్‌మూర్తి తెలిపారు. మంగళవారం తాలూకాలోని కాడుమత్సంద్ర గ్రామం వద్ద ఉన్న బాలాంజనేయస్వామి ఆలయంలో వివిధ జాతులకు చెందిన 45 మొక్కలను ఆలయ సమితికి అందించి మాట్లాడారు. తాను రాజకీయ నాయకుడిని కాదని ఎల్‌ఐసీ ద్వారా వచ్చే డబ్బుతో మొక్కలను కొనుగోలు చేసి ఉచితంగా అందిస్తున్నానన్నారు. ఆరోగ్యవంతమైన పరిసరాలను భావి తరాలకు అందించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమం చేట్టానన్నారు. ఆధునికత పెరుగుతున్న కొద్దీ చెట్లను నరికే సంస్కృతి కూడా అధికమైందన్నారు. చెట్లను నరకడాన్ని మానుకోవాలన్నారు. ఈసందర్భంగా ఆలయ సమితి అధ్యక్షుడు దేవరాజరెడ్డి, ఉపాధ్యక్షుడు శివశంకరప్ప, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు పక్కాగా అమలు చేయాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లాధికారి

కోలారు: స్త్రీలు, పిల్లల రక్షణ కోసం తెచ్చిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. మంగళవారం జిల్లాధికారి కార్యాలయ భవనంలో నిర్వహించిన పిల్లల పోషణ, రక్షణపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒకరోజు సదస్సును ప్రారంభించి ఆయన మాట్లాడారు. బాల న్యాయ చట్టాలు, పోక్సో చట్టాలు చాలా కఠినంగా ఉన్నా కొన్ని సందర్భాల్లో మహిళలు, పిల్లలపై దౌర్జన్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. శిశు సంక్షేమ సమితి, బాల న్యాయ మండలి, పిల్లల పాలన సంస్థలన్నీ సక్రమంగా పని చేయాలన్నారు. న్యాయ సేవల ప్రాధికార సభ్యుడు, న్యాయమూర్తి సునీల్ ఎస్. హొసమని మాట్లాడుతూ కఠినమైన చట్టాలను తెచ్చినా వాటిని ఉల్లంఘిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. పిల్లలకు చట్టాల గురించి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ భాస్కర్, స్త్రీశిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికల హాస్టల్లో తనిఖీ



అన్నం పరిశీలిస్తున్న తహసీల్దార్

గౌరిబిదనూరు: నగరంలోని వెనుక బడిన వర్గాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని బాలికల ప్రభుత్వ హాస్టలును తహశిల్దారు మహేశ్ పత్రి తనిఖీ చేశారు. హాస్టలులో వండుతున్న ఆహారం నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వ నియమాల ప్రకారం బాలికలకు ఆహారం అందజేయాలని, సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని విద్యార్థినులకు సూచించారు. హాస్టల్లో విద్యుత్ సమస్యను ప్రస్తావించగా, రెండు రోజులలోగా పరిష్కరిస్తామన్నారు. హాస్టల్ వార్డన్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యసనాల జోలికి వెళ్లొద్దు

గౌరిబిదనూరు: వాల్మీకి నాయక వర్గంలోని యువత చెడు వ్యసనాలకు బానిసలు కారాదని, విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని వాల్మీకి నాయక సామాజిక వర్గం స్వామీజీ బ్రహ్మానంద పురి స్వామీజీ తెలిపారు. తొండేబావి గ్రామంలో వాల్మీకి భవనం ప్రారంభించి మాట్లాడారు. విద్యారంగంలో సౌలభ్యాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దురలవాట్ల జోలికి వెళ్ళరాదన్నారు. ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ మాట్లాడుతూ వాల్మీకి భవనం ఇప్పటికి సాకారమైందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రముఖులు ఆర్ అశోక్‌కుమార్, బాబణ్ణ, గంగప్ప, కాంతరాజు, నాగరాజప్ప పాల్గొన్నారు.

హైటెక్ పశువుల ఆస్పత్రి ప్రారంభం

దొడ్డబళ్లాపురం: సీనియర్ నటి లీలావతి నెలమంగల తాలూకా సోలదేనహళ్లి వద్ద నిర్మించిన హైటెక్ పశువుల ఆస్పత్రిని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం ఉద్ఘాటించారు. నటి లీలావతి ఇదే ప్రాంతంలో ఒక ఆస్పత్రిని కూడా నిర్మించారు. పశువుల ఆస్పత్రి కూడా నిర్మించాలనేది ఆమె కల. ఆమె కల ఇన్నాళ్లకు నెరవేరింది. అంతకంటే ముందు డీకే శివకుమార్ లీలావతి ఇంటికి వెళ్లి ఆమె ఆరోగ్యం గురించి కుమారుడు వినోద్‌రాజ్‌తో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నెలమంగల ఎమ్మెల్యే ఎన్ శ్రీనివాస్ ఉన్నారు.

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం



రాజ్యోత్సవ వేడుకల దృశ్యం

బొమ్మనహళ్లి: కన్నడనాడులో ఉన్న ప్రతి ఒక్కరు కూడా కన్నడ ప్రజలే అని, అలాంటి కన్నడనాడులో ఉన్న వారు కన్నడ భాషాభివృద్ధి కోసం, కన్నడనాడు కోసం పాటుపడాలని సమాజ సేవకుడు, జై కర్ణాటక సంఘం బొమ్మనహళ్లి విభాగం సీనియర్ నాయకుడు ఆర్. నాగేష్ అన్నారు. మంగళవారం నగరంలోని బొమ్మనహళ్లిలోని బీడీఏ కాంప్లెక్స్ ఆవరణంలో కన్నడ సమృద్ధి సంఘం క్యాబ్ డ్రైవర్లు, యజమానుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కన్నడ రాజ్యోత్సవం, పవర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్‌కు నివాళి కార్యక్రమంలో పాల్గొని కన్నడ పతాకాన్ని ఎగురవేశారు. అంతకు ముందు కన్నడ మాత భువనేశ్వరికి పూజలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లో ఉన్న సమర్థనం ట్రస్టు విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్‌ఆర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో కన్నడ సమృద్ధి సంఘం క్యాబ్ డ్రైవర్‌లు, యజమానులు పాల్గొన్నారు.

సిద్ధుకు కుమార స్వామి అభినందనలు

యశవంతపుర: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం నిర్వహించిన జనతా దర్శన్‌ను మాజీ సీఎం జన స్పందనగా అభివర్ణించారు. అయన మంగళవారం మడికేరి తాలూకా హకత్తూరులో విలేకర్లతో మాట్లాడారు. సీఎం అధికారులను పిలిపించుకుని ప్రజల సమస్యలు తెలుసుకోవటం అభినందనీయమన్నారు. మరో మూడు నెలలో మళ్లీ జనస్పందన నిర్వహిస్తామని చెప్పటం అంటే అధికారుల పనితీరు సిద్ధుకు అర్థమై ఉంటుందన్నారు. తాను సీఎంగా ఉన్న సమయంలో జనతా దర్శన్‌ను ఉదయం 9 గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు నిర్వహించేవాడినని గుర్తు చేశారు.

దొడ్డమ్మ దేవికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బొమ్మనహళ్లి: కార్తీకమాసం రెండో సోమవారం సందర్భంగా బొమ్మనహళ్లి పరిధి హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ ఇబ్బలూరు గ్రామంలో వెలసిన గ్రామ దేవత దొడ్డమ్మ దేవికి సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు ఆలయంలో దీపాలను వెలిగించారు.

ఘరానా నేపాలీ ముఠాకు సంకెళ్లు

- ఇటీవల పారిశ్రామికవేత్త ఇంట్లో 5 కేజీల బంగారం, సొత్తు అపహరణ
- 3 కేజీల పసిడి రికవరీ



నేపాలీ గ్యాంగ్ నుంచి స్వాధీనం చేసుకున్న చోరీసొత్తును పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ దయానంద్, రమణ్‌గుప్తా తదితరులు

బనశంకరి: నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ సహోదరుడు పారిశ్రామికవేత్త భ్రమరేశ్ ఇంట్లో భారీ చోరీ కేసును మహాలక్ష్మీలేఔట్ పోలీసులు ఛేదించి ముగ్గురు మహిళలతో పాటు 7మంది నేపాలీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ. 40వేల నగదు, రూ.1.53 కోట్ల విలువచేసే 3.01 కేజీల బంగారు ఆభరణాలు, 562 గ్రాముల వెండి వస్తువులు, 16 ఖరీదైన గడియారాలను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద్ తెలిపారు. మంగళవారం కేసు వివరాలను ఆయన వెల్లడించారు. నేపాల్‌కు చెందిన ఉపేంద్ర బహద్దూర్, రాణా బహద్దూర్, శాకేంద్ర బహద్దూర్ షాహి, కోమల్ షాహి, స్వస్తిక్ షాహి, పార్వతి షాహి, శాదిల్ షాహి అనేవారితో కూడిన ముఠాను అరెస్టు చేశారు భ్రమరేశ్ మహలక్ష్మీలేఔట్ 7వ మెయిన్ రోడ్డు నాగపుర ఇంటికి తాళం వేసుకుని కుటుంబసమేతంగా అక్టోబరు నెలలో యూరప్ పర్యటనకు వెళ్లారు. ఈ సమయంలో ఆ ఇంటి పక్కనే నిర్మాణంలో గల కట్టడంలో పనిచేసే నేపాలీ ముఠా దోపిడీకి పథకం వేసింది. ఇంటి కిటికీ ఊచలు విరిచి చొరబడి సుమారు 5 కిలోల బంగారు ఆభరణాలు నగదు దోచుకెళ్లారు. అక్టోబరు 30 తేదీన విదేశీపర్యటన ముగించుకుని ఇంటికి చేరుకున్న భ్రమరేశ్ ఇంట్లో చోరీని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తుచేపట్టి నేపాలీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి నగదు, బంగారు ఆభరణాలు, చేతిగడియారాలు స్వాధీనం చేసుకున్నారు.

రూ.40 కోట్లు దోచిన సైబర్ ముఠా అరెస్టు

ఆన్‌లైన్ ద్వారా పార్ట్‌టైమ్ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి వివిధ టాస్కుల పేరుతో డబ్బు పెట్టుబడిగా పెట్టించుకుని వంచనకు పాల్పడిన నలుగురు మోసగాళ్లను మంగళవారం ఈశాన్య విభాగ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, ల్యాప్‌టాప్ ఇతర వస్తువులను కమిషనర్ దయానంద్ పరిశీలించి మాట్లాడారు. నిందితులు ఇబ్రహీం, మహమ్మద్ కలీముల్లా, సయ్యద్ యూనస్, సయ్యద్ అబ్రాజ్ అనే నలుగురు పట్టుబడగా, వీరికి చెందిన 30 బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్ చేసి రూ.60 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 4 మొబైల్స్, బ్యాంకు పాస్‌బుక్స్, 6 డెబిట్ కార్డులు, సిమ్‌కార్డులు, ల్యాప్‌టాప్‌లు, కారు, రెండు బైకులు, బంగారు ఆభరణాలను సీజ్ చేశారు. ఈ ముఠా ప్రజల నుంచి రూ.40 కోట్లకు పైగా వసూళ్లు చేసినట్లు దర్యాప్తులో తెలిసింది. ఈ ముఠా మోసాలపై దేశవ్యాప్తంగా 315 కు పైగా కేసులు నమోదైనట్లు తెలిపారు.



పోలీసులకు పట్టుబడిన నేపాలీ గ్యాంగ్



సీజ్ చేసిన ల్యాప్‌టాప్‌లు, కారు, ద్విచక్రవాహనాలు

సీనియర్ సిటిజన్లకు సన్మానం



సీనియర్ సిటిజన్లను సన్మానించిన దృశ్యం

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ పట్టణంలోని స్టేట్ బ్యాంకు శాఖలో కన్నడ రాజ్యోత్సవాలను అధికారులు ఘనంగా నిర్వహించారు. వేడుకలను మేనేజర్ రేవతి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకులో ఖాతాదారులైన సీనియర్ సిటిజన్లను బ్యాంకు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కన్నడ సాహిత్య పరిషత్ అధ్యుడు ఆదూరి ప్రకాశ్, హేమంత్, అజయ్ బ్యాంకు సిబ్బందితో పాటు బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

పుల్వామా దాడి జరగకుంటే మోది గెలిచేవాడు కాదు

- ఎమ్మెల్యే బాలకృష్ణ

దొడ్డబళ్లాపురం: గత ఎన్నికల సమయంలో పుల్వామా దాడి జరగకుండా ఉండిఉంటే మోది మరోసారి గెలిచి ప్రధాని అయ్యేవాడు కాదని, జనం ఆయనను ఇంటికి పంపించేవారని మాగడి ఎమ్మెల్యే హెచ్‌సీ బాలకృష్ణ వివాదాస్పద వ్యాఖ్యలు చేసారు. మాగడి తాలూకా తూబినకెరె గ్రామంలో డా.బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో అమాయక సైనికులను బలి ఇచ్చిన ఘనత నరేంద్రమోదికి దక్కుతుందన్నారు. సైనికుల బలిదానంతోనే మోది మరోసారి ప్రధాని అయ్యాడన్నారు. ఆనాడు పుల్వామా దాడిపై విమర్శలు చేసిన కుమారస్వామి నేడు అదే బీజేపీతో జతకట్టడం విషాదనీయమన్నారు. అప్పట్లో సోనియాగాంధీ మల్లికార్జున ఖర్గెని ముఖ్యమంత్రిని చేద్దామనుకున్నారని, అయితే జేడీఎస్ నాయకులు పట్టుబట్టి ధరంసింగ్‌ను ముఖ్యమంత్రిని చేసారన్నారు. అప్పుడు తాను జేడీఎస్ ఎమ్మెల్యేగా ఉన్నానన్నారు. ఇప్పుడు అదే జేడీఎస్ నాయకులు మల్లికార్జున ఖర్గేకి అన్యాయం జరిగిందని గగ్గోలు పెడుతున్నారన్నారు. సిద్దరామయ్యకు జేడీఎస్ పార్టీలో అన్యాయం జరగకుండా ఉంటే ఈరోజు జేడీఎస్ పార్టీ బాగుండేదన్నారు.

ప్రిన్సిపాల్, వార్డెన్ సస్పెండ్

యశవంతపుర: దావణగెరె జిల్లా చన్నగిరి తాలూకా కాకనూరు గ్రామంలోని కిత్తూరు రాణి చెన్నమ్మ వసతి పాఠశాల ప్రిన్సిపాల్ మంజునాథ్ పుర, హాస్టల్ వార్డెన్ నసీనాబానును కలెక్టర్ ఎంవీ వెంకటేశ్ సస్పెండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత 25 మంది విద్యార్థులు వాంతులు, విరేచనాలకు గురయ్యారు. విద్యార్థులు భోజనం చేసిన వంటకంలో పురుగులు పడిన్నట్లు విద్యార్థుల నుంచి సమాచారం తెలుసుకున్న కలెక్టర్ ఇద్దరిని సస్పెండ్ చేశారు.

సామూహిక వరలక్ష్మీ పూజలు



వరమహాలక్ష్మీ పూజ

గౌరిబిదనూరు: స్వయం సేవా సంస్థలు తమ కర్తవ్యాలకు తోడుగా ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. మంగళవారం తాలూకా డి పాళ్య గ్రామం ఎస్‌ఆర్ కల్యాణ మంటపంలో ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సామూహిక వరమహాలక్ష్మి పూజ, మహిళా సంఘాల ఐక్య వేదిక అధికార బాధ్యతల స్వీకారోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ప్రాజెక్ట్ అధికారి నాగరాజనాయ్క సంస్థ నుండి లభించే సౌలభ్యాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర హనుమాన్, లలితా సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయుడు రామకృష్ణప్ప, ఆర్య వైశ్య మండలి అధ్యక్షుడు హరీశ్, శకుంతల, లక్ష్మి, బెట్టగౌడ, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గురునానక్ జయంతి సందర్భంగా మంగళవారం బీదర్‌లో సిక్కుల ఊరేగింపు

అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం.. ఒకరి మృతి



మంటలను ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

యశవంతపుర: మంగళూరు నగరంలోని అత్తావరలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఆకస్మికంగా అగ్నిప్రమాదం జరిగింది. ఘటనలో వాష్‌రూమ్‌లో ఉన్న మూసబ్ (57) అనే మహిళ మృతి చెందారు. వివరాలు...అత్తావర అపార్ట్‌మెంట్‌లో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. స్నానం చేయటానికి వాష్‌రూమ్‌కు వెళ్లిన మూసబ్ ఊపిరాడక మృతి చెందగా మరొకరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయటంతో పెద్ద ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు అధికారులు గుర్తించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్లాట్‌లో 9 మంది ఉండగా ఏడుగురు ప్రమాదం నుంచి బయట పడ్డారు. పాండేశ్వర పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

అడిగినన్ని కరువు నిధులు రాలేదు



కలెక్టర్, ఎంపీ సమావేశం

మైసూరు: జిల్లాలో నెలకొన్న కరువు నేపథ్యంలో రైతులకు, పరిహార చర్యలకు గాను రూ. 69 కోట్లను మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదికను పంపినట్లు, కానీ ప్రభుత్వం రూ. 20 కోట్లను మాత్రమే ఇచ్చిందని కలెక్టర్ రాజేంద్ర తెలిపారు. మంగళవారం మైసూరు జడ్పీ హాల్‌లో ఆయన కరువు పరిస్థితి గురించి చర్చించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కర్ణాటక కార్డులను ఇప్పటివరకు 25 లక్షలు రాగా, 7.6 లక్షల కార్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఎంపీ ప్రతాపసింహ, అధికారులు పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి భవాని, అరుణాకుమారి

చిక్కబళ్లాపురం: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల తక్షణ పరిష్కారం కోసం డిసెంబర్ 9న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా జడ్జి నేరళె వీరభద్రయ్య భవాని తెలిపారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... చెక్‌బౌన్స్ కేసులు, భూ సంబంధిత కేసులు, బ్యాంకు, కరెంట్ కేసులు తదితర వాటిని లోక్ అదాలత్ ద్వారా తక్షణ పరిష్కారం చేసుకోవచ్చని చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో మరో జడ్జి అరుణ కుమారి పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో మండ్య బాలుడు



ఇండియా రికార్డ్సులో స్థానం సాధించిన దేవానందన్

మండ్య: వేగంగా ఇంగ్లిష్ పదాలను ఉచ్చరించడం ద్వారా మండ్యకు చెందిన ఐదేళ్ల బాలుడు దేవానందన్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో తన పేరును నమోదు చేసుకున్నారు. 200 ఇంగ్లిష్ పదాలను కేవలం రెండు నిమిషాల 58 సెకండ్ల సమయంలో చదివి జాతీయ స్థాయిలో రికార్డును సృష్టించారు. మండ్య తాలూకా భూతన హోసూరు గ్రామానికి చెందిన సతీష్, దివ్య దంపతుల కుమారుడు దేవానందన్ గ్రామంలోని మండ్య క్లబ్ పాఠశాలలో యూకేజీ చదువుతున్నాడు. కన్నడ దిన పత్రికను కూడా వేగంగా చదవడంలో బాలుడు దిట్ట. పుస్తకంలో ఉన్న కన్నడ పదాలతో పాటు వాటిలో ఉన్న తప్పులను చూడా చూపించడం ఇతని ప్రత్యేకత. బాలుడి ప్రతిభను గుర్తించి అతని చిన్నాన్న సంతోష్‌గౌడ మరింత ప్రోత్సాహం అందించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హోం మంత్రి

తుమకూరు: విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని హోం మంత్రి పరమేశ్వర్ అన్నారు. మంగళవారం తుమకూరు నగరంలోని గెద్దలహళ్ళి సమీపంలోని బాలికల వసతి నిలయం ఆవరణంలో జరిగిన ఓ కార్యక్రమంలో హోం మంత్రి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ లక్ష్య సాధనతో చదువుకోవాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. వసతి నిలయాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

నిమోనియా కట్టడికి చర్యలు

మైసూరు: నిమోనియా జబ్బు వ్యాపించకుండా చర్యలు చేపట్టినట్లు డిహెచ్‌ఓ కుమారస్వామి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మైసూరు నగరంతో పాటు జిల్లాలో శ్వాసకోశ రోగాలతో బాధపడేవారికి మంచి వైద్యసేవలు అందిస్తామన్నారు. ఇందుకోసం ఆక్సిజన్ ప్లాంట్‌లు, డ్రై రన్ నిర్వహించామని, తాలూకా ఆస్పత్రులలో 5 నుంచి 7 బెడ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఊపిరి ఆడకపోయినా, జ్వరం, ఇతర అసౌకర్యం ఉన్నా ఆస్పత్రికి వచ్చి చూపించుకోవాలన్నారు.

భజరంగ్ దళ్ కార్యకర్తల అరెస్ట్



అరెస్టయిన భజరంగదళ్ కార్యకర్తలు

యశవంతపుర: అన్యమతానికి చెందిన యువతి, యువకుడు తిరుగుతుండగా ఇద్దరు భజరంగదళ కార్యకర్తలు వారిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన మంగళూరులో జరిగింది. మంకి స్టెండ్‌కు చెందిన యువకుడు చిక్కమగళూరుకు చెందిన యువతితో ఒక మాల్‌కు వెళ్లారు. స్కూటర్‌పై జోడీ తిరుగుతున్న విషయాన్ని భజరంగదళ్ కార్యకర్తలు గుర్తించి వీరిని బైకుపై వెంబడించారు. మంకిస్టెండ్ వద్ద బైకును అడ్డగించి దౌర్జన్యం చేశారు. విషయం తెలుసుకున్న రెండు మతాలకు చెందిన జనం గుమికూడటంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు రెండు గ్రూపులపై లాఠీచార్జ్ చేసి చెదరగొట్టారు. భజరంగదళ్‌కు కార్యకర్తలు అక్షయ్ రావ్, శిబిన్ పడికల్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు.

హోసూరు వార్తలు..

ప్రత్యంగిరా ఆలయంలో యాగం



మిరపకాయలతో యాగం నిర్వహిస్తున్న దృశ్యం

హోసూరు: హోసూరు సమీపంలోని మోర్నపల్లి గ్రామంలో అధర్వణ ప్రత్యంగిరాదేవి ఆలయంలో సోమవారం రాత్రి మిరపకాయల యాగాన్ని నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, రాహుకేతువులకు ప్రత్యేక అభిషేకం, కాలభైరవస్వామికి అభిషేకం అలంకారంతో పాటు వివిధపూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఆలయంలో మిరపకాయల యాగం చేపట్టారు. పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు.

విద్యార్థి ఆత్మహత్య

హోసూరు: కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాయకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. రాయకోట సమీపంలోని పిల్లారి అగ్రహారం గ్రామానికి చెందిన మారియప్ప కొడుకు ఏళుమలై (21) హోసూరులోని ప్రైవేట్ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు వెంటనే రాయకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సానంతరం క్రిష్ణగిరిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఫలితం లేక మృతి చెందాడు. రాయకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

బావిని శుద్ధీకరించండి



చెత్తతో నిండిపోయిన బావి

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరి పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న తాగునీటి బావిని శుద్ధీకరించి ప్రజల వినియోగానికి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సూళగిరి దిగువ వీధిలో ఏర్పాటు చేసిన ఈ బావి నుంచి పట్టణ వాసులు తాగు నీటి కోసం వినియోగించేవారని, కొద్ది సంవత్సరాలుగా బావిని పరామర్శించకపోవడంతో చుట్టుపక్కల ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తా చెదారాన్ని తీసుకెళ్లి బావిలో పడేయడంతో పారిశుభ్రత లోపించిందని, సూళగిరి పట్టణానికి తాగునీటి ఆధారంగా ఉన్న ఈ బావిని సంబంధిత శాఖాధికారులు శుద్ధీకరించి ప్రజల వినియోగానికి తీసుకురావాలని కోరుతున్నారు.

రహదార్లపై వీలింగ్.. ముగ్గురి అరెస్ట్



వీలింగ్ చేస్తూ పట్టు బడిన యువకులు

హోసూరు: జాతీయ రహదారిపై ప్రమాదకరంగా వీలింగ్ చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. హోసూరు డీఎస్పీ ప్రశాంత్ బాబు నేతృత్వంలో పోలీసులు హోసూరు–బెంగళూరు, హోసూరు–క్రిష్ణగిరి జాతీయ రహదార్లపై గస్తీ తిరుగుతుండగా ద్విచక్ర వాహనాల్లో వీలింగ్ చేస్తున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో హోసూరు పార్వతీనగర్‌కు చెందిన మహమ్మద్ అఫేరార్ (22) అప్సుఖాన్ (23), మహమ్మద్‌ఆలీ (19)లను అరెస్ట్ చేసి వారి డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేశారు. మరో ముగ్గురు చిన్నారులు కావడంతో వారికి తలా రూ. 25 వేలు జరిమానా విధించి 25 ఏళ్ల వరకు లైసెన్స్‌లు పొందేందుకు అర్హత లేకుండా చేశారు. రోడ్లపై వీలింగ్ చేస్తే ప్రజలు వెంటనే 638329123 నంబర్‌కు వాట్సాప్ చేయాలని, సమాచారం అందజేసే వారి వివరాలను రహస్యంగా ఉంచుతామని డీఎస్పీ బాబు ప్రశాంత్ తెలిపారు.

నిందితుడు ఆత్మహత్య

కెలమంగలం: హత్య కేసులో నిందితుడు జామీనుపై బయటకొచ్చి ఆత్మహత్య చేసుకొన్న ఘటన క్రిష్ణగిరి డ్యాం పరిధిలో జరిగింది. వివరాల మేరకు క్రిష్ణగిరి సమీపంలోని తిమ్మరాయనహళ్లి గ్రామానికి చెందిన గోవిందన్ (65) అనే వృద్ధుడు 2022లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి వేలూరు జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజుల క్రితం జామీనుపై బయటకొచ్చిన అతను అనారోగ్యంతో బాధపడుతూ విరక్తి చెంది ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. క్రిష్ణగిరి డ్యాం పోలీసులు కేసు నమోదు చేశారు.

కరుణానిధి పెన్ను రాక



హోసూరుకు చేరుకొన్న కలం

హోసూరు: మాజీ ముఖ్యమంత్రి, దివంగత కరుణానిధి శతజయంతోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం పెన్ను ప్రదర్శన నిర్వహిస్తోంది. ఈ మేరకు మంగళవారం భారీ పెన్ను బొమ్మతో కూడిన వాహనం హోసూరుకు చేరుకుంది. ఎమ్మెల్యే వై.ప్రకాష్, మేయర్ ఎస్.ఏ.సత్య, కమిషనర్ స్నేహ, పారిశుద్ధశాఖాధికారి ప్రభాకర్, ఉపమేయర్ ఆనందయ్య, ఎస్.ఎస్. మాదేశ్వరన్ తదితరులు ఘనస్వాగతం పలికారు. ప్రజలు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కరుణానిధి పేరుపొందిన రచయిత కావడంతో అందుకు గుర్తుగా పెన్ను ప్రదర్శన చేపట్టారు.

ఘనంగా కార్తీక పూజలు

పావగడ: వైఎన్ హొసకోటలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస పూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. బిల్వార్చన, పంచామృతాభిషేకం, పూల అలంకారం తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా ఇత్యాది

హోసూరు: కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలను ఆకర్షించే విధంగా చిత్రీకరించిన కన్నడ చిత్రం ఇత్యాది సినిమా త్వరలో విడుదల కానుందని, ఈ చిత్రాన్ని ప్రజలు ప్రోత్సహించాలని డైరెక్టర్ యోగిరాజ్ హోసూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కోరారు. కొత్త వ్యక్తులతో స్థానిక ప్రజలను ఆకట్టుకొనేలా చిత్రాలను నిర్మించడమే ధ్యేయమన్నారు. కర్ణాటక రాష్ట్రం శృంగేరి ప్రాంతంలో షూటింగ్ ప్రారంభించి ఈ క్రైం థ్రిల్లర్ మూవీని చిత్రీకరించామని తెలిపారు. నటీనటులు సచిన్, సౌమ్య, సినీ బృందం పాల్గొన్నారు.

భారీ శబ్దాలతో రక్తనాళాలు స్తంభిస్తాయి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: భారీ శబ్దాల వల్ల మనుషుల్లో రక్తనాళాలు స్తంభిస్తాయని ప్రముఖ శాస్త్రవేత్త, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఏరోస్పేస్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ జగదీశ్ గోపాలన్ తెలిపారు. బెంగళూరు నగరంలోని బసవనగుడిలో ఉన్న నేషనల్ కళాశాలలోని డాక్టర్ హెచ్‌ఎన్ ఆడిటోరియంలో బెంగళూరు ఫోరం ఆధ్వర్యంలో సైన్స్‌పై నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాణాసంచా, బాంబులు, సిలిండర్ వంటి పేలుళ్ల శబ్దాలు మానవులకు ప్రమాదకరని, శబ్దాలకు రక్తనాళాలల్లో రక్తం సరఫరా నిలిచిపోయి ప్రమాదకర పరిస్థితుల్లో పడిపోతారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రక్తనాళాలు సక్రమంగా పనిచేసేలా ప్రయోగాలు జరుగుతున్నాయన్నారు.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


విజయవాడలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా


తిరుపతి జిల్లా పెద్ద ఈటిపాకంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కే ఆదిమూలం


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బత్తలపల్లిలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి


కాకినాడ జిల్లా వాకాడలో సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు


శ్రీకాకుళం జిల్లా బారువ-2 సచివాలయ పరిధిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్


అనంతపురంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీ


పశ్చిమగోదావరి జిల్లా దొడ్డనపూడిలో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు


పల్నాడు జిల్లా పెదకంచర్లలో పథకాల బోర్డును ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు


విశాఖ, చినవాల్తేరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు

‘బాకా’ బృందం.. ‘కాకా’ కథనం

సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ముసుగులో ఈనాడు వక్రీకరణ కథనం

- ఓటర్ల జాబితా సవరణ సచివాలయ సిబ్బంది చేయడం తప్పట
- సచివాలయ సిబ్బంది ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులే
- వారు కాక రామోజీ, సీఎఫ్‌డీ పెద్దలు చేస్తారా?
- రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల్లోనే పని చేస్తున్నారు
- సీఈవో నిబంధనల మేరకే ఓటర్ల జాబితా సవరణ బాధ్యతలు అప్పగించారు
- గతంలో బీఎల్‌వోలుగా శాశ్వత ఉద్యోగుల్లేరు
- అంగన్ వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంలు చేశారు
- టీచర్లకు ఓటర్ల సవరణ అప్పగించాలనడం వారి అజ్ఞానమే
- టీచర్లకు బోధనేతర బాధ్యతలు ఇవ్వొద్దన్న సుప్రీం కోర్టు తీర్పు విషయం తెలియదా?
- కేంద్ర పథకాలను వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో కేంద్రం ప్రజలకు వివరిస్తోంది
- ఈ కార్యక్రమంలో కలెక్టర్ల నుంచి సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొంటున్నారు
- అదే తరహాలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది
- ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రభుత్వ ఉద్యోగులు వివరిస్తున్నారు
- తప్పుపట్టడానికి ఏముంది?.. ఇదీ ప్రభుత్వ కార్యక్రమమే
- ప్రధానిగా మోదీ ఉన్నందున ఆయన సందేశం ప్రచారం
- ఇక్కడ సీఎంగా జగన్ ఉన్నందున ఆయన పేరుతో కార్యక్రమం
- కేంద్ర కార్యక్రమాన్ని తప్పు పట్టని వారికి రాష్ట్ర ప్రభుత కార్యక్రమం తప్పట!


ఓటర్ల జాబితా బాధ్యతలు సచివాలయ సిబ్బందికా?
- ‘జగనే ఎందుకు కావాలంటే’లో అధికారులు ఎలా పాల్గొంటారు?
- గవర్నర్, ఈసీకి ‘సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ’ ఫిర్యాదు

ఈనాడు – అమరావతి

సాక్షి, అమరావతి: అదొక తెలుగుదేశం పార్టీ బాకా బృందం. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ (సీఎఫ్‌డీ) ముసుగులో ఉన్న ఈ బృందంలో అందరూ చంద్రబాబు మనుషులే. పెత్తందార్ల పెద్ద ఈనాడు రామోజీరావే ఈ బాకా బృందానికీ కాకా. ఇంకేముంది? చంద్రబాబు, రామోజీ నుంచి ఆదేశాలు రాగానే గుడ్డలు చించుకోవడం మొదలెట్టారు. రాష్ట్రంలో ఓటర్ల సవరణ, వై నీడ్స్ జగన్ కార్యక్రమాలపై గొంతులు చించుకుంటున్నారు. వీటిపై ఎన్నికల సంఘానికీ వినతిపత్రాలు ఇస్తున్నారు. వీరి పేరుతో పెత్తందార్ల పెద్ద రామోజీరావు వక్రీకరణలతో ఓ అక్కసు కథ అచ్చేశారు. ఇందులో వారి లక్ష్యం స్వయంకృషితో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి, సచివాలయాల్లో పనిచేస్తున్న బడుగు, బలహీనవర్గాలేనన్నది సుస్పష్టం. ఓటర్ల జాబితా బాధ్యతలు సచివాలయ సిబ్బందికా అంటూ సీఎఫ్‌డీలోని బాబు బృందంతో పాటు ఈనాడులో రామోజీ గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులైన సచివాలయ సిబ్బందికి కాక ఇంకెవరికి అప్పగించాలి? సీఎఫ్‌డీలోని బాబు బృందానికి, రామోజీకి అప్పగించాలా? ఇందుకు కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిస్తుందా? ప్రభుత్వ ఉద్యోగులైన రెవెన్యూ కార్యదర్శి, పంచాయతీ కార్యదర్శులు బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు)గా ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్నారు. ఈ ఉద్యోగులు పనిచేస్తున్నదీ సచివాలయాల్లోనే. వారు కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకే ఓటర్ల జాబితా సవరణ చేపడుతున్నారు. గతంలో బీఎల్‌వోలుగా అంగన్‌వాడీ వర్కర్లు, గ్రామ స్థానిక వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఉండేవారు. ఇప్పుడు ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులు ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆ మాత్రం కనీస జ్ఞానం కూడా లేకుండా సీఎఫ్‌డీలోని పెద్దలు గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టడం పెద్ద నేరం, ఘోరం అయినట్లు కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయడం, దాన్ని భూతద్దంలో చూపెడుతూ ఈనాడు రామోజీ కథనం రాయడం ఓ విడ్డూరం. ప్రభుత్వ ఉద్యోగులైన సచివాలయ సిబ్బందిని కించపరచడమేనని అధికార వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి.

సీఎఫ్‌డీ సొంత భాష్యం

ఓటర్ల జాబితా సవరణ బాధ్యతల్లో సచివాలయ సిబ్బందిని కొనసాగించడం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వైఫల్యం అంటూ సీఎఫ్‌డీ సొంత భాష్యం చెప్పింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను టీచర్లకు అప్పగించాలంటూ సీఎఫ్‌డీ పెద్దలు వారి అజ్ఞానాన్ని, వైఫల్యాన్ని బహిర్గతం చేసుకున్నారు. ఉపాధ్యాయులను బోధనకు తప్ప ఇతర పనులకు వినియోగించరాదని సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చిందనే విషయం సీఎఫ్‌డీ పెద్దలకు తెలియదా? లేక తెలిసే టీచర్లకు అప్పగించాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారా?

ప్రభుత్వ వ్యవస్థకు రాజకీయ రంగా?

ప్రభుత్వ వ్యవస్థ అయిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు రాజకీయ రంగు పులిమేందుకు సీఎఫ్‌డీ పెద్దలు, రామోజీ ఇలాంటి వక్రీకరణలకు పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసినంతమాత్రాన సచివాలయాల వ్యవస్థను పార్టీకి అంటగడతారా? గతంలో ఎన్టీఆర్ మండల వ్యవస్థను ఏర్పాటు చేస్తే దాన్నీ ఆ పార్టీకి అంటగడతారా? ఈ వ్యవస్థలను పరిపాలన సౌలభ్యం కోసం, ప్రజలకు సేవలను చేరువ చేయడానికి ఏర్పాటు చేసినవిగా చూడాలి తప్ప మరోలా కాదని అధికారవర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

వారు ప్రభుత్వ ఉద్యోగులే

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను చట్టబద్ధంగా ఏర్పాటు చేశారు. ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షల ద్వారా ఎంపికయ్యారు. వీరికి ఇతర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే సర్వీసు రూల్స్ వర్తిస్తాయి. వీరంతా శాశ్వత ఉద్యోగులే. ప్రభుత్వ వేతనాలు పొందుతున్నారు. అలాంటి ఉద్యోగుల పట్ల బాబు సీఎఫ్‌డీ బృందానికి, రామోజీకి కడుపు మంట ఎందుకో! నిబంధనల మేరకు విధులు నిర్వర్తిస్తుంటే ఆ ఉద్యోగులు పనికి రారంటూ సీఎఫ్‌డీతో పాటు రామోజీ నిందించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. సచివాలయాల ఉద్యోగులందరూ ఉన్నత విద్యావంతులే. అలాంటి ఉద్యోగులను తక్కువ చేసి చూడటం తగదని అధికారవర్గాలు అంటున్నాయి. ఓటర్ల జాబితాలో పొరపాట్లు 2019 ఎన్నికల సమయంలోనే ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా సచివాలయ సిబ్బంది చేసినవి కాదు. గతంలోనే సీఈవో ఓటర్ల జాబితాలో పొరపాట్లను క్షేత్రస్థాయి తనిఖీల ద్వారా సరిచేశామని ప్రకటించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర తరహాలోనే ‘వై ఏపీ నీడ్స్ జగన్’

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రజలకు వివరించడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తోంది. ఈ యాత్రలో కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామ, వార్డు సచివాలయాలు, పంచాయతీల వారీగా వివరించడంతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాలను మొబైల్ వ్యాన్ల ద్వారా స్క్రీన్లపై ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల్లో అధికార యంత్రాంగమే పాల్గొంటోంది. ఈ కార్యక్రమం కోసం రాష్ట్ర స్థాయిలో సీఎస్, జిల్లా స్థాయిలో కలెక్టర్ల అధ్యక్షతన ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ల నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొంటున్నారు. ఇప్పుడు ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ఉన్నందున ఆయన సందేశాన్ని ప్రచారం చేస్తున్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం. ఇదే తరహాలో వై నీడ్స్ జగన్ అనేది రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమం. ఈ కార్యక్రమం కింద రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను అధికార యంత్రాంగం ప్రజలకు వివరిస్తోంది. ఇందులో తప్పేమి ఉంది? సీఎంగా జగన్ ఉన్నందున ఆయన పేరుతో కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇదేదో మహా నేరం అయినట్లు చిత్రీకరించడం సీఎఫ్‌డీ పెద్దలు, రామోజీ కడుపు మంటే తప్ప మరేదీ కాదు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో అధికారులతో పాటు కేంద్ర మంత్రులు, నాయకులు కూడా పాల్గొంటున్నారు. రాష్ట్రంలో కూడా అధికారులు, ఉద్యోగులతో పాటు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు. ఇదేదో సివిల్ సర్వీస్ కోడ్‌కి విఘాతం అంటూ సీఎఫ్‌డీ పెద్దలు తెగ బాధపడిపోవడం విచిత్రంగా ఉంది. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల భాగస్వామ్యం అనైతికం, అధర్మం అంటూ ఆ పెద్దలు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంపై పల్లెత్తు మాట అనని ఈ ‘పెద్దలు’ రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాన్ని తప్పు పట్టడానికి మాత్రం ముందుంటారు. వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై వారికున్న కడుపు మంటకు ఇదే నిదర్శనం.

రామోజీకి, బాబుకు భజన బృందమే సీఎఫ్‌డీ పెద్దలు

పేరుకు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ (సీఎఫ్‌డీ) అంటూ పేరు పెట్టుకుని తెలుగుదేశం పార్టీకి, ఈనాడు రామోజీకి, ఎల్లో మీడియాకు అనుకూలంగా వ్యవహరించడమే సీఎఫ్‌డీ పెద్దల రాజకీయం. గతంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్‌గా పనిచేసిన నిమ్మగడ్డ రమేశ్ కుమార్ వ్యవహార శైలి అందరికీ తెలిసిందే. తెలుగుదేశం పార్టీకి మేలు చేయడానికి కోవిడ్ సాకుతో ప్రభుత్వాన్ని సంప్రదించకుండా ప్రకటించిన పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను రద్దు చేసింది నిమ్మగడ్డ అనే విషయం ప్రజలు మరచిపోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అంటే గిట్టని వారు సీఎఫ్‌డీలో చేరి ఎన్నికల ముందు తెలుగుదేశం అనుకూల రాజకీయాలు చేస్తున్నారు. రామోజీ, చంద్రబాబు డైరెక్షన్‌లో ఇలాంటి వక్రీకరణలకు మున్ముందు మరిన్నింటికి పాల్పడతారు. తెలుగుదేశానికి అనుకూలంగా వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగానే సీఎఫ్‌డీ పుట్టుకొచ్చింది తప్ప ఇందులో పౌరుల ప్రయోజనాలపై వారికేమీ ఆసక్తి లేదనేది సుస్పష్టం.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పూలే వర్ధంతి



సాక్షి, అమరావతి: కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడి అందరికి సమాన అవకాశాలు కల్పించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, మేరుగు నాగార్జున కొనియాడారు. మహాత్మా పూలే కలలను సీఎం వైఎస్ జగన్ నిజం చేస్తూ.. ఆయన బాటలోనే నడుస్తూ సామాజిక సాధికారత సాధించారని ప్రశంసించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రులు కారుమూరి, మేరుగు, తెలుగు, సంస్కృత అకాడమి చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావు నివాళులర్పించారు.

‘వాస్తవాలను పరిశీలించి.. ఆందోళన విరమించండి’

సాక్షి, అమరావతి: పొరుగు రాష్ట్రాల కన్నా గరిష్ట వేతనాలు ఇవ్వడంతో పాటు, ఇతర విషయాల్లోనూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో)ల పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చెప్పారు. సీహెచ్‌వోలు సహేతుకం కాని డిమాండ్లు చేయడం సరికాదని పేర్కొంటూ మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయడం కోసం 2,500 జనాభాకు ఒకటి చొప్పున 10,032 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో సేవలు అందించడానికిగాను 10,032 సీహెచ్‌వో పోస్టులు భర్తీ చేసినట్లు చెప్పారు. వీరికి నెలకు రూ.40 వేల వరకు చెల్లిస్తున్నామని, ఏటా 15 రోజుల సాధారణ సెలవులను మంజూరు చేశామన్నారు. ఈ పోస్టులకు కర్ణాటకలో రూ.30,000, తెలంగాణలో రూ.29,900, తమిళనాడులో రూ.19,000, కేరళలో రూ.17,000 చొప్పున వేతనాలిస్తున్నారని తెలిపారు. వాస్తవ పరిస్థితులను గుర్తించి ఆందోళన విరమించి, విధుల్లో చేరాలని సీహెచ్‌వోలను కోరారు. లేనిపక్షంలో వారి కాంట్రాక్ట్‌లను రద్దు చేసి, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. బుధవారం రాష్ట్రంలోని అందరు సీహెచ్‌వోలతో వెబ్‌నార్ నిర్వహిస్తామని, అప్పటికీ వాస్తవాల్ని తెలుసుకుని ఆందోళన విరమించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పూలే స్ఫూర్తితో హక్కులు సాధిస్తాం



తాడికొండ: సామాజిక సాధికారత కోసం కృషి చేసిన మహాత్మ జ్యోతీరావు పూలే స్ఫూర్తితో తమ హక్కులను సాధించుకుంటామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,157వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. సమాజంలోని అందరికీ సమాన హక్కులు కల్పించాలని పూలే నింపిన స్ఫూర్తి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. బహుజనులు ఉన్నతంగా ఎదగాలంటే వారికి ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థానం కల్పించాలనే యోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగుతుందని చెప్పారు. ఏపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పించి ఉన్నత పదవులు, కొలువుల్లో నియమించిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. శిబిరంలో మహాత్మా జ్యోతీరావు పూలే 133వ వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. నాయకులు పులి దాసు, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

• తెలంగాణ

మోదీతో రాజీపడే ప్రసక్తే లేదు


హైదరాబాద్ కార్నర్ మీటింగుల్లో రాహుల్‌గాంధీ



సాక్షి, హైదరాబాద్: ‘కాంగ్రెస్ పోరాటం కేవలం కాషాయం, విద్వేషాలపైనే. మోదీతో రాజీ పడే ప్రసక్తే లేదు. బీజేపీకి బీఆర్‌ఎస్, ఎంఐఎం బీ టీం కాకుంటే అవినీతిపరుడైన కేసీఆర్‌తో పాటు ఒవైసీపై ఒక్క కేసు, ఈడీ దాడులు ఎందుకు లేవు? మోదీ సర్కార్ తెచ్చిన అన్ని బిల్లులకు బీఆర్‌ఎస్ మద్దతు పలికింది. ఉత్తరాది, ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో మజ్లిస్ పార్టీకి కనీసం ఉనికి, ఒక్క ఓటు లేకున్నా బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకు ఎన్నికల బరిలో దిగుతుంది. మజ్లిస్ ఎక్కడ పోటీ చేయాలో కూడా బీజేపీ నిర్ణయిస్తోంది. కేవలం కాంగ్రెస్‌ను దెబ్బతీయడమే మజ్లిస్ ఉద్దేశం. ఈ మూడూ ఒకటే టీమ్. కలిసే పనిచేస్తాయి..’ అని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన మంగళవారం.. హైదరాబాద్ నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని బజార్‌ఘాట్ చౌరస్తాలో, మల్కాజిగిరి ఇందిరా చౌక్ వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగుల్లో రాహుల్ మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాల అమలుపై మంత్రివర్గం సంతకాలు చేస్తుందని ప్రకటించారు. దేశంలో మత విద్వేషాలు లేకుండా చేసేందుకు ఢిల్లీలో నరేంద్ర మోదీని గద్దె దింపాలంటే, ముందుగా తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించాలని అన్నారు. మోదీ విద్వేషాలతో కూడిన భారతదేశాన్ని తయారు చేశారని, తాము ప్రేమతో కూడిన దేశాన్ని కోరుకుంటున్నామని చెప్పారు. ప్రజల తరఫున ఢిల్లీలో పోరాడడానికి తాను, సోదరి ప్రియాంక సైనికుల్లా ఉంటామని రాహుల్ చెప్పారు. ప్రియాంకా గాంధీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పదేళ్లు ఫాంహౌస్ పాలన కొనసాగిందని, కేసీఆర్ కుటుంబంలోని వారికి మంత్రి పదవులు వచ్చాయని విమర్శించారు.

నేను రాలేకపోతున్నా... మీరు మార్పు తీసుకురండి

తెలంగాణ ప్రజలకు సోనియాగాంధీ వీడియో సందేశం



సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో మార్పు కావాలని, ఆ మార్పు కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ కోరారు. ఈ మేరకు తెలంగాణ ప్రజలనుద్దేశించి మంగళవారం ఓ వీడియో సందేశం పంపారు. ‘ప్రియమైన సోదర సోదరీమణులకు నమస్కారం. నేను మీ దగ్గరకు రాలేకపోతున్నా. కానీ మీరు నా హృదయానికి చాలా దగ్గరగా ఉంటారు. మీకు ఓ విషయాన్ని చెప్పాలనుకుంటున్నాను. తెలంగాణ అమరవీరుల కలలు నెరవేరడం చూడాలనుకుంటున్నా. మనందరం కలిసి దొరల తెలంగాణను ప్రజల తెలంగాణగా మార్చాలి. మీ కలలు సాకారం కావాలి. ఒక మంచి ప్రభుత్వం రావాలి. సోనియమ్మ అని పిలిచి మీరు నాకు చాలా గౌరవప్రదమైన అమ్మ స్థానం ఇచ్చారు. మీ ప్రేమాభిమానాలకు నేను ఎప్పటికీ రుణపడి ఉంటాను. తెలంగాణ సోదరులు, అమ్మలు, బిడ్డలందరికీ నా విన్నపం. మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటేయండి. మార్పు కావాలి. కాంగ్రెస్ రావాలి. జై తెలంగాణ. జైహింద్.’ అని ఆమె తన వీడియో సందేశంలో పేర్కొన్నారు.

ఇందిరమ్మ రాజ్యం ఎవరికి కావాలి?

- నాకు పదవుల కాంక్ష లేదు.. రాష్ట్రాన్ని చక్కదిద్దాలన్నదే లక్ష్యం
- మూడోసారి బీఆర్‌ఎస్ పాలన తెచ్చుకుందాం
- గజ్వేల్, వరంగల్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్



సాక్షిప్రతినిధి, వరంగల్/ సాక్షి, సిద్దిపేట: ‘కాంగ్రెస్ గెలిస్తే ఇందిరమ్మ రాజ్యం తెస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇందిరమ్మ రాజ్యం ఎవరికి కావాలిప్పుడు? అప్పుడు ఏం సక్కదనం వెలగబెట్టారని పదేపదే ఆ పేరు ఉచ్చరిస్తున్నారు? ఇందిరమ్మ రాజ్యం అంటే ఎమర్జెన్సీ.. కాలిన కడుపులు, కాల్చివేతలు, కూల్చివేతలేగా. ఆ కష్టాలు మనకు అవసరమా? ఎన్‌కౌంటర్లు, రక్తపాతం, తెలంగాణ ఉద్యమ సమయంలో 1969లో 400 మంది కాల్చివేత.. ఇవన్నీ మరిచిపోలేదు. కాంగ్రెసోళ్లు ఇప్పుడు మళ్లీ పాత చరిత్ర తెస్తామంటున్నారు. కానీ మనం ఏంటనేది 30వ తేదీన నిరూపించాలి..’ అని సీఎం, బీఆర్‌ఎస్ అధినేత, పార్టీ గజ్వేల్ అభ్యర్థి కె.చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారం చివరి రోజు మంగళవారం గజ్వేల్‌లో, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన భారీ ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు. ‘‘నా వయసు ఫిబ్రవరిలో 70 ఏళ్లకు చేరుతుంది. పదవుల కాంక్ష లేదు.. తెలంగాణను సక్కదిద్దాలనే ఉంది. మనసు పెట్టి సంక్షేమం అందిస్తున్న బీఆర్‌ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి మూడవసారి పాలన తెచ్చుకుందాం. సరికొత్త చరిత్రను సృష్టిద్దాం. అభ్యర్థుల గుణగణాలు, గతంలో చేసిన అభివృద్ధి, ఇప్పుడు ఏం చేస్తారనే విషయాన్ని తెలుసుకోవాలి. 50 ఏళ్ల కాంగ్రెస్ చరిత్ర, 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనను బేరీజు వేసుకుని ఓట్లు వేయాలి..’ అని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో ముగిసిన ప్రచారం

అమల్లోకి వచ్చిన నిషేధాజ్ఞలు, 144వ సెక్షన్: రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి రాష్ట్రంలో సైలెన్స్ పీరియడ్ ప్రారంభమైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ప్రకటించారు. రాజకీయ, ప్రచార కార్యక్రమాలపై నిషేధాజ్ఞలతో పాటు 114 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన స్థానికేతరులందరూ నియోజకవర్గాలను విడిచి తక్షణమే వెళ్లిపోవాలని ఆదేశించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా మంగళవారం రాత్రి మొదలు నిరంతర పర్యవేక్షణ పోలింగ్ పూర్తయ్యే వరకూ కొనసాగుతుందని పేర్కొన్నారు. ఓటర్లకు డబ్బులు, మద్యం, ఇతర కానుకల పంపిణీని కట్టడి చేసేందుకు కంట్రోల్ రూమ్ ద్వారా 24X7 పర్యవేక్షణ కొనసాగుతుందని వెల్లడించారు. ఒపీనియన్ పోల్స్‌పై నిషేధం ఉంటుందన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత అర్ధ గంట వరకు ఎలాంటి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ప్రకటించరాదని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎలాంటి రాజకీయ ప్రకటనలు ఇవ్వరాదన్నారు. బల్క్ ఎస్‌ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లపై నిషేధం ఉంటుందన్నారు. ఎన్నికలకు సంబంధించి పార్టీల స్టార్ క్యాంపైనర్లు పత్రికా సమావేశాలు పెట్టరాదని, మీడియాకు ఇంటర్వ్యూలు ఇవ్వరాదని స్పష్టం చేశారు.

ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు బైబై చెప్పాలి

జహీరాబాద్ రోడ్‌షోలో ప్రియాంకా గాంధీ



జహీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఫాంహౌస్‌కే పరిమితమైన సీఎం కేసీఆర్‌కు బైబై చెప్పాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల కోసం చేసిందేమీ లేదని, రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగిపోయాయని, యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని, పేపర్ లీకేజీలు అయ్యాయని, రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని అన్నారు. దేశంలో రైతు రోజుకు రూ.27 సంపాదిస్తున్నాడని, మోదీ స్నేహితుడు అదానీ మాత్రం వేల కోట్లు సంపాదించారని చెప్పారు.

డబ్బులిస్తే తీసుకోండి ఓటు సమర్థులకే వేయండి

సినీదర్శకుడు రామ్‌గోపాల్ వర్మ

సాక్షి, హైదరాబాద్: ఓటు కోసం అభ్యర్థులెవరైనా డబ్బులిస్తే తీసుకుని ఓటును మాత్రం సమర్థులకే వేయాలని సినీదర్శకుడు రామ్‌గోపాల్ వర్మ పేర్కొన్నారు. ‘ఓటుకు నోటు’కు వ్యతిరేకంగా అవగాహన కల్పించడంలో భాగంగా తెలంగాణ ఆర్టిస్ట్స్ ఫోరమ్, ప్రెస్‌క్లబ్ హైదరాబాద్, ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్‌ల ఆధ్వర్యంలో రూపొందించిన ‘ఆర్ట్ ఫర్ డెమోక్రసీ’ వాల్‌పోస్టర్‌ను మంగళవారం వర్మ ఆవిష్కరించారు. సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఈకార్యక్రమంలో వర్మ మాట్లాడుతూ...ప్రజలను మేలుకొల్పడంలో పొలిటికల్ కార్టూన్స్ చాలా ప్రభావం చూపిస్తాయన్నారు.

హనుమాన్ చాలీసా, సాయి చాలీసా గురించి మనకు తెలుసు. సీతా చాలీసాను రాసి, వినిపిస్తున్నారు డాక్టర్ జిఎల్‌కె దుర్గ. ఆంధ్రమహిళా సభ రిటైర్డ్ ప్రిన్సిపల్ అయిన దుర్గ మోటివేషనల్ స్పీకర్‌గానూ యువతలో స్ఫూర్తిని కలిగిస్తున్నారు. అరవైఏడేళ్ల వయసులో జీవితాన్ని అర్థవంతంగా మార్చుకుంటూ స్ఫూర్తిని కలిగించే ఎన్నో విషయాలు ఇలా మన ముందుంచారు.


డాక్టర్ జిఎల్‌కె దుర్గ

● దుర్గ రాసింది సీతా చాలీసా!

‘‘నేటి మహిళల పరిస్థితి చూస్తుంటే ఒక పక్కన ఆకాశంలోకి దూసుకుపోతున్నాం... మరోపక్కన అథోలోకంలోకి కూడా వెళుతున్నామా అనిపిస్తుంది. ఓవైపు అమ్మాయిలను ఆకాశం అంత ఎత్తు ఎదగాలని ప్రోత్సహిస్తున్నాం.. మరోవైపు ఇంకా స్త్రీ భ్రూణహత్యలు జరగడం చూస్తున్నాం. మహిళలు ఎదగాలంటే మగవారిలోనూ మార్పు రావాలి. ఇప్పటికన్నా ఇతిహాస కాలం నాటి రోజులను తెలుసుకుంటే నాటి మహిళ తెగువ, సమయస్ఫూర్తి మనకు కనిపిస్తాయి. సీతా చాలీసా స్త్రీ కేంద్రకంగా ఉంటుంది.

తెలుసుకుంటూ చేసిన ప్రయత్నం

శ్రీరామనవమి కళ్యాణోత్సవానికి మా అత్తగారి ఊరు వెళ్లాం. అక్కడ అమ్మవారికి మంగళసూత్ర ధారణ జరిగేటప్పుడు రామ, హనుమాన్ చాలీసా ఉంది, సీతాచాలీసా గురించి లేదే... అనిపించింది. తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత అదే విషయం మనసులో మెదులుతుండటంతో ఇంటర్నెట్‌లో శోధించాను. నాకున్న స్నేహితులు, పెద్దలను అడిగాను. తెలుగులో సీతా చాలీసా లేదు. హిందీలో ఉంది కానీ... బాణీ వేరుగా ఉంది. దీంతో తెలుగులో సీతా చాలీసా రాయాలని నిర్ణయించుకున్నాను. ఇందుకోసం వాల్మీకి రామాయణాన్ని పారాయణ చేస్తూ... అందులో నుంచి సీతాదేవి గురించి ఉన్న వ్యాఖ్యానాలు రాసుకుంటూ వచ్చాను. ఈ ప్రయాణంలో చాలా మంది మిత్రులు, పెద్దలు నాకు సాయం చేశారు. నిజానికి వాల్మీకి మహాకవి, రామాయణ కథానాయిక అయిన సీత గురించి చాలా గొప్పగా... రాముడికి ఏ మాత్రం తీసిపోని విధంగా చెప్పారు. అందం, సుగుణాలలోనే కాదు సహనం, ధైర్యం, తెలివితేటలు, ఔదార్యం, సమయస్ఫూర్తి, మాటలు .. ఇలా అన్నింటిలోనూ ఆమె గొప్పతనం గురించి వివరించారు. సీతాదేవి బాల్యం, యవ్వనం, స్వయంవరం, కల్యాణం, అరణ్యవాసం, అశోకవనం, రావణ వధానంతరం రామునితో తిరిగి అయోధ్య చేరడం, పట్టాభిషేకం, అనంతరం అడవులకు వెళ్లడం, అక్కడినుంచి వాల్మీకి ఆశ్రమం చేరడం, లవకుశలను పెంచడం, చివరగా తల్లి భూదేవిలో కలిసిపోవడం వరకు ఆమె జీవనం ఎంత శక్తిమంతమైనదో... అదంతా చాలీసాలో వచ్చేలా కూర్చాను. బాల్యంలో ఆడుకుంటూ శివధనస్సును ఉంచిన మంజూషను జరిపినది అని ఉంటే.. ‘శివధనస్సును అవలీలగా జరిపిన బాలవు నీవు’ అని, హనుమతో మాట్లాడేటప్పుడు..‘రాముని ధ్యాసే శ్వాసగ నిలిపి తప మొనరించిన తాపసి వీవు’ అని అశోకవనంలో చెప్పడం.. పట్టాభిషేక సమయంలో హనుమకు పుత్రవాత్సల్యంతో ఇచ్చిన అపురూపమైన మణిహారం గురించి .. ఇలా రామాయణంలోని ప్రతి ఘట్టాన్ని ఆమె గుణగణాలను వివరిస్తూ చేసే చాలీసా మనలో ఒక స్ఫూర్తిని నింపుతుంది.


సీతాచాలీసాను బృందగానం చేయిస్తూ...

నానమ్మ చెప్పిన కథలు..

నేను కామర్స్ సబ్జెక్ట్‌తో పీహెచ్‌డి పూర్తి చేసి, ఆంధ్ర మహిళా సభలో 35 ఏళ్లుగా లెక్చరర్‌గా, ప్రిన్సిపల్‌గా చేసి రిటైర్ అయ్యాను. ఆంధ్ర మహిళాసభ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభకు వైస్‌ప్రెసిడెంట్‌గా ఉన్నాను. కాలేజీ రోజుల్లో బెస్ట్ స్టూడెంట్ అవార్డ్‌తో పాటు మెరిట్ స్కాలర్‌షిప్‌లు పొందాను. కామర్స్ స్టూడెంట్‌ని అయినా తెలుగు సాహిత్యం అంటే చాలా ఇష్టం. అలా, సంస్కృతం కూడా నేర్చుకున్నాను. అందుకు మా నానమ్మే కారణం. నా చిన్నతనంలో ఆమె ప్రతిరోజూ పడుకునే సమయంలో రామాయణంలోని కథలు చెప్పేది. ఆధ్యాత్మికతను పెంచే గజేంద్ర మోక్షం, రామాయణ, మహాభారతాల గురించి చెప్పేది. ఆ ఆసక్తితోనే పుస్తకాలు చదవడం అలవాటయ్యింది. ఇప్పటికి కూడా ప్రతి రోజూ ఉదయం రెండు గంటల సమయం రాయడానికి కేటాయిస్తే, రాత్రి రెండు గంటల సేపు చదవడానికి కేటాయిస్తాను.

ప్రభుత్వ స్కూళ్లకు వెళ్ల..

పదేళ్లుగా మోటివేషనల్ స్పీకర్‌గా ఉన్నాను. టీచింగ్ వృత్తిలో కొనసాగడం వల్ల యువతకు, మహిళలకు మంచి విషయాలు నా ద్వారా వెళ్లడం ఒక అదృష్టంగా భావిస్తున్నాను. సమాజంలో మార్పు వచ్చేందుకు చేసే ఏ చిన్న పని అయినా ముందుండేందుకు ప్రయత్నిస్తుంటాను. ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి, ఆ రోజు ఏ టీచర్ అయితే రాలేదో ఆ స్థానంలో నేను మోటివేషనల్ క్లాస్ తీసుకుంటాను. జైలుకు వెళ్లి ఖైదీలకు మంచి విషయాలు చెప్పడానికి ప్రయత్నిస్తుంటాను.

మహిళల కోసం ప్రత్యేకం..

స్టాండప్ కామెడీ చేస్తుంటాను. స్వచ్ఛంద సంస్థలతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాను. అత్తగారు–కోడళ్ల మధ్య ఉండాల్సిన బంధాలు, మహిళల ఆరోగ్యం, చదువుకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనడం, నాదైన బాణీలో నవ్విస్తూనే వారిని వారు దిద్దుకునే ఆలోచన కలిగించడానికి ప్రయత్నిస్తుంటాను. యువత కోసం వివేకానందుని రచనలు చేస్తున్నాను.

ఇటీవల జరిగిన ఓ భక్తి కార్యక్రమంలో సీతా చాలీసాను బృందంగా ఆలపించడంతో ఎన్నాళ్లుగానో నా మనసులో మెదిలిన ఒక ఆలోచన ఇలా రూపుదిద్దుకొని, ప్రజల ముందుకు రావడం ఎంతో ఆనందంగా అనిపించింది. ‘పద్యం, గద్యం ఎరుగని దుర్గకు నిను కొలిచే భాగ్యం దక్కెను’ అని సీతామాతకు వందనం చెప్పాను’’ అని వివరించారు దుర్గ.

– నిర్మలారెడ్డి

ట్రెండ్

పెళ్లి అనగానే డిస్పోజబుల్ ప్లాస్టిక్‌ను విపరీతంగా వాడాల్సి వస్తుంది. ఇది పర్యావరణానికి హాని. అంతే కాదు పల్లెల్లో వాటి వల్ల పేరుకున్న చెత్తతో ఎక్కడలేని మురికి. జబ్బులు. అందుకే ఉత్తరాదిలో చాలామంది మహిళా సర్పంచ్‌లు ‘బర్తన్ బ్యాంక్’ను ఏర్పాటు చేస్తున్నారు. ఊరికి ఇంతని స్టీలు పెళ్లి సామాను ఇచ్చి అందరూ వాటిని ఫ్రీగా వాడుకునేలా చేస్తున్నారు. ఇది దక్షిణాదికి అందుకోవాల్సి ఉంది.



ప్లాస్టిక్‌పై కొత్త ఉద్యమం బర్తన్ బ్యాంక్

ఇండోర్‌లో మునిసిపల్ అధికారులు రెగ్యులర్‌గా కేటరింగ్ వాళ్లను, పెళ్లిళ్ల జరిగే ఫంక్షన్ హాళ్లను, రెస్టరెంట్‌లను సందర్శిస్తారు. ఎక్కడైనా ప్లాస్టిక్ వాడితే మొహమాటం లేకుండా ఫైన్ వేస్తారు. ఈ ఫైన్ ఐదు వందలతో మొదలయ్యి 12 లక్షల వరకూ ఉంటుంది. హోటళ్ల వారికి వాళ్లు ఒకటే చెబుతారు– ‘మీరు రోజూ వన్ టైమ్ యూజ్ ప్లాస్టిక్ వాడటం వల్ల చేసే ఖర్చును స్టీలు వాడకం ద్వారా పూర్తిగా తగ్గించవచ్చు’ అని. ఇండోర్‌కు క్లీన్ సిటీగా పేరు ఉంది. ఆ పేరును నిలబెట్టాలని అధికారుల తాపత్రయం. అంతే కాదు, వారు ఒక ‘బర్తన్ బ్యాంక్’ను కూడా ఏర్పాటు చేశారు. బర్తన్ అంటే గిన్నెలు. పెళ్లికి కావాల్సిన వంట, వడ్డన కోసం కావాల్సిన అన్ని పాత్రలు, గ్లాసులు, ప్లేట్లు, గరిటెలు అన్నీ ఒక చోట పెడతారు. 24 గంటల ముందు చెప్పి ఎవరైనా ఉచితంగా తీసుకెళ్లవచ్చు. ఉపయోగించుకున్నాక శుభ్రం చేసి తిరిగి చెల్లించాలి. ఏవైనా డ్యామేజీ అయినా పోయినా డబ్బు కట్టాలి. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వారు ఈ బ్యాంక్‌కు పోటెత్తుతున్నారు.

ఇదంతా ఎలా మొదలైంది?

రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిషా తదితర రాష్ట్రాలలో కొత్తగా పదవుల్లోకి వచ్చిన మహిళా సర్పంచ్‌లు పల్లెల్లో చెత్తగా పేరుకు పోతున్న ప్లాస్టిక్‌ను చూసి ఇది మొదలెట్టారు. రాజస్థాన్‌లోని జున్‌జును అనే పల్లెకు నీరూ యాదవ్ అనే ఆవిడ సర్పంచ్ అయ్యాక ఈ సంవత్సరం మొదలులో ‘బర్తన్ బ్యాంక్’ మొదలెట్టింది. ఊరి పెద్దలను ధిక్కరించి నిధులను ఇలాంటి పనులకు ఉపయోగించడం మొదలెట్టిన నీరూ యాదవ్ ‘బర్తన్ బ్యాంక్’ వల్ల ఊరు ఎంత శుభ్రంగా ఉంటుందో ప్రాక్టికల్‌గా చూపించాక అందరూ ఆమె నిర్ణయాన్ని అంగీకరించారు. అలా ఈ ఉద్యమం రాజస్థాన్ నుంచి ఇతర రాష్ట్రాలకు వ్యాపించింది.



‘ప్లాస్టిక్ వద్దు చెత్త వద్దు’ నినాదంతో మహిళా సర్పంచ్‌లు తమ గ్రామాల్లో బర్తన్ బ్యాంక్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో గ్రామానికి 1000 స్టీలుప్లేట్లు, రెండు వేల కూర గిన్నెలు, రెండు వేల స్టీలు గ్లాసులు, 2 వేల స్పూన్లు, 50 మంచి నీటి జగ్గులు, ఐదారు వంట డేగిసాలు ఏర్పాటు చేస్తూ... గ్రామంలో ఎవరి ఇంట ఏ శుభకార్యం జరిగినా ఈ బ్యాంక్ నుంచి ఉచితంగా గిన్నెలు పొందే సదుపాయం కల్పిస్తున్నారు. .

దీదీ బర్తన్‌బ్యాంక్

చత్తీస్‌గఢ్‌లోని సర్గుజా జిల్లా అంబికా పూర్‌లో స్వయం ఉపాధి మహిళా బృందాలు తమ ఇళ్లల్లో శుభకార్యాల కోసం ‘దీదీ బర్తన్ బ్యాంక్’ ఏర్పాటు చేసుకున్నారు. అంటే ఈ మహిళల ఈ బ్యాంక్‌లో ఏర్పాటు చేసుకున్న పాత్రలను ఉచితంగా వాడుకోవచ్చు. అయితే రాను రాను జిల్లా అంతా అందరు ప్రజలూ వాడుకునేలా ఈ ‘దీదీ బర్తన్ బ్యాంక్’లు విస్తరించాయి.‘ప్లాస్టిక్ చెత్త మురుగు నీటికి పెద్ద ప్రతిబంధకం. అది మట్టిలో కలవదు. దానిని రీసైకిల్ చేయడం కూడా వృథా. ఇలాంటి ప్లాస్టిక్‌కు స్టీలు వస్తువులతో విరుగుడు చెప్పాలి’ అంటారు ఈ మహిళలు.

ఒడిస్సాలో

ఒడిస్సాలో బర్తన్ బ్యాంక్ ఉద్యమం జోరు మీద ఉంది. నౌపాడ జిల్లాలో భలేస్వర్ అనే పంచాయితీ సర్పంచ్ అయిన సరోజ్ దేవి అగర్వాల్ ఊరి పెద్దలను ఎదిరించి మరీ పంచాయితీ నిధుల నుంచి 75 వేలు మంజూరు చేసి ‘బర్తన్ బ్యాంక్’ ఏర్పాటు చేసింది. ‘ప్రతి ఊళ్లో ఇలాంటి బ్యాంక్ ఉండాలి’అంటుందామె.

అయితే ఈ బర్తన్ బ్యాంక్‌లు రెండు విధాలుగా పని చేస్తున్నాయి. కొన్ని చోట్ల కామన్‌గా పాత్రలను ఉంచేస్తే మరికొన్ని చోట్ల ఇంటికి ఇన్నని స్టీలు సామాన్లు ఇచ్చేస్తున్నారు. అంటే పెళ్లికి ఎవరికి పళ్లాలు వాళ్లు తెచ్చుకుని తిని తీసుకెళ్లిపోయేలా. ఇది కూడా బాగానే ఉందంటున్నారు కొందరు.

ఏమైనా ఉత్తరాది సంప్రదాయం దక్షిణాదికి కూడా వ్యాపిస్తే బాగుండు.

జ్ఞాపకాలే ఆకాంక్షగా...


ఆకాంక్ష

మనకు నచ్చిన రంగు రంగుల చాక్లెట్ రేపర్స్ నుంచి మనం ఇష్టపడే వారు ఇచ్చిన పువ్వులు, నెమలీకల వరకు ప్రతి చిన్న వస్తువును పుస్తకాల్లో అపురూపంగా దాచుకునే వాళ్లం. అప్పుడప్పుడు వాటిని చూసుకుని తెగ మురిసిపోయిన సందర్భాలు ఎన్నో. ఇవి కొన్నేళ్లపాటు ఉన్నప్పటికీ తర్వాత ఆ పుస్తకాలను దాచుకునే ప్లేసు లేక వాటన్నింటిని కోల్పోయి బాధపడుతుంటాము. ‘‘ఇక ముందు మీరు దిగులు పడాల్సిన పనిలేదు. మీ చిన్ననాటి జ్ఞాపకాన్ని రెజిన్ ఆర్ట్‌లో ఎప్పటికీ దాచుకోవచ్చు’’ అని చెబుతోంది 31 ఏళ్ల ఆకాంక్ష సెహగల్. గులాబీ రేకులను సైతం ఏళ్లపాటు దాచుకునేలా అందమైన ఆకృతిలో రెజిన్ క్రాఫ్ట్స్‌ను రూపొందిస్తోంది. రెజిన్ ఆర్టిస్ట్ అయ్యేందుకు ఇండిగో ఉద్యోగాన్నే వదిలేసింది ఆకాంక్ష.

నాగపూర్‌కు చెందిన ఆకాంక్ష సెహగల్ అనుకున్నది సాధించేవరకు కష్టపడుతుంది. ఆ మనస్తత్వమే ఆమెని రెజిన్ క్రాఫ్ట్స్ ఆర్టిస్ట్‌గా మార్చింది. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ పూర్తయ్యాక రేడియో మిర్చిలో సెలబ్రిటీ మేనేజర్‌గా చేరింది. ఎందుకో గానీ ఆ ఉద్యోగం ఆమెకు తృప్తినివ్వలేదు. దాంతో విమానంలో ఎగరాలని చిన్నప్పటినుంచి తాను కంటున్న కలలను నెరవేర్చుకునేందుకు విమానంలో ఉద్యోగం చేయాలనుకుంది. అందుకు తగ్గట్టుగా కష్టపడి ఇండిగోలో క్యాబిన్ క్రూ ఉద్యోగాన్ని సాధించింది.

కల నిజమైనప్పటికీ...

క్యాబిన్ క్రూగా ఎంతో సంతోషంగా సాగిపోతున్న ఆకాంక్షకు క్రూగా కొంతకాలం మాత్రమే పనిచేస్తామని ఆ తరువాత పేపర్ వర్క్ పనిచేయాల్సి ఉంటుంది అని తెలిసింది. అప్పటి దాకా ఉన్న సంతోషం ఆవిరైంది. కొంతకాలం పనిచేసిన తరువాత నేను క్రూ గా ఉండలేను. పేపర్ వర్క్ చేయడం ఇష్టం లేదు. దీంతో తనకు నచ్చిన, ఎప్పటికీ ఉండే వృత్తిని కెరీర్‌గా ఎంచుకోవాలని నిర్ణయించుకుని మళ్లీ కొత్త ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఒక పక్క క్యాబిన్ క్రూగా బాధ్యతలు నిర్వహిస్తూనే తనకెంతో ఇష్టమైన క్రాఫ్ట్స్‌ను కెరీర్‌గా ఎంచుకుంది.



యునిక్ రెజిన్ క్రియేషన్స్..

చిన్నప్పటి నుంచి ఆర్ట్స్‌పై మక్కువ ఉన్న ఆకాంక్ష.. తనకి కాబోయే భర్తకు రెజిన్ క్రాఫ్ట్ తయారు చేసి బహుమతిగా ఇచ్చింది. అది చూసిన ఆకాంక్ష కాబోయే భర్త చాలా బావుంది. రెజిన్ క్రాఫ్ట్స్ తయారీలో నీకు మంచి నైపుణ్యం ఉంది. క్రాఫ్ట్స్ కోర్సు చెయ్యి అని ప్రోత్సహించాడు. దీంతో ఇండిగోలో ఉద్యోగం చేస్తూనే చిన్నచిన్న రెజిన్ క్రాఫ్ట్స్ తయారు చేయడం మొదలు పెట్టింది. ఈ క్రాఫ్ట్స్‌ను మరింత నాణ్యంగా తయారు చేసేందుకు ఇండిగో ఉద్యోగాన్ని వదిలేసి యూనిక్ రెజిన్ క్రియేషన్స్ పేరిట బ్రాండ్‌ను ప్రారంభించింది. తడిసినా పాడవకుండా ఉండే రెజిన్ పదార్థానికి రంగులు జోడించి అందమైన ఆకృతుల్లో ప్రత్యేకంగా ఉండే గిఫ్ట్స్ తయారు చేసి విక్రయించడం మొదలు పెట్టింది. ప్రారంభంలో అనేక సవాళ్లు ఎదురైనప్పటికీ కుటుంబం సహాయంతో తన బ్రాండ్‌ను చక్కగా నిర్వహిస్తోంది ఆకాంక్ష.



మరింత ప్రత్యేకంగా...

మిగతా బహుమతుల కంటే రెజిన్‌క్రాఫ్ట్స్ ద్వారా అపురూప జ్ఞాపకాలను భద్రపరుచుకోవచ్చు. పెళ్లిదండలు, ఇష్టమైన వారు ఇచ్చిన పూలు, వాటి తాలుకా రేకులు, పుష్పగుచ్ఛాలు, శిశువు బొడ్డు తాడు వంటి వాటిని మరింత ప్రత్యేకంగా దాచుకునేలా రూపొందిస్తోంది. ఈ క్రాఫ్ట్స్ ఆకర్షణీయంగా ఉండడంతో కస్టమర్లు ఎగబడి మరీ ఆర్డర్లు ఇస్తున్నారు ఆకాంక్షకు.

ఇంత చిన్నవయసులో రెండు ఉద్యోగాలను అవలీలగా సాధించి, తనని తాను నిరూపించుకుంది. చివరికి తనకెంతో ఇష్టమైన క్రాఫ్ట్స్‌ను తయారు చేస్తూ రెజిన్ క్రాఫ్ట్ ఆర్టిస్ట్‌గా మారి ఎంతోమంది యువతీ యువకులకు ప్రేరణగా నిలుస్తోంది.

‘ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించడం అంటే మాటలా?’ అన్నది ఒకప్పటి మాట. మాటల మాంత్రికులైన యువ సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌లు కలర్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్ కలలు కంటున్నారు. ‘వ్యాపారం అంటే మాట్లాడినంత తేలిక కాదు’ అనే విమర్శను దాటి ఇన్‌ఫ్లూయెన్సర్‌లుగా తమ అనుభవాన్ని ఉపయోగించి ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా గెలుపు జెండా ఎగరేస్తున్నారు.

యూత్ పల్స్

ఇన్‌ఫ్లూయెన్సర్ టు ఎంటర్‌ప్రెన్యూర్



బ్రాండ్స్ ద్వారా గుర్తింపు పొందిన యంగ్ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు ఆ తరువాత తామే ఒక బ్రాండ్‌గా మారుతున్నారు. మాసివ్ ఆన్‌లైన్ ఫాలోయింగ్‌తో ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా మారుతున్నారు.

ఫ్యాషన్, బ్యూటీ అండ్ లైఫ్‌స్టైల్ యూ ట్యూబర్ జ్యోతీ సేథీ ఎంటర్‌ప్రెన్యూర్‌గా అడుగులు వేస్తోంది. కొన్ని నెలల క్రితం ‘అభారి’ పేరుతో శారీ బ్రాండ్‌ను లాంచ్ చేసింది. వివిధ ప్రాంతాలలో ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసింది. తక్కువ సమయంలోనే ఎంటర్‌ప్రెన్యూర్‌గా సక్సెస్ అయింది.

‘సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం కంటే ముందు వివిధ ప్రాంతాలలో ఎగ్జిబిషన్‌లను ఏర్పాటు చేయడం వల్ల కస్టమర్‌ల పల్స్ తెలుసుకోగలిగాను. వారి నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నాకు ఎంతో ఉపయోగపడింది’ అంటుంది జ్యోతి సేథీ.

ముంబైకి చెందిన సంజయ్ ఖీర్ ఆరో తరగతిలోనే వంట చేయడం నేర్చుకున్నాడు. హోటల్ మేనేజ్‌మెంట్ చదువుకున్న సంజయ్ ఫుడ్‌కు సంబంధించి యూట్యూబ్ చానల్ ‘యువర్ ఫుడ్ ల్యాబ్’ ప్రారంభించాడు. 13 మిలియన్‌ల ఫాలోవర్‌లతో దూసుకుపోయాడు. మూడు నెలల క్రితం కిచెన్ అండ్ హోమ్ అప్లయెన్స్ బ్రాండ్ ‘వైఎఫ్ఎల్ హోమ్’ను స్టార్ట్ చేశాడు.

‘ఒక వీడియోను రూపొందించడానికి కొన్ని రోజుల సమయం పడుతుంది. ఒక బ్రాండ్‌ను నిర్మించడానికి మాత్రం నెలలు, సంవత్సరాలు కూడా పట్టవచ్చు. ఇది పెద్ద సవాలు. ఆ సవాలును ఓపికతో మాత్రమే స్వీకరించాలి. కంటెంట్ క్రియేటర్‌గా నాకు అడ్వాంటేజ్ ఉండొచ్చు. అయితే ప్రాడక్ట్ మాట్లాడాలి’ అంటున్నాడు సంజయ్ ఖీర్.

ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకు ఉన్న పది సంవత్సరాల అనుభవంతో రెండు సంవత్సరాల క్రితం ‘వియరీఫెడ్’ అనే బ్యూటీ బ్రాండ్‌ను స్టార్ట్ చేసి సక్సెస్ అయింది అనమ్ చష్మావాలా. తన స్కిన్ టోన్‌కు మ్యాచ్ అయ్యే లిప్‌స్టిక్ గురించి ఎంత వెదికినా ఎక్కడా కనిపించలేదు. ఈ నిరాశ నుంచే బ్రాండ్ ఆలోచన చేసింది. అయిదు సంవత్సరాల రీసెర్చ్ తరువాత తన బ్రాండ్‌ను పట్టాలకెక్కించింది.

26 సంవత్సరాల హిమాద్రి పటేల్ ఇన్ఫోసిస్‌లో చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకొని ఫ్యాషన్ అండ్ లైఫ్‌స్టైల్ ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మారింది. ఇన్‌ఫ్లూయెన్సర్‌గా సక్సెస్ అయిన తరువాత ఎత్నిక్ క్లాతింగ్ బ్రాండ్ ‘డ్రై బై హిమాద్రి’ స్టార్ట్ చేసింది.


కంటెంట్ క్రియేటర్‌గా ప్రయాణం ప్రారంభించిన రణ్‌వీర్ అల్లబాదియా పాడ్‌కాస్ట్ షో ‘ది రణ్‌వీర్ షో’తో డిజిటల్ ప్రపంచంలో సుపరిచితుడయ్యాడు. కాలేజి ఫ్రెండ్ విరాజ్ సేఠ్‌తో కలిసి ‘మాంక్ ఎంటర్‌టైన్‌మెంట్’ కంపెనీ ప్రారంభించి విజయం సాధించాడు. ఫ్యాషన్ సెన్స్, ఫన్–లవ్ కంటెంట్‌తో కంటెంట్ క్రియేటర్‌గా పేరు తెచ్చుకున్న దీక్షా ఖురానా ‘డీక్లాతింగ్’ పేరుతో క్లాతింగ్ బ్రాండ్‌ను స్టార్ట్ చేసి సక్సెస్ అయింది.

ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పేరు తెచ్చుకున్నవారికి ఎంటర్‌ప్రెన్యూర్‌గా నిలదొక్కుకోవడం అంత తేలిక కాదు.

‘సక్సెస్‌ఫుల్ బ్రాండ్‌లను క్రియేట్ చేయడానికి మౌలిక సదుపాయాల కొరత ఇన్‌ఫ్లూయెన్సర్‌లకు అడ్డంకిగా ఉంది’ అంటున్నాడు ఇన్‌ఫ్లూయెన్సర్ మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ ‘వన్ ఇంప్రెషన్’ సీయీవో అపాక్ష్ గుప్తా.

అంతమాత్రాన ‘ఇది మన స్పేస్ కాదు’ అనుకోవడం లేదు, అధైర్యపడడం లేదు యువ ఇన్‌ఫ్లూయెన్సర్‌లు. ఒక్కో అడుగు వేసుకుంటూ నడకలో వేగం పెంచుతున్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా విజయం సాధిస్తున్నారు.

ట్రెండ్ సెట్ చేయాలి



ఫ్యాషన్ అండ్ లైఫ్ స్టైల్‌కు సంబంధించి సుపరిచిత బ్రాండ్‌లతో కలిసి పనిచేయడం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోగలిగాను. ఆ తరువాత సొంతంగా ‘డీక్లాతింగ్’ క్లాతింగ్ బ్రాండ్‌ను స్టార్ట్ చేశాను. బ్రాండ్ స్టార్ట్ చేయడానికి ముందు ‘నా బ్రాండ్ ట్రెండ్ సెట్ చేయాలి’ అనుకున్నాను. అందరిలో ఒకరిగా కాకుండా మనదైన ప్రత్యేకతను సృష్టించుకున్నప్పుడు మాత్రమే మార్కెట్‌లో నిలదొక్కుకోగలం.

– దీక్షా ఖురానా,
క్లాతింగ్ బ్రాండ్ ‘డీక్లాతింగ్’ ఫౌండర్



కలా నిజమా అనుకున్నాను

నా బ్రాండ్‌కు ఆర్డర్లు మొదలై, పెరుగుతూ పోతున్న క్రమంలో ‘ఇది కలా నిజమా?’ అనుకున్నాను. ఈ విజయం నాకు బాగా ఉత్సాహాన్ని ఇచ్చింది. ‘ఇంకా ఏం చేయవచ్చు’ అని రక రకాలుగా ఆలోచించేలా చేసింది. ఇన్‌ఫ్లూయెన్సర్‌తో పోల్చితే ఎంటర్‌ప్రెన్యూర్‌గా బాగా కష్టపడాలి.

– అనమ్ చష్మవాలా,
బ్యూటీ బ్రాండ్ ‘వియరీఫెడ్’ ఫౌండర్

ఆ కష్టమే ఇక్కడ కూడా...



వ్యాపారరంగంలోకి అడుగు పెట్టాలని ఎప్పటి నుంచో అనుకున్నాను. అయితే ముందుగా ఇన్‌ఫ్లూయెన్సర్, కంటెంట్ క్రియేటర్‌గా నాకంటూ పేరు తెచ్చుకోవాలనుకున్నాను. ఆ తరువాత వ్యాపారం వైపు అడుగులు వేశాను. యూట్యూబ్ ద్వారా ఒక కంపెనీ ఎలా మొదలు పెట్టాలి? జీఎస్‌టీ నంబర్ అంటే ఏమిటి... మొదలైన విషయాలను తెలుసుకున్నాను. మొదట్లో కొన్ని పొరపాట్లు జరిగాయి. అయితే వాటి నుంచి విలువైన విషయాలు నేర్చుకున్నాను. ఇన్‌ఫ్లూయెన్సర్‌గా పేరు తెచ్చుకోవడానికి ఎంతో కష్టపడ్డాను. అలాంటి కష్టమే వ్యాపారంలో పెడితే విజయం సాధిస్తాను అని నమ్మాను. ప్రజల నమ్మకాన్ని చూరగొనడం అనేది అది పెద్ద విజయం.

– జ్యోతి సేథీ, క్లాత్ బ్రాండ్ ‘అభారీ’ ఫౌండర్



ప్రపంచకప్‌కు నమీబియా క్వాలిఫై

వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌కు నమీబియా జట్టు అర్హత సాధించింది. ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయర్స్ టోర్నీలో ఆడిన ఐదు మ్యాచ్‌లలో విజయం సాధించి అగ్రస్థానం ఖాయం చేసుకోవడంతో ఆ జట్టు వరల్డ్ కప్‌కు క్వాలిఫై అయింది. మంగళవారం జరిగిన పోరులో నమీబియా 58 పరుగుల తేడాతో టాంజానియాను ఓడించింది. నమీబియా 20 ఓవర్లలో 6 వికెట్లకు 157 పరుగులు చేసింది. జేజే స్మిట్ (40), మైకేల్ లింజెన్ (30) రాణించారు. అనంతరం టాంజానియా 20 ఓవర్లలో 6 వికెట్లకు 99 పరుగులే చేయగలిగింది. అమాల్ రాజీవన్ (41 నాటౌట్) మినహా అంతా విఫలమయ్యారు. వరుసగా మూడో టి20 ప్రపంచకప్‌కు (2021, 2022, 2024) నమీబియా అర్హత సాధించడం విశేషం. ఇదే టోర్నీలో జరిగిన మరో మ్యాచ్‌లో రువాండాపై 144 పరుగులతో గెలిచిన జింబాబ్వే తాము కూడా క్వాలిఫై అయ్యే అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. 2024 జూన్‌లో వెస్టిండీస్, అమెరికా ఈ టి20 ప్రపంచకప్‌కు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్నాయి.

జాతీయ చాంపియన్ పంజాబ్



చెన్నై: జాతీయ సీనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో పంజాబ్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం మేయర్ రాధాకృష్ణన్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో పంజాబ్ 'షూటౌట్'లో డిఫెండింగ్ చాంపియన్ హర్యానాను ఓడించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2–2 గోల్స్‌తో సమంగా నిలవగా...షూటౌట్ నిర్వహించారు. ఇందులో 9–8తో పంజాబ్ గెలుపొందింది. పంజాబ్ తరఫున హర్జీత్ సింగ్ (13వ నిమిషం), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (42వ ని.) గోల్స్ చేయగా...హర్యానాకు సంజయ్ (25వ ని.), రజంత్ (50వ ని.) గోల్స్ అందించారు. షూటౌట్‌లో హర్యానా తరఫున సంజయ్, దీపక్, అభిషేక్ గోల్స్ కొట్టగా...పంజాబ్‌కు హర్మన్‌ప్రీత్ సింగ్, సిమ్రన్‌జీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్ గోల్స్ సాధించారు. దాంతో పరిస్థితి సడెన్ డెత్‌కు మారింది. ఈ స్థితిలో సిమ్రన్‌జీత్ సింగ్ గోల్ కొట్టి పంజాబ్‌ను గెలిపించాడు. మూడో స్థానం కోసం కూడా ఫలితం షూటౌట్ ద్వారానే తేలింది. తమిళనాడు, కర్నాటక మధ్య జరిగిన ఈ పోరు ముందుగా 3–3తో సమంగా నిలవగా...షూటౌట్‌లో 5–3తో గెలిచి తమిళనాడు కాంస్యం సొంతం చేసుకుంది.

ప్రిక్వార్టర్స్‌లో సిక్కి-సుమీత్

లక్నో: సయ్యద్ మోడి ఇండియా ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలంగాణకు చెందిన సిక్కి రెడ్డి – సుమీత్ రెడ్డి ద్వయం మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సిక్కి–సుమీత్ 21–14, 21–14 స్కోరుతో వి సువాన్ యి–చున్ యున్ యాంగ్ (చైనీస్ తైపీ) జోడీపై విజయం సాధించింది. మిక్స్‌డ్ విభాగంలోనే అశ్విని పొన్నప్ప–రోహన్ కపూర్ జంట కూడా ముందంజ వేసింది. తొలి రౌండ్‌లో అశ్విని–రోహన్ 21–12, 21–18తో పెంగ్ సూన్–యీ సీ (మలేసియా)ను ఓడించారు.

ధీరజ్‌కు షాక్

అయోధ్య: జాతీయ సీనియర్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. పురుషుల రికర్వ్ సెమీ ఫైనల్లో జార్ఖండ్‌కు చెందిన మృణాల్ చౌహాన్ షూట్ ఆఫ్‌లో ధీరజ్‌ను ఓడించి ఫైనల్లోకి అడుగు పెట్టాడు. స్కోరు 5–5తో సమంగా ఉండగా, షూట్ ఆఫ్‌లో చౌహాన్ పైచేయి సాధించాడు. ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డుకు చెందిన తుషార్ శెల్కేతో ఫైనల్లో చౌహాన్ తలపడతాడు. సెమీస్‌లో శెల్కే 6–4తో అతుల్ వర్మ (గోవా)ను ఓడించాడు.

రుతురాజ్ బాదాడు...

మ్యాక్స్‌వెల్ గెలిపించాడు

- ఆఖరి బంతికి ఆస్ట్రేలియా విజయం
- 5 వికెట్ల తేడాతో భారత్ ఓటమి
- శుక్రవారం రాయ్‌పూర్‌లో నాలుగో టి20



రుతురాజ్ మెరుపు శతకాన్ని మ్యాక్స్‌వెల్ విధ్వంసం కమ్మేసింది. టీమిండియా 'హ్యాట్రిక్'ను, సిరీస్ విజయాన్ని అడ్డుకుంది. ఇటీవలే ముగిసిన ప్రపంచకప్‌లో అఫ్గాన్‌పై అద్వితీయ డబుల్ సెంచరీని గుర్తుకు తెచ్చేలా మూడో టి20లో మ్యాక్సీ అజేయ శతకంతో ఆస్ట్రేలియాను గెలిపించాడు. బౌలింగ్‌లో ఆఖరి ఓవర్లో 30 పరుగులు సమర్పించుకున్న మ్యాక్సీ ఆ చేత్తోనే బ్యాటింగ్‌లో ఆఖరి బంతిదాకా పోరాడి మరీ జట్టును సిరీస్‌లో నిలిపాడు.

గువాహటి: వరుస విజయాలతో సిరీస్‌ను గెలుచుకుందామనుకున్న టీమిండియా పట్టుదలకు ఒకే ఒక్కడు అడ్డుపడ్డాడు. గ్లెన్ మ్యాక్స్‌వెల్ (48 బంతుల్లో 104 నాటౌట్; 8 ఫోర్లు, 8 సిక్సర్లు) ధనాధన్ ధాటికి మ్యాచ్ చేజారింది. మంగళవారం జరిగిన మూడో టి20లో భారత్ 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. సిరీస్ ఆధిక్యం 2–1కు తగ్గింది. మొదట భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది. ఈ సిరీస్‌లో వరుసగా మూడో సారి టీమిండియా 200 పైచిలుకు స్కోరు చేసింది. ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (57 బంతుల్లో 123 నాటౌట్; 13 ఫోర్లు, 7 సిక్సలు) మెరుపు శతకాన్ని సాధించాడు. సూర్యకుమార్ (29 బంతుల్లో 39; 5 ఫోర్లు, 2 సిక్సలు) రాణించాడు. అనంతరం ఆస్ట్రేలియా సరిగ్గా 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 225 పరుగులు చేసి గెలిచింది. ట్రవిస్ హెడ్ (18 బంతుల్లో 35; 8) వేగంగా ఆడాడు. మ్యాక్స్‌వెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది. పేసర్ ముకేశ్ వివాహం కోసం సెలవు తీసుకోగా, అవేశ్ ఖాన్ భారత తుది జట్టులోకి వచ్చాడు.

ఒడిదుడుకులతో మొదలై...

పవర్‌ప్లేలో చెలరేగిపోయే ఓపెనర్ యశస్వి జైస్వాల్ (6) రెండో ఓవర్లోనే నిష్క్రమించడం, ఆ మరుసటి ఓవర్లోనే వన్‌డౌన్ బ్యాటర్ ఇషాన్ కిషన్ (0) డకౌట్ కావడంతో భారత్ పరుగుల పయనం నెమ్మదిగా మొదలైంది. 24/2 వద్ద కెప్టెన్ సూర్యకుమార్ క్రీజులోకి వచ్చాడు. నాథన్ ఎలిస్ ఐదో ఓవర్లో రెండు భారీ సిక్సర్లతో అతను భారత శిబిరంలో జోష్ తెచ్చాడు. పవర్‌ప్లేలో జట్టు 43/2 స్కోరు చేసింది. సూర్య తడాఖా చూపడంతో పరుగుల వేగం పుంజుకుంది. చూడచక్కని బౌండరీలతో సూర్యకుమార్ కాసేపు ఇన్నింగ్స్‌ను నడిపించాడు.

రుతురాజ్ వీరవిహారం

అప్పటి వరకు అడపాదడపా బౌండరీలతో సరిపెట్టుకుంటూ వచ్చిన రుతురాజ్ తొలి 10 ఓవర్లు ముగిసేసరికి 21 బంతుల్లో 21 పరుగులే చేశాడు. ఆ తర్వాత 'పరుగుల మిషన్'లా చెలరేగిపోయాడు. గైక్వాడ్ తర్వాతి 10 ఓవర్లలో 36 బంతులాడి 102 పరుగులు చేశాడు. 13వ ఓవర్లో రెండు ఫోర్లు, 14వ ఓవర్లో గైక్వాడ్ మరో రెండు బౌండరీలు బాది 32 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. తిలక్ వర్మ కూడా ఓ ఫోర్ కొట్టడంతో ఆ ఓవర్లో 19 పరుగులు వచ్చాయి. సంఘా ఓవర్లో వరుసగా 4, 6 బాదిన గైక్వాడ్... హార్డి వేసిన 18వ ఓవర్లో 0, 6, 1వైడ్, 6, 4, 0, 6, 2లతో 25 పరుగులు పిండుకున్నాడు. మ్యాక్స్‌వెల్ వేసిన ఆఖరి ఓవర్లో రుతురాజ్ 3 సిక్సలు, 2 ఫోర్లు బాదడంతో మొత్తం 30 పరుగులు వచ్చాయి. తొలి బంతికి బాదిన సిక్సర్‌తోనే 52 బంతుల్లో రుతురాజ్ సెంచరీ పూర్తయ్యింది. అబేధ్యమైన నాలుగో వికెట్‌కు రుతురాజ్, తిలక్ 9.4 ఓవర్లలో 141 పరుగులు జోడించారు.

గెలిపించిన మ్యాక్స్‌వెల్

ఆస్ట్రేలియా ఛేజింగ్‌ను ఓపెనర్ హెడ్ ధాటిగా మొదలెట్టాడు. తొలి ఓవర్లో 2, రెండో ఓవర్లో 4 బౌండరీలు బాదాడు. హార్డి (16)ని అర్ష్‌దీప్ పెవిలియన్ చేర్చాడు. బౌండరీలతో చెలరేగిపోతున్న హెడ్‌ను అవేశ్‌ఖాన్ బోల్తా కొట్టించాడు. పవర్‌ప్లేలో ఆసీస్ స్కోరు 67/2. క్రీజులోకి వచ్చిన మ్యాక్స్‌వెల్ భారీషాట్లతో విరుచుకుపడ్డాడు. దీంతో ఆసీస్ ఓవర్‌కు 10పైచిలుకు రన్‌రేట్‌తో సాగిపోయింది. నాలుగో వికెట్‌కు 60 పరుగులు జోడించాక 128 పరుగుల వద్ద స్టొయినిస్ (17) నిష్క్రమించగా, స్వల్ప వ్యవధిలో టిమ్ డేవిడ్ (0) డకౌటయ్యాడు. భారత్ శిబిరం ఆనందంలో ఉండగా అప్పుడు ఆసీస్ స్కోరు 13.3 ఓవర్లలో 134/5. గెలుపు సమీకరణం 39 బంతుల్లో 85 పరుగులు భారత్‌కే అనుకూలంగా ఉంది. కానీ తర్వాత కెప్టెన్ వేడ్ (28 నాటౌట్) జతవ్వగా... మ్యాక్స్‌వెల్ యథేచ్ఛగా భారీసిక్సర్లతో భారత్ శిబిరాన్ని వణికించాడు. 18 బంతుల్లో 49 పరుగులు చేయాల్సివుండగా 18వ ఓవర్ వేసిన ప్రసిధ్ కేవలం 6 పరుగులే ఇచ్చి భారత్‌కు ఊరటనిచ్చాడు. కానీ అదే ప్రసిధ్ ఆఖరి ఓవర్లో 6 బంతుల్లో 21 పరుగులు కావాల్సినపుడు 4, 1, 6, 4, 4, 4లతో 23 పరుగులిచ్చుకున్నాడు. ఇందులో ఆఖరి 4 బంతుల్ని బౌండరీలను దాటించిన మ్యాక్స్‌వెల్ 47 బంతుల్లోనే సెంచరీ సాధించాడు.



స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: యశస్వి (సి) వేడ్ (బి) బెహ్రెన్‌డార్ఫ్ 6; రుతురాజ్ నాటౌట్ 123; ఇషాన్ (సి) స్టొయినిస్ (బి) రిచర్డ్‌సన్ 0; సూర్యకుమార్ (సి) వేడ్ (బి) హార్డి 39; తిలక్ వర్మ నాటౌట్ 31; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 222.** **వికెట్ల పతనం:** 1–14, 2–24, 3–81. **బౌలింగ్:** రిచర్డ్‌సన్ 3–0–34–1, బెహ్రెన్‌డార్ఫ్ 4–1–12–1, ఎలిస్ 4–0–36–0, తన్వీర్ సంఘా 4–0–42–0, హార్డి 4–0–64–1, మ్యాక్స్‌వెల్ 1–0–30–0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (సి) బిష్ణోయ్ (బి) అవేశ్ 35; హార్డి (సి) ఇషాన్ (బి) అర్ష్‌దీప్ 16; ఇంగ్లిస్ (బి) బిష్ణోయ్ 10; మ్యాక్స్‌వెల్ నాటౌట్ 104; స్టొయినిస్ (సి) సూర్య (బి) అక్షర్ 17; టిమ్ డేవిడ్ (సి) సూర్య (బి) బిష్ణోయ్ 0; వేడ్ నాటౌట్ 28; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 225.** **వికెట్ల పతనం:** 1–47, 2–66, 3–68, 4–128, 5–134. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–44–1, ప్రసిధ్‌కృష్ణ 4–0–68–0, రవి బిష్ణోయ్ 4–0–32–2, అవేశ్‌ఖాన్ 4–0–37–1, అక్షర్ పటేల్ 4–0–37–1.

4 అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక (4) సెంచరీలు చేసిన ఆటగాడిగా రోహిత్‌శర్మ రికార్డును మ్యాక్స్‌వెల్ సమం చేశాడు.

100 మ్యాక్స్‌వెల్‌కు ఇది 100వ అంతర్జాతీయ టి20 మ్యాచ్. వందో మ్యాచ్‌లో సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా అతను నిలిచాడు.

68 భారత్ తరఫున టి20ల్లో అత్యధిక పరుగులు (68) ఇచ్చిన ఆటగాడు ప్రసిధ్ కృష్ణ

'ఆ క్షణం లైబ్రరీలా అనిపించింది'

- కోహ్లి వికెట్‌పై కమిన్స్ వ్యాఖ్య
- స్వదేశంలో వరల్డ్ కప్ గెలుపు సంబరాలు



సిడ్నీ: వన్డే వరల్డ్ కప్ గెలిచి వారం రోజులు దాటినా ఆస్ట్రేలియా జట్టు తమ విజయాన్ని ఇంకా వేడుకలా జరుపుకుంటూనే ఉంది. మంగళవారం సిడ్నీ మైదానంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్, పేసర్ మిచెల్ స్టార్క్ కలిసి వరల్డ్ కప్ ట్రోఫీని ప్రదర్శించాడు. ఈ సందర్భంగా కమిన్స్ తన ఫైనల్ మ్యాచ్ అనుభవాన్ని గుర్తు చేసుకున్నాడు. ముఖ్యంగా కోహ్లి వికెట్ తీయడం మ్యాచ్‌ను మలుపు తిప్పిందని అతను అన్నాడు. కమిన్స్ బంతిని కోహ్లి వికెట్లపైకి ఆడుకోవడంతో భారత్ భారీ స్కోరు చేయడంలో విఫలమైంది. ఆ క్షణం మైదానంలో ఆవరించిన నిశ్శబ్దం మరచిపోలేనని కమిన్స్ అన్నాడు. 'కోహ్లి వికెట్ పడిన తర్వాత మా జట్టు సభ్యులంతా ఒక చోట చేరి సంబరాలు చేసుకుంటుంటే స్మిత్ ఒక మాట అన్నాడు. మైదానంలో ఏదైనా శబ్దం వినిపిస్తోందా అని అడిగాడు. మేం ఒక క్షణం ఆగి గమనించాం. స్టేడియం మొత్తం ఒక లైబ్రరీలా అనిపించింది. లక్ష మంది ఉన్న మైదానంలో అంతా నిశ్శబ్దం ఆవరించింది. ఈ ఘట్టాన్ని చిరకాలం గుర్తుంచుకుంటా' అని కమిన్స్ వ్యాఖ్యానించాడు. ఒకే సమయంలో భిన్న ఫార్మాట్‌లలో తాము ప్రపంచ చాంపియన్‌లుగా ఉండటం చాలా గర్వంగా ఉందని అన్నాడు.

ఆరుగురు ఆసీస్ ఆటగాళ్లు ముందుగానే...

భారత్‌తో జరుగుతున్న టి20 సిరీస్‌లో పాల్గొంటున్న ఆస్ట్రేలియా జట్టులోని ఆరుగురు ప్రధాన ఆటగాళ్లు సిరీస్ ముగియడానికి ముందే స్వదేశానికి వెళ్లిపోతున్నారు. వరల్డ్ కప్ గెలిచిన జట్టులో సభ్యులుగా ఉన్నవారిలో ఏడుగురు టి20 సిరీస్ కోసం ఇక్కడే ఆగిపోయారు. వీరిలో హెడ్ ఒక్కడే సిరీస్ ముగిసే వరకు ఉండనున్నారు. స్మిత్, జంపా ఇప్పటికే బయల్దేరిపోగా...మరో నలుగురు మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, ఇన్‌గ్లిస్, అబాట్ మూడో మ్యాచ్ ముగియగానే వెళ్లిపోతారు. చివరి రెండు మ్యాచ్‌లకు వీరు అందుబాటులో ఉండటం లేదు. వీరి స్థానాల్లో జోష్ ఫిలిప్, బెన్ మెక్‌డెర్మాట్, బెన్ ద్వార్‌షియస్, క్రిస్ గ్రీన్‌లను ఆస్ట్రేలియా సెలక్టర్లు ఎంపిక చేశారు.

ట్రైలర్ చూశా.. మెంటలొచ్చేసింది! - మహేశ్ బాబు



సందీప్ రెడ్డి, మహేశ్‌బాబు, రణ్‌బీర్ కపూర్, రాజమౌళి, అనిల్ కపూర్, రష్మికా మందన్నా

''యానిమల్' ట్రైలర్ చూశా.. మెంటలొచ్చేసింది. ఇంత ఒరిజినల్ ట్రైలర్‌ని నేను ఇప్పటి వరకూ చూడలేదు. సందీప్ అంటే నాకు ఇష్టం. తను చాలా యునిక్, ఒరిజినల్ ఫిల్మ్ మేకర్. ఇది ప్రీ రిలీజ్ వేడుకలా లేదు.. వంద రోజుల వేడుకలా ఉంది'' అని హీరో మహేశ్‌బాబు అన్నారు. రణ్‌బీర్ కపూర్, రష్మికా మందన్న జంటగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించిన చిత్రం 'యానిమల్'. అనిల్ కపూర్, బాబీ డియోల్ కీలక పాత్రల్లో నటించారు. భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 1న రిలీజ్ కానుంది. తెలుగులో నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి హీరో మహేశ్‌బాబు, డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి అతిథులుగా హాజరయ్యారు. మహేశ్‌బాబు మాట్లాడుతూ– ''నేను రణ్‌బీర్ అభిమానిని. తను ఇండియాలో ది బెస్ట్ యాక్టర్ అని నా అభిప్రాయం. రష్మిక ప్రయాణం చూస్తుంటే గర్వంగా ఉంది. ఈ చిత్రం బ్లాక్ బస్టర్ అవుతుంది'' అన్నారు. రాజమౌళి మాట్లాడుతూ– ''ప్రతి ఏడాది కొత్త దర్శకులు వచ్చి పెద్ద సినిమాలు తీసి విజయాలు అందుకుంటారు.. చాలా పేరు సాధిస్తారు. కానీ ఎప్పుడో ఒకసారి ప్రేక్షకులని, ఇండస్ట్రీనే కాదు.. సినిమా ఫార్ములాని కూడా షేక్ చేసే దర్శకులు వస్తారు. ఒకప్పుడు రామ్‌గోపాల్ వర్మ వచ్చారు.. ఇప్పుడు సందీప్ వంగా. బాలీవుడ్‌లో నా ఫేవరెట్ యాక్టర్ రణ్‌బీర్ కపూర్'' అన్నారు. రణ్‌బీర్ కపూర్ మాట్లాడుతూ– ''రాజమౌళిగారు గొప్ప మనసున్న వ్యక్తి. నేను కలిసిన మొదటి సూపర్ స్టార్ మహేశ్‌బాబుగారు. 'ఒక్కడు' సినిమా చూసి ఆయనకి మెసేజ్ చేశాను'' అన్నారు. ఈ వేడుకలో మంత్రి మల్లారెడ్డి, నిర్మాతలు 'దిల్' రాజు, భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు సూపర్ స్టార్ కావొచ్చు!



నయనతార

నయనతార కెరీర్‌లో రూపొందిన 75వ సినిమా 'అన్నపూరణి'. జై, సత్యరాజ్ కీలక పాత్రలు పోషించారు. నీలేష్ కృష్ణ దర్శకత్వంలో జీ స్టూడియోస్, నాడ్ స్టూడియోస్, ట్రైడెంట్ ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 1న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ విడుదలైంది ''నేను ఇండియాలోనే బెస్ట్ చెఫ్ అవుతాను.. అంకుల్', 'కలలో కోట కట్టకు.. వీధిలో క్రికెట్ ఆడే ప్రతి ఒక్కరూ సచిన్ టెండూల్కర్ కాలేడు, అలాగే ప్రతి బస్ కండక్టర్ సూపర్‌స్టార్ కాలేడు', 'ఇష్టపడి చేస్తే లక్షల్లో ఒకరు కాదమ్మా... లక్ష మందీ సూపర్ స్టార్ కావొచ్చు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఓ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన అన్నపూర్ణ (నయనతార పాత్ర పేరు) చెఫ్ కావాలనుకుంటుంది. ఈ క్రమంలో మాంసాహార వంటకాలను రుచిగా చేయాల్సి ఉంటుంది. కానీ ఇందుకు ఆ యువతి కుటుంబ సభ్యులు ఒప్పుకోరు. అప్పుడు ఆ యువతి ఏం చేసింది? జీవితంలో ఆమె లక్ష్యాన్ని ఎలా చేరుకుంది? అన్నది ఈ సినిమా కథనం.

రాసి పెట్టుకోండి.. అందర్నీ నవ్విస్తాం - నితిన్



వక్కంతం వంశీ, నితిన్, సుధాకర్ రెడ్డి, సునీల్ నారంగ్

''నటుడిగా నా 21 ఏళ్ల కెరీర్‌లో 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' నా 32వ సినిమా. నేను చేసిన మంచి పాత్రల్లో ఈ చిత్రం నంబర్ వన్ అవుతుంది. వక్కంతం వంశీగారు కథ అందించిన 'కిక్, రేసు గుర్రం, టెంపర్' సినిమాలన్నీ హిట్ అయ్యాయి. ఈ చిత్రాలకు ఏ మాత్రం తగ్గకుండా 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' మూవీ ఉంటుంది. ప్రేక్షకులందర్నీ నాన్ స్టాప్‌గా నవ్విస్తాం'' అని హీరో నితిన్ అన్నారు. వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్'. శ్రేష్ఠ్ మూవీస్, ఆదిత్య మూవీస్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, రుచిర ఎంటర్‌టైన్ మెంట్స్‌పై సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం డిసెంబర్ 8న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో నితిన్ మాట్లాడుతూ– ''ఈ మూవీలో స్క్రీన్ ప్లే కొత్తగా ఉంటుంది. మంచి కథ, పాటలు, చక్కని డ్యాన్స్ కూడా ఉంటాయి. డిసెంబర్ 8న హిట్ సాధించబోతున్నాం.. ఇది కచ్చితం.. రాసి పెట్టుకోండి'' అన్నారు. ''ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌కి మమ్మల్ని సపోర్ట్ చేయటానికి వచ్చిన అభిమానులు, ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు ఎన్. సుధాకర్ రెడ్డి. ''అద్భుతమైన ఔట్‌పుట్ ఇవ్వటానికి నేను, నితిన్ రెండేళ్లు కష్టపడ్డాం. అందర్నీ ఎంటర్‌టైన్ చేయాలని రెండేళ్లు కష్టపడి చాలా జాగ్రత్తగా ఒళ్లు దగ్గర పెట్టుకుని పని చేశాం'' అన్నారు వక్కంతం వంశీ.

గర్ల్ ఫ్రెండ్ కథ



అల్లు అరవింద్, రాహుల్ రవీంద్రన్

రష్మికా మందన్నా ప్రధాన పాత్రలో నటించనున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో విద్య కొప్పినేని, ధీరజ్ మొగిలినేని నిర్మించనున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శక–నిర్మాత మారుతి కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. దర్శక–నిర్మాత సాయి రాజేశ్ గౌరవ దర్శకత్వం వహించారు. వైవిధ్యమైన ప్రేమకథతో తెరకెక్కనున్న 'ది గర్ల్ ఫ్రెండ్' సినిమా రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభం కానుందని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ సినిమాకు సంగీతం: హేషమ్ అబ్దుల్ వాహబ్, కెమెరా: కృష్ణన్ వసంత్.

ఎనభై లొకేషన్స్‌లో షష్టిపూర్తి



అర్చన, ఆకాంక్షా సింగ్, రూపేష్ కుమార్, రాజేంద్రప్రసాద్

రూపేష్ కుమార్ హీరోగా నటిస్తూ, నిర్మిస్తున్న చిత్రం 'షష్టిపూర్తి'. పవన్‌ప్రభ దర్శకత్వంలో ఆకాంక్షా సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రాజేంద్రప్రసాద్, అర్చన కీలక పాత్రధారులు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేసి, సినిమా విజయం సాధించాలన్నారు. ఈ సందర్భంగా పవన్‌ప్రభ మాట్లాడుతూ– ''షష్టిపూర్తి' నేపథ్యంలో రూపొందుతున్న సినిమా ఇది. కొంత టాకీ పార్టు, ఓ యాక్షన్ సీక్వెన్స్ బ్యాలెన్స్ ఉన్నాయి. బ్యాలెన్స్ ఉన్న యాక్షన్ సీన్ కోసం రూపేష్ గారు శిక్షణ తీసుకుంటున్నారు. సినిమాలో మొత్తం 80 లొకేషన్స్ ఉన్నాయి. కానీ రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో ఎక్కువ శాతం చిత్రీకరణ జరిగింది. 'లేడీస్ టైలర్' తర్వాత.. అంటే 37 ఏళ్ల తర్వాత రాజేంద్రప్రసాద్, అర్చనగార్లు ఈ సినిమాలో నటిస్తున్నారు కాబట్టి వారిపై ఓ స్పెషల్ రెట్రో ఎపిసోడ్‌ను కూడా చిత్రీకరించాం. ఈ సినిమా ఓ మ్యూజికల్ జర్నీ. అందుకే సంగీత దర్శకుడిగా ఇళయరాజాగారిని తీసుకోవడం జరిగింది'' అన్నారు.

మార్చిలో గోదావరి గ్యాంగ్



విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' మార్చిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నేహా శెట్టి కథానాయికగా నటించగా, నటి అంజలి ముఖ్యమైన పాత్రను పోషించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, వెంకట్ ఉప్పుటూరి, ఇన్నమూరి గోపీచంద్ నిర్మించిన ఈ చిత్రం విడుదల తేదీ మారింది. తొలుత డిసెంబరు 8న సినిమాని విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే 2024 మార్చి 8న రిలీజ్ చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు. ''చీకటి ప్రపంచంలో సాధారణ స్థాయి నుండి ధనవంతుడిగా ఎదిగిన ఓ వ్యక్తి కథతో ఈ చిత్రం రూపొందింది. అతని ప్రయాణంలో రాజకీయ చిక్కులు కూడా ఉంటాయి. ఈ సినిమాలో విశ్వక్ సేన్ గ్రే క్యారెక్టర్‌లో కనిపిస్తారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్ రాజా, కెమెరా: అనిత్ మధాడి.

పదకొండు సినిమాల ప్లాన్ ఉంది



కంచర్ల ఉపేంద్ర

కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ హీరోయిన్లుగా ఆర్యన్ సుభాన్ ఎస్ .కె దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. కంచర్ల అచ్యుతరావు నిర్మించిన ఈ చిత్రం డిసెంబరు 1న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కంచర్ల ఉపేంద్ర మాట్లాడుతూ– ''మా నాన్న (కంచర్ల అచ్యుతరావు)గారు రియల్ ఎస్టేట్ వ్యాపారి. సామాజిక కార్యకర్త. ఉపకారి అనే స్వచ్ఛంద సేవా సంస్థను కూడా నిర్వహిస్తున్నారు. నన్ను యాక్టింగ్ వైపు ప్రోత్సహించారు. కంచర్ల, ఉపేంద్ర బీఫార్మసీ, ఐపీసీ 369, అనగనగా కథలో.., ఉపేంద్రగాడి అడ్డా.. ఇలా ఒకేసారి ఐదు సినిమాలు ప్రారంభించాం. వివిధ కారణాల వల్ల నేను సైన్ చేసిన నా ఐదో సినిమా 'ఉపేంద్రగాడి అడ్డా' నా తొలి మూవీగా రిలీజ్ అవుతోంది. సోషల్ మీడియాను మంచిగా ఎలా వినియోగించుకోవాలి అనే అంశంతో పాటు ఎలా వినియోగించుకోకూడదో కూడా చెప్పేలా చిన్న సందేశంతో ఈ సినిమా తీశాం. మహిళలకు బాగా నచ్చుతుంది. నా తర్వాతి చిత్రం 'కంచర్ల' సంక్రాంతి టైమ్‌లో విడుదల కావొచ్చు. ఇక నా ఆరో సినిమా '1920 భీమునిపట్నం'కు ఇళయరాజాగారు సంగీతం ఇవ్వడం చాలా సంతోషాన్నిస్తోంది. మా నాన్నగారు నాతో 11 సినిమాలు తీయాలని నిర్ణయించుకున్నారు'' అని చెప్పుకొచ్చారు.

పది నిమిషాలకో ట్విస్ట్ ఉంటుంది



సుభాష్ నూతలపాటి

కార్తీక్‌రాజు, సిమ్రాన్ చౌదరి, ఐరా హీరో హీరోయిన్లుగా మహేశ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రం 'అథర్వ'. నూతలపాటి నరసింహం, అనసూయమ్మ సమర్పణలో సుభాష్ నూతలపాటి నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా సుభాష్ నూతలపాటి మాట్లాడుతూ– ''దర్శకుడు మహేశ్ రెడ్డిగారు ఈ సినిమా కథ చెప్పినప్పుడు థ్రిల్లింగ్‌గా అనిపించింది. మహేశ్‌గారి సోదరుడు ఒకరు 'క్లూ' టీమ్‌లో వర్క్ చేస్తున్నారు. ఆయన సహకారంతో, పరిశోధన చేసి ఈ సినిమా కథను రెడీ చేశారు మహేశ్. ప్రతి పది నిమిషాలకో ట్విస్ట్ ఉంటుంది. సురేష్ ప్రొడక్షన్స్ మా సినిమా రిలీజ్‌కు సహాయం చేస్తోంది. నిర్మాత సురేష్‌బాబుగారు ఈ సినిమాను చూడలేదు. అయితే 'క్లూస్' అధికారులకు ఈ సినిమాను చూపించినప్పుడు వారు హ్యాపీగా ఫీలయ్యారు. థ్రిల్లింగ్‌గా ఉందని చెప్పారు. ఈ సినిమా వారికో నివాళిగా కొందరు పేర్కొనడం ఆనందంగా అనిపించింది. ఈ సినిమాకు సీక్వెల్ తీయవచ్చు'' అని చెప్పుకొచ్చారు.

సాక్షి బిజినెస్
బుధవారం
29-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
204	95
66,174	19,890

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు సోమవారం ముగింపు)

నాస్‌డాక్	14,241	▽	10
డోజోన్స్	35,333	▽	57
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,431	▽	30
డాక్స్	15,937	▽	29
షాంఘై	3,039	▲	7
నికాయ్	33,408	▽	39

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.62	84.29
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.73	107.11
€	యూరో	ఒకటి	89.88	92.96
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.49	57.19
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.52	55.90
S$	సింగపూర్ డాలర్	ఒకటి	54.31	56.78
SAR	సౌదీ రియాల్	ఖాతాదారుకి	21.19	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాదారుకి	21.79	22.99
¥	చైనా యువాన్	ఖాతాదారుకి	10.49	12.58

70 లక్షల మొబైల్ నంబర్స్ రద్దు

అనుమానాస్పద లావాదేవీలు కారణం



న్యూఢిల్లీ: డిజిటల్ మోసాలకు చెక్ చెప్పే దిశగా 70 లక్షల మొబైల్ నంబర్లను సస్పెండ్ చేసినట్లు కేంద్ర ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి వివేక్ జోషి తెలిపారు. ఆయా నంబర్లపై అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడమే ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు. ఆర్థికాంశాలకు సంబంధించిన సైబర్ భద్రత, డిజిటల్ పేమెంట్ల మోసాలు పెరుగుతుండటం తదితర అంశాలపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన ఈ విషయాలు తెలిపారు. ఇటువంటి సమావేశాలు మరిన్ని నిర్వహించనున్నట్లు, జనవరిలో తదుపరి భేటీ ఉండనున్నట్లు జోషి చెప్పారు. మోసాల బారిన పడకుండా అమాయక కస్టమర్లను కాపాడేందుకు సైబర్ మోసాల గురించి అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ పేమెంట్ మోసాలు, వాటిని కట్టడి చేయడంలో ఎదురవుతున్న సవాళ్లపై ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ ఈ సమావేశంలో ప్రెజెంటేషన్ ఇచ్చింది.

బెంగళూరులో ఏఎండీ గ్లోబల్ డిజైన్ సెంటర్



న్యూఢిల్లీ: అమెరికా సెమీకండక్టర్ దిగ్గజం ఏఎండీ తాజాగా బెంగళూరులో గ్లోబల్ డిజైన్ సెంటర్‌ను ప్రారంభించింది. 5,00,000 చ.అ. విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన క్యాంపస్‌ను ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రారంభించినట్లు కంపెనీ వివరించింది. ఇది తమకు అతి పెద్ద గ్లోబల్ డిజైన్ సెంటర్ అని తెలిపింది. భారత్‌లో 400 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో భాగంగా ఏఎండీ దీన్ని ఏర్పాటు చేసింది. రాబోయే రోజుల్లో ఈ సెంటర్‌లో 3,000 మంది ఇంజనీర్లు ఉంటారని కంపెనీ తెలిపింది. 3డీ స్టాకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌తో పాటు సెమీకండక్టర్ టెక్నాలజీ డిజైనింగ్, అభివృద్ధి కార్యకలాపాలపై దృష్టి పెట్టనున్నట్లు వివరించింది.

భారత్‌లో మరో 1.6 బిలియన్ డాలర్లు

విస్తరణ బాటలో ఫాక్స్‌కాన్

- ఇప్పటికే 8 బిలియన్ డాలర్ల పెట్టుబడులు
- చైనా ప్లస్ వన్ వ్యూహంలో భాగం



ముంబై: ఐఫోన్ల కాంట్రాక్ట్ తయారీ సంస్థ, తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఫాక్స్‌కాన్ భారత్‌లో తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించడంపై దృష్టి పెడుతోంది. ఈ క్రమంలో తాజాగా మరో 1.6 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 13 వేల కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తైవాన్‌లోని స్టాక్ ఎక్స్ఛేంజీలకు సంస్థ తెలియజేసింది. భారత్‌లోని తమ అనుబంధ సంస్థ హోన్ హాయ్ టెక్నాలజీ ఇండియా మెగా డెవలప్‌మెంట్ ద్వారా పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది. చైనాకు మాత్రమే పరిమితం కాకుండా కార్యకలాపాలను ఇతర దేశాలకు కూడా మళ్లించే వ్యూహంలో భాగంగా (చైనా ప్లస్ వన్) కంపెనీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా–చైనా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతుండటం తరచుగా సమస్యలకు దారి తీస్తున్న నేపథ్యంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. ఫాక్స్‌కాన్ ఇప్పటికే భారత్‌లో దాదాపు 8 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. భారత మార్కెట్లో అవకాశాల రీత్యా ఇక్కడ తమ పెట్టుబడులను గతేడాదితో పోలిస్తే మరింతగా పెంచుకునే అవకాశం ఉందని కంపెనీ చైర్మన్ యంగ్ లియు ఇటీవలే తెలిపారు.

ఐఫోన్ల తయారీలో టాప్..

అమెరికా టెక్ దిగ్గజం యాపిల్‌కు అత్యధికంగా ఐఫోన్‌లను సరఫరా చేసే కాంట్రాక్ట్ తయారీ సంస్థల్లో ఫాక్స్‌కాన్‌ది అగ్రస్థానం. భారత్‌లోనూ పోటీ సంస్థలైన టాటా, పెగాట్రాన్‌కు మించి ఉత్పత్తి చేస్తోంది. ఫాక్స్‌కాన్ ఆదాయంలో దాదాపు సగభాగం ఐఫోన్ల తయారీ ద్వారానే ఉంటోంది. కంపెనీకి భారత్‌లో 40,000 మంది పైగా వర్కర్లు ఉన్నారు. ఇక్కడ మొత్తం 30 ఫ్యాక్టరీలు ఉండగా, ఏటా దాదాపు 10 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తోంది. 2022లో ఫాక్స్‌కాన్ ఆదాయం 216 బిలియన్ డాలర్లు కాగా అందులో భారత విభాగం వాటా 4.6%గా నమోదైంది. అంతక్రితం ఏడాది 2021లో ఇది 2%గా ఉండేది. తమిళనాడులోని కాంచీపురం జిల్లాలో ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కోసం మరో ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని ఫాక్స్‌కాన్ యోచిస్తోంది. అటు కర్ణాటకలో రూ. 8,800 కోట్లతో ఐఫోన్ విడిభాగాల యూనిట్ నెలకొల్పే యోచన కూడా ఉంది. ఇందుకు తుమకూరులోని జపాన్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లో స్థలాన్ని కూడా అధికారులు పరిశీలించినట్లు సమాచారం. కొత్తగా ప్రతిపాదించిన 1.6 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికల్లోనే ఈ ఇన్వెస్ట్‌మెంట్ కూడా భాగంగా ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీతో కొత్తగా 14,000 పైచిలుకు ఉద్యోగాల కల్పన జరగవచ్చని అంచనా. ఇందులో ఫోన్ స్క్రీన్‌లు, వెలుపలి కవరింగ్‌లు తయారు చేసే అవకాశం ఉంది.

సెమీకండక్టర్లపైనా దృష్టి..

భారత్‌లో తొలి సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు ఫాక్స్‌కాన్ సైతం పోటీపడుతోంది. ఇందుకోసం ముందుగా వేదాంత సంస్థతో జట్టు కట్టినప్పటికీ, తర్వాత ఆ జాయింట్ వెంచర్ నుంచి పక్కకు తప్పుకుంది. భారతీయ భాగస్వామి అవసరం లేకుండా సొంతంగానే ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఇందుకు సంబంధించి తమ ఫ్యాబ్ యూనిట్ ప్లాన్‌కి ఆమోదం పొందేందుకు ప్రభుత్వంతో చర్చలు కూడా జరుపుతున్నట్లు కంపెనీ గతంలో తెలిపింది.

డెట్ మార్కెట్లో ఎఫ్‌పీఐల జోరు

నవంబర్‌లో రూ. 12,400 కోట్లు



న్యూఢిల్లీ: దేశీ రుణ సెక్యూరిటీల (డెట్) మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నారు. ఈ నెల (నవంబర్ 27)లో ఇప్పటి వరకూ రూ. 12,400 కోట్ల విలువైన పెట్టుబడులు చేపట్టారు. గత రెండేళ్లలో ఇవి అత్యధికంకాగా.. ఆకర్షణీయ ఈల్డ్స్ ప్రభావం చూపుతున్నాయి. వర్ధమాన మార్కెట్ల జేపీ మోర్గాన్ గవర్నమెంట్ బాండ్ ఇండెక్స్‌లో దేశీ జీసెక్యూరిటీలను చేర్చడం ఇందుకు తోడ్పాటునిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ కేలండర్ ఏడాది(2023) ప్రారంభంనుంచీ ఎఫ్‌పీఐలు దేశీ డెట్ మార్కెట్లపట్ల ఆసక్తి చూపుతున్నట్లు తెలియజేశారు. వెరసి మార్చి మినహా ఏడాది పొడవునా ఇన్వెస్ట్ చేస్తున్నట్లు తెలియజేశారు. మార్చిలో మాత్రం నికరంగా రూ. 2,505 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. కాగా.. తాజా పెట్టుబడులతో కలిపి రుణ సెక్యూరిటీలలో ఎఫ్‌పీఐల ఇన్వెస్ట్‌మెంట్స్ రూ. 47,900 కోట్లకు చేరినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ బాటలో 2021 సెప్టెంబర్ (రూ. 12,804 కోట్లు) తదుపరి తిరిగి ఈ నెలలో అత్యధికంగా రూ. 12,400 కోట్లు ఇన్వెస్ట్ చేశారు.

2 నెలల గరిష్టానికి నిఫ్టీ

మళ్లీ 66 వేల పైకి సెన్సెక్స్



ముంబై: అదానీ గ్రూప్ షేర్లు అదరగొట్టడంతో మంగళవారం నిఫ్టీ 95 పాయింట్లు పెరిగి 2 నెలల గరిష్ట స్థాయి 19,890 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 204 పాయింట్లు బలపడి 66,174 వద్ద నిలిచింది. క్రూడాయిల్ ధరలు దిగిరావడంతో ఇంధన షేర్లు రాణించడం కూడా కలిసొచ్చింది. ఉదయం స్వల్ప లాభాల్లో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. ట్రేడింగ్ చివర్లో ఆటో, విద్యుత్, మెటల్ షేర్లకు డిమాండ్ లభించడంతో ఒక దశలో సెన్సెక్స్ 286 పాయింట్లు పెరిగి 66,064 వద్ద, నిఫ్టీ 122 పాయింట్లు బలపడి 19,917 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేసింది. ఎఫ్‌ఎంసీజీ, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.784 కోట్ల షేర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,325 కోట్ల షేర్లు కొన్నారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

హిండెన్‌బర్గ్ ఆరోపణలు పరిశీలించాలంటూ కోరుతూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు తీర్పు రిజర్వ్ చేయడం అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల షేర్లూ లాభాల్లో ముగిశాయి. అత్యధికంగా అదానీ టోటల్ గ్యాస్ 20% ర్యాలీ చేసింది. అదానీ గ్రీన్ సొల్యూషన్స్ 19%, అదానీ గ్రీన్ 12%, ఎన్‌డీటీవీ 12%, అదానీ విల్మార్ 10%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 9% చొప్పున లాభపడ్డాయి. అదానీ పోర్ట్స్ 5%, అంబుజా సిమెంట్స్ 4%, ఏసీసీ సిమెంట్స్ 3% పెరిగాయి. ఫలితంగా గ్రూప్ కంపెనీల సంయుక్త మార్కెట్ క్యాపిటలైజేషన్ మంగళవారం ఒక్కరోజే రూ. ఒక లక్ష కోట్లకు పైగా పెరిగి రూ.11.31 లక్షల కోట్లకు చేరింది.

వాహనాలకు పండుగ గిరాకీ..

- 42 రోజుల్లో 37.93 లక్షల ఆటో మొబైల్ అమ్మకాలు
- డీలర్ల సమాఖ్య ఫాడా గణాంకాలు వెల్లడి



న్యూఢిల్లీ: ఈ ఏడాది పండుగ సీజన్‌లో దేశీయంగా 37,93,584 వాహనాలు అమ్ముడైనట్లు వాహన డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 19% వృద్ధి నమోదైనట్లు తెలిపింది. వ్యవస్థలో నెలకొన్న బలమైన డిమాండ్ ఇందుకు కారణమని చెప్పుకొచ్చింది. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభ రోజైన అక్టోబర్ 15 నుంచి నవంబర్ 25 వరకు(42 రోజులు) జరిగిన విక్రయాలకు సంబంధించిన గణాంకాలు ఫాడా మంగళవారం విడుదల చేసింది. ట్రాక్టర్లు మినహా అన్ని వాహన విభాగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైనట్లు వివరించింది.

- ప్యాసింజర్ వాహన అమ్మకాలు 4,96,047 నుంచి 10% పెరిగి 5,47,246కి చేరాయి. ''సీజన్ తొలినాళ్లలో స్తబ్ధుగా ఉన్న విక్రయాలు దీపావళి నుంచి భారీగా పుంజుకున్నాయి. స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్(ఎస్‌యూవీ)లకు భారీగా డిమాండ్ లభించింది'' అని ఫాడా అధ్యక్షుడు మనీష్ రాజ్ సిన్హా తెలిపారు.
- ద్విచక్ర వాహన విక్రయాలు 21% వృద్ధి పెరిగి 23,96,665 నుంచి 28,93,107 యూనిట్లకు చేరాయి. గ్రామీణ ప్రాంతం గిరాకీ పుంజుకోవడంతో రికార్డు స్థాయి విక్రయాలు జరిగినట్లు సిన్హా పేర్కొన్నారు.
- వాణిజ్య వాహన అమ్మకాలు 8% వృద్ధి చెంది 1,23,784 యూనిట్లకు చేరాయి.
- వార్షిక ప్రాతిపదికన త్రిచక్ర వాహన విక్రయాలు 41% పెరిగి 1,01,052 యూనిట్ల నుంచి 1,42,875 యూనిట్లకు చేరాయి.
- ట్రాక్టర్ల అమ్మకాల్లో 0.44% క్షీణత నమోదైంది. గతేడాదిలో 86,951 ట్రాకర్లు అమ్ముడవగా, ఈసారి 86,572 యూనిట్లకు పరిమితమయ్యాయి. దసరా సమయంలో 8.3% క్షీణత నమోదైన ట్రాకర్ల విక్రయాలు సీజన్ చరమాంకానికి భారీ రికవరీ సాధించాయని సిన్హా వివరించారు.

జాబ్ పాయింట్

ఎయిమ్స్ సంస్థల్లో 3036 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

న్యూఢిల్లీలోని కామన్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామినేషన్ ఫర్ ఎయిమ్స్ (సీఆర్‌ఈ–ఎయిమ్స్).. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ సంస్థల్లో నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైటీషియన్, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ లాండ్రీ సూపర్‌వైజర్, అసిస్టెంట్ స్టోర్ ఆఫీసర్, ఆడియోలజిస్ట్ అండ్ స్పీచ్ థెరపిస్ట్, బయో మెడికల్ ఇంజనీర్, క్యాషియర్, కోడింగ్ క్లర్క్, డార్క్‌రూమ్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డెంటల్ హైజీనిస్ట్, డైటీషియన్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/పదో తరగతి, ఐటీఐ, 12వ తరగతి/ఇంటర్, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ, టైపింగ్/డ్రైవింగ్ సర్టిఫికేట్ కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** సీబీటీ రాతపరీక్ష/స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.12.2023
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 06.12.2023 నుంచి 07.12.2023
» **అడ్మిట్ కార్డుల జారీ:** 12.12.2023.
» **పరీక్ష తేదీలు:** 18.12.2023 నుంచి 20.12.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.aiimsexams.ac.in

ఏఐఏసీఎల్‌ఏఎస్, న్యూఢిల్లీలో 906 సెక్యూరిటీ స్క్రీనర్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఏఏఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్ (ఏఏఐసీఎల్‌ఏఎస్).. దేశవ్యాప్తంగా ఏఏఐసీఎల్‌ఏఎస్ కేంద్రాల్లో ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన సెక్యూరిటీ స్క్రీనర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 906
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కుల(ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం)తో ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు/యూనివర్శిటీ/సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్, హిందీ లేదా స్థానిక భాషలో మాట్లాడే సామర్థ్యం కలిగి ఉండాలి. **వయసు:** 01.11.2023 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
» **పోస్టింగ్ స్థలం:** చెన్నై, కోల్‌కతా, గోవా, కోజికోడ్ (కాలికట్), వారణాసి, శ్రీనగర్, వడోదర, మధురై, తిరుపతి, రాయ్‌పూర్, వైజాగ్, ఇండోర్, అమృతసర్, భువనేశ్వర్, అగర్తల, పోర్ట్‌బ్లెయిర్, తిరుచ్చి, డెహ్రాడూన్, పుణె, సూరత్, లేహ్ శ్రీనగర్, పాట్నా.
» **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.34,000
» **ఎంపిక విధానం:** డిగ్రీ మార్కులు, ఐ/కలర్ బ్లైండ్‌నెస్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.12.2023
» **వెబ్‌సైట్:** www.aaiclas.aero

ఏపీ సివిల్ సప్లైస్, పార్వతీపురంలో టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్3 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్.. పార్వతీపురం మన్యం జిల్లాలో టెక్నికల్ అసిస్టెంట్ గ్రేడ్3 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 09
» **అర్హత:** బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/బయోటెక్నాలజీ/డ్రైల్యాండ్ అగ్రికల్చర్/బోటనీ) ఉత్తీర్ణులై ఉండాలి.వయసు:35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు(టీపీ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా డిస్ట్రిక్ట్ సివిల్ సప్లైస్ మేనేజర్ ఆఫీస్, ఏపీ పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్,జిల్లా కార్యాలయం, సబ్ కలెక్టరేట్ కాంపౌండ్, పార్వతీపురం, పార్వతీపురం మన్యం జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023.
» **వెబ్‌సైట్:** parvathipurammanyam.ap.gov.in

పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో 12 టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు

ఏలూరులోని రెవెన్యూ డిపార్ట్‌మెంట్.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **అర్హత:** డిగ్రీతో కంప్యూటర్స్ లేదా బీఈ, బీటెక్/బీసీఏ/ఎంసీఏ లేదా డిగ్రీతో పీజీడీసీఏ, హయ్యర్ గ్రేడ్ టైప్ రైటింగ్ సర్టిఫికేట్ ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** రూ.18,500.
» **ఎంపిక విధానం:** డిగ్రీ, అకడమిక్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023
» **వెబ్‌సైట్:** https://westgodavari.ap.gov.in

స్కిల్ ఉంటేనే.. కొలువు!

» ఐటీలో తగ్గనున్న ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్
» స్కిల్స్ అప్ గ్రేడ్ చేసుకుంటేనే అవకాశాలు
» బీఎఫ్‌ఎస్‌ఐ, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్‌లో జాబ్స్

ఏ రంగంలో నియామకాలు ఎక్కువగా జరుగుతున్నాయి.. ఐటీలో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్ పరిస్థితి ఎలా ఉంది.. ఏ స్కిల్స్‌కు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉంది..? ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, బ్యాచిలర్ డిగ్రీ కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులకు ఇలాంటి సందేహాలెన్నో!! ముఖ్యంగా నవంబర్ వచ్చిందంటే.. క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్, జాబ్ మార్కెట్ పరిస్థితులపై ఎంతో ఆసక్తి. కారణం.. మరికొద్ది నెలల్లో వారంతా కోర్సులు పూర్తి చేసుకొని ఉద్యోగ వేటలో జాబ్ మార్కెట్‌లోకి ప్రవేశిస్తుండటమే!! ఈ నేపథ్యంలో.. ఈ ఏడాది రిక్రూట్‌మెంట్ ట్రెండ్స్, డిమాండింగ్ స్కిల్స్, ఉద్యోగ సాధనకు మెలకువలపై ప్రత్యేక కథనం..

ఐటీ రంగంలో ఈ ఏడాది నియామకాలు తక్కువగా ఉంటాయని ఇప్పటికే అంచనాలు వెలువడ్డాయి. మరోవైపు ఐటీని మినహాయించి.. ఇతర రంగాల్లో రిక్రూట్‌మెంట్స్‌లో వృద్ధి కనిపించనుందని, విద్యార్థులు సదరు రంగాలపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆ మూడు సెక్టార్లు

తాజా జాబ్ మార్కెట్ పరిస్థితిని పరిగణనలోకి తీసుకుంటే.. ముఖ్యంగా మూడు రంగాలు నియామకాల్లో ముందున్నట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. బీఎఫ్‌ఎస్‌ఐ, హెల్త్‌కేర్,హాస్పిటాలిటీ రంగాల్లో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్స్ పెరగనున్నాయి. దీంతోపాటు ఈ–కామర్స్, టెక్ స్టార్టప్స్, టెలికమ్యూనికేషన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లోనూ ఫ్రెషర్స్ నియామకాల్లో వృద్ధి కనిపించనుంది.

నౌకరీ డాట్ కామ్ నివేదిక ప్రకారం–సెప్టెంబర్ చివరికి బీఎఫ్‌ఎస్‌ఐ, హెల్త్‌కేర్ సెక్టార్ల నియామకాల్లో ఏడు శాతం పెరుగుదల కనిపించింది. బీఎఫ్‌ఎస్‌ఐలోని బ్యాంకింగ్ విభాగంలో గత సెప్టెంబర్‌తో పోల్చితే ఈ ఏడాది సెప్టెంబర్‌లో నియామకాల్లో 40 శాతం వృద్ధి కనిపించింది. ఈ రంగంలో మొత్తం ఏడు శాతం వృద్ధి కనిపించగా.. ఇందులో ఇన్సూరెన్స్ విభాగంలో నాలుగు శాతం మేరకు ఉద్యోగాలు తగ్గడం గమనార్హం. ట్రావెల్ అండ్ హాస్పిటాలిటీ సెక్టార్‌లో 22 శాతం, ఫార్మా/బయోటెక్/క్లినికల్ రీసెర్చ్ విభాగంలో 11 శాతం; ఆటోమోటివ్స్, ఆయిల్ అండ్ గ్యాస్/పవర్ సెక్టార్లలో ఆరు శాతం చొప్పున నియామకాల్లో వృద్ధి నమోదైంది.ఐటీ సాఫ్ట్‌వేర్/సాఫ్ట్‌వేర్ సర్వీసెస్‌లో మాత్రం 43 శాతం మేర నియామకాలు తగ్గడం గమనార్హం.

ఈ-కామర్స్, టెక్ స్టార్టప్స్

ఈ ఏడాది ఫ్రెషర్స్ నియామకాల్లో ఈ-కామర్స్ అగ్రస్థానంలో ఉంటుందని టీమ్‌లీజ్ నివేదిక పేర్కొంది. ఈ మేరకు కెరీర్ ఔట్‌లుక్ రిపోర్ట్ 2023–హెచ్‌వై2 (జూలై–డిసెంబర్) పేరుతో ప్రత్యేక నివేదిక రూపొందించింది. ఈ నివేదిక ప్రకారం– ఈ–కామర్స్, టెక్ స్టార్టప్స్‌లో ఈ ఏడాది ద్వితీయార్థంలో 59 శాతం మేరకు ఫ్రెషర్స్ నియామకాలు జరగనున్నాయి. అదే విధంగా టెలికమ్యూనికేషన్స్‌లో 53 శాతం; ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో 50 శాతం చొప్పున రిక్రూట్‌మెంట్స్‌లో పెరుగుదల కనిపించనుంది. ఐటీ విభాగంలో 49 శాతం; హెల్త్‌కేర్/ఫార్మా రంగంలో 42 శాతం; కన్‌స్ట్రక్షన్ అండ్ రియల్ ఎస్టేట్, ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో 21 శాతం; ఎఫ్‌ఎంసీజీలో 24 శాతం; కన్సల్టింగ్‌లో 13 శాతం చొప్పున నియామకాల్లో పెరుగుదల నమోదైంది. మొత్తంగా చూస్తే ఈ ఏడాది ప్రథమార్ధంతో పోల్చితే ద్వితీయార్ధంలో మూడు శాతం మేర ఫ్రెషర్ నియామకాలు పెరుగుతాయని నివేదిక స్పష్టం చేసింది.

హాస్పిటాలిటీలో 60 శాతం!

ఈ ఏడాది ద్వితీయార్థంలో హాస్పిటాలిటీ రంగంలో నియామకాల్లో 60 శాతం వృద్ధి నమోదవుతుందని పలు సర్వే నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. హెల్త్ టూరిజం, బిజినెస్ ట్రావెల్, డొమెస్టిక్ పర్సనల్ టూర్స్‌లో పెరుగుదల కనిపిస్తుండడమే ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు. ఈవెంట్ కో ఆర్డినేటర్, జూనియర్ చెఫ్, ట్రావెల్ ఏజెంట్స్, రిసార్ట్ మేనేజర్స్, హోటల్ స్టాఫ్, హౌస్ కీపింగ్ విభాగాల్లో మానవ వనరులకు డిమాండ్ ఏర్పడనుంది. ఇదే సమయంలో స్కిల్ గ్యాప్ సమస్య కూడా ఈ రంగంలో ఉందని, సంబంధిత కోర్సుల అభ్యర్థులకు అవకాశాలు లభిస్తాయని చెబుతున్నారు.

బీఎఫ్‌ఎస్‌ఐలోనూ ఇదే జోరు

బీఎఫ్‌ఎస్‌ఐ సెక్టార్‌లో ముఖ్యంగా.. బ్యాంకింగ్ విభాగంలో నియామకాలు గతేడాది మాదిరిగానే కొనసాగుతాయని అంచనా. క్రెడిట్ కార్డ్ సేల్స్, కస్టమర్ సర్వీస్ ఏజెంట్స్, బ్రాంచ్ మేనేజర్స్ హోదాల్లో ఎక్కువ నియామకాలు ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా అనలిటిక్స్ ఆధారిత సేవలు పెరగడం కూడా ఈ రంగంలో నియామకాలకు ఊతంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు.

కన్సల్టింగ్.. తయారీ

ఫైనాన్షియల్ కన్సల్టింగ్ సెక్టార్‌లోనూ నూతన నియామకాల్లో జోరు కొనసాగనుంది. బిజినెస్ ఆపరేషన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ టెక్నాలజీ, డేటా సైన్స్ తదితర విభాగాల్లో అయిదు వేలకుపైగా నియామకాలు జరగనున్నాయి. ఇక దేశ జీడీపీలో కీలకమైన తయారీ రంగం.. నియామకాలకు ఊతంగా నిలిచే పరిస్థితి కనిపిస్తోంది. ఈ రంగంలో దాదాపు 20 వేలకు పైగా కొత్త ఉద్యోగాలు సెప్టెంబర్–డిసెంబర్ మధ్య కాలంలో లభిస్తాయని అంచనా. 5జీ టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలు, ఇండస్ట్రియల్ ఐఓటీ, ఆర్ అండ్ డీ కార్యకలాపాల్లో పెరుగుదలే ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు.

ఐటీలో ఇలా

దేశ ఐటీ రంగంలో దాదాపు 50 వేల ఉద్యోగాలు ఫ్రెషర్స్‌కు అందుబాటులోకి రానున్నట్లు అంచనా. దిగ్గజ సంస్థలతో పోల్చితే మధ్య తరహా ఐటీ సంస్థల్లో నియామకాలు కొంత ఎక్కువగా ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు. బిగ్ డేటా టెస్టింగ్ ఇంజనీర్, ఐటీ ఆపరేషన్స్ మేనేజర్ వంటి జాబ్ ప్రొఫైల్స్‌కు డిమాండ్ నెలకొంది.

జాబ్ ప్రొఫైల్స్

డెవాప్స్ ఇంజనీర్, చార్టర్డ్ అకౌంటెంట్, ఎస్ఈఓ అనలిస్ట్, యుఎక్స్ డిజైనర్ వంటి జాబ్ ప్రొఫైల్స్‌కు డిమాండ్ నెలకొంది. అదే విధంగా డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజనీర్ ఉద్యోగాలు కూడా ఎక్కువగా లభించనున్నాయి.బీఎఫ్‌ఎస్‌ఐ సెక్టార్‌లో.. బ్రాంచ్ మేనేజర్, ఫైనాన్షియల్ కన్సల్టెంట్ హోదాలకు డిమాండ్ ఉంది. హెల్త్‌కేర్ అండ్ ఫార్మా రంగంలో.. రీసెర్చర్స్, మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ నెలకొంది.



ఈ స్కిల్స్‌కు డిమాండ్

డిజిటల్ మార్కెటింగ్, బిజినెస్ కమ్యూనికేషన్, డేటా సైన్స్, బ్లాక్ చైన్, బిజినెస్ అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సెర్చ్ ఇంజన్ ఆప్టిమైజేషన్ స్కిల్స్ ఉన్న వారికి జాబ్ మార్కెట్‌లో ప్రాధాన్యం ఉంటుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఫ్రెషర్స్ నియామకాల్లో సాఫ్ట్ స్కిల్స్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. క్రిటికల్ థింకింగ్, గ్రోత్ మైండ్ సెట్, టైమ్ మేనేజ్‌మెంట్, యాక్టివ్ లెర్నింగ్ దృక్పథం ఉన్న అభ్యర్థులకు అవకాశాలు లభిస్తాయని పేర్కొంటున్నారు.

అప్ స్కిల్లింగ్ మంత్ర

ఐటీలో తగ్గుతూ.. ఇతర రంగాల్లో నియామకాలు పెరుగుతున్న తరుణంలో విద్యార్థులు అప్ స్కిల్లింగ్‌కు ప్రాధాన్యం ఇస్తేనే ఉద్యోగ సాధనలో ముందుంటారని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని రంగాల్లోనూ కీలకంగా మారిన ఏఐ/ఎంఎల్, బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, క్లౌడ్ కంప్యూటింగ్ నైపుణ్యాలు పొందేలా కృషి చేయాలని సూచిస్తున్నారు. ఐటీ ఉద్యోగాలు కోరుకునే వారు ఏఐ/ఐఓటీ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని.. డెవాప్స్, యుఎక్స్ డిజైన్ వంటి నైపుణ్యాలు పెంచుకునేందుకు కృషి చేయాలంటున్నారు.

ఎన్నో మార్గాలు

ఫ్రెష్ రిక్రూట్‌మెంట్స్‌లో కీలకంగా నిలుస్తున్న ఏఐ, ఐటీ స్కిల్స్‌ను సొంతం చేసుకునేందుకు ప్రస్తుతం పలు మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థులు ఇన్ఫోసిస్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, ఒరాకిల్, ఐబీఎం వంటి సంస్థలు అందిస్తున్న ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సులు పూర్తి చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా సంబంధిత సర్టిఫికేషన్స్ సొంతం చేసుకుంటే.. ఉద్యోగ సాధనలో ముందంజలో నిలిచే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా...

జేఈఈ మెయిన్‌కు దరఖాస్తు గడువు రేపే



సాక్షి, హైదరాబాద్: ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్రప్రభుత్వ నిధులతో నడిచే ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష(జేఈఈ మెయిన్)కు దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 30వ తేదీతో ముగుస్తుంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడించింది. దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 1వ తేదీన మొదలైంది. జేఈఈ మెయిన్ తొలివిడత పరీక్ష దేశవ్యాప్తంగా 2024 జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ జరుగుతుంది. రెండోవిడత ఏప్రిల్‌లో జరుగుతుంది. ఫిబ్రవరి 12న మెయిన్ ఫలితాలు వెల్లడిస్తారు.

ఉపాధ్యాయులకు టోఫెల్‌లో శిక్షణ

సాక్షి, అమరావతి: సర్కారు పాఠశాలల్లో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'టోఫెల్' కోర్సుపై ఉపాధ్యాయులకు మంగళవారం విజయవాడలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఇంగ్లిష్ బోధనలో నిష్ణాతులైన 120 మంది ఉపాధ్యాయులను మాస్టర్ ట్రైనర్స్‌గా ఎంపికచేసి ఢిల్లీ నుంచి వచ్చిన 'లిక్విడ్' సంస్థ ప్రతినిధులు శిక్షణనిస్తున్నారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. 26 జిల్లాల నుంచి ఇంగ్లిష్‌లో నిష్ణాతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేశామని, మాస్టర్ ట్రైనర్స్ టోఫెల్ విభాగంలో అన్ని అంశాలను అవగాహన చేసుకోవాలని సూచించారు.

దూరవిద్య 'వ్యవసాయ' కోర్సులకు దరఖాస్తులు

గుంటూరు రూరల్: దూర విద్య ద్వారా వ్యవసాయ విద్య వ్యాప్తికి లాంఫాంలోని సార్వత్రిక దూర విద్య కేంద్రం ద్వారా రైతులు, మహిళలు, యువత నుంచి వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2023 నుంచి ప్రారంభం కానున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు చిరుధాన్యాలు, పట్టు పురుగుల పెంపకం, వర్మీ కంపోస్టు, బయోఫెర్టిలైజర్స్ కోర్సులు 8 వారాలు (రెండు నెలలు) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు కోర్సుకు రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు www.-angrau.ac.in సంప్రదించాలని కోరారు.

నేడు, రేపు రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్



సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో సైన్స్‌పై ఆలోచనలు పెంచడం, వారు గుర్తించిన సమస్యలకు పరిష్కారాలు కనుగొనేలా ప్రోత్సహించేందుకు సైన్స్ కాంగ్రెస్ దోహదం చేస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి (అప్‌కాస్ట్) మెంబర్ సెక్రటరీ డాక్టర్ వై.అపర్ణ తెలిపారు. మంగళవారం విజయవాడలోని అప్‌కాస్ట్ కార్యాలయంలో ఆమె పాత్రికేయులతో మాట్లాడారు. గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 29, 30 తేదీల్లో బాలల సైన్స్ కాంగ్రెస్ నిర్వహిస్తామని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి బాల శాస్త్రవేత్తలు, గైడ్స్, ఎస్కార్ట్ టీచర్లు, జిల్లా కో–ఆర్డినేటర్లు, జిల్లా అకడమిక్ కో–ఆర్డినేటర్లతో సహా మొత్తం 500 మంది పాల్గొంటున్నట్టు ఆమె వెల్లడించారు. జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు 4 వేల ప్రాజెక్టులను ప్రదర్శించగా, వాటిలో ఉత్తమంగా ఉన్న 182 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు చెప్పారు. రెండు రోజుల ప్రదర్శనలో జిల్లాకు ఒకటి చొప్పున 26 ప్రాజెక్టులను కేవీఆర్ సైంటిఫిక్ సొసైటీకి పంపిస్తామని, వాటిలో ఉత్తమమైన 17 ప్రాజెక్టులను జాతీయ సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపిక చేయనున్నట్టు ఆమె వెల్లడించారు.

శ్రీసిటీకి ఎల్జీ పాలిమర్స్ ప్లాంట్

- హైకోర్టును కోరిన యాజమాన్యం

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో ఉన్న తమ ఇంజనీరింగ్ ప్లాస్టిక్ కాంపౌండింగ్ (ఈపీసీ) ప్లాంట్‌ను తిరుపతి, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న శ్రీసిటీకి తరలిస్తామని ఎల్జీ పాలిమర్స్ యాజమాన్యం మంగళవారం హైకోర్టుకు నివేదించింది. తమ ప్లాంట్ తరలింపునకు అనుమతినివ్వాలని కోరుతూ ఆ సంస్థ ప్రతినిధి ఓ అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం వాదనలు జరిగాయి. తమ షరతులకు కట్టుబడి ఉంటామంటే.. ఎల్జీ పాలిమర్స్ ఈపీసీ ప్లాంట్‌ను శ్రీసిటీకి తరలించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది చింతల సుమన్ తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు ఈ అనుబంధ పిటిషన్‌పై తన నిర్ణయాన్ని వాయిదా వేసింది. డిసెంబర్ 7న నిర్ణయం వెలువరిస్తామని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ మండవ కిరణ్మయి ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 మే 7న విశాఖపట్నం, ఆర్ఆర్ వెంకటాపురం వద్ద ఉన్న ఎల్జీ పాలిమర్స్ నుంచి స్టైరీన్ విష వాయువు లీక్ కావడం వల్ల పలువురు మరణించిన విషయం తెలిసిందే.

'అవుకు'పైనా అవాకులు

మీ బాబువల్ల కానిది సీఎం జగన్ చేశాడనేగా మీ ఏడుపు రామోజీ?

అవుకు సొరంగాల్లోని ఫాల్ట్‌జోన్‌లో మిగిలిన పనులు పూర్తిచేయలేక చేతులెత్తేసిన చంద్రబాబు

- ఒక సొరంగంలోని ఫాల్ట్‌జోన్‌లో లూప్‌లు తవ్వి 10 వేల క్యూసెక్కులు తరలింపు
- దాంతోనే గాలేరు–నగరి పూర్తిచేశానంటూ చంద్రబాబు బిల్డప్.. రామోజీ వత్తాసు
- అత్యాధునిక పరిజ్ఞానంతో అవుకు రెండో సొరంగాన్ని పూర్తిచేసిన సీఎం జగన్
- గాలేరు–నగరి వరద కాలువ డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులు తరలింపునకు లైన్‌క్లియర్
- ఈనెల 30న అవుకు సొరంగాన్ని జాతికి అంకితం చేయనున్న సీఎం
- దీంతో ఎస్సార్బీసీ, గాలేరు–నగరి ఆయకట్టు రైతుల్లో జగన్‌కు మరింతగా పెరిగిన ఆదరణ
- దీన్ని జీర్ణించుకోలేకే 'సీఎం మెప్పు కోసం నీటి మళ్లింపు' అంటూ 'ఈనాడు'లో రామోజీ విషం
- ఎస్సార్బీసీ ఆయకట్టుకు నీళ్లందిస్తే పంటల ప్రయోజనాలు దెబ్బతింటాయంటూ నీతిమాలిన రాతలు

సాక్షి, అమరావతి: అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన వారు అస్మదీయులైనా.. తస్మదీయులైనా సరే అభినందించడం మంచి సంప్రదాయం. కానీ.. అస్మదీయుడివల్ల కాని పనిని తస్మదీయుడు పూర్తిచేసి చూపిస్తే దానిపై విషం చిమ్మడంలో తనకు ఎవరూ సాటిరారని రామోజీరావు మరోసారి నిరూపించుకున్నారు. టీడీపీ సర్కార్ హయాంలో గాలేరు–నగరి వరద కాలువలో అంతర్భాగమైన అవుకు రెండో సొరంగంలో ఫాల్ట్‌జోన్ (మట్టి పొరలు పెళుసుగా ఉండే ప్రాంతం)లో అప్పటి సీఎం చంద్రబాబు చేతులెత్తేస్తే.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆ పనులను సీఎం వైఎస్ జగన్ పూర్తిచేయించారు. ప్రస్తుత డిజైన్ మేరకు గాలేరు–నగరి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కులను తరలించేందుకు మార్గం సుగమం చేశారు. రెండు సొరంగాల ద్వారా అవుకు రిజర్వాయర్‌కు నీటిని తరలించి.. ఎస్సార్బీసీ (శ్రీశైలం కుడి గట్టు కాలువ) ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా రెండో సొరంగాన్ని ఈనెల 30న జాతికి అంకితం చేసేందుకు సీఎం వైఎస్ జగన్ సిద్ధమయ్యారు. దీనివల్ల ఎస్సార్బీసీ, గాలేరు–నగరి ఆయకట్టు రైతులు, రాయలసీమ ప్రజల్లో సీఎం వైఎస్ జగన్‌కు ఆదరణ మరింత పెరగడాన్ని జీర్ణించుకోలేని రామోజీరావు యథావిధిగా పచ్చి అబద్ధాలు, అభూతకల్పనలను పోగేసి.. 'సీఎం మెప్పు కోసం నీటి మళ్లింపు' పేరుతో మంగళవారం ఈనాడులో ప్రభుత్వంపై విషంకక్కారు. ఇందులోని ప్రతి అక్షరంలో సీఎం జగన్‌పై అక్కసు తప్ప వీసమెత్తు నిజం కన్పించలేదు. అసలు నిజం ఏమిటంటే..

అప్పుడు బాకాలూది ఇప్పుడు శోకాలా..?

- దుర్భిక్ష రాయలసీమకు కృష్ణా జలాలను తరలించి సస్యశ్యామలం చేయడం కోసం శ్రీశైలం ప్రాజెక్టులో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 9 వేల నుంచి 44 వేల క్యూసెక్కులకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టారు. ఆ క్రమంలో సీమ ప్రజల చిరకాల స్వప్నమైన గాలేరు–నగరి సుజల స్రవంతి పథకాన్ని చేపట్టారు.
- ఎస్సార్బీసీ కాలువకు సమాంతరంగా గోరకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకూ 57.7 కిమీల పొడవున గాలేరు–నగరి వరద కాలువ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా



అవుకు రిజర్వాయర్‌కు నీళ్లు చేరక ముందు సొరంగం తవ్వాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో 16 మీటర్ల వ్యాసం, 5.7 కిమీల పొడవుతో 20 వేల క్యూసెక్కులు తరలించేలా సొరంగం నిర్మాణ పనులు చేపట్టేందుకు రూ.570.86 కోట్లతో 2006, నవంబర్ 18న పరిపాలన అనుమతిచ్చారు. సొరంగం తవ్వే ప్రాంతంలో రాతి పొరలు బలహీనంగా ఉండటంవల్ల ఒక పెద్ద సొరంగం బదులు రెండు చిన్న సొరంగాలు తవ్వాలని కేంద్ర భూగర్భ శాస్త్రవేత్తలు సూచించారు. దీంతో 11 మీటర్ల వ్యాసం, 5.7 కిమీల పొడవుతో రెండు సొరంగాల తవ్వకం పనులు చేపట్టి.. 2009 నాటికే దాదాపుగా పూర్తిచేశారు. ఎడమ సొరంగంలో 350, కుడి సొరంగంలో 180 మీటర్ల పొడవున ఫాల్ట్‌జోన్‌లో పనులు మాత్రమే మిగిలాయి.

- ఈ పనులు చేయలేక చంద్రబాబు చేతులెత్తేశారు. చివరకు ఎడమ సొరంగంలోని ఫాల్ట్‌జోన్‌లో పనులు చేయకుండా.. వాటి స్థానంలో ఏడు మీటర్ల వ్యాసంతో 2 లూప్‌లు తవ్వి పదివేల క్యూసెక్కులు తరలించి.. గండికోటలో 4 టీఎంసీలు నిల్వచేసి, గాలేరు–నగరిని తానే పూర్తిచేసినట్లు అప్పటి సీఎం చంద్రబాబు బిల్డప్ ఇచ్చారు. ఇందుకు రామోజీరావు బాకాలూదారు.
- అనంతరం.. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక.. అవుకు రెండో సొరంగాన్ని పూర్తిచేయడం ద్వారా గాలేరు–నగరి వరద కాలువ డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులు తరలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గండికోట నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లతో పునరావాసం కల్పించి 2019లోనే పూర్తిస్థాయిలో అంటే 26.85 టీఎంసీలను నిల్వచేశారు. 2020, 2021, 2022లోనూ అదే స్థాయిలో నీటిని నిల్వచేశారు.
- ఫాల్ట్‌జోన్‌లో పోర్–పూలింగ్, అంబ్రెల్లా పైప్ రూఫ్ విధానం, పాలియురిథేన్ గ్రౌటింగ్ ద్వారా రెండో సొరంగాన్ని పూర్తిచేయవచ్చని నిపుణుల కమిటీ సూచించింది. ఆ మేరకు పనులు చేసేందుకు 2020, మార్చి 12న రూ.126 కోట్లతో ప్రభుత్వం పరిపాలన అనుమతిచ్చింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫాల్ట్‌జోన్ పనులు పూర్తిచేసి.. 2023, జూన్ నాటికే అధికారులు రెండో సొరంగాన్ని పూర్తిచేశారు.
- దీంతో గాలేరు–నగరి వరద కాలువ ద్వారా 20 వేల క్యూసెక్కుల తరలింపునకు మార్గం సుగమం చేశారు. దీన్ని ఈనెల 30న సీఎం జగన్ జాతికి అంకితం చేస్తుండటంతో రామోజీకి కంటి మీద కునుకు కరువై గుండెలు బాదుకుంటున్నారు.
- అవుకు రెండు సొరంగాలకు ఇప్పటిదాకా రూ.568 కోట్లు ఖర్చుచేస్తే.. అందులో మహానేత వైఎస్ వెచ్చించింది రూ.340 కోట్లు, సీఎం వైఎస్ జగన్ వ్యయం చేసింది రూ.146 కోట్లు.
- ఇక వాతావరణ మార్పులవల్ల కృష్ణా నది నుంచి శ్రీశైలానికి వరద వచ్చే రోజులు తగ్గిన నేపథ్యంలో.. వరద వచ్చిన రోజుల్లోనే గాలేరు–నగరిపై ఆధారపడ్డ ప్రాజెక్టులను నింపేలా వరద కాలువ సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు పెంచే పనులను సీఎం వైఎస్ జగన్ చేపట్టారు. అందులో భాగంగా అవుకు వద్ద మూడో సొరంగాన్ని చేపట్టారు. ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి.

నీటిని తరలిస్తే పంటలు దెబ్బతింటాయా?

అవుకు రెండో సొరంగాన్ని పూర్తిచేయడం ద్వారా గండికోట, వామికొండ, సర్వారాయ సాగర్, పైడిపాలెం, మైలవరం రిజర్వాయర్లకు రోజుకు అదనంగా ఒక టీఎంసీని తరలించవచ్చు. రెండు సొరంగాల ద్వారా నీటిని మళ్లించడం ద్వారా 2.21 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడంతోపాటు 1.77 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించవచ్చు. అలాగే, ఎస్సార్బీసీ కింద 1.5 లక్షల ఎకరాలకు నీళ్లందించవచ్చు. దీంతో సీమ రైతుల్లో సీఎం వైఎస్ జగన్‌కు ఆదరణ మరింతగా పెరుగుతోంది. దీన్ని జీర్ణించుకోలేని రామోజీరావు 'సీఎం మెప్పు కోసమే నీటి మళ్లింపు' అంటూ కట్టుకథలు అల్లారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గోరకల్లు రిజర్వాయర్‌లో నిల్వచేసిన నీటిని రెండు టన్నెళ్ల ద్వారా అవుకు రిజర్వాయర్‌కు నీటిని తరలించనున్నారు. తద్వారా ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు పంటల ప్రయోజనాలు అందుతాయి. కానీ, దానివల్ల పంటల ప్రయోజనాలు దెబ్బతింటాయని రామోజీ రాతలు రాయడం హాస్యాస్పదం. ఇందులో రైతుల ప్రయోజనాలు తప్ప సీఎం మెప్పు కోసం అనే అంశం ఎక్కడ కనిపించింది రామోజీ!?

భారత్‌లో పంటల సాగు ప్రపంచానికే మార్గదర్శకం

- ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించిన విదేశీ బృందం



సొరకాయ సాగును పరిశీలిస్తున్న విదేశీ వ్యవసాయ అధికారుల బృందం

కార్వేటినగరం (చిత్తూరు జిల్లా): భారతదేశంలో పంటలు పండిస్తున్న విధానం ప్రపంచానికే మార్గదర్శకంగా నిలుస్తున్నాయని విదేశీ వ్యవసాయ అధికారి జింగ్‌వెన ప్రశంసించారు. మంగళవారం పెనుమూరు మండల పరిధిలోని చార్వకానివారిపల్లి గ్రామంలో రైతు మణెమ్మ, రామానాయుడు దంపతులు ప్రకృతి వ్యవసాయంతో సాగు చేస్తున్న హైబ్రీడ్ ముల్లంగి, సొరకాయ, మిరప, ఆముదం, అలసంద వంటి వివిధ పంటలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బృందంలో ఇండోనేషియా, కెనడా, శ్రీలంక దేశాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు తౌరాయి, మార్‌సెల, సిమోనె, ఆర్వెన్, రాక్‌సా, ఆలెజంద్ర, నదియ, సురేంద్ర, గుల్‌షాన్, ఉమ, సుదర్శన్ ఉన్నారు. వారు మాట్లాడుతూ.. రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి వేడి అవ్వడమే కాకుండా వాతావరణంలో ప్రమాదకరమైన కాలుష్యం ఏర్పడుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసే పంటలను వాడడం వల్ల ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని తమ దేశాల్లోనూ అమలు చేస్తామన్నారు. దశపత్ర కషాయం, జీవామృతం, నీమాస్త్రం వంటి ప్రకృతి వ్యవసాయ ఉపకరణాల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు, మండల వ్యవసాయ అధికారి కళ్యాణ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నౌకాదళ విన్యాసాలు



బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): విశాఖ ఆర్కే బీచ్‌లో నౌకాదళ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డిసెంబర్ 4న నౌకాదళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ విన్యాసాలు నిర్వహించారు. సముద్రంలో యుద్ధ నౌకలు, హెలికాప్టర్ల విన్యాసాలను చూసేందుకు విశాఖ నగర వాసులే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు బీచ్‌కు చేరుకున్నారు. దీంతో ఆర్కే బీచ్ కిటకిటలాడింది. యుద్ధ సమయంలో నావికాదళం ఎలా స్పందిస్తుంది, శత్రువులపై ఎలా ఎదురుదాడికి దిగుతుందో కళ్లకు కట్టినట్లు చూపించారు. తీరానికి వచ్చిన సందర్శకులు ఈ విన్యాసాలను ఆసక్తిగా తిలకించారు.

ఇక స్టెప్, డీఎస్‌ఏలు వేర్వేరు

కడప స్పోర్ట్స్: క్రీడాశాఖలో కీలక మలుపునకు శ్రీకారం చుడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాల్లో ఇక నుంచి యువజన సర్వీసుల శాఖ పరిధిలోని సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రమోషన్(స్టెప్), జిల్లా స్పోర్ట్స్ అథారిటీ(డీఎస్‌ఏ)లు వేర్వేరుగా కొనసాగనున్నాయి. ఈ మేరకు యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డీఎస్‌ఏ, స్టెప్ వేర్వేరుగా ఉండేవి. కానీ, 2018, జనవరిలో అప్పటి ప్రభుత్వం డీఎస్‌ఏలను స్టెప్‌లో విలీనం చేసింది. అప్పటి వరకు ఉన్న డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎస్‌డీవో) పోస్టును సైతం రద్దు చేసి చీఫ్ కోచ్‌గా స్థాయిని తగ్గించింది. అప్పట్లో స్టెప్ సీఈవో, డీఎస్‌డీవోల మధ్య పలు అభిప్రాయబేధాలు తలెత్తడంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కోచ్‌లు తమను స్టెప్ నుంచి వేరు చేసి తమ సొంతశాఖను యథాతథంగా ఉంచాలని విన్నవించారు. తాజాగా ప్రభుత్వం స్టెప్, డీఎస్‌ఏలను వేర్వేరు శాఖలుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు డిసెంబర్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. అదేవిధంగా చీఫ్ కోచ్ పోస్టును తిరిగి డీఎస్‌డీవోగా ఉన్నతీకరిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీల నిర్వహణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో కొద్దిరోజుల పాటు రెండుశాఖలు సమన్వయంతో పనిచేయనున్నట్లు క్రీడాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. ప్రభుత్వం స్టెప్, డీఎస్‌ఏలను వేర్వేరు శాఖలుగా ఏర్పాటు చేయడం పట్ల డీఎస్‌ఏ కోచ్‌లు, సిబ్బంది సంతోషం వ్యక్తంచేశారు.

రూ. 9.41 లక్షల కోట్ల కొత్త పెట్టుబడులు

నాలుగేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఏపీకి వచ్చినవి

- ఎంఎస్‌ఎంఈ ఎగుమతి ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ వెల్లడి



సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ దూసుకెళుతోంది. 2018–19 నుంచి 2022– 23 వరకు రూ. 9,41,020 కోట్ల విలువైన కొత్త పెట్టుబడులను రాష్ట్రం ఆకర్షించింది. దీనిలో 2022–23లో అత్యధికంగా రూ. 3,32,186 కోట్లు ఉండటం విశేషం. ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆర్గానిక్ ఫుడ్ ప్రొడ్యూసర్స్ అండ్ మార్కెటింగ్ ఏజెన్సీస్ (సీఏఐఏ) సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ఈ వివరాలు వెల్లడించింది. ఈ అధ్యయన నివేదికను మంగళవారం ఢిల్లీలో ఎంఎస్‌ఎంఈ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్. రావత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఆఫ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ)లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం, ఈ కాలంలో రాష్ట్రంలో రూ. 1,34,419 కోట్లు పెట్టుబడి ప్రాజెక్టులు పూర్తవ్వగా పెండింగ్‌లో ఉన్న రూ. 27,110 కోట్ల విలువైన ప్రాజెక్టులు పునరుద్ధరించడమైందని ఆయన వివరించారు. 2022–23లో మొత్తం పెట్టుబడి ప్రాజెక్టుల విలువ రూ. 17,90,533 కోట్లు అని ఆయన చెప్పారు. విత్‌హెల్డ్ ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి హైపవర్డ్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని అధ్యయనం నొక్కి చెప్పింది. పెట్టుబడులు త్వరగా వస్తే 2 లక్షలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించవచ్చని చైర్మన్ డాక్టర్ రావత్ చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన కొత్త పెట్టుబడి ప్రాజెక్టులు రూ. 23,293 కోట్లు కాగా, ప్రైవేట్ రంగం రూ. 3,08,893 కోట్లు.

ఏపీ నుంచే నేరుగా విదేశాలకు..

- ఏపీ భవన్‌లో 'ఆంధ్రప్రదేశ్–విమానయానం ద్వారా కనెక్టివిటీ' అనే అంశంపై సమీక్ష
- హాజరైన వైజాగ్, తిరుపతి, కడప, కర్నూలు ఎయిర్‌పోర్టుల డైరెక్టర్లు



సాక్షి, న్యూఢిల్లీ: ఇకపై విదేశాలకు వెళ్లేవారు హైదరాబాద్‌తో సంబంధం లేకుండా ఏపీ నుంచే నేరుగా వెళ్లేలా విమానయాన రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరముందని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ పేర్కొన్నారు. అందుకు సంబంధించి మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన అవసరమన్నారు. రాష్ట్ర విమానయాన రంగంపై ఢిల్లీలోని ఏపీ భవన్‌లో 'ఆంధ్రప్రదేశ్–విమానయానం ద్వారా కనెక్టివిటీ' అనే అంశంపై లవ్ అగర్వాల్ అధ్యక్షతన మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. ప్రభుత్వ సలహాదారుడు ఆదిత్యనాథ్ దాస్, పరిశ్రమలు, వాణిజ్యశాఖ సెక్రటరీ యువరాజ్, ఏపీ భవన్ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్, విశాఖ, తిరుపతి, కడప, కర్నూలు ఎయిర్ పోర్టుల డైరెక్టర్లు, వివిధ ప్రైవేటు విమానయాన సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈసందర్భంగా లవ్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఏపీలోని వివిధ పట్టణాల మధ్య విమాన సర్వీసులను పెంచడం ద్వారా ప్రజలకు మెరుగైన ప్రయాణం, రవాణా సదుపాయాల్ని కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున విమానయాన సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.

'ఈజ్ ఆఫ్ ట్రావెల్' ద్వారానే సాధ్యం

విమానయానం ద్వారా ఈశాన్య భారతాన్ని దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానిస్తున్నప్పుడు.. ఆ సౌకర్యాలు ఏపీకి ఎందుకు కల్పించలేకపోతున్నారని ఎయిర్‌పోర్టు డైరెక్టర్లను అగర్వాల్ ప్రశ్నించారు. 'ఈజ్ ఆఫ్ ట్రావెల్' ద్వారానే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' సాధ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పట్టణాల మధ్య, రాష్ట్ర పట్టణాలకు దేశంలోని ఇతర పట్టణాలతో కనెక్టివిటీని పెంచేందుకు తోడ్పాటు ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా విశాఖ నుండి రాష్ట్రంలోని ప్రధాన నగరాలకు, సమీప నగరాలైన భువనేశ్వర్, కలకత్తాలకు సర్వీసులు అవసరమన్నారు. వీటితో పాటు థాయ్‌లాండ్, మలేషియా, శ్రీలంక, సింగపూర్ వంటి దేశాలకు విమాన సర్వీసులను నడపాల్సిన అవసరం ఉందని వివరించారు. సుమారు రెండు కోట్ల మంది తమ విమాన ప్రయాణం కోసం విశాఖపట్నం విమానాశ్రయంపై ఆధారపడుతున్నారని చెప్పారు. మరోపక్క తిరుమలకు ప్రతిరోజూ వచ్చే లక్ష మంది భక్తులకు విమాన సర్వీసును అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

3 కారిడార్లు గల ఏకైక రాష్ట్రం ఏపీనే

దేశంలో మూడు పారిశ్రామిక కారిడార్లు గల ఏకైక రాష్ట్రం ఏపీనే అని వాణిజ్య శాఖ సెక్రటరీ ఎస్.యువరాజ్ తెలిపారు. దేశంలో రెండవ పొడవైన సముద్ర తీర ప్రాంతం గల ఏపీకి విస్తృత అభివృద్ధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కర్నూలు ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. కర్నూలు జిల్లా నుండి ప్రజలు అధిక సంఖ్యలో వారణాసికి వెళుతుంటారని, వారి సౌకర్యార్థం వారణాసికి విమాన సర్వీసులను ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు.

ఇండియా స్కిల్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: వృత్తి, సేవా ఆధారిత విద్య, సాంకేతికత వంటి 40 అంశాల్లో నైపుణ్యాలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఇండియా స్కిల్ పోటీలు–2023 పోస్టర్‌ను ప్రభుత్వ సలహాదారు చల్లా మధుసూదన్‌రెడ్డితో కలిసి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ డాక్టర్ వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో వివిధ అంశాల్లో స్కిల్స్‌ను ప్రోత్సహించేందుకు వరల్డ్ స్కిల్స్ ఇంటర్నేషనల్ సహకారం అందిస్తోందని, 2007 నుంచి భారత్ ఇందులో సభ్యదేశంగా ఉందని వివరించారు. ఇందులో రెండేళ్లకు ఒకసారి ఈ పోటీలు జరుగుతాయని, 2024లో ఫ్రాన్స్‌లో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కాగా, ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 40 విభాగాల్లో ఈ నైపుణ్య పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఆయన వివరించారు. చల్లా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియా స్కిల్ పోటీల్లో ఏపీ 2018లో నాలుగు పతకాలు సాధిస్తే, 2021లో 17 పతకాలను సాధించిందని గుర్తు చేశారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సంబంధిత విభాగంలో https:// skill-universe.apssdc.in/world-skill లింక్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ఎఫ్ఐఆర్ నమోదుపై అవగాహన కల్పించండి

- లలిత కుమారి కేసు తీర్పు కాపీని మరోసారి ప్రతీ పోలీసుకు పంపండి
- సుప్రీంకోర్టు మార్గదర్శకాల గురించి అవగాహన కల్పించండి
- ఎఫ్ఐఆర్ దశ తెలుసుకునే యంత్రాంగాన్ని అభివృద్ధి చేయండి
- డీజీపీకి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి ఆదేశం



సాక్షి, అమరావతి: కాగ్నిజబుల్ కేసుల్లో ప్రాథమిక విచారణతో నిమిత్తం లేకుండా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉంటుందని హైకోర్టు పేర్కొంది. తమ ఫిర్యాదు ఏ దశలో ఉంది.. దాని పరిస్థితి ఏమిటన్న విషయాలను పౌరులు తెలుసుకునేందుకు వీలుగా ఓ యంత్రాంగాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. లలితకుమారి వర్సెస్ గవర్నమెంట్ ఆఫ్ యూపీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాపీ ప్రతిని మరోసారి పోలీసులందరికీ సర్కులేట్ చేయాలని, ఆ తీర్పును మరింత సులభంగా అర్థం చేసుకునేందుకు వీలుగా తెలుగులోకి అనువదించి అందుబాటులోకి తేవాలని డీజీపీకి స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ఇటీవల తీర్పు వెలువరించారు. తాము ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ జ్యోతిర్మయి విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది పీవీజీ ఉమేష్ చంద్ర, హోంశాఖ తరఫున ప్రభుత్వ సహాయ న్యాయవాది ఎస్.నిర్మల్ కుమార్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి తీర్పు వెలువరిస్తూ, ఎఫ్ఐఆర్ నమోదు విషయంలో పోలీసులు ఎలా వ్యవహరించాలన్న దానిపై లలిత కుమారి కేసులో సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. ఫిర్యాదు ఇచ్చినా కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే జిల్లా ఎస్పీకి పోస్టు ద్వారా ఫిర్యాదు పంపవచ్చునన్నారు. అయినా కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోతే, స్థానిక కోర్టులో ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేయవచ్చునని తెలిపారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం లేదంటూ హైకోర్టులో పెద్ద సంఖ్యలో పిటిషన్లు దాఖలవుతున్నాయని గుర్తు చేశారు. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోవడంపై దాఖలైన వ్యాజ్యాల్లో జోక్యానికి న్యాయమూర్తి నిరాకరించారు. సీఆర్‌పీసీ నిబంధనల ప్రకారం తగిన వేదిక ముందు పిటిషనర్లు తమకున్న ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని తేల్చి చెప్పారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

గందరగోళంతో మేయర్ ఎన్నిక వాయిదా

- రెండు వర్గాలుగా చీలిపోయిన కాంగ్రెస్ కార్పొరేటర్లు
- అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు ప్రకటించిన అధికారులు


ఎన్నిక వాయిదా వేయడంతో కార్పొరేషన్‌లో ధర్నాకు దిగిన కార్పొరేటర్లు


రాయల్ సర్కిల్ వద్ద ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు

సాక్షి,బళ్లారి: బళ్లారి నగర మేయర్ ఎన్నిక గందరగోళం మధ్య వాయిదా పడింది. మంగళవారం మేయర్ ఎన్నికను నిర్వహించేందుకు సంబంధిత ఎన్నికల అధికారి అధికారికంగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో మేయర్ పదవిని దక్కించుకునేందుకు ఎస్సీ వర్గానికి చెందిన నలుగురు కార్పొరేటర్లు నామినేషన్ వేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు 21 మందితో పాటు స్వతంత్రంగా గెలుపొందిన ఐదుగురు కార్పొరేటర్లు ముందు నుంచి కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నందున ఆ పార్టీకి బలం 26 మందికి చేరింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని మేయర్‌గా ఎన్నుకునేందుకు సులభంగా అవకాశం ఉన్నా మేయర్ ఎంపిక విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మేయర్ ఎన్నిక ఉత్కంఠంగా మారింది. దీంతో చివరికి ఎన్నిక వాయిదా వేసేందుకు దారితీసింది. జిల్లా మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే, నేతలు మేయర్ ఎంపికను ఏకగ్రీవంగా జరిపేందుకు ప్రయత్నించకపోవడంతో నగరంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు రెండు వర్గాలుగా చీలిపోయారు. మేయర్ పదవి కోసం మించు శ్రీనివాస్, కుబేర, శ్వేతలతో పాటు బీజేపీకి చెందిన గుడిగంటి హనుమంతు నామినేషన్ వేశారు.

అధికార పార్టీ నేతల్లో కొరవడిన సఖ్యత

కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ల మధ్య సఖ్యత లేకపోవడంతో పాటు మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్ మేయర్ ఎన్నిక జరిగే ప్రాంతానికి పలు కారణాలతో రాకపోవడంతో నామినేషన్ వేసిన వారంతా బరిలో నిలవడంతో మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారింది. స్వతంత్రంగా గెలుపొందిన మించు శ్రీనివాస్‌కు బీజేపీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు మద్దతు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. వీరితో పాటు స్వతంత్రంగా గెలుపొందిన ఐదు మంది కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు మాజీ మేయర్ మోదుపల్లి రాజేశ్వరి, పద్మరోజా, ఉమాదేవి తదితర ఆరుగురు కార్పొరేటర్లు మించు శ్రీనివాస్‌ను మేయర్‌ను చేసేందుకు సిద్ధమయ్యారు. ఈనేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయ సభాంగణం గందరగోళం నెలకొంది. అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో తెర వెనుక నుంచి అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎన్నికను అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్లు ఏడీసీ తెలపడంతో కార్పొరేటర్లు భగ్గుమన్నారు.

భగ్గుమన్న కార్పొరేటర్లు

ఎన్నికను ఎందుకు వాయిదా వేస్తున్నారో తెలపాలని బీజేపీ కార్పొరేటర్లు ఇబ్రహీంబాబు, మోత్కూరు శ్రీనివాసరెడ్డి, గోవిందరాజులు, హనుమంతప్ప తదితరులు వాగ్వాదానికి దిగారు. మేయర్ ఎన్నిక నిర్వహిస్తామని తేదీ ఖరారు చేసి, నామినేషన్లు తీసుకుని, తగినంత కోరం ఉన్నా వాయిదా వేయడం వెనుక రాజకీయ దురుద్దేశం దాగి ఉందన్నారు. అధికారులు రాజకీయాలు చేయకూడదని, చట్ట ప్రకారం నడుచుకోవాలని, ఒకవేళ వాయిదా వేయాలనుకుంటే ముందుగా వేసి ఉండవచ్చని, రాష్ట్రంలోనే కాదు దేశంలోనే ఇలాంటి సంఘటన ఎక్కడా జరిగి ఉండదని మండిపడ్డారు. బీజేపీ హయాంలో 2008లో రిపబ్లిక్ ఆఫ్ బళ్లారి అని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారని, మరి ఇప్పుడు జరుగుతున్నదాన్ని ఏమనాలని ప్రశ్నించారు. అప్పుడు కాదు ఇప్పుడే రిపబ్లిక్ ఆఫ్ బళ్లారి పాలన జరుగుతోందని, ఇంత కన్నా ఇంకేమి కావాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు మేయర్ ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. అయితే బీజేపీ కార్పొరేటర్లతో పాటు మేయర్ పదవికి నామినేషన్ వేసిన మించు శ్రీనివాస్, పలువురు స్వతంత్ర, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు దాదాపు 25 మంది కార్పొరేషన్ సభాంగణంలోనే కూర్చొని ధర్నా చేపట్టారు.

సభాంగణంలోనే ఆందోళన

ఈ పరిణామాలతో కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు వస్తుందని భావించిన పలువురు బయటి నుంచి ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లను బయటకు రప్పించేలా ప్రయత్నం చేశారు. అయితే తాము ఎట్టి పరిస్థితుల్లోను బయటకు రాబోమని, ఎన్నిక జరిపి తీరాలని భీష్మించు కూర్చొన్నారు. కాగా మేయర్ ఎన్నిక విషయంలో శ్వేత లేదా కుబేరాను మేయర్‌గా చేయాలని, నగర ఎమ్మెల్యే మించు శ్రీనివాస్‌ను మేయర్‌ను చేయాలని భావించినట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం కుదరకపోడంతో మేయర్ ఎన్నిక రసకందాయంలో పడింది. పైగా కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు బహిరంగంగానే రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తేలింది. జిల్లా మంత్రి సూచించిన వ్యక్తిని మేయర్‌ను చేయడానికి కాంగ్రెస్ కార్పొరేటర్లు మద్దతు ఇవ్వకపోవడంతో బీజేపీ మద్దతుతో మించు శ్రీనివాస్ మేయర్ కావాలని ప్రయత్నించినా తాత్కాలికంగా వాయిదా పడటంతో మేయర్ పదవిపై ఉత్కంఠత నెలకొంది. దీంతో కార్పొరేషన్ కార్యాలయం వద్ద జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాయల్ సర్కిల్‌లో బీజేపీ కార్పొరేటర్ల ధర్నా

నగర మేయర్ ఎన్నిక వాయిదా వేయడంపై బీజేపీ ఆందోళనకు దిగింది. మంగళవారం నగర మేయర్ ఎన్నిక జరగాల్సి ఉండగా ఎన్నికల అధికారి రాకపోవడంతో అనివార్య కారణాలతో ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అదనపు జిల్లాధికారి ప్రకటించిన అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో కాసేపు కూర్చొన్న అనంతరం రాయల్ సర్కిల్ వద్ద బీజేపీ నాయకులు బైఠాయించి ఆందోళనను ఉధృతం చేశారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు మురహర గౌడ, ఉపాధ్యక్షుడు వీరశేఖరరెడ్డిలతో పాటు కార్పొరేటర్లు ఇబ్రహీంబాబు, హనుమంతప్ప తదితరులు రాయల్ సర్కిల్ వద్ద కూర్చొని కాంగ్రెస్ సర్కారు తీరును ఎండగట్టారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన వ్యక్తి రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించారన్నారు. నామినేషన్లు వేసిన తర్వాత ఎన్నిక జరపాల్సి ఉండగా, పాలకుల ఒత్తిళ్లకు తలొగ్గి వాయిదా వేశారని మండిపడ్డారు. దళిత వ్యక్తిని మేయర్ కాకుండా చేయాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ కుట్రలు చేసి అడ్డుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తినే మేయర్‌గా చేసేందుకు అవకాశం ఉన్నా ఎందుకు వాయిదా వేశారని ప్రశ్నించారు. కాగా ఆందోళన విరమింపజేసేందుకు డీఎస్పీ చంద్రకాంత్ నందారెడ్డి నేతృత్వంలో పలువురు సీఐలు, ఎస్ఐలు తీవ్రంగా ప్రయత్నించినా రాత్రి వరకు ఆందోళన చేశారు. కార్పొరేటర్లు మోత్కూరు శ్రీనివాసరెడ్డి, సురేఖ మల్లనగౌడ, నాగరత్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటి సంపులో పడి చిన్నారి మృతి


చిన్నారి మృతదేహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీనివాస్ (ఇన్‌సెట్‌లో) విస్మిత(ఫైల్)

హొసపేటె: వాటర్ సంపులో పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా చిక్కజోగిహళ్లి తండాలో మంగళవారం జరిగింది. తండా వాసులు నాగరాజ్, కావేరి దంపతుల కుమార్తె విస్మిత(3) తల్లి పెట్టిన గోరు ముద్దలు తిని ఆడుకుంటూ ఇంటి వద్ద ఉన్న సంపులో పడి మృతి చెందింది. ఈ ఘటనతో తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కూడ్లిగి ఎమ్మెల్యే డాక్టర్ ఎన్‌టీ శ్రీనివాస్ మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబం సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

కాటే దర్వాజ కమాన్ నిర్మించొద్దు


పనులను అడ్డుకుంటున్న అధికారులు

రాయచూరు రూరల్: నగరంలోని సూపర్ మార్కెట్ వద్ద కాటే దర్వాజ కమాన్‌ను నిర్మించడం తగదని ప్రజలు జిల్లాధికారికి ఫిర్యాదు చేశారు. శని, ఆదివారాలు సెలవులు కావడంతో దర్గా నిర్వాహకులు కమాన్ నిర్మాణానికి ముందుకొచ్చారు. మంగళవారం పురావస్తు శాఖ, నగరసభ అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పాపారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శంకరప్ప, బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, రమానంద్ యాదవ్, శివ బసప్ప మాలిపాటిల్, నాగరాజ్ భాల్కి, నరసారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలో అశాంతిని రేకెత్తించే ఇలాంటి అక్రమ కట్టడ నిర్మాణానికి అవకాశం కల్పించరాదని జిల్లాధికారిని కోరారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో శోభాయాత్ర


శ్రీకృష్ణ శోభాయాత్రను నిర్వహిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో సోమవారం రాత్రి ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ శోభాయాత్రను చేపట్టారు. కార్తీక పున్నమి సందర్భంగా నగరేశ్వర ఆలయం నుంచి మహేశ్వరి సమాజ్ అధ్యక్షుడు విఠల్‌దాస్ ఇన్నాని శోభాయాత్రను ప్రారంభించారు. పుర వీధుల గుండా సాగిన యాత్రలో రంగుల ముగ్గులతో అలంకరించిన వీధుల్లో భక్తులు సంకీర్తనలు, భజనలు చేసి ప్రజలను మంత్రముగ్ధులను చేశారు. ఆర్యవైశ్య నగరేశ్వర మందిర్ అధ్యక్షుడు సరతి శ్యాందాస్, కేశవరెడ్డి తదితరులున్నారు.

నేత్రదాన సేవలు అనన్యం



ప్రమాణపత్రాన్ని అందుకుంటున్న అమరేష్

రాయచూరు రూరల్: మానవ అవయవ దానాల్లో నేత్రదానం ప్రధానమని ఆర్డీసీసీ బ్యాంక్ మేనేజర్ అమరేష్ రాయకోటి అన్నారు. మంగళవారం ఎస్‌కేఈ ప్యారా మెడికల్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవుడు మరణించిన తర్వాత కన్నులను దానం చేసి నలుగురి జీవితాలకు వెలుగులు నింపాలన్నారు. సామాజిక భద్రతకు పునాదిరాయిలాంటిదన్నారు. సమావేశంలో గ్రీన్ రాయచూరు సంచాలకుడు రాజేంద్ర శివాళే, నవోదయ వైద్యులు జయశ్రీ, ఆదినాయర్, అధికారులు విజయలక్ష్మి, గిరీష్ ఆచారి, చంద్రశేఖర్, బాబూరావ్, జీవన్ జ్యోతి, అశ్విని, శరణప్పలున్నారు.

జేజేఎం పనులకు శ్రీకారం


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమశేఖర్

కంప్లి: జల్‌జీవన్ మిషన్(జేజేఎం) పథకం కింద చేపట్టిన పనులు నిర్ణీత సమయంలో నాణ్యతగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎస్టీ సోమశేఖర్ తెలిపారు. కూడ్లిగి అసెంబ్లీ నియోజకవర్గంలోని తూలహళ్లి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయడం వల్ల తాగునీటి సమస్య ఎలా ఉన్నా మహిళలు బయటికి వెళ్లకుండా తమ ఇళ్ల ముందే నీటిని నింపుకోగలుగుతారని అన్నారు. కాంట్రాక్టర్ వీటిని దృష్టిలో పెట్టుకొని పనులు వీలైనంత త్వరగా నాణ్యతగా పూర్తి చేయాలన్నారు.

త్వరలోనే రైతులకు పంట నష్టపరిహారం


పంట నష్టంపై రైతుల గోడు ఆలకిస్తున్న మంత్రి చెలువరాయస్వామి, ఎమ్మెల్యే తుకారాం

బళ్లారిటౌన్: త్వరలోనే అనావృష్టితో నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారాన్ని అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి పేర్కొన్నారు. మంగళవారం జిల్లాలోని సండూరు తాలూకాలో వివిధ గ్రామాల్లో అనావృష్టితో పంటలు దెబ్బతిన్న పొలాలను సందర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే ఈ విషయంపై కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రితో చర్చించినట్లు తెలిపారు. ఈ పంట నష్టపరిహారం పొందాలంటే ఫోర్త్ ఐడీ రైతులు తమ పేరున భూములను నమోదు చేసుకోవాలన్నారు. దీన్ని వల్ల పరిహారం పొందేందుకు అనుకూలం అవుతుందన్నారు. ఈ నెలాఖరులో కేంద్ర ప్రభుత్వం నుంచి పరిహారం విడుదల కావచ్చన్నారు. కేంద్రం నుంచి నిధులు రాగానే సన్న, అతిసన్నకారు రైతులకు ఈ పరిహారాన్ని అందిస్తామన్నారు. ఈ సందర్భంగా సండూరు ఎమ్మెల్యే తుకారాం, జెడ్పీ సీఈఓ రాహుల్ శరణప్ప, వ్యవసాయ శాఖ జేడీ కే.మల్లికార్జున, డీడీలు కెంగేగౌడ, సంతోష్, తహసీల్దార్ పవన్‌కుమార్, ఏడీలు మంజునాథ, హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

భారీగా చౌక బియ్యం పట్టివేత


పట్టుబడిన బియ్యం లోడు లారీలు

రాయచూరు రూరల్: యాదగిరి జిల్లా షాపూర్‌లో మంగళవారం నల్ల బజారుకు అక్రమంగా తరలిస్తున్న చౌక బియ్యాన్ని అధికారులు భారీ ఎత్తున పట్టుకున్నారు. రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ మంత్రి శరణ బసప్ప దర్శనాపూర్ ప్రాతినిథ్యం వహిస్తున్న షాపూర్‌లోని ఎఫ్‌సీఐ గోదాముల నుంచి గ్రామీణ ప్రాంతాల్లో నిత్యావసర వస్తువుల దుకాణాలకు అన్న భాగ్య పథకం కింద పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని రెండు లారీల్లో నల్లబజారుకు తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు వాటి విలువ సుమారు రూ.2.50 కోట్లు ఉంటుందని తేల్చారు. ఈ విషయంపై జిల్లాధికారి సుశీల మాట్లాడుతూ షాపూర్ ఎఫ్‌సీఐ గోడౌన్లలో సీసీ కెమెరాలు అమర్చలేదన్నారు. బియ్యం అక్రమంగా నల్లబజారుకు తరలిస్తుండగా పట్టివేత అంశంపై సమగ్ర విచారణకు కమిటీని ఏర్పాటు చేశామన్నారు.

మున్సిపల్ కౌన్సిలర్‌పై ఎఫ్ఐఆర్


కారదపుడి మహేష్(ఫైల్)

హొసపేటె: కులం పేరుతో దూషణ ఆరోపణలపై మున్సిపల్ కౌన్సిలర్‌పై ఎఫ్ఐఆర్ నమోదైన ఘటన మంగళవారం జరిగింది. వివరాలు..తమ వార్డులో తాగునీటి సమస్యపై మున్సిపల్ కమిషనర్‌తో చర్చించిన విషయంపై కౌన్సిలర్ కారదపుడి మహేష్ తనను పరుష పదజాలంతో దూషిస్తూ అవమానించి మాట్లాడారని ఆరోపిస్తూ నగర వాసి, వాల్మీకి సమాజానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి కుల దూషణ చట్టం కింద ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు టౌన్ పోలీసులు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య


రైతు పెన్నయ్య(ఫైల్)

కంప్లి: అప్పుల బాధ తాళలేక విషం తాగి ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కురుగోడు పరిధిలోని బాదనహట్టిలో జరిగింది. గ్రామానికి చెందిన పోతప్పనకట్టె 4వ వార్డులో నివాసముంటున్న బసాపుర పెన్నయ్య(35) అనే వాల్మీకి సముదాయానికి చెందిన రైతు తన 3 ఎకరాల పొలంలో మిరప సాగు చేశాడు. అయితే వర్షాలు కరువై పంటకు నీరు లేక నష్టపోయాడు. పంట సాగు కోసం క్రిమినాశక మందులు, ఎరువులు, విత్తనాలకు భార్య నీలమ్మ పేరిట బ్యాంకుల్లో రూ.1.20 లక్షలు రుణం తీసుకున్నాడు. అంతేగాకుండా ఊరిలో రూ.5 లక్షలు అప్పు చేశాడు. అయితే పంట నష్టం సంభవించడంతో అప్పులు తీర్చే మార్గం కానరాక జీవితంపై విరక్తి చెంది విషం తాగాడు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెన్నయ్యకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై కురుగోడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

28 ఏళ్ల నాటి కేసులో నిందితుడి అరెస్ట్


నిందితుడి మహమ్మద్ హొసమని(ఫైల్), బెండిగేరి పోలీస్ స్టేషన్

హుబ్లీ: ఒక కేసులో 28 ఏళ్ల క్రితం జైలుకు వెళ్లి ఆ తర్వాత బెయిల్‌పై విడుదలై కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకొని తిరుగుతున్న నిందితుడిని సోమవారం బెండిగేరి పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని తారిహాళ రోడ్డు నివాసి మహమ్మద్ హొసమని(57) నిందితుడు. ఆయన 1995లో నమోదైన కేసులో తప్పించుకొని తిరుగుతున్నాడు. బెండిగేరి సీఐ జయపాల్ పాటిల్ నేతృత్వంలో బృందం ప్రత్యేకంగా అన్వేషించి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. కాగా ఈ కేసు మిస్టరీ ఛేదనకు కృషి చేసిన బృందాన్ని పోలీస్ కమిషనర్ రేణుకా సుకుమార అభినందించారు.

రేపు కనకదాస జయంతి

చెళ్లకెరె రూరల్: పట్టణంలో ఈ నెల 30న భక్త కనకదాస 536వ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని కురుబ సమాజ నాయకుడు ఆర్ మల్లేశప్ప తెలిపారు. ఆయన మంగళవారం కురుబ విద్యార్థి నిలయంలో విలేకరులతో మాట్లాడారు. హాస్టల్ ముందు కనకదాస సర్కిల్‌గా నామకరణానికి ఎమ్మెల్యే ద్వారా భూమిపూజ నిర్వహిస్తారన్నారు. అనంతరం కురుబ సమాజం తరపున కనకదాస చిత్రపటాన్ని ఊరేగిస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డీ.సుధాకర్, ఎమ్మెల్యే టీ.రఘుమూర్తి హాజరవుతారన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నగరసభ సభ్యుడు ఎంజే రాఘవేంద్ర, జే.లింగప్ప, రుద్రముని, పూజార్ పరుసప్ప, ఎస్‌బీ హనుమంతరాయ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరమ్మ పండుగ



పూలతో ప్రత్యేక అలంకరణలో గౌరీదేవి , గౌరీదేవికి చక్కెర హారతులతో మహిళల పూజలు

బళ్లారిఅర్బన్: నగరంలో మంగళవారం గౌరీదేవి వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. పటేల్‌నగర్ లక్ష్మీవెంకటేశ్వర దేవస్థానంలో గౌరీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి చుట్టు పక్కల ప్రాంత వాసులు తమ ఇళ్ల నుంచి నోముదారాలు, చక్కెర హారతులతో విచ్చేసి నోములు నోచి ధార్మిక పూజలను చేశారు. ముఖ్యంగా బాలికలు కూడా చీరలను కట్టుకొని చక్కెర హారతులతో సంబరంగా గౌరీదేవికి నైవేద్యం సమర్పించి బాణాసంచాను వెలిగించారు. ఇక గ్రామాల్లో గౌరమ్మ పండుగను విశేషంగా జరుపుకున్నారు.

ఆరోగ్య మేళా లబ్ధి పొందండి


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కంప్లి: ప్రతి మంగళవారం ఆరోగ్య మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ వై.రమేష్ బాబు కోరారు. ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన ఆరోగ్యమేళాను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో అంత్యోదయ కార్డుదారులకు అందించే ఆయుష్మాన్‌భవ అభియాన్ ద్వారా అన్ని తాలూకాల్లో విజయవంతంగా ఆరోగ్య మేళాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వేడుకగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం


లక్ష్మీవేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో మంగళవారం లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణోత్సవం, రథోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే కల్యాణోత్సవం ప్రారంభమై సాయంత్రం వరకు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం జరిగింది. పట్టణంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు.వేంకటేశ్వర ఆలయ సేవా కమిటీ, సవితా సమాజ, ఆర్యవైశ్య సమాజంతో పాటు అన్ని కులాల భక్తులు, పౌరులు, వివిధ సంఘాల నాయకులు, మహిళలు, పిల్లలు, పెద్దలు అందరూ లక్ష్మీవేంకటేశ్వర కల్యాణోత్సవానికి హాజరయ్యారు. రథోత్సవానికి హాజరైనవారు గోవిందగిరి భజన చేశారు. కళాకారులు, వాయిద్యకారులు విభిన్న కళా బృందాలు, వేలాది మంది భక్తులు కల్యాణోత్సవం, రథోత్సవంలో పాల్గొని స్వామి వారి కృపకు పాతులయ్యారు.

పర్మిట్ లేని ఆటోల సీజ్


సీజ్ చేసిన ఆటోలను పరిశీలిస్తున్న అధికారులు

బళ్లారిఅర్బన్: నగరంలో యథేచ్ఛగా తిరుగుతున్న ఆటోలపై ట్రాఫిక్ సీఐ నిఘా ఉంచి పట్టుకున్నారు. మంగళవారం స్థానిక నటరాజ్ థియేటర్ ఎదురుగా బెంగళూరు రోడ్డులో ఆటోలను నిలిపి సంబంధిత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్, కండీషన్ పత్రాలు, పర్మిట్ లేని వాహనాలను బళ్లారి ఆర్‌టీఓ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్, ట్రాఫిక్ సీఐ అయ్యన్నగౌడ పాటిల్, సిబ్బంది తనిఖీలు నిర్వహించి 33 ఆటోలను సీజ్ చేశారు.

గ్రీన్ బోర్డుల ఏర్పాటు భేష్

రాయచూరు రూరల్: తాలూకాలో 9 పాఠశాలలకు రోటరీ క్లబ్ కాటన్ సిటీ ఆధ్వర్యంలో గ్రీన్ బోర్డులను ఏర్పాటు చేయడం అభినందనీయమని మడ్డిపేటె ప్రభుత్వ హైస్కూలు హెడ్‌మాస్టర్ మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం అస్కిహాళ, మడ్డిపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో గ్రీన్ బోర్డుల అమరికను ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ జిల్లాధ్యక్షుడు శివగిరీష్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ కాటన్ సిటీ, యూరోఫిన్స్ ఐటీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ కంపెనీల ఆధ్వర్యంలో ఐదేళ్ల పాటు అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. ఛాయాదేవి, వీరేష్, లక్ష్మణ్, శశిధర్, వేణుగోపాల్, మునిస్వామి, హుసేనప్ప, వసంత్‌లున్నారు.

మానవతా విలువలను పెంచుకోవాలి



దప్పు వాయిస్తున్న హంపయ్య నాయక్

రాయచూరు రూరల్: విద్యార్థులు మానవతా విలువలను పెంచుకోవాలని మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్ అన్నారు. మంగళవారం నీరమాన్వి ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రతిభా కారంజీ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు పచ్చదనం, ప్లాస్టిక్ నిర్మూలనకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గణితంపై భయం తగదు

రాయచూరు రూరల్: విద్యార్థులు గణితం సబ్జెక్ట్‌పై భయాందోళన చెందాల్సిన అవసరం లేదని దేవదుర్గ తాలూకా విద్యా శాఖ అధికారి సుఖదేవ్ పేర్కొన్నారు. మంగళవారం అరికెరలోని ఆదర్శ పాఠశాలలో గణిత భవన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆర్యభట్ట ప్రావీణ్యం పొందిన గణితాన్ని ఉపాధ్యాయులు బోధిస్తున్నప్పుడు విద్యార్థులు క్రమశిక్షణతో వింటే చాలా సులభంగా అర్థమవుతుందన్నారు. అధికారులు శివరాజ్, అపర్ణ, మంజుల, కుమార స్వామి, చెన్నమల్లప్ప, మంజునాథ్, మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రతిభ వెలికితీతకు కారంజి దోహదం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బళ్లారిటౌన్: పాఠశాల పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రతిభా కారంజి, కళోత్సవ కార్యక్రమాలు ఎంతో తోడ్పడతాయని జిల్లా విద్యాశాఖ డీడీ బీ.ఉమాదేవి పేర్కొన్నారు. మంగళవారం కోట ప్రాంతంలోని సెయింట్‌జాన్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ప్రతిభా కారంజి కళోత్సవాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరిలోను ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందన్నారు. దానిని గుర్తించేందుకు ఇలాంటి వేదికలు ఎంతో దోహద పడతాయన్నారు. పిల్లలు పాఠాలతో పాటు పాఠ్యేతర కార్యక్రమాలకు కూడా ఎక్కువ ఆసక్తి కనబరిచేలా ఉపాధ్యాయులు తోడ్పడాలన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలన్నారు. విద్యా సంస్థ వ్యవస్థాపకుడు వందనీయ ఫాదర్, వాల్తేర్ మేనేజర్స్ ప్రధాన ఉపాధ్యాయులు శాంతశీలన్, వివిధ తాలూకాల బీఈఓలు పాల్గొన్నారు.

డణాపుర పరిసరాల్లో చిరుత ప్రత్యక్షం


గ్రామ పరిసరాల్లో తిరుగుతున్న చిరుత

హొసపేటె: ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా భాసిలుతున్న హంపీ సమీపంలోని డణాపుర పరిసరాల్లో చిరుత ప్రత్యక్షమైన ఘటన మంగళవారం జరిగింది. డణాపుర గ్రామ శివార్లలోని చెరుకు పొలం వద్ద చిరుత సంచారం రైతుల కంట పడటంతో గ్రామస్తులు, రైతులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. తమ పొలాలకు వెళ్లాలన్నా అరచేతిలో ప్రాణాలను పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని, వెంటనే అటవీ అధికారులను బోనును ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని రైతులు కోరారు.

నరేగ పనుల్లో అవినీతిపై కేసు నమోదు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కరువు నెలకొనడంతో వ్యవసాయ కూలీ కార్మికులకు గ్రామ స్థాయిలో ఉపాధి పనుల కల్పన కోసం ఏర్పాటు చేసిన నరేగ పథకంలో రూ.కోట్లలో అవినీతి జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. వ్యవసాయ కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ(నరేగ) పథకంలో ఉపాధి కల్పించాల్సింది పోయి గత రెండేళ్లలో దేవదుర్గ తాలూకాలో నిధులు దిగమింగిన 95 మంది పీడీఓలు, 66 మంది గ్రామ పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, టీపీ అసిస్టెంట్ డైరెక్టర్ పంపాపతి, టీపీ ఈఓ బసణ్ణ నాయక్, 23 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులపై రూ.11 కోట్ల మేర నిధుల దుర్వినియోగంపై గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ పవన్ కుమార్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి టీపీ ఈఓ అణ్ణారావ్ ఫిర్యాదు చేశారు.

రమణీయంగా తుంగా హారతి



తుంగా హారతిని ప్రారంభిస్తున్న సుబుధేంద్ర తీర్థులు


నదీలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

రాయచూరురూరల్: సోమవారం రాత్రి కార్తీక పున్నమి సందర్భంగ తుంగా తీరంలో తుంగా హారతిని మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రారంభించారు. తుంగభద్ర నదీ తీరంలో వేలాది మంది భక్తుల మధ్య కమనీయంగా హారతి వేడుక జరిగింది. మఠంలో రాఘవేంద్ర స్వాములకు పూజలు చేసి రథోత్సవం నిర్వహించారు.